# తాళ్లపాక సాహిత్యంలో



# తాళ్ళపాక సాహిత్యంలో కవిసమయాలు

**డా॥ జి. ఉమాదేవి,** యం.ఏ.,పి.హెచ్.డి.
రీడరు, తెలుగుశాఖ
డి.కె. ప్రభుత్వ మహిళా కళాశాల, నెల్లూరు

శారదా ప్రచురణలు
**18-1-46/3, శాంతి నగర్, కపిలతీర్థం రోడ్డు, తిరుపతి**
**1993**

ధమ ముద్రణ : 1993

ర్వస్వామ్యములు రచయితవి

ంతులు : 1000

ల : రూ.80.00

is book is published with the Financial assistance of Tirumala
irupati Devasthanams under their scheme 'Aids to publish
eligious books'

కాశకులు : సూరపరాజు. కోటేశ్వరరావు
శారదా ప్రచురణలు
18-1-46/3, శాంతి నగర్, కె.టి.రోడ్డు,
తిరుపతి.

ుద్రణ : అరుణ గ్రాఫిక్స్, నెల్లూరు

# కైమోడ్పు

'తాళ్ళపాక సాహిత్యంలో కవి సమయాలు' అనే అంశాన్ని ఎన్నుకొని పి.హెచ్.డి. చేయడానికి అనుమతించిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ "డాక్టరల్ రిసర్చి కమిటి" అధ్యాపక వర్గానికి.......

నా ఎం.ఫిల్., పి.హెచ్.డి., లకు పర్యవేక్షక బాధ్యతను వహించడమే గాక నా కోరిక మన్నించి నా ఈ సిద్ధాంత వ్యాస ప్రచురణపై తమ "ఆమోదం" అందించిన మద్గురువర్యులు ప్రా. డా॥ కె. సర్వోత్తము రావు గారికి..........

నిరంతరం అష్టావధానం, శతావధాన కార్యక్రమాలతోను అన్నమాచార్య ప్రాజెక్టు పనులతోను తలమునకలై వుండి గూడ అడిగిన వెంటనే కాదనకుండ విశాల హృదయంతో నా చిరు గ్రంథంపై తమ అమూల్యాభిప్రాయాన్ని అందించిన శతావధాన చక్రవర్తి, శతావధాన సార్వభౌమ డా॥ మేడసాని మోహన్ గారికి.......

నా పరిశోధనకు వలసిన పుస్తక సేకరణలో నాకెంతో తోడ్పడిన అన్నమాచార్య ప్రాజెక్టు, రీసెర్చి అసిస్టెంట్ డా॥కేసర్ల వాణి గారికి..........

ఈ పుస్తక ప్రచురణకు కొంతవరకు ఆర్థిక సహాయాన్ని అందించిన తిరుమల తిరుపతి దేవస్థానం కార్యనిర్వహణాధికారులకు, తెలుగు విశ్వవిద్యాలయం అధికారులకు...........

వీలైనంత వరకు తప్పులు లేకుండా శ్రద్ధతో ఈ సిద్ధాంత వ్యాసాన్ని ముద్రించి యిచ్చిన యూనివర్సల్ గ్రాఫిక్స్ వారికి, అరుణా గ్రాఫిక్స్ వారికి....

గురుతరమైన ఈ గ్రంథ ప్రచురణ బాధ్యతను స్వీకరించి ఆద్యంతం స్వయంగా పర్యవేక్షించిన నాజీవన సహచరులైన శ్రీ నూరపరాజు కోటేశ్వరరావు, లైబ్రేరియన్, శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల, తిరుపతి గారికి....

తమ ఆశీస్సులందించిన మా తల్లిదండ్రులైన శ్రీ గుర్రం రాధాకృష్ణయ్య, శ్రీమతి శారదాంబగారలకు.......

ఈ గ్రంథ ప్రచురణకు ప్రోత్సహించి తమ సహాయ సహకారాలందించిన ఆత్మీయులందరికి...........

నా కృతజ్ఞతలు

**జి. ఉమాదేవి**

నెల్లూరు

'శ్రీముఖ' శ్రావణ పూర్ణిమ.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ప్రస్తావన | 1 - 7 |
| 2. | కవిసమయ స్వరూప స్వభావాలు | 9 - 23 |
| 3. | తాళ్లపాక సాహిత్యంలో కవిసమయాలు | 25-94 |
| 4. | తాళ్లపాక సాహిత్యంలోని విశిష్ట కవిసమయాలు | 96 - 98 |
| | 1. శరీరావయవసంబంధి | 98 - 250 |
| | 2. శారీరక ప్రవృత్తి సంబంధి | 250 - 299 |
| | 3. మనస్సంబంధి | 299 - 311 |
| | 4. మానసిక ప్రవృత్తి సంబంధి | 311 - 322 |
| 5. | ఉపసంహారం | 323 - 324 |

తిరుపతి
30-4-93

ఆచార్య కె. సర్వోత్తమరావు
తెలుగు అధ్యయన శాఖ
శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం

# ఆమోదం

డా॥ జి. ఉమాదేవిగారు నాకు పదేళ్ళుగా పరిచితులు. నా పర్యవేక్షణలో ఎం.ఫిల్, పి.హెచ్.డి. పరిశోధన సాగించినారు. వీరి పి.హెచ్.డి. సిద్ధాంత వ్యాసం, 'తాళ్ళపాక సాహిత్యంలో కవిసమయాలు" అచ్చులోకి రావడం ఆనందించదగ్గ విషయం.

ఆంధ్రవాఙ్మయంలో తాళ్ళపాక సాహిత్యానికున్న స్థానం విలువ గట్టలేనిది. తాళ్ళపాక సాహిత్యం చదవనిదే తెలుగు పూర్తికాదు అన్నంతగా విస్తృతమయినదీ సాహిత్యం. పై పెచ్చు ఎంత మాత్రమున నెవ్వరు తలచిన నంత మాత్రమే అవడం ఈ సాహిత్యానికి అక్షరాలా సరిపోతుంది. ఒక కోణంలో చూసే వేళ తాళ్ళపాక కవులు పండితులుగా కనిపిస్తారు. మరో దృష్టితో చూసేవేళ పామరులకు సన్నిహితులుగా కనిపిస్తారు. యింకో దృష్టితో పరిశీలించేటప్పుడు లాక్షణికులుగా నిలుస్తారు. మరో మారు చూసే వేళ పరమ నాయకులుగా, పరమ భక్తులుగా కళ్ళముందు మెరసిపోతారు. తాళ్ళపాక సాహిత్యం క్షీర సముద్రం లాంటిదనడంలో అతిశయోక్తి ఆవగింజంత కూడా లేదు.

ఈ మధ్య చాలామంది దృష్టి తాళ్ళపాక సాహిత్యంపై పడడం హర్షించదగ్గ అంశం. అయితే వాటిలో చాలా రచనలు ఈత లాంటివే. మునిగి వెలికి తీసిన రత్నాలు కావు. డా॥ ఉమాదేవి గారి పరిశోధన చివరి కోవకు చెందిన రచన.

'కవి సమయాలు' సాహిత్యానికి సంబంధించిన పరిభాష అని కొందరి అభిప్రాయం. ఇది భాషాగతమయిన పరిభాష అని మరి కొందరి భావం. ఏది ఏమయినా ఈ పరిభాష పాతది. సంస్కృత లాక్షణికులు పరిశీలించి పెద్ద పీట వేసిన పరిభాష సాహిత్య సిద్ధాంతాలలో మార్పు వచ్చినట్లే కవి సమయాల - లక్షణాలలో

సమన్వయాలలో చాలా మార్పులు వచ్చాయి. వినూత్న ఉపమాలను కూడా కవి సమయాలుగా చెప్పడం ఇందులోని ప్రత్యేకత.

తాళ్ళపాక కవులు 'ఉభయ కవులు'. అంతేకాదు పండితుల్ని పామరుల్ని తమ రచనలతో ఆకట్టుకున్న నేర్పరులు. పామరుల్ని రంజించడనికి వారెన్నుకున్న 'ఉపమాసామగ్రి'. ఆకాశంలోని నక్షత్రాలంత ఇవన్నీ భావుకతకు పట్టని దర్పణాలు. ఉదాహరణకు పాదాలను తామరతో పోల్చడం తెలిసిన విషయమే గాని తులసీదళం, చింతకొమ్మ, తేపపరశు, నోగలు లాంటి వాటితో పోల్చడం కొత్త పద్ధతి. తొడలను 'అరటి' తో పోల్చడం పాతకవి సమయం. అయితే తాళ్ళపాక కవులు తేరు, పట్టెమంచం, యుగాలు, కొలువు కూటం లాంటి వాటితో పోల్చారు. నాభిని పాదుతో, సురపొన్నతో, సరసుతో, గుహతో గుంతపోకలతో పోల్చడం మరో ప్రత్యేకత.

సామాన్య విషయాలను కవి సమయాలుగా మలచుకోవడం తాళ్ళపాక కవులకే తెలుసు. నూగారును చీమల దొంతరతో పోల్చడం, నాచుతో ఉపమించడం, పొగ బాణమనడం, కుంచెగా కనపించిందనడం ఉదాహరణలుగా చెప్పుకోవచ్చు. జడలను కొడవళ్ళుగా, చింతకాయలుగా, తరుటుగా ద్రోణంగా తీర్చడం వీరికే తగు. ఈలాంటివి వందలు వేలు.

డా॥ జి. ఉమాదేవి గారు తాళ్ళపాక సాహిత్యాన్ని అనేకమార్లు చదివినవారు. అవగాహన చేసుకున్నవారు. తాను అర్థం చేసుకున్న దానిని సప్రమాణంగా సరసంగా చెప్పగలిగినవారు. అంచేతనే ఈ సిద్ధాంత గ్రంథం పరీక్షకుల్ని ఆకట్టుకుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయాన్ని కూడా అందుకోగలిగింది.

తాళ్ళపాక సాహిత్యాన్ని మథించి మరికొన్ని విశేషాలు గ్రంథ రూపంలో ప్రచురించాలని ఆకాంక్ష.

కె. సర్వోత్తమ రావు

# ఆశంస

అవధాన చక్రవర్తి తిరుపతి

శతావధాన సార్వ భౌమ 21-3-1993

డా॥ మేడసాని మోహన్, ఎం.ఏ. పి.హెచ్.డి.

డైరెక్టర్, అన్నమాచార్య ప్రాజెక్టు, టి.టి.డి.

శ్రీమతి జి. ఉమాదేవిగారి "తాళ్ళపాక సాహిత్యంలో కవి సమయాలు" అనే పరిశోధనా సిద్ధాంత వ్యాసం సాంతం చదవడం నా కెంతో ఆనందాన్ని కల్గించింది. భావుకతా సామ్రాజ్య పట్ట భద్రుడైన అన్నమయ్య ఊహల పోహళింపులలోని సౌందర్యం ఒకసారి తిలకించినట్లె మనస్సు పులకించింది. ఆలంకారిక దృక్పథంలో కవి నేర్పుకు, తీర్పుకు సంబంధించిన పరిణతిని సూచించేవి కవి సమయాలు. ఆ పరిణతిలో తాళ్ళపాక కవుల స్థాయి ఎంత ఉన్నతమైందో ఈమె పరిశోధనా వ్యాసం విశదీకరిస్తూ ఉంది.

వస్తు విశ్లేషణంలోనే ఈమె పరిశోధనా సూక్ష్మేక్షిక ప్రశంసనీయమని చెప్పక తప్పదు. మధుర భక్తి రసవశం వదుడైన అన్నమయ్య అధ్యాత చిత్తవృత్తికి అద్దం పట్టే సొగసైన ఎన్నో ఉదాహరణలు ఈమె చూపించారు.

దిబ్బలు వెట్టుచు తేలిన దిదివో
ఉబ్బు నీటిపై ఒక హంస
అనువున (గముల విహారమే నెలవై
వొనరి వున్నదిదె వొక హంసా
మనియెడి జీవుల మానస సరుసుల
వునికి నున్నదిదె ఒక హంసా 1-1

అని హంసకు సంబంధించిన కవి సమయాన్ని చక్కగా విశ్లేషించడం జరిగింది. పై పాటలో ఉన్నశాస్త్రాంశాన్ని కూడ ఉటంకించడం ఈమె వైదుష్యానికి తార్కాణం.

అలానే

చీఁకటి తురుము దాన చేరకు నన్ను

చీఁకటి నల్లని మేను వెలువుడను. (12-350)

వంటి సంకీర్తనల్లోని కవి సమయాలను చక్కఁగా సందర్భానుసారంగా వివరించడం సముచితంగా ఉంది. నాయిక కొప్పును చీకటితో పోలుస్తూ పిడికిట బట్టే వస్తువుగా పరిగణించిన అన్నమయ్య ఊహలోని సౌకుమార్యం రసజ్ఞులకు ఆనందభోజనం.

"కమలలోచన హృదయ కమలంబె మరుచేతి

కమలమై తనమసను గాడి పారినది" (12-187)

కొండలోఁ గోవిల గుయ్యి గుండె వగిలెనే

అండకు రాగాఁ బ్రాణమంతలోఁ బ్రదికెరా

అన్న సంకీర్తనల్లో మన్మథావస్థలకు సంబంధించిన కవి సమయాలను ప్రసన్నంగా వ్యక్తీకరించారు.

నాల్గవ అధ్యాయంలో నాయికా నాయకుల సర్వాంగ సంబంధమైన కవి సమయాలను విశ్లేషించడంలో ఈమె చూపిన పరిశోధనాపాటవం బహుధా ప్రశంసనీయం. ఈ అధ్యాయం చదువుతూ ఉంటే ఈమె చెప్పిన ఉదాహరణల్లో ఏది మేలైనదిగా పరిగణించి చూపాలో ఎంపిక చేసుకోవడం నాకు అసాధ్యమనిపించింది. తాళ్ళపాక కవుల విశ్వ సౌందర్య కళోపాసనా శాస్త్రానికి ఈ అధ్యాయం ఒక వ్యాఖ్యాన ప్రాయమైన విశ్లేషణ -------అని నాకనిపించింది.

కవి సమయాలకు సంబంధించి ఇతః పూర్వం కూడ ఎందరో పరిశోధకులు కృషి చేశారు. అవన్నీ అధ్యయనం చేయడం కూడా ఈమెకు ఎంతో ఉపకరించి ఉండవచ్చు. కానీ ఉమాదేవీ గారి అనన్యమైన పరిశ్రమ ఈ సిద్ధాంత వ్యాస విషయికంగా తప్పక ప్రశంసనీయం. తాళ్ళపాక కవుల కృతులపై ఇంకా ఎన్నో పరిశోధనా వ్యాసాలు ఈ విదుషీమణి కలం నుండి వెలువడగలవని ఆకాంక్షిస్తున్నాను.

- మేడసాని మోహన్.

21.3.93

# ప్రకరణం - 1

# ప్రస్తావన

తాళ్లపాక కవులు :

ఒకే కుటుంబంలో పలువురు వ్యక్తులు కవులు, కళాకారులు కావడం అపూర్వమైన అంశం. పిడపర్తి కవులు, వెన్నెలగంటి కవులు, తాళ్లపాకకవులు ఈ కోవకు చెందినవారు. తాళ్లపాక కవులు ప్రధానంగా వాగ్గేయకారులైనా ద్విపదలు, శతకాలు, దండకాలు, రగడలు ఇత్యాది ఎన్నో కావ్య ప్రక్రియలను వీరు చేపట్టి పట్టిందల్లా బంగారం కావించారు. తమ కళా భారతిచే భగవంతుని సేవించి తరించారు.

స్వగ్రామమైన తాళ్లపాక పేరే ఇంటిపేరుగా గలవారు తాళ్లపాక కవులు. వీరు నందవరీక బ్రాహ్మణులు. ఆశ్వలాయన సూత్రులు. స్మార్తులు. ఈ వంశంలో ప్రసిద్ధుడు అన్నమాచార్యుడు. ఇతడు లక్కమాంబ నారాయణసూరి దంపతుల తనయుడు. హరినందకాంశంలో జన్మించిన కారణజన్ముడు. ఇతని రచనలు - 32వేల శృంగార అధ్యాత్మ సంకీర్తనలు, పలుభాషలలో 12 శతకాలు, ద్విపదరామాయణం, శృంగారమంజరి, వేంకటాద్రి మహాత్యం (సంస్కృతం), సంకీర్తన లక్షణం. వీటిలో నేడు మనకు దాదాపు 13వేల సంకీర్తనలు, శృంగారమంజరి, అలమేలు మంగపై రచించిన ఒక శతకం మాత్రం లభిస్తున్నాయి.

అన్నమయ్యకు తిమ్మక్క, అక్కాంబలిద్దరు భార్యలు. వీరిలో తొలి తెనుగు కవయిత్రిగా ప్రసిద్ధికెక్కిన తిమ్మక్క రచన 'సుభద్రాకల్యాణం' ద్విపద కావ్యం. ఇది నేడు పలబ్ధం.

అన్నమయ్య, అక్కాంబల తనయుడు పెద తిరుమలయ్య. అన్నమయ్య సంకల్పించిన సంకీర్తనా యజ్ఞాన్ని తుదిదాక నిర్వహించి ఆ సంకీర్తనలన్నింటిని రాగిరేకులపై చెక్కించి పితౄణం తీర్చుకొన్న ధన్యజీవి పెద తిరుమలయ్య, శృంగార, అధ్యాత్మ సంకీర్తనలు, శ్రీ వేంకటేశ్వర వచనాలు, శృంగారదండకం, చక్రవాళ మంజరి, శృంగార వృత్త శతకం, వేంకటేశ్వరోదాహరణం, నీతిసీసశతకం, శ్రీ వేంకటేశ్వర ప్రభాతస్తవం (ద్విపద), సుదర్శనరగడ, భగవద్గీత తెలుగు వచనం, రేఫ ఱకారనిర్ణయం, ద్విపదహరివంశం, సంకీర్తన లక్షణవ్యాఖ్యలు - ఇతర

కృతులు - వీటిలో ద్విపద హరివంశం, సంకీర్తన లక్షణ వ్యాఖ్యలు తప్ప మిగిలినవన్నీ లభిస్తున్నాయి.

పెద తిరుమలయ్య సంతతిలో పెద్దవాడు చినతిరుమలయ్య. ఇతడు కూడ తండ్రి తాతలవలెనే పదకర్త. శృంగార, ఆధ్యాత్మ సంకీర్తనలు, అష్టభాషాందండకం, అన్నమయ్య సంకీర్తన లక్షణ గ్రంధానువాదం - ఇతని రచనలు. ఇవన్నీ నేటికి లభిస్తున్నాయి.

పెదతిరుమలయ్య నాల్గవ కుమారుడు చిన్నన్నగా ప్రసిద్ధికెక్కిన తిరువేంగళనాధుడు. అష్టమహిషీ కల్యాణం, పరమయోగి విలాసం, ఉషాకల్యాణం, అన్నమాచార్య చరితలితని రచనలు. ఇవన్నీ ద్విపద కావ్యాలే, నేటికి లభిస్తున్నాయి.

చిన తిరుమలయ్య కొడుకు తిరువేంగళప్ప. ఇతని అమర వ్యాఖ్య, కావ్య ప్రకాశిక వ్యాఖ్యలు అప్రకటితాలు. సంస్కృత అమరుకశతక ఆంధ్రీకృతి ప్రకటితం. రామ చంద్రోపాఖ్యాన కావ్యం అలభ్యం.

## తాళ్ళపాక వాఙ్మయ ప్రచురణ :

రాగిరేకులకెక్కిన తాళ్ళపాక వాఙ్మయం కాలదోషం పట్టి ఎన్నో కరిగిపోగా మిగిలినవాటిని క్రీ.శ. 1922-23 ప్రాంతంలో తొట్టతొలిగా వెలికి తీసినవారు కీ.శే. సాధు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు. శ్రీమాన్ పండిత విజయ రాఘవాచారిగారు అన్నమయ్య కీర్తనల కొన్నింటిని చిన్నన్న కృతులను ప్రకటించగా తర్వాత అన్నమయ్య కీర్తనలను సాధికారంగా పరిష్కరించి ప్రకటించిన అన్నమయ్యచరిత్రను వెలుగులోకి తెచ్చిన ఘనత కీ.శే. వేటూరి ప్రభాకరశాస్త్రిగారిది. వీరు తొట్టతొల్లిగా అన్నమయ్య వర్ధంతి సభలు ప్రారంభించి అనేక సమావేశాలు నిర్వహించి ఆలిండియారేడియో ప్రసారాలవల్ల అంతదనుక తిరుమేలేశుని ఒడిలో ఒదిగివున్న అన్నమయ్య సంకీర్తనకీరితి రూప పుష్ప సుగంధాన్ని ఆంధ్రదేశం నలుమూలలా గుబాళింపజేశారు. వీరి తర్వాత శ్రీమాన్ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు ఈ వాఙ్మయాన్ని పరిష్కరించి ప్రకటించడమే గాకుండా అన్నమయ్య సంకీర్తనల నెనింటినో స్వరపరచి మనకందించారు. ఈ

ఇరువురి బాటలో నడుస్తూ అన్నమయ్య సంపుటాలనేకం వెలవరించి వాటిలో మనకంతుచిక్కని భాషా సాహిత్యమర్మాలనెన్నింటినో మనకిందించినవారు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు. తాళ్ళపాక సాహిత్య ప్రచురణ ప్రచారాల విషయంలో నేటికి తిరుమల తిరుపతి దేవస్థానము కృషి ప్రశంసనీయం.

తాళ్ళపాక సాహిత్య పరిశోధన :

తొలిగా తాళ్ళపాక సాహిత్యం గురించి సాధికారిక సిద్ధాంత వ్యాసాన్ని వెలువరిచినవారు డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారు. నేడు తెలుగుదేశం నలుమూలలా తాళ్ళపాక సాహిత్యంపై విస్తృతమైన పరిశోధనలు సాగుతున్నాయి. ఈ పరిశోధనలు రెండు రకాలు. 1. వ్యక్తిగత పరిశోధన 2. విశ్వవిద్యాలయ సంస్థాగత పరిశోదన.

1. వ్యక్తిగత పరిశోధన :

ఎందరో పండితులు వ్యక్తిగతంగా తాళ్ళపాక సాహిత్య సంగీతాలపై పరిశోధనలు జరిపి అమూల్యగ్రంధాలు, వ్యాసాలు రూపంలో వాటిని ప్రచురించడం.

2. విశ్వవిద్యాలయాలలో పరిశోధన :

ఉస్మానియా, ఆంధ్ర, నాగార్జున, కృష్ణదేవరాయ, శ్రీ వేంకటేశ్వర, మద్రాసు విశ్వవిద్యాలయాలలో ఎందో విద్యార్థులు ఎం.ఫిల్. పి.హెచ్.డి. పట్టాలకై తాళ్ళపాక సాహిత్యంలోని వివిధాంశాలపై పరిశోధనలు జరపటం.

ఎందరెన్ని పరిశోధనలు జరిపినా తాళ్ళపాక సాహిత్యంలో కవి సమయాలను గురించిన సమగ్ర పరిశోధన ఇంతవరకు జరుగలేదు. అసలు సాహిత్యాంగమైన కవి సమయాల గురించి జరిగిన పరిశోధన తక్కువ. విశేషించి పదసాహిత్యంలో కవిసమయాల గురించిన కృషి అంతంత మాత్రమే.

## కవిసమయాలు - సంస్కృత ఆలంకారిక గ్రంథాలు :

మన సాహిత్యంలో కవిసమయాల పుట్టుక ప్రయోగాలను పసికట్టి కవిసమయ వర్గీకరణ చేసిన ప్రథమ సంస్కృత ఆలంకారికుడు క్రీ.శ. 10వ శతాబ్దికి చెందిన రాజశేఖరుడు. ఇతని తర్వాత అజితసేనుడు, హేమ చంద్రుడు, అమరచంద్రుడు, అరిసింహుడు, దేవేశ్వరుడు, విశ్వనాథుడు, కేశమిశ్రుడు, దాదాపుగ రాజశేఖరుని మార్గాన్ననుసరించే కవిసమయాలను వింగడించారు.

## తెలుగు ఆలంకారిక గ్రంథాలు :

తెలుగు ఆలంకారికులలో రామరాజభూషణుడు 'కావ్యాలంకార సంగ్రహం'లో కవిసమయ స్వరూపాన్ని పరోక్షంగా తెలిపాడు. అప్పకవి తన అప్పకవీయంలో కవిసమయసిద్ధ పదాలను పేర్కొన్నాడు. శ్రీచర్ల గణపతి శాస్త్రిగారు 'సాహిత్య సౌందర్య దర్శనము' అనే తమ సమగ్రాలంకార గ్రంథంలో కవిసమయ ప్రాశస్త్యాన్ని వివరించారు.

## ప్రత్యేక వ్యాసాలు :

తెలుగు పండిత విమర్శకులలో విద్వాన్ కపగల్లుమఠం కరిబసవశాస్త్రిగారు 'కవిసమయములు' అనే వ్యాసంలోను, శ్రీ బులుసు వేంకటరమణయ్యగారు 'కొన్ని కవిసమయాలు' అనే వ్యాసంలోను[2], డా॥ జి. శంకరరెడ్డి 'జానపద సాహిత్యంలో కవిసమయాలు' అనే వ్యాసంలోను[3], శ్రీ కె.వి. రాఘవాచార్యగారు 'కవిసమయాలు క్రొత్త ప్రయోగాలు' అనే వ్యాసంలోను[4] కవిసమయాలగురించి చర్చించారు.

## వ్యాఖ్యానాలు, పీఠికలు :

శిరోమణి సన్నిధానం సూర్యనారాయణ శాస్త్రిగారు 'కావ్యాలంకార సంగ్రహ' వ్యాఖ్యానంలో[5] రాజశేఖరుని మార్గాన్ననుసరించి కవిసమయాల వింగడింపు గావించారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు విజయవిలాస, వసుచరిత్ర పీఠికలలో 'కవిసమయాల' గురించి వివరించారు.

## సిద్ధాంతగ్రంధాలు :

డా॥ సి. నారాయణరెడ్డిగారు 'ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయ ప్రయోగములు' అనే తమ సిద్ధాంత గ్రంధములో కవిసమయాల గురించి కొంత చర్చించారు. డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు 'కవిసమాయలు' అనే తమ సిద్ధాంతవ్యాసంలో డా॥ జి. శంకరరెడ్డిగారు 'తెలుగు సాహిత్యంలో కవిసమయాలు' అనే తమ సిద్ధాంత వ్యాసంలోను శ్రీమతి జి. ఉమాదేవి 'అన్నమయ్య సంకీర్తనలలో కవిసమయాలు' అనే సిద్ధాంతవ్యాసంలోను కవిసమయాల గురించిన ఇతోధిక కృషి జరిగింది.

## సిద్ధాంత పరిధి :

ఈ సిద్ధాంత వ్యాసంలో రాజశేఖరుని విభజన ప్రకారం తాళ్ళపాక సాహిత్యంలో కనిపించే కవిసమయాలను విశ్లేషించడం. ఉపమానాలను కవిసమయాంగాలుగా పరిగణించి తాళ్ళపాక సాహిత్యంలో ప్రయోగింపబడ్డ అసంఖ్యాలైనా ఉపమానాలగురించి పరిశోధించడం ప్రధానాంశం.

ఈ సిద్ధాంత వ్యాసంలో ఐదు ప్రకరణాలున్నాయి.

| | |
|---|---|
| మొదటి ప్రకరణంలో | ప్రస్తావనను |
| రెండవ ప్రకరణంలో | కవిసమయ స్వరూప స్వభావాలను |
| మూడవ ప్రకరణంలో | తాళ్లపాక సాహిత్యంలోని కవిసమాయాలను |
| నాల్గవ ప్రకరణంలో | తాళ్లపాకసాహిత్యంలోని విశిష్టకవిసమయాలను |
| ఐదవ ప్రకరణంలో | ఉపసంహారాన్ని |

సంగ్రహంగా చెప్పడం జరిగింది.

## సంఖ్యా సూచిక

| | | | |
|---|---|---|---|
| 1. | ఆంధ్రసారస్వత పరిషత్పత్రిక | - | 1928 సం॥ ఫాల్గుణ సంచిక |
| 2. | భారతి | - | 1932 సం॥ జూలై సంచిక |
| 3. | నవభారతి | - | 1982 సం॥ మార్చి సంచిక |
| 4. | భారతి | - | 1978 సం॥ ఏప్రిల్ సంచిక |
| 5. | కావ్యాలంకార సంగ్రహం | - | 490, 491, 492 పుటలు |

# ప్రకరణం - 2

# కవిసమయ స్వరూప స్వభావాలు

## 2. కవిసమయం :

'కవీనాం సమయః' అని కవిసమయ సమాసానికి విగ్రహవాక్యం. ఈ సమాసంలో కవి, సమయమనే రెండు పదాలున్నాయి. ఈ పదసముదాయం సాహిత్యశాస్త్రంలో ప్రత్యేకార్థంలో ప్రయుక్తం. కవులయినవారు తమ తమ రచనలలో పాటించే నియమావళి కవిసమయమని స్థూలార్థం. కవి సమయం గురించి తెలుసుకోవడానికి ముందు ఈ సమాసంలో ప్రధాన మయిన 'సమయ' శబ్దం గురించి చర్చించడం సమంజసం.

### 2.1 సమయం : నిఘంటువులు

అమరంలో (గురుబాల ప్రబోధిక) సమయశబ్ద వివరణ రెండు రకాలుగా ఉంది.

1. 'సమ్యక్ ఈయతే అనే నేతి సమయః దీని చేత ఎరుగ బడును. కనుక సమయం.

2. సంకేతే సమయః ప్రోక్తో నియమే ౭వసరే ౭పిచ'

ఇవేగాక శపధ, ఆచార, కాల, సిద్ధాంత, జ్ఞానములనేవి సమయ శబ్ద పర్యాయార్థాలే.

ఇక సంస్కృతాంధ్ర నిఘంటువులలో వివరణ పరిశీలిద్దాం.

సమయ : 'Time in general, Occassion, opportunity. Fit time, Propertime or Session. Right moment. An agreement. A compact contract, An engagement. A conventional usage. An established rule of conduct, ceremonial custom, usual practice observence. The convention of the Poets (eg: that persons separate from their beloveds are affected at the sights of clouds). An appointment. Assignation A condition stipulation. A law rule, regulation. Direction order. Instruction. Precept Emergency, Exigency. An oath. A sign. Hint A demonstrated

conclusion. Doctrine End conclusion. Termination. Success. Prosperity End of trouble - Apte.

సమయం సం.వి.అ.పుం. తఱి, వేళ, తగిన కాలము బాగు శపథం. ఆజ్ఞ. సిద్ధాంతము. బుద్ధి, ఆచారుము. సంకేతము. ఒప్పుకోట సంపద నియమము. వ్యు. సమే +ఇణ్ (= గతే) + అచ్. కృ. ప్ర - 'ఆంధ్ర శబ్ద రత్నాకరము'.

సమయము : సం.వి. అ.పుం. కాలము, శపథము. ఒట్టు ఆచారము. సిద్ధాంతము. అంగీకారము. ఒప్పుదల. భాగ్యము, సంపద. సంకేతము. నిర్దేశము. ఆజ్ఞ. బుద్ధి. భాష. నియమము, శాస్త్రము. ఈ శబ్దానికిది యర్థమనియెడి కట్టుబాటు. ఏర్పాటు హద్దు. సూచన. ప్రతిజ్ఞ తఱి. యుక్తకాలము.

- 'సూర్యరాయాంధ్ర నిఘంటువు'.

సమయము : తెలుగులో - కాలము. అదను. శపథము, సంకేతము, ఒడంబడిక. సిద్ధాంతము.

తమిళంలో - కాలం - పొళుదు. సమయం. సత్తియం. కుఱి, ఆణై, ఉడన్‌పాడు సిద్ధాంతము. కడవుళ్ వణక్కం.

కన్నడంలో - కాల - ఒప్పంద. వేళె. శపథ, సంకేత. సిద్ధాంత ఒందు విధ ధర్మ - ఆంధ్ర తమిళ కన్నడ త్రిభాషా నిఘంటువు.

పై వివరణవల్ల సమయం సంస్కృత శబ్దమని స్పష్టం. ఈ శబ్దానికి ఎన్ని అర్థాలున్నా కవిసమయ మన్నప్పుడు 'కవుల ఆచార' మనే వివరణ సమంజసంగా కనిపిస్తుంది.

## 2.2. సమయం - కావ్యప్రయోగాలు :

సమయ శబ్దం చాల ప్రాచీనమైంది సంస్కృత కవులయిన వాల్మీకి, వ్యాస, కాళిదాస, భవభూతి, భారవి, మాఘుల రచనలలో సమయ శబ్ద ప్రయోగముంది.

యదా హరామో ధర్మాత్మతత్కురుష్వ సమాహిత ః

రాజం తిష్టస్వ సమయే భవ సత్య ప్రతి శ్రవః

- రామాయణం 4.32 .51.

"నారదస్యోజ్ఞాయాచైవ ద్రౌపద్యాః సమయ క్రియా"

- మాహాభారతం 1.2. 119

"ఏవంతే సమయం కృత్వాదాసీ భావాయవై మిధః

జగ్మతుః స్వగృహానే వశ్యోదృక్ష్యో ఇవ ఇతిస్మవా"

- మహాభారతం 1.20.5.

"నిహ్నవంతి చయే తేషాం సమయం సుకృతంచత్"

-మహాభారతం 12.229

"కామం తథా తిష్ఠ నరేంద్ర తాస్మిన్ యథాకృతాస్తే సమయః సభాయామ్

- మహాభారతం 3.185. - 35

"గన్తుమ్ ప్రవృత్తే సమయం విలంఘ్య"

- కుమార సంభవమ్ 3.35

"వీరాణాం సమయోహి దారుణ రసః స్నేహ క్రమం బాధతే

- ఉత్తరరామ చరిత్ర 5. 19

"నిరస్తనారీ సమయా దురాధయః" - కిరాతార్జునీయం - 1.28

"న సమయ పరిరక్షణ క్షమమ్" - కిరాతార్జునీయమ్ - 1.45

"శౌరి సమయ నిగృహీత ధియః" - శిశుపావధ 15-41

పై ప్రయోగాల వల్ల సమయ శబ్దానికి నియమం; ఒప్పందం; నిబంధనం, ఆచారం, శపథం, యుక్తకాలం, సంప్రదాయం, ధర్మం, సంకేతం అనే అర్థాలున్నట్లు స్పష్టమయింది.

తెలుగులో కూడా కవిత్రయం, ధూర్జటి, ఎల్లనార్యుడు, ధరణి దేవుల అన్నయామాత్యుల రచనలలో సమయశబ్ద ప్రయోగం వుంది.

"వినుడు ప్రసిద్ధులైన ప్రధివీపతులిందఱు నేగురు ప్రయోజనమున జేసితిన్ సమయసంస్థితి యీలలితాంగికుద్భవించిన తనయుండు రాజ్యమును జేయగనర్హుడు"

- మహాభారతం. ఆదిపర్వం. 4-189.

"దానవిధులఁ జేసి వానివలన
గ్రమము వడసి యొక్క సమయంబుఁ జేసిరి"

- మహాభారతం ఆదిపర్వం 6.264.

"ఇట్టిది సమయంబుగాఁ బరి గ్రహింపుమనినఁ గర్ణుడు నాకుంగల పగతు
డొక్కరుండ వాని వధియించుట మదీయ మనోరథంబు"

- మహాభారతం. అరణ్యపర్వం 7.371

"సమయమెయ్యది యేని దమకును నీకుగ
ల్గిన యట్టులైనను గనియరిచట"

- మహాభారతం. విరాటపర్వం. 2. 148

"తనయగపాటులోరులెఱుగుదు
రని సూతుడు సమయ భంగ మగుటకు భీముండు

- మహాభారతం. విరాటపర్వం. 2.345

"వాలి యజ్ఞాతవాస సంవత్సరంబు
నిండకుండగమున్న పార్థుండు బయలు
మెఱసి సమయంబుఁ దప్పె"

- మహాభారతం. విరాటపర్వం 5-368

"తప్పిది చెప్పరాదు కవితా సమయంబున కొప్పుగాదునీ, విప్పగదిన్ రచింపదగునే?"

- శ్రీ కాళహస్తీశ్వర మహాత్యం 3.159.

"ఆత్మమూర్తులయందు దినావసాన
సమయ లక్ష్మి విలాసంబు సంఘటిల్ల"

- రాధామాధవం 4-78.

"ఐన సమయంబుగాదని యంటిరేని
కన్నులర్కేందులను నాభిగమల భవుడు
శయ్యయై శేషుడుండగ శౌరిగొల్వ
మాకు సహాయంబుగాదె ధీమహితులారా

- దశావతార చరిత్ర 3-137.

పై ప్రయోగాలవల్ల సమయ శబ్దానికి తెలుగులోకూడ శపథం, ప్రతిజ్ఞ, ఒడంబడిక, కాలం, యుక్తకాలం అనే అర్థాలున్నట్లు స్పష్టం.

## 2.3 కవి సమయం - ఆలంకారిక నిర్వచనాలు :

సంస్కృత వాఙ్మయంలో 'అలంకారశాస్త్రానికి' ప్రత్యేక గౌరవం ఉంది. భరతుని మొదలు జగన్నాధరాయల వరకు సాగిన సాహిత్య విమర్శలో అంకారాల

చర్చ ప్రాధాన్యత వహించింది. ఈలాంటి అలంకార గ్రంధాలలో కవిసమయ చర్చ కూడ ఒక భాగంగా కనిపిస్తుంది. ఈ చర్చను మూడు దశలుగా వర్గీకరించవచ్చు.

### 2.3.1 ప్రథమదశ:

సాహిత్య విమర్శలో 'కవి సమయా'ల ఉనికి పసిగట్టి కవి సమయ స్వరూప స్వభావాలను విశదీకరించిన వాడు రాజశేఖరుడు. అయినా అతని కంటె ముందు పురాణాలలోను వామనాది ఆలంకారికుల గ్రంథాల్లోను కవి సమయం కనిపిస్తుంది. ఇదే తొలిదశ.

"అనేకస్య తథైకేన బహూనాం బహుభిఃశుభా

కవీనాం సముదాచారః సమయోనామగీయతే"

- 31వ శ్లోకం.

అని అగ్ని పురాణంలో కావ్యదోష ప్రకరణంలో వ్యాసుడు కవిసమయ శబ్దాన్ని నిర్వచించాడు. పలువురు వ్యక్తులు ఒకే మాటను చెప్పడం లేక పలువురు దానినే పలుమార్లు ఆవృత్తి చేయడం శుభావహమని కవుల సముదాచారమే కవిసమయమని అగ్ని పురాణకర్త అభిప్రాయం. కాని అతడు దీనికి ఏలాంటి వ్యాఖ్యానంగాని ఉదాహరణలుగాని పేర్కొనలేదు.

రాజశేఖరునికి పూర్వమున్న ఆలంకారికులు భామహ, ఉద్భటాదులు కవిసమయాలను గూర్చి ఏమీ చెప్పలేదు. కాని లోకశాస్త్ర విరుద్ధార్థగ్రథనం దోషమని చెప్పారు. క్రీ.శ. తొమ్మిదవ శతాబ్దికి చెందిన వామనుడు తన కావ్యాలంకార సూత్రవృత్తిలో 'సంప్రతి కావ్యసమయమ్ శబ్ద శుద్ధించ దర్మయితుం ప్రాయోగికాఖ్యమధి కరణ మారభతే। తత్ర కావ్య సమయస్థావదుచ్యతే' - 5.1

అని కొన్ని సందిగ్ధ పదప్రయోగాలను, ఛందో సంప్రదాయ ప్రయోగాలను కావ్య సమయాలుగా పేర్కొన్నాడు.

### 2.3.2 ద్వితీయదశః

కవిసమయ స్వరూప స్వభావాలను లాక్షణికంగా ప్రవచించినవాడు రాజశేఖరుడు. ఇతడు 10వ శతాబ్దానికి చెందినవాడు.

తన కావ్య మీమాంసలో -

"సోఽయం కవీనాం సమయః కావ్యే సుప్త ఇవస్థితః

ససాం ప్రతమిహో స్మాభిర్యధా బుధ్విబోధిత ః" -16-20

అని ఇంతవరకు కవిసమయాలు కావ్యాలలో నిద్రపోతున్నట్లున్నాయని ఇప్పుడు తానే బుద్ధ్యనుసారంగా వాటిని మేల్కొలుపుతున్నానని పేర్కొన్నాడు. ఇతడు కావ్యమీమాంసయందు -

అశాస్త్రీయం అలౌకికంచ పరంపరాయతం

యమర్ధముప నిబధ్నంతి కవయః స కవిసమయః" -14-1.

అని కవిసమయ శబ్దాన్ని నిర్వచించాడు. ఇతని నిర్వచన ప్రకారం అశాస్త్రీయం, అలౌకికం, పరంపరాయాతం అయిన అర్ధనిబంధనం కవి సమయ మనబడుతుంది.

### 2.3.3. తృతీయదశ ః

రాజశేఖరుని తరువాతి అంకారికులు చెప్పినా లేదా విశదీకరించిన అభిప్రాయాలు తృతీయ; దశలో చేరుతాయి. వారిలో అజితసేనుడు[1] (10వ.శ.); హేమచంద్రుడు[2] (11.12శ.); అమరచంద్రుడు[3] మరియు అరిసింహుడు (13శ) దేవేశ్వరుడు[4] (14శ) విశ్వనాధుడు[5] (14శ); కేశవమిత్రుడు[6] (16శ) ప్రముఖులు. వీరు రాజశేఖరుని మార్గాన్ననుసరించే కవిసమయాలను పేర్కొన్నారు. జగన్నాధ పండితరాయలు (17శ) మాత్రం 'రసంగంగాధరం'లో కవిసమయాలు చమత్కార సాధనాలని కావ్య సౌందర్య

హేతువులని, అట్టి కవిసమయాలు కావ్యాలలో లేక పోవడం దోషమని పేర్కొన్నాడుగాని కవిసమయాలను నిర్వచించి పేర్కొనలేదు.

కవి సమయాలను గురించి పేర్కొన్న తెలుగు ఆలంకారికులలో రామరాజభూషణుడు (16శ) ప్రసిద్ధుడు. ఇతడు తన 'కావ్యాలంకార సంగ్రహం'లో

"క్రమమెడలి దేశకాలా

సముచితము విరుద్ధమయ్యె సమదవిలోల

భ్రమరము చంపకవన'మన

సముదంచిత కైతకంబు చైత్రంబనగన్" - 4.49.

అని దేశకాలాదులకు విరుద్ధమైనది దోషమంటూ దేశకాలాదుల కనుగుణంగా కవి ప్రయోగించాలని 'కవిసమయ స్వరూపాన్ని పరోక్షంగా తెలిపాడు.

అప్పకవి (17శ) తన అప్పకవీయంలో 'దేశ సమయలోక దిక్కాల మైత్రీవిరోధాగమ కళా విరోధములును' -1.34. అని సమయవిరుద్ధ ప్రయోగాలను దోషాలుగా పరిగణించాడు.

"సిద్ధిర్లోకాద్వ్యాలో కో ?సన్యాదృశశ్చ నిత్యశ్చ' - 1. అనే ఆంధ్రశబ్ద చింతామణి సూత్రాన్ని అనువదిస్తూ 'పూర్వకవి సమయ సిద్ధ పదంబులు' అనే విభాగంలో పూర్వకవి సంప్రదాయసిద్ధంగ వచ్చిన పద ప్రయోగాలను.

సీ. మదిరాక్షి చెవులు తొమ్మిది లెక్కలనరాదు

ముద్దియ కనులు తమ్ములనరాదు

శుకవాణి బుగ్గలు ముకురంబులన రాదు

చెలి పండ్లు మల్లె మొగ్గలనరాదు

గజయాన చండ్లు బంగరు కుండలనరాదు

సతిబొడ్డు సుడిని మెచ్చదనరాదు

నరసిజానన ముడ్డి పై కతంబనరాదు

హరి మధ్యకాళ్ళిగుళ్ళునగరాదు

క్రమత వీనికి వీనులు కన్నుదోయి

చెక్కులును బలు వరుసలు నిక్కు( జన్ను

గవయు( బొక్కిలి పిఱుదు చొక్కంపుటడగు

అనుచు మును వాడి రవియ చే కొనగవలయు

- అప్పకవీయం - 1.118

అని పేర్కొన్నాడు.

## 2.4 కవిసమయం - వర్గీకరణ :

కవి సమయాలను లాక్షణికంగా వర్గీకరించినవాడు రాజశేఖరుడు. ఇతడు కవిసమయాలను స్వరూప, దేశ, స్వభావాలకను గుణంగా మూడు విధాలుగాచేశాడు.

### 2.4.1 స్వరూప వర్గీకరణ :

ఈ విభాగంలో 'అశాస్త్రీయం, అలౌకికం, పరంపరాయాతం' అనే విభాగాలు చేరతాయి.

#### 2.4.1.1. అశాస్త్రీయం :

శాస్త్రమర్యాదలకు లొంగనివి, తర్కానికి నిలవనివీ, కవి పాఠకలోకానికి మాత్రం పరిమితమైనవి. ఊహా కల్పితమైన కవిసమయాలు అశాస్త్రీయాలు.

#### 2.4.1.2. అలౌకికం:

కేవలం స్థావర జంగమాత్మక మయిన ఇహలోకానికి సంబంధించినవి కాక లోకాతీతమయినవి, విలక్షణమయినవి, భావనా జగత్తులో మాత్రం

ప్రత్యక్షమయ్యేవి రాసావిష్కరణకు దోహదం చేసేవి. కావ్యానికి ఎంతో సౌందర్యాన్ని ఆపాదించేవి అలౌకికాలు.

### 2.4.1.3. పరంపరాయాతం :

కేవలం అశాస్త్రీయం, అలౌకికం కాకుండా సంప్రదాయసిద్ధంగా కావ్యోత్కర్షను కలిగించే కవి సంకేతాలన్నీ పరంపరాయాత కవిసమయాలు.

### 2.4.2 ప్రదేశ వర్గీకరణ :

ప్రదేశమంటే లోకమని అభిప్రాయం భారతీయ సిద్ధాంతం బట్టి లోకాలనేకాలు. వాటిలో స్వర్గం, పాతాళం, భూలోకాలు త్రిలోకాలుగా ప్రసిద్ధాలు. జంతుజాలంలో భౌగోళిక వాతావరణంలో వీటికి తేడా లెక్కువ. ఈ దృష్టితోనే రాజశేఖరుడు ప్రదేశ వర్గీకరణ చేశాడు.

### 2.4.2.1. స్వర్గ్యం :

స్వర్గలోక వాసులకు మాత్రం చెందినవి స్వర్గ్య కవి సమయాలు చంద్రునిలో శశమృగాలక్యైక్యాన్ని వర్ణించడం; కామకేతనంలో మకర మత్స్యాల కైక్యాన్ని వర్ణించడం; అత్రినేత్రం నుండి, సముద్రం నుండి పుట్టిన చంద్రాదులకు ఐక్యాన్ని వర్ణించడం; చాలాకాలం క్రితమే జన్మించినా శివుని జటాజూటంలోని చంద్రుని నెలబాలునిగానే వర్ణించడం, మన్మధుని అశరీరునిగా వర్ణించడం, ద్వాదశాదిత్యుల కైక్యాన్ని వర్ణించడం, నారాయణ మాధవులకు దామోదర శేషకూర్మలకు ఐక్యాన్ని వర్ణించడం కమలా సందలకు ఐక్యాన్ని వర్ణించడం. ఇవి స్వర్గ్య కవిసమాయాలలో ప్రత్యేకతలు.

### 2.4.2.2 భౌమం :

భూమికి సంబంధించిన కవిసమయంలే భౌమం. ఇది చాలయా విస్తృతమయినది. స్వర్గ పాతాళాల కంటె భూలోక వాసులే శ్రేష్ఠులు. అదీగాక అజరం, అమరం అయిన త్రిదశత్వం కంటె వర్ధమానం, వినోదాశ్రయం స్వర్గపాతాళీయులకు ప్రీతి పాత్రం అయిన భౌమంశ్రేష్ఠం. ఈ భౌమ

కవిసమయాలు జాతి ద్రవ్య గుణక్రియలని నాల్గువిధాలు. నదులలో పంకజ నీలోత్పలాదుల వర్ణించడం, జలాశయంలో హంసాదుల వర్ణించడం, పర్వతాలన్నిట్లో బంగారం, రత్నాలున్నట్లు వర్ణించడం మొదలయినవి కొన్ని భౌమ కనవిసమయాలు.

### 2.4.2.3. పాతాళీయం :

పాతాళానికి చెందిన కవి సమయాలు పాతాళీయాలు. వీనిలో ప్రత్యేకాలు దైత్య, దానవ, అసురుల ఐక్యాన్ని వర్ణించడం. హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు, ప్రహ్లాదుడు, విరోచనుడు, బలి, శంబరుడు, నముచి, పులోముడు, మొదలైన దానవులు, బలవృత్తుడు, విక్షురుడు, వృషపర్వుడు మొదలైన అసురులు - అందరికీ ఐక్యాన్ని వర్ణించడం - పాతాళీయ కవిసమయం.

### 2.4.3. కవిసమయ స్వభావ వర్గీకరణ :

స్వభావాన్ని బట్టి కవి సమయాలు జాతి ద్రవ్యగుణ క్రియలని నాలుగురకాలు. వానియందలి సత్యాసత్యనిబంధనలనుసరించి అసత్ నిబంధనం, సత్ అనిబంధనం, నియమ నిబంధనం అని మరల మూడురకాలు.

### 2.4.3.1. జాతినిబంధనం :

ఒక జాతి వస్తువులకు సంబంధించిన కవి సమయాలు. ఇది అసత్ నిబంధనం, సత్ అని బంధనం, నియమ నిబంధనం అని మూడు రకాలు.

### 2.4.3.1.1.అసత్ నిబంధనం :

ఒక జాతి వస్తువులో లేని ధర్మాన్ని ఉన్నట్లుగా కావ్యాల్లో నిబంధించడం జాతి అసత్నిబంధనం. నదుల్లో పంకజ నీలోత్పలాదులుండవు. అవి నిశ్చలమైన నీటిలోనే వుండడం లో॥ సమాన్యం. కాని కవి కావ్యంలో నదులలో కూడ పంకజ నీలోత్పలాదులున్నట్లు వర్ణించడం. అలాగే జలాశయంలో హంసలు, పర్వతాలన్నిట్లో బంగారు, రత్నాలున్నట్లు వర్ణించడం జాతి అసత్ నిబంధనం.

### 2.4.3.1.2. సత్ అనిబంధనం :

లౌకిక ప్రపంచంలో వున్న వాస్తవాంశాలను కవి కావ్యంలో లేనట్లు వర్ణిచడం సత్ అనిబంధనం వస్తు సహజ ధర్మాన్ని స్వీకరించ కుండడం దీని ప్రధాన లక్షణం. వాస్తవానికి మాలతీలత వసంతర్తువులో పుష్పిస్తుంది. కాని కావ్యాలో వసంతంలో పుష్పించినట్లు వర్ణించక పోవడం. అలాగే చందన వృక్షాలకు అశోకానికి పువ్వులున్నా కావ్యాల్లో వానిని వున్నట్లు వర్ణించక పోవడం జాతి సత్ అనిబంధనాలు.

### 2.4.3.1.3. నియమ నిబంధనం :

లోకంలో యాదార్థస్థితి ఎట్లున్నా కవులు ఒక కట్టుబాటుకు లొంగి వర్ణించడం సంప్రదాయం. ఒక వస్తువు చాల స్థలాలలో వున్నప్పటికి ఒక స్థలంలోనే వున్నట్లు వర్ణిచడం నియమ నిబంధనం. మొసళ్ళు సముద్రంలో నదులలో జలాశయాలలో వుండడంలోక సహజం. కాని సముద్ర గాంభీర్యాన్ని వైశాల్యాన్ని తెలియజేయాలని కవులు మొసళ్ళు కేవలం సముద్రంలో మాత్రమే ఉన్నట్లు వర్ణించడం. తామ్రపర్ణీనదిలో మాత్రమే ముత్యాలు లభిస్తాయని వర్ణిచడం జాతి నియమ నిబంధనం.

### 2.4.3.2. ద్రవ్యనిబంధనం :

ద్రవ్యాలకు సంబంధించిన నిబంధనం. ఇది కూడా అసత్ నిబంధనం, సత్ అనిబంధనం, నియమనిబంధనం అని మూడు రకాలు.

### 2.4.3.2.1. అసత్ నిబంధనం :

లేని ద్రవ్యాన్ని కూడా వర్ణించడం ద్రవ్య అసత్ నిబంధనం. అమూర్త పదార్థమైన చీకటిని పిడికిళ్ళతో పట్టుకోవడానికి వీలున్నట్లు, సూదులతో గ్రుచ్చడానికి వీలునట్లు వర్ణించడం, వెన్నెలను కడవలతో ఎత్తిపోయడానికి వీలుగా వర్ణించడం - ద్రవ్య అసత్ నిబంధనాలు.

2.4.3.2.2. సత్ అనిబంధనం :

ఉన్న ద్రవ్యాన్ని వర్ణించక పోవడం. కృష్ణపక్షంలో వెన్నెలవున్నా వర్ణించకపోవడం, శుక్లపక్షంలో చీకటి వున్నా వర్ణించక పోవడం సత్ అనిబంధనం.

2.4.3.2.3. నియమ నిబంధనం :

ఒక వస్తువు అనేక ప్రదేశాలలో అభిస్తున్నా అది నియతంగా ఒక ప్రదేశంలో మాత్రమే వున్నట్లు వర్ణించడం. చందన వృక్షం, భూర్జవృక్షాలు ఎన్నో చోట్ల లభిస్తున్నా హిమాలయంలోనే భూర్జవృక్షం మలయంలోనే చందన వృక్షాలను వర్ణించడం. పాలకడలికి, ఉప్పునీటి సముద్రానికి మహాసాగరాలకు ఏకత్వాన్ని వర్ణించడం ద్రవ్యనియమ నిబంధనం.

2.4.3.3. గుణ నిబంధనం :

ఇది గుణాలకు సంబంధించిన నిబంధనం. అసత్ నిబంధనం, సత్ అనిబంధనం, నియమనిబంధనం అని మూడు రకాలు.

2.4.3.3.1. అసత్ నిబంధనం :

లేని గుణాన్ని వున్నట్లు వర్ణించడం. అమూర్త పదార్థాలైన కీర్తిని, నవ్వును తెల్లగా; అపకీర్తిని, పాపాన్ని నల్లగా; క్రోధాన్ని, అనురాగాన్ని ఎర్రగా వర్ణించడం గుణ అసత్ నిబంధనం.

2.4.3.3.2. సత్ అనిబంధనం :

లోకంలో ప్రసిద్ధంగా వున్న గుణాలను కూర్చకుండడం. మల్లెమొగ్గతొడిమలు, కాముకుల దంతాలు ఎర్రగా వున్నా అట్లున్నట్లు వర్ణించక పోవడం. తామర మొగ్గలు ఆకుపచ్చగావున్నా, ప్రియాంగు పుష్పాలు పచ్చగా వున్నా అట్లు వర్ణించకపోవడం గుణసత్ అనిబంధనం.

## 2.4.3.3.3. నియమ నిబంధనం :

కావ్యాల్లో నియమాలను నిబంధించడం. మాణిక్యాలు సామాన్యంగా అన్నీ ఎఱ్ఱగా వున్నట్లు, పూలన్నీ సామాన్య రూపంగా తెల్లగా వున్నట్లు, మేఘాలు నల్లగా వున్నట్లు వర్ణించడం, ఇంకా నలుపు (కృష్ణ) నీలం, ఆకు పచ్చ (హరిత), ముదురు పచ్చ (శ్యామల) రంగులకు, తెలుపు (శుక్ల), బూడిదరంగు (గౌర)లకు ఐక్యాన్ని వర్ణించడం. నేత్రాలకు తెలుపు, నలుపు, ఎరుపులు ప్రత్యేకంగాను, కలసి వున్నట్లు వర్ణించడం గుణనియమ నిబంధనం.

## 2.4.3.4. క్రియానిబంధనం:

క్రియారూప నిబంధనం. ఇది అసత్ నిబంధనం, సత్ అనిబంధనం, నియమ నిబంధనం అని మూడు రాకాలు.

## 2.4.3.4.1. అసత్ నిబంధనం :

యాదార్ధానికి లేకపోయినా క్రియా రూపమైన అర్ధాన్ని కూర్చడం అంటే యదార్ధక్రియకు వ్యతిరేకంగా వర్ణించడం. రాత్రివేళ చక్రవాక మిధునం ఒకే తటంలో వున్నా వేరు వేరు తటాలని ఆశ్రయించి విరహంలో వున్నట్లువర్ణించడం. అలాగే చకోరాలు వెన్నెలను త్రాగవు. కాని వెన్నెలనే త్రాగి జీవిస్తున్నట్లు వర్ణించడం – క్రియారూప అసత్ నిబంధనం.

## 2.4.3.4.2 సత్ అనిబంధనం :

యదార్ధానికి లోకంలో జరుగుతున్నా జరగనట్లు వర్ణించడం. నీలోత్పలాలు పగటి పూట వికసిస్తున్నా కావ్యాల్లో రాత్రివేళనేగాని పగటిపూట కలువలు వికసించినట్లు వర్ణించకపోవడం. విప్పపూలు రాత్రిపూటరాలిపోయినా రాలినట్లు వర్ణించకపోవడం – క్రియారూప సత్ అనిబంధనం.

2.4.3.4.3. నియమనిబంధనం :

లోకంలో యదార్థం ఎట్లున్నా కావ్యాల్లో నియతమైన నిబంధనం. వేసవిలో కోకిలరుతం వినిపించేదయినా వసంతంలోనే కోకిల కూసినట్లు వర్ణించడం ఇలాగే వర్షాలు రావడంతోనే నెమలి నాట్యాన్ని వర్ణించడం - క్రియారూపనియమ నిబంధనం.

ఇంతవరకు అలంకార శాస్త్రాలలోని కవిసమయవర్గీకరణను ప్రస్తావించడం జరిగింది. ఇక తాళ్లపాక సాహిత్యంలో కనిపించే కవిసమయాలను మూడువ ప్రకరణంలో పరిశీలిద్దాం.

## సంఖ్యా సూచిక

| | | | |
|---|---|---|---|
| 1. | అంకార చూడామణి | - | ప్రథమాధ్యాయం |
| 2. | కావ్యానుశాసనం | - | ప్రథమాధ్యాయం |
| 3. | కావ్యకల్పలతావృత్తి | - | ద్వితీయప్రతానం |
| 4. | కవి కల్పలత | - | శబ్దస్తబకం |
| 5. | సాహిత్య దర్పణం | - | సప్తమాధ్యాయం |
| 6. | అలంకారశేఖరం | - | పంచదశోమరీచి. |

# ప్రకరణం - 3

# తాళ్లపాక సాహిత్యంలో కవిసమయాలు

## తాళ్లపాక సాహిత్యంలో కవిసమయాలు :

'అపారే కావ్య సంసారే కవి రేవ ప్రజాపతి' కావ్యసృష్టి ఒక అలౌకికలోకం. ఇది బ్రహ్మ సృష్టికంటె భిన్నం విశిష్టం. ఈ సృష్టిలో సత్యాసత్య మీమాంస ఉండదు. సత్యశోధన కేవలం శాస్త్ర కారులకు సంబంధించింది. అది శాస్త్ర మర్యాద. కావ్యం కళ. శాస్త్రంకాదు. అట్లని కావ్యం కేవలం సత్యదూరమూ. అయదార్థమూ కాదు.

'తత్త్వశాస్త్ర సిద్ధాంతులేమందురోగాని సాహిత్యమువారమగు మనకు సత్యములేని అసత్యముగాని అసత్యములేవి సత్యముగాని సాధారణముగ దొరకు పదార్థం కాదు' అని కావ్య తత్వాన్ని గుర్చి శ్రీమన్ రాళ్ళపల్లి అనంతకృష్ణ శర్మగారు చెప్పిన అంశాన్ని కవిసమయాలకు వర్తింప జేసుకొన వచ్చని డా॥ ఇరివెంట కృష్ణమూర్తిగారి అభిప్రాయం!

కవులు స్వేచ్ఛా ప్రియులు అయినా పారంపర్యంగా వచ్చే ఈ కవిసమయాలను పాటిస్తూనే క్రొత్తవాటిని సృష్టింపగల సమర్థులు. కవులు కావ్యాలలో కనిపించే కవి సమయాలను సహేతుకంగా విశ్లేషించిన ప్రథమాలంకారికుడు రాజశేఖరుడు. ఇతడు ప్రాదేశికంగా కవిసమయాలను భౌమ, స్వర్గ్య, పాతాళీయాలుగా విభజించాడు. వీటిలో అధిక ప్రాధాన్యత వహించినవి భౌమ కవిసమయాలే.

### 3.1. భౌమం :

భూలోకవాసులకు సబంధించిన కవిసమయాలు భౌమ కవిసమయాలు. స్వభావాన్ని ట్టి వీటిని జాతి, ద్రవ్య, గుణ, క్రియలని నాలుగు విధాలుగా విభజించాడు. వీటిలోని సత్యాసత్య నిబంధనల బట్టి వీటిని మళ్ళా అసత్ నిబంధనం, సత్ అనిబంధనం, నియమనిబంధనం అని ఒక్కొక్కదానిని మూడు రకాలుగా విభజించాడు. రాజశేఖరుని తరువాత పలువురు ఆలంకారికులీ విభజనను పాటించినవారే. ఈ ఆలంకారికులు పేరొక్కన్న కవిసమయోదాహరణలను పరిశీలిస్తే వీటిని ప్రధానంగా పక్షి, వృక్ష, రత్న, ఆకాశ, వర్ణ వర్గాలుగా విభజించవచ్చు. తాళ్లపాక సాహిత్యంలోని కవిసమయాలను పరిశీలిద్దాం.

### 3.1.1. అసత్ నిబంధనం :

అసత్ నిబంధనమంటే సత్యంకాని దానిని కావ్యాలలో నిబంధించడం. లేనిది ఉన్నట్లు చెప్పడం. నిజానికి లోకంలో లేనిదానిని అయదార్థమైన దానిని కవులు తమ కావ్యాలలో ఉన్నట్లు పరంపరగా వర్ణించడం. ఈ పారంపర్యత వల్లనే అయదార్థమైనది కూడా మనకు యదార్థంగా గోచరిస్తుంది. 'పలువురాడుమాట పాడియై ధరజెల్లు' నన్న అక్షరసత్యాన్ని నిరూపించేవి ఈ కవిసమాయాలు.

#### 3.1.1.1. హంస - వర్షర్తుమానస సరోవరపయనం:

"రాజహంసాస్తుతే చంచు చరణైర్లోహితై స్సితాః

మలినై ర్మల్లి కాఖ్యాస్తే ధార్త రాష్ట్రానితేతరైః"

హంస, రాజహంస, మల్లిక, ధార్తరాష్ట్రాలని హంసలలో నలురకాలను అమరకోశం పేర్కొంది. ఎఱ్ఱని ముక్కు కాళ్ళతో కూడిన తెల్లని రెక్కలతో కనిపించేవి హంసలు. హంసశబ్దం సూర్యునికి కూడ పర్యాయపదం. హిమాలయ శిఖరానికి అవతలగల మానసరోవరమే వీటి ఉత్పత్తి స్థానమని అయితే అక్కడ చలి ఎక్కువగా ఉన్న శీతాకాలంలో మాత్రం గంగాయమునా నదీతీరాలకు వలస వస్తాయని వర్షరుతువులో తిరిగి ఉత్తరదిశగా పయనిస్తాయని పక్షి శాస్త్రజ్ఞాల అభిప్రాయం.

నదీనదజలాశయాలన్నిటోల సారసాది జలపక్షుల తోబాటు హంసలు కూడా ఉన్నట్లు వర్ణించడం శోభస్కరమని భావించి నీరున్న తావులన్నిట్లోను ఈ పక్షులు కలరవాలను వర్ణించడం కవిసమయం. వర్షాకాలంలో ఇక్కడి సరోవరాలు మలినం కావడంచేత హంసలు తిరిగి మానససరోవరానికి తరలి వెళ్తునట్లు వర్ణించడంకూడా కవిసమయం. హంస నీటి పక్షి అయినా జలచరాలను వేటిని ఆహారంగా స్వీకరించదని తామరతూండ్లను మాత్రమే స్వీకరిస్తుందని పాలలో నీళ్ళను వేరుచేసి పాలను మాత్రమే గ్రహిస్తుందని వర్ణించడం సంప్రదాయం.

భారతీయ సంస్కృతి సాహిత్యాలలో హంసకు అతి పవిత్రస్థానముంది. ఆధ్యాత్మికులు హంసను పరమాత్మకు ప్రతీకగా శిరస్థానీయమై సహస్రదళపద్మమైన

సహస్రార చక్రమే ఈహంసకు నెలవైన మానస సరోవరంగా భావించడం సుప్రదాయం. హంస ఆహారవిహారాదుల బట్టి దానిని సాత్త్వికతకు, పవిత్రతకు ప్రతీకగా భావించి పరమాత్మ సాక్షాత్కారం చేసుకున్న సత్యస్వరూపులైన పవిత్ర యోగీశ్వరుల పేరు చివర హంస పదాన్ని చేర్చి వ్యవహరించడం భారతీయ సంప్రదాయం.

అన్నమయ్య హంసను పరమాత్మకు సంకేతంగా భావించి

దిబ్బలు వెట్టుచు దేలినదిదివో

ఉబ్బునీటిపై నొకహంసా

అనువున గమల విహారమె నెలవై

వొనరి వున్నదిదె వొక హంసా

మనియెడి జీవుల మానస సరసుల

వునికి నున్నదిదె వొక హంసా

పాలునీరు వేర్పరచి పాలలో

నోలలాడె నిదె వొక హంసా

తడవి రోమ రంధ్రంబుల గుడ్ల

నుడుగక పొదిగీ నొక హంసా

కడువేడుక వేంకటగిరి మీదట

నోడలు వెంచె నిదె యొక హంసా - 1 - 16.

అని హంసకు సంబంధించిన కవి సమయాలన్నిటినీ ఆధ్యాత్మిక పరంగా అన్వయించడమేగాక హంసలు బురదమట్టిని దిబ్బ ఆకారంగా చేసి అందమైన గూళ్ళు కట్టాయనే శాస్త్రాంశాన్ని జతపరిచాడు.

రాచతీవికి మారుపేరు హంసనడకలు. ఉత్తమ రాచకన్యల నడకలను మందగమన మరాళంతో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య -

చినుకు జెమటలచే చీకాకుపడినవి

చననీక నడపుటంచలవిల (లల?) యించేవు - 19 - 254.

అని వర్షం హంసలకు చీకాకు కలిగిస్తుందని సూచించాడు.

పెదతిరుమలాచార్యులు శృంగార దండకంలో కేళీసరోవరాన్ని వర్ణిస్తూ.

"మహోద్యాన వీధీ లసత్కేళి కాసారముంజేరి యాలోని

మీనంబులన్ మీది ఫేనంబులన్, హంసయానంబులన్,

సన్నిధానంబునం జూపి"

అని అతి సామాన్యమైన కేళీసరోవరంలో కూడ హంసలన్నట్లుగా వర్ణించాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో శ్రీకృష్ణ గోపికల జలక్రీడా సందర్భంలో

కలకలనాద కోకముల లోకముల

.................................

లలిత మరాళ సారముల జాలముల

గలిత సౌరభ పరాగముల పూగముల

కలికి శ్రీకృష్ణశృంగార రసాబ్ధి

వలె నొప్పు సమయమున పరవుత్రిగాంచి

-2 ఆ. పుట 110.

అని మేఘోదయంతో కలత చెందిన హంసలు మానస సరోవరానికి పయనిస్తున్నట్లు వర్ణించాడు.

### 3.1.1.2. చకోరం - చంద్రికాపానం :

"చకతి తృప్యతి జ్యోత్స్నయా చకోర : చకతృప్తౌ" వెన్నెలను చూచి తృప్తి పొందేది చకోరమని అమరకోశం. చకోరాలు వెన్నెల వేళల్లో పదేపదే ఆకాశంవైపు మెడలు చాచి ఆనందోత్సాహంతో ఉన్మత్త కూజితాలతో విహరిస్తాయని శాస్త్రజ్ఞులు అభిప్రాయం. చకోరాల ఈ ప్రవర్తన ఆధారంగానే చకోరాలు చంద్రికాపానం చేస్తున్నట్లు వర్ణించడం కవిసమయమైనది.

సంధ్యాసమయంలోను వెన్నెల వేళల్లో చంచూపుటాలను ఆకాశంవైపుపైకెత్తి మహోత్సాహంతో విహరించడాన్ని అవి చంద్రికాపానం చేస్తునట్లు కవులు ఉత్ప్రేక్షించారు. ప్రియుని రాకకై ఎదురుచూచే ప్రేయసిలా చంద్రునిరాకకై చకోరాలు నిరీక్షిస్తునట్లు వీటికి ప్రేమానుబంధాన్ని కూడా కలిగించారు. చంద్రుడు మిత్రుడైతే మరి వెంటనే సూర్యుడు శత్రువు కాక తప్పదుగదా! సూర్యచంద్రులకు లేని వైరాన్ని మన కవులు సృష్టించారు. అంచేతే అన్నమయ్య

వెన్నెలకు జకోరము వేడుక పడెగాక

వన్నెల యెండ గాయగ వచ్చి తలయెత్తునా - 28 - 100.

అని చకోరాలు చంద్రికలకు తలయెత్తి వాటి నాహ్వానిస్తాయని ఎండలకు విముఖతను ప్రదర్శిస్తాయని వర్ణించాడు. అవ ఎండలనేగాదు వేడి గాలులను సైతం భరించలేవని అన్నమయ్య భావన.

సదతి నెన్నుదుట కస్తూరినామము వెలయ

చెదరకుండగ దీర్చిన (దిచిన?) భావము

పొది సూర్పుగాలి చప్పుడుకుఁ గనుచకోరాలు

కదలకుండగ గట్టు కంభమో యనఁగా

- 13 - 413

విరహిణి అయిన నాయిక కనుబొమలమధ్య పొడవుగా ధరించిన కస్తూరి నామాన్ని ఆమె వదిలే వేడినిట్టూర్పుగాలులకు నయన చకోరాలు భయపడి పారిపోకుండ కట్టివేసే స్తంభంలా ఉత్ప్రేక్షించాడు. వేరొక కీర్తనలో అన్నమయ్య

చెల్లినమ్మ నీవేమి సేసినాను నీవిభుఁడు

యెల్లినాఁడు నిన్నుఁ బాయలేక లేవాఁడు గనక.

..................................................

విందుగా (జకోరాలకు వెన్నెల దాగించేవేమే

చందురుని కిరణాల సంపదగాదా - 28 - 217

ఇట నాయిక చకోరాల చేత వెన్నెలలను త్రాగింప జేస్తోంది. చకోరాలు వెన్నెలలను త్రాగడం అశాస్త్రీయం, అలౌకికం. అలౌకిక కార్యాలను సంఘటింపగలవారు లౌకికులైన ఆదేవతలే. అని ఇట సూచన

పెదతిరుమలయ్య ఆధ్యాత్మ సంకీర్తనాలలో

ఏమిటఁ గడమ యిఁక హరిదాసులకు

...................................

జగదేక పతిరూప చంద్ర చంద్రికలు గలుగ

మొగిఁ జకోరపు నేత్రములు తనివి బొందె - 21 - 70

అని జగదేక పతియైన ఆ భగవంతుని రూప చంద్రికలను జూచి భక్తుల కనుచకోరాలు తనివిబొందుతాయని చంద్రచకోరలకు గల అనుబంధాన్ని ధ్వనింపజేశాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

.......... పుష్పకార్ముకు తండ్రిఁ దలచి

యతని సద్గుణ కీర్తులనెడి చంద్రికల

శృతి చకోరములఁ జేజూరలాడుచును ఆ - 174 పుట

ఇట శ్రీకృష్ణుని కీర్తి చంద్రికలను రుక్మిణి తన శ్రుతి చకోరాలతో త్రాగుతోంది.

### 3.1.1.3. చాతకం - వర్షధారాపానం :

సారాంగము, స్తోకము, చాతకము అనునవి వానకోయిల పేళ్ళుగా అమరకోశం పేర్కొన్నది. ఇది అల్పమైన శిరస్సు కలది. మెల్లగా కూయునది. వర్షోదకమును యాచించునది అని చాతకపక్షిని గూర్చి వివరించినది.

సలీం ఆలీ అను పక్షి శాస్త్రవేత్త 'Pied crested Cuckoo' Local Name - Chatak (Hindi) అని చాతకపక్షి శాస్త్రీయ నామాన్ని తెలిపి అది మైనా పక్షి పరిమాణంలో పొడవైన సన్నని తోకతో నలుపు తెలుపు వర్ణాల కలయికతో కూడిన పక్షిగా దీనిని అభివర్ణించాడు. ఇది వర్షాకాలంలో ముఖ్యంగా తొలకరివానలు కురిసే జూన్ మాసంలో భారతదేశాన్ని సందర్శించే వలస పక్షిగా పేర్కొన్నాడు[2]. ఈ కాలంలో కంచుగీసిన కంఠంతో ఉత్సాహంతో పీ-పీ అని కూసే పక్షి. ఇది కోయిల జాతికి చెందిన పక్షి. వర్షానికి దీనికిగల ఈ అనుబంధాన్ని పురస్కరించుకొనే చాతకం మేఘజలాన్నే పానం చేస్తుందనే కవిసమయం ఏర్పడి వుంటుంది.

ఈ అనుబంధాన్ని ప్రణయంగా, మహోదాత్తవస్తు నిరీక్షణగా వ్యంజించడమే కవుల లక్ష్యంగా భావించవచ్చు. ఈ కవిసమయాల మూలంగా ఏర్పడినవే చంద్రికా చకోరన్యాయం, మేఘచాతక న్యాయాలు. వర్ష ప్రదాత అయిన ఇంద్రునికి చాతకానికి దాతృదాత వ్యానుబంధంగా కవులు పేర్కొన్నారు.

అన్నమయ్య --

అతివ నీయంగములె అతను తాపపుమాటు

తతి నొకటి కొకటిగని దైవమే సేసె

నిట్టూర్పు గాలికిని నీలాహి వేణికిని (ణియిదె?)

నెట్టనను విరహంపు నెగులేఁటికే

చుట్టుఁగన్నీటికిని చూపుఁ జాతకములవె

తొట్టి యిఁక మీఁదనవి తుదమీఱఁగలవా - 13 - 1.

అని నీటి ధారలకు చాతకాలకుగల అవినాభావ సంబంధాన్ని మనోజ్ఞంగా అభివర్ణించాడు. మదన తాపానికి గురి అయిన నాయికకు కలిగే నిట్టూర్పు గాలుల్నిమింగి వేయడానికి ప్రక్కనే నల్లత్రాచనెడి వేణీబంధముంది. కన్నీటి ధారలు క్రిందకు ఉరలకుండ వాటిని సేవించడానికి ఆ చెంతనే చూపులనే చాతకాలున్నాయి. కాబట్టి ఆమె ఇక మదనుని చూచి జడియ పనిలేదని నాయికకు చెలుల అభయమిది. విరహించే నాయికకు గలిగిన నిట్టూర్పులు, అశ్రువులనే సాత్త్విక భావాలను కవి సమయాలతో జతచేసి మనోజ్ఞంగా వర్ణించాడు.

వర్షపు ధారలకై చాతకాలు ఎదురు చూస్తాయనే ఈ కవిసమయాన్ని పురస్కరించుకొని నాయకుని రాకకై ప్రతీక్షించే నాయిక కళ్ళను, చూపులను చాతకాలతో పోల్చే సంప్రదాయం ఏర్పడింది.

నడపుల హంసల నయన చాతకముల

పడతి శ్రీ వేంకటపతి పాదిగె - 14 -7.

అని పరవశత్వంతో నాయకుని ఆహ్వానించే నాయిక కళ్ళను చాతకాలతో అన్నమయ్య పోల్చాడు.

చిన్నన్న అష్టమహిషీ కాల్యాణంలో

నీల వర్ణుని మూర్తి నిఖిలంబుగప్పు
పోలికే దట్టమై పొదలె మేఘములు
గలిగిన పక్షి సంఘములతో నెల్ల
దలయెత్తిచూచె చాతక నికాయంబు 1 ఆ

అని ఆకాశంలో దట్టమైన కారు మేఘాలు వ్యాపించగానే చాతక పక్షులు ఉత్సుకతతో తలయెత్తి చూస్తున్నట్లు వర్ణించి చాతక వర్షాలకు గల అనుబంధాన్ని పేర్కొన్నాడు.

## 3.1.1.4. చక్రవాకం – నిశిభిన్న తటాశ్రయణం :

కోకశ్చక్రశ్చక్రవాకో రథాఙ్గాహ్వయ నామకః
తపతే ప్రియా వియోగాత్ రాత్రావితిశోకః కుజ్ శబ్దే -
ప్రియా వియోగముచేత రాత్రియందు మొఱపెట్టునది.

చకితే తర్పయతి ప్రియామితి చక్రః చకతృప్తౌ ప్రియురాలిని ప్రీతినొందించునది. కోకము, రథాంగము, జక్కవ పిట్ట పేళ్ళు గలది చక్రవాకం అని అమరకోశం పేర్కొంది.

చక్రవాక పక్షులు

రాత్రివేళ ఆహారంకోసం దూర ప్రాంతాలకు పోతాయని అలాంటి సందర్భాలలో ఆడమగ పక్షులు దూరమై సకరుణంగా ఆర్తనాదాలు చేస్తాయని ఆ వ్యాపారాన్నే విరహ బాధగా వ్యంజించి చెప్పటమే ఈ కవి సమయానికి గల కారణమని డా॥ఇరివెంటి కృష్ణమూర్తిగారు పేర్కొన్నారు.[3]

ప్రణయానికి ప్రతీకగా, విడివడని జంటగా ఏ మాత్రం ఎడబాటును భరించలేనివిగా వర్ణించడమే ఈ కవి సమయోద్దేశం. పగటిపూట చక్రవాక మిథున సంయోగాన్ని రాత్రివేళ వాటి విరహాన్ని వర్ణించడం సంప్రదాయమైంది. అన్నమయ్య -

ఒనరవిజ్ఞాన సూర్యోదయమాయ
మును జీవ పరమాత్మముల జక్కవలు గూడె
వనజాక్ష. మేలుకొని వాకిలి దెరవవే - 11-1-170

అని సూర్యోదయం కాగానే జక్కవలు జతగూడినట్లు వర్ణించాడు. శృంగారానికి ప్రతీకలుగా విడివడని జంటగా కవులు భావించే చక్రవాక మిధునాన్ని వేదాంతోపమానంగా గ్రహించడం అన్నమయ్య ప్రత్యేకత. జీవాత్మ, పరమాత్మల ఐక్యాను సంధానాన్ని జక్కవల కూటమిగా అభివర్ణించి అద్వైత భావనకు అన్నమయ్య దోహదం కలిగించాడు.

అతివ వురమున కంఠహారములు కడు ( బెక్కు
తతి(గట్టుకొన్న చందంబమరెను
కతలుగా ముఖ చంద్రు(గని చన్ను జక్కవలు
క్షతి( బాయకుండ లంకెల । బెరచినట్లు 13-413

నాయిక వక్షోజాలపై పెనవేసుకొన్న హారాలు ఆమె ముఖ చంద్రునికి భయపడి చన్నులనే జక్కవలు విడిపోకుండ పెనవేసిన బంధాలుగా కవి ఉత్ప్రేక్షించడానికి గల కారణం చంద్రోదయంతో చక్రవాక మిధునం విడివడి విరహాన్ననుభవిస్తుందనే కవి సమయమే. అన్నమయ్య -

తరుణి జవ్వనపు దపము సేయ(గను
వరుసతోడ జాతి వైరము లుడిగె
జక్కవపులుగులు జంట వాయవివె
గ్రక్కున వెన్నెల గాసినను
..........................................
యెలమిని శ్రీ వేంకటేశు(డు గూడ(గ
చెలియంగములని చెప్ప(గ బొసగె 24-167

తపోవనంలో సకల జీవరాశి జాతి వైరాలను విడిచి సాత్త్వికతతో కలిసి మెలసి ఉంటాయి గదా ! అంచేత వెన్నెలలు కాసినా చక్రవాక మిథునం విడిపోలేదుట. కారణం తరుణి తపసు చేయడమే. అయితే ఈ తపోవనంలోని జక్కవలు మామూలు చక్రవాకాలు కావు. ఆమె శరీరంగాలయిన కుచాలే!

పెద తిరుమలయ్య చక్రవాళ మంజరిలో సూర్యాస్తమయ వర్ణనా సందర్భంలో

పంబంచు రవిడాఁగెఁ బడమటి కొండఁ

గొండాటముగ నిండుకొనియె జీకట్లు

కట్లూడి చనియె వియోగమునఁ జక్రములు

అని చీకట్లు వ్యాపించగా చక్రవాక మిథునం విభిన్న తటాలనాశ్రయించి వియోగాన్ని అనుభవిస్తున్నటు వర్ణించాడు.

## 3.1.1.5. చంపకం – భ్రమరవైరం :

అథచామ్పేయశ్చమ్పకో హేమపుష్పకః

చంపాఖ్యే దేశే భవః చాంపేయః –

చంపయను దేశమందు బుట్టినది.

చమ్యతే అళిభిరితి చంపకః చము అదనే–

తుమ్మెదలచే ఆస్వాదింపబడినది.

హేమవర్ణం పుష్పస్యేతి హేమ పుష్పకః –

బంగారు వెన్నెగలది. ఇవి సంపెంగ చెట్టు వేళ్ళు.

ఏతస్య కలికా గంధ ఫలీస్యాత్– గంధ మివ ఫలమస్యా ఇతి గంధఫలీ – గంధమే ఫలముగాఁ గలది గంధఫలి. ఇది సంపెంగ మొగ్గ పేరు – అని అమరకోశము పేర్కొనుచున్నది. దీనిని బట్టి నిజానికి చంపకానికి తుమ్మెదలకు వైరము లేదని తెలుస్తోంది. లేనిదానిని ఉన్నదని నిబంధించడమే అసన్ని బంధనం.

సంపెంగ పసుపు పచ్చని పూలతో అతి తీక్షణమైన మాదక పరిమళంతో ఒప్పారే కుసుమం. ఈ వాసనను భరించలేక తుమ్మెదలు వాటిపై వ్రాలవని కవి సమయం. వృక్ష శాస్త్ర రీత్య తుమ్మెదలు, గాలి, నీరు, పక్షులు అనేక రకాలైన కీటకాలు పూలలోని రంగు, వాసనలచే అకృష్టమై వాటిపై వ్రాలి పరపరాగ సంపర్కానికి దోహదకారులవుతున్నాయి. కాని కావ్య ప్రపంచంలో పూలన్నీ స్త్రీలు తుమ్మెదలే పురుషులు. పూలలోని మకరందాన్ని ఆస్వాదించే తుమ్మెదల కార్యకలాపాన్ని ప్రణయ వ్యాపారంగ చంపకం దరిజేరని తుమ్మెదల ప్రవృత్తి స్త్రీ పరాఙ్ముఖుడైన పురుషుని తో పోల్చడం సంప్రదాయం. తాళ్ళపాక సాహిత్యంలోగూడ ఈ కవి సమయ ప్రయోగం విస్తృతం. అన్నమయ్య -

మగువ నీకు మొక్కె మాయింటికి రమ్మని
జిగిఁదన శిరసుపై జేతులు మోడ్చి
వొగి చంపక నాసికమున్నదని యలులకు
వెగటుగాఁ దామరలు వేగు చెప్పినట్లు- 13-411

నాయిక కురులే తుమ్మెదలు చేతులే తామరలు నాసికే చంపకం కాగా ఆమె తన చేతులు శిరసుపై మోడ్చి నాయకుని తన యింటికి రమ్మని ఆహ్వానించడం. చేతులు అనే తామరలు కురులు అనే అలుల చెంతచేరి వాటికి శత్రువైన చంపక నాసిక, సమీపంలోనే ఉంది జాగ్రత్త సుమా అని హెచ్చరించినట్లుందని ఉత్ప్రేక్ష. ఉపమా ద్రవ్యాలైన అలులకు చంపకాలకు గల వైరాన్ని వాటిని పోలిన ఉపమేయాలకు కూడా కవులు వర్తింపజేశారు. తుమ్మెదలకు చంపకంతో వైరం తామరలతో మైత్రి కావ్యప్రసిద్ధం. అంచేతే అన్నమయ్య

ఎక్కడ దిరిగినా మా యింటికే వత్తువు నీవు
తొక్కు మెట్టాడి నిన్ను దూరనేఁటికి
పుక్కట తుమ్మెదకు పువ్వులెన్ని కలిగినా

తక్కిన చుట్టపు పొందు తామరే కదా- 13-197

అని విడరాని వాటి అనుబంధాన్ని పేర్కొన్నాడు.

చంపకానికి తుమ్మెదలకు ఉన్న సుప్రసిద్ధ వైరాన్ని పెదతిరుమలయ్య

మును సంపెంగవిరులు ముడుచుక నీవురాగా

వని తలివేణియయ్యు వాడికె మాటాడెను

..................................................

దోమటి శ్రీ వేంకటేశ తొలతటి మీలోని

బూమెల వైరాలు దీరఁ బొందొకటి సేసెను.- 23-281

అని తొలుతటి వైరాన్ని తొలగించి మైత్రినే చేకూర్చడం విశిష్టత. ఆ వైరం తొలగడానికి కారణం ఆ సంపెంగలను ముడుచుకొని వచ్చిన వ్యక్తి తన ప్రియుడే కావడం అంచేతే నాయిక అలివేణి అయినప్పటికి సంపెంగల పొందును సహించి మైత్రినే నెరిపింది. చిన్నన్న అష్టమహిషీ కళ్యాణంలో

సంపెంగల క్రేగాలి జలియించుతేఁటి

గుంపుల గతిఁ గప్ప క్రొమ్ముళ్ళు వీడె 2 ఆ- పుట 64

అని సంపంగి గాలిసోకి చెల్లాచెదరైపోయే తుమ్మెదల లాగ కాళియపత్నుల క్రొమ్ముళ్ళు వీడి జుట్టు చిందరవందరైందని కృష్ణుడు కాళియుని మర్దించిన సందర్భంలో కాళియాంగనల వైరాన్ని పురస్కరించుకొని సాగింది ఈ వర్ణన.

## 3.1.1.6. పద్మోత్పల శైవలాలు – నదీ జలాశయావాసం :

తామరలు, కలువలు నీరు నిలకడగా ఉన్న సరోవరాలలో మాత్రమే ఉంటాయి. కాని తామరలకున్న జలజం, అబ్జం, నీరజం, కంజం ఇత్యాది నామాలవల్ల నీటినుండి పుట్టినది అనే వ్యుత్పత్తిని పురస్కరించుకొని ఆ నీరు మంచి నీరైనా, ఉప్పునీరైనా, సముద్రాలైనా నీరున్న అన్ని చోట్ల కమల కుముదాలను వర్ణించడం కవి సమయమైంది. ఇలా వర్ణించడానికి గల కారణం కేవలం ఆ జలాశయాలను సౌందర్యశోభితం చేయడమే.

శైవలం అంటే పాచి (Algee) . ఇది సామాన్యంగా నిలువ నీటిలో ఉంటుంది. శైవలమున్న నీటిని అపరి శుభ్రంగా పరిగణించడం కద్దు. శైవలం ఎన్నో పక్షులకు, జలచరాలకు ఆహారం. శైవలం ముండడంచేత పలురకాలు పక్షులు ఆ జలాశయాలను సమీపించి వాటి కలకూజితాలతో ప్రకృతిశోభను ఇనుమడింపజేస్తాయనే భావంతో నీరున్న తావులన్నింట్లో శైవలాన్ని వర్ణించడం కవి సమయం. కాని Chlorophyceae, Cynophyceae అనే ఆకుపచ్చ, నీలి-ఆకుపచ్చ జాతుల శైవలం నదులలోను, Phaeophyceae, Rhodophyceae అనే గోధుమ, ఎరుపు వన్నెల శైవలం సముద్రాలలోను ఉంటుందని వృక్ష శాస్త్రజ్ఞుల అభిప్రాయం.

తాళ్ళపాక కవులలో పెద తిరుమలాచార్యులు శృంగార దండకంలో గోవిందుని రూపరేఖా విలాసాదులను చెలులు కీర్తింపగా విని వలవంతనొందుతున్న వనిత నుత్సాహపరచడానికై చెలులు కేళీసరోవరానికి ఏతెంచినపుడు ఆ సరోవర సౌందర్యాన్ని వర్ణిస్తూ

" మహోద్యాన వీధీ లసత్కేళి కాసారముంజేరి,

కోకంబులం, గ్రౌంచలోకంబులం,

బుండరీకంబులం సోకనే కంబుగా జూపి, కూలంబులం,

గుంజనాళంబులన్, సుప్రవాళంబులం, జాలమేలంబుగా

వైచి, యాలేమకుం దోయకేళీసమాసక్తి పుట్టించి ....."

అని అతి సామాన్యమైన కేళీసరోవరంలో గూడ హంసలు, చక్రవాకాలు, క్రౌంచ పక్షులు, తామరలు ఇత్యాదులున్నట్లు వర్ణించాడు.

చిన్నన్న అష్ట మహిషీ కళ్యాణంలో శ్రీ కృష్ణుని జలక్రీడల వర్ణనా సందర్భంలో

కలకలనాద కోకముల లోకములఁ
గలికాగ్రకాంత భృంగముల భంగముల
సమధిక హేమకంజ పుంజముల
రమణీయ పుష్పనీరముల పూరముల
లలిత మరాళ సారసముల జాలముల
గలిత సౌరభ పరాగముల పూగముల
కలికి శ్రీకృష్ణ శృంగార రసాబ్ధి
వలె నొప్పున యమున పరపుత్రిగాంచి 2 ఆ- పుట 110.

అని సుందర యమునాతటిని వర్ణించాడు. యమునలో అపరూపమైన బంగారు తామరల గుంపు, వాటిని చుట్టుముట్టిన తుమ్మెదల ఝుంకారం, చక్రవాక, హంస, సారసపక్షుల కలరవాలను పేర్కొన్నాడు.

వారికేళి యొనర్చి వారని వేడ్క
తరఁగలగని యొక్క తరళాక్షి శౌరి
కరములోయని పట్టి కరము నవ్వినను
హరికురులని యొక్క యతివ శైవలము
సరఁగుఁన బట్టి వేసరి కేరి తిట్టి 2 ఆ - పుట 111

అని శ్రీ కృష్ణుని శృంగార రసాబ్ధిలో తేలియాడుతున్న గోపికలు మైమరచి యమునా తరంగాలే కృష్ణుని కరాలనే భ్రాంతితో పట్టబోయారు. యమునా తరంగాలు కృష్ణుని కరాలైతే ఆ నదిలో తేలియాడే శైవలం శ్రీ కృష్ణుని కేశపాశంగా జలక్రీడలాడే గోపికలకు కనిపించింది. కృష్ణుని జుట్టు పట్టుకొందామని ఆశించేవారికి ఆశాభంగం కలిగింది.

ఈ విధంగా యమునలో బంగారు తామరలు, హంస, సారసాది పక్షులు, శైవలం ఉన్నట్లు చిన్నన్న వర్ణించడం కవి సమయ ప్రభావమే.

## 3.1.1.7. పుష్పాలు– మాసాంతర వికాసం :–

ఒక్కొక్క ఋతువులో కొన్ని చెట్లే పుష్పించడం లోకంలో మనమెరిగిందే. అన్ని ఋతువులలోను అన్ని చెట్లు పూయవు. కేవలం స్వర్గంలోని నందనవనంలోను, రావణుని లంకా రాజ్యంలోను అన్ని ఋతువులలో అన్ని పూలు వికసిస్తాయని పురాణాల కథనం. అయినా ఋతువులతో నిమిత్తం లేకుండ మాసాంతరాలలో గూడ చెట్లు కుసుమించినట్లు వర్ణించడం కవి సమయం. ఆ పూలన్నిటిని సఖీసమేత అయిన నాయిక కోయడం 'పుష్పాపచయం' ప్రబంధాలలోని అష్టాదశ వర్ణనలతో ఒకటైంది. అన్నమయ్య శృంగారమంజరిలోను, పెద తిరుమలయ్య చక్రవాళ మంజరిలోను ఈ పుష్పాచయ వర్ణనలున్నాయి. ఒకవేళ పుష్పాచయ సమయానికి పూయక పోయినట్లైతే ఆ సుందరాంగులు తమ పాద తాడనాది దోహద క్రియలనాచరించి అయినా అన్ని చెట్లును ఒకే పర్యాయం కుసుమింపజేయగల సమర్థులు. అంచేతే అన్నమయ్య

> వుడివో దేకాలము నొకతతి రావద్దు (?)
> చెడని శ్రీహరి భక్తి చెట్టుకట్టితేను – 3- 230

అని శ్రీహరి భక్తి అనెడి చెట్టు ఎప్పటికి మోడువోదని సర్వకాల సర్వావస్థలలో పూత పిందెలతో అలరారుతుందని వర్ణించాడు. శ్రీహరిపై భక్తి గలవారెల్లపుడు సత్ఫలితాలనే పొందగలరని దీని భావము. ఇక్కడ ఒక తతి అన్న పదానికి "పూచుటకో కాచుటకో ఒక ఋతువే కావలెనను పద్ధతి వద్దు అని

కావచ్చునేమో" యని శ్రీగౌరి పెద్ది రామసుబ్బశర్మగారి వ్యాఖ్యానం ఈ కవి సమయాన్ని తలపింపజేస్తుంది 4

అంచెల రతివేళల నంగన నిన్నుఁగూడఁగా
మించి గుబ్బల పూగుత్తులు మెరయఁజొచ్చె
కొంచక శ్రీ వెంకటేశ కూడె నామని కాలము
చలించక యింపులు చల్లులాడరయ్య 24-8

అని వసంతర్తువు రాగానే పూలన్ని వికసిస్తాయని అన్నమయ్య సూచించాడు.

### 3.1.1.8. పుష్ప వికాసం –వృక్షదోహద క్రియలు :

దోహద శబ్దానికి "ఇచ్ఛ, కాంక్ష, స్పృహ, వాంఛ, లాలస" అనే అర్థాలను అమరకోశం పేర్కొంది.

తరుగుల్మలతాదీనామకాలే కుశలైః కృతమ్
పుష్పాద్యుత్పాదకం ద్రవ్యం దోహదం స్యాత్తుత్క్రియా"

అని అకాలంలో వృక్షాలను కుసుమింపజేసే కుశలోపాయంగా దోహద క్రియలను మల్లినాథసూరి పేర్కొన్నాడు. ధూప ధూమ దోహదం చేత దానిమ్మను పండించే వారని రామరాజభూషణుని వసుచరిత్రవల్ల తెలుస్తోంది.5 ఇప్పుడున్నట్లు కాలంగాని కాలంలో కూడ ఫల పుష్పాల నొసగే సంకర వృక్ష జాతులు గాని కృత్రిమ ఎరువులుగాని విరివిగా ప్రాచీన కాలంలో లేకపోవడమే ఈ దోహద క్రియల ఆవిర్భావానికి కారణం గావచ్చు. పద్మినీ జాతి స్త్రీల పాద తాడనాదికాలు కొన్ని వృక్ష దోహ క్రియలుగా ఆలంకారికులు పేర్కొన్నారు. రాజశేఖరుడు మాత్రం దోహ క్రియలను కవి సమయాలుగా పేర్కొనలేదు. కాని తన కావ్య మీమాంస 13, 18 అధ్యాయాలలో

ముఖ మదిరయా పాదన్యాసై ర్విలాసవిలోకితై
ర్వకుల విట పీరక్తా శోకస్తదా తిలకద్రుమః

జల నిధితటీ కాంతారాణాం క్రమాత్ కకుభాంజయే
ఝుగితి గమితాయ ద్వర్యాభిర్వికాస సమహోత్సవమ్" 133-29
"నాలింగితః కురుఒక స్తిలకో న దృష్టో
నో తాడితశ్చ చరణైః సదృశామశోకః
సిక్తోన వక్త్రమధునా వకుళశ్చ చైత్రే
చిత్రం తథాప భవతి ప్రసవావ కీర్ణః 186 - 56 శ్లోకం

అని వకుళ, అశోక, తిలకద్రుమాలు స్త్రీల ముఖమదిర, పాదాఘాత విలోకనాలచేత పుష్పిస్తాయని, రమణి ఆలింగనం లేకయే కురవకం, ఆమె చూపులు పడకనే తిలకం, పాదాఘాతం లేకయే అశోకం, ముఖ పద్మ గండూషం లేకనే వకుళం పూచిందని ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ వృక్ష దోహద క్రియల కొన్నింటిని పేర్కొన్నాడు. కాని వీటిని తన కవి సమయాల కోవలో చేర్చలేదు.

రాజశేఖరుని తరువాతవాడైన విశ్వనాధుడు (14శ) తన సాహిత్య దర్పణంలో వృక్ష దోహదాలను కవి సమయాలలో చేర్చాడు. "పాదాఘాతాదశోకం వికసతి బకులం యోషితా మా స్యమద్యైః" అని అశోక, వకుళ దోహదాలను మాత్రమే పేర్కొన్నాడు. 16వ శతాబ్దికి చెందిన కేశవ మిశ్రుడు కూడ తన అలంకార శేఖరంలో "కేసరా శోకయోః సత్ స్త్రీల గండుషాత్పాద ఘాతత ః" అని ఈ రెండు దోహద క్రియలనే అసత్తును నిబంధించడానికి ఉదాహరణలుగా పేర్కొన్నాడు.

కాళిదాసు కావ్యాలకు పరమ ప్రామాణికమైన వ్యాఖ్యానాన్ని సంతరించిన మల్లినాధసూరి మేఘ దూత వ్యాఖ్యానంలో కవి ప్రసిద్ధాలైన అశోక వకుళ దోహదాలతో పాటు మరికొన్ని దోహద క్రియలను జతచేసి

"స్త్రీణాం స్పర్శాత్ ప్రియంగు వికసతి వకులం సీధు గండూషసేకాత్
పాదా ఘాతాదశోక స్తిలక కురవకా వీక్షణా మాలింగ నాభ్యాం
మందారో నర్మవాక్యాత్ పటు మృదుహసనాచ్చపంకో వక్త్రవాతాత్

చూతో గీతాన్నమేరుర్వికసతి చపురోనర్తనాత్ కర్ణికారః 2 ఆ - 18 శ్లో

అని మేఘ సందేశం వ్యాఖానంలో పది వృక్ష దోహద క్రియలను పేర్కొన్నాడు. వీనినే కావ్యాలంకార సంగ్రహ వ్యాఖ్యాత శ్రీ సన్నిధానం శిరోమణిగారు కూడ పేర్కొన్నారు.

రామరాజ భూషణుని వసు చరిత్ర వ్యాఖ్యాతలైన శ్రీ శాంతి భద్రాద్రి శాస్త్రి, శ్రీ శేషాద్రి రమణ కవులు వసుచరిత్ర 1వ ఆశ్వాసం 158వ పద్య వ్యాఖ్యానంలో

"అశోక శ్చరణాఘాతా వకుళో ముఖ సీధునా
ఆలిఙ్గనాత్కురవక స్తిలకో వీక్షణేనచ
కరస్పర్శేన మాకన్దో ముఖ రాగేణ చమ్పకః
సల్లాపతః కర్ణికార స్సిన్దు వారో ముఖానిలాత్
గీత్యాప్రియాళుర్నితరాం నమేరుర్హసి తేనచ"

అని దశ విధ దోహద క్రియలను పేర్కొన్నారు. కాని వీటిలో కొన్ని మల్లినాధసూరి పేర్కొన్న దోహ క్రియలకు భిన్నంగా ఉన్నాయి. వృక్ష శాస్త్ర సంగ్రహంలో కూడ వసు చరిత్ర వ్యాఖ్యాత పేర్కొన్న దోహద క్రియలే పేర్కొన బడ్డాయి.

శ్రీ వేదం వెంకట రాయశాస్త్రిగారు ఆముక్త మాల్యద 5వ ఆ-100వ పద్య వ్యాఖ్యానంలో శేషాద్రి రమణ కవులు పేర్కొన్న దోహద క్రియలనే పేర్కొన్నారుగాని వాటిలో తిలక, సింధువార వృక్ష దోహద క్రియలు లేవు.

| వృక్షనామం | మల్లినాధసూరి | శేషాద్రి రమణకవులు |
|---|---|---|
| 1. అశోకం | పాదతాడనం | పాదతాడనం |
| 2. వకుళం | గండూషమద్యం | గండూషమద్యం |
| 3. కురువకం | ఆలింగనం | ఆలింగనం |

| | | |
|---|---|---|
| 4. తిలకం | వీక్షణం | వీక్షణం |
| 5. మాకందం | ముఖవాయువు | స్పర్శ |
| 6. చంపకం | హాసం | ముఖరాగం |
| 7. కర్ణికారం | నృత్యం | సల్లాపం |
| 8. ప్రియంగు | స్పర్శ | గానం |
| 9. నమేరు | గానం | హాస్యం |
| 10. మందారం | నర్మవాక్యం | - |
| 11. సింధువారం | - | శ్వాస |

అకాల పుష్పోద్గమనం ఆనంద సంధాయకమే గదా! ఈ దోహద క్రియలన్నీ స్త్రీల శృంగార చేష్టా విశేషాలే. అంచేతే అన్నమయ్య ఆయా వృక్షాల పేర్లు చెప్పకుండానే స్త్రీలచే దోహద క్రియలాచరింపజేశాడు.

ఇందరి (లి?) భావము నీవే యెరుఁగుదాకె యెరుఁగు
యిందుకుఁగా వింతసేయ నేమిటికయ్యా ॥ పల్లవి ॥
సుదతి నిన్నుఁ గోపానఁజూడకొక్క మానుచూచే
అదె యొక్క మానితో మాటాడి సొలసి
పదరి పరవశానఁ బట్టె నొక్క మాని కొమ్మ ॥ ఇంద ॥
మానిని యొక మానిపై మదన రాగము చిమ్మె
ఆనిన పూఁదేనే యొక్క మానఁజిలికే
పూనిన నీ బాసలకు నొక మానిపై నవ్వె
తానుడుకు దీర నొకమాని పొంతఁబాడెను ॥ ఇంద ॥
అంత నీవు దగ్గరితే అందుమాను చేతనంటే
కాంత నీ మారొకమాను కాల దన్నెను

ఇంతలో శ్రీ వేంకటేశ యింతి నీవు గూడఁగను

వింతగా నీ తరువుల విరులు నీకిచ్చెను ॥ ఇంద ॥ - 13-320

నాయకునిపై కినుకవహించి అతనికి దూరమయిన నాయిక చేష్టల వర్ణన యిది. ఆమె అతనికి బదులుగా ఒక వృక్షాన్ని (తిలకం) కోపంతో చూచింది. ఒకమాని (కర్ణికారం) తో మాట్లాడింది. ఒక్క మానును (కురవకం) పరవశంతో ఆశ్లేషించింది. ఒక మాని (సింధువారం)పై నిట్టూర్పులు వదిలింది. ఒకమాని (చంపకం)పై మదనరాగం చిమ్మింది. వేరొకమాని (వకుళం) పై గండూష మద్యంచిలికింది. తన ఉడుకుదీర ఒకమాని (ప్రియాళువు) చెంత గానం చేసింది. అతడు సమీపించే సరికి ఒకమాను (మావి) ను స్పృశించింది. అతనికి మారుగా ఒకమాను (అశోకం)ను కాలదన్నింది. ఇంతలో అతడామెను రతిక్రీడల తేలించగానే తన కోపతాపాలనుడిగి తన చేష్టలు అనే దోహద క్రియలచే పుష్పించిన అయా తరువుల విరులన్నింటినీ గుది గ్రుచ్చి అతని కర్పించింది. ఈ నాయకుడెవరో కాదు శ్రీ వేంకటేశుడే. అతనికి మారుగా అశోకాన్ని కాలదన్నగల యింతి అలమేలుమంగ. ఆమెచేత దోహద క్రియాలాచరింపజేసి శ్రీ వేంకటేశునకా విరులతోడి కైంకర్యం చేయించినాడు అన్నమయ్య -

అన్నమయ్య శృంగారమంజరిలో శ్రీ వేంకటేశుని చూడడానికై వచ్చిన జవరాండ్రు వన విహార వర్ణనా సందర్భంలో

"లేమా విలాసంబు లేమావిమంచి

లేమావిఁజేచూప లేమా యటంచు

.........................................

చతుర భావంబుల సరసభాషణము

లాడుచు విహరించు నంతలోపలను

ఆ స్త్రీలు మేము మాత్రం మా స్పర్శచేత మామిడి, వీక్షణం చేత తిలకం, పాదతాండనంచేత అశోకం, షల్లాపం చేత కర్ణికారం, ఆశ్లేషంచేత కురవకం,

ముఖవారుణిచేత వకుళా (కేసరం)లను పుష్పింపచేయలేమా అని ఆయా వృక్షాలకు దోహ క్రియాలాచరించినట్లు పేర్కొన్నాడు.

పెదతిరుమలయ్య చక్రవాళ మంజరిలోగూడ నాయిక కేశవుని రూపగుణాలనాకర్ణించి మదన పరవశ అయింది. ఆమెకు ఉత్సాహాన్ని కలిగించడానికై చెలికత్తెలు ఆమెతో వన విహారానికి వెళ్ళి అక్కడ వృక్ష దోహద క్రియలాచరిస్తారు.

రసికతతో నొక్కరమణి గోరంట
గోరంట గౌగిటఁ గూరిచెఁ బొగడ
బొగడపై నువిసెను బుక్కిట మదిర
మదిరాక్షి యొక్క రామాతిలకంబు
తిలకంబుఁజూచె నొద్దికనొక కాంత
కాంతాళమున నశోకముఁదన్నె నొకతె
యొకతెఱుంగునఁ గరంబొనర రసాల
సాలము పైఁజూచెసకియలీరీతి
రీతి దప్పక సంచరించి వసంత
సంతతోత్సాహంబు సలుపంగఁబూని
పూనీటఁ గోరకంబులును నొండొంటి
నొండమై వ్రేయుచు........

ఇట ఒక్క రమణి తన గోరు అంటునట్లుగా గోరంటను కౌగలించింది. ఒక మదిరాక్షి తన పక్కిటి మదిరను పొగడపై నుమిసింది. ఒక రామాతిలకం తిలక వృక్షాన్ని వీక్షించింది. ఒక కాంత ఈర్ష్యతో అశోకాన్ని తన్నింది. ఒకతె తన కరాన్ని రసాల సాలంపై చాచి స్పృశించింది అని పెద తిరుమలయ్య అయిదు వృక్ష దోహద క్రియల పేర్కొన్నాడు.

### 3.1.1.9. స్వర్ణరత్నాదులు – పర్వతోత్పత్తి :

బంగారమొక ధాతువు. ధాతువులు భూగర్భంలోను పర్వతాలలోను నిక్షిప్తాలై ఉంటాయి. నిగూఢంగా వున్న వీటిని త్రవ్వి వెలికి తీస్తేగాని బయట పడవు. పర్వతాలకు మరింత గౌరవాన్ని చేకూర్చాలనే పర్వతాలన్నిట్లోను స్వర్ణ రత్నాదికాలున్నట్లు వర్ణించాలని కవిసమయం. పర్వతాలలో స్వర్ణరత్నాదు లున్నట్లు వర్ణించడమే కాదు వెండి, బంగారు పర్వతాలనే కవులు వర్ణించారు. అన్నమయ్య -

ధరణీ వధూ పయోధర కనకమేదినీ

ధర శిఖరకేళి తత్పర మయూర 4 -160

అని శ్రీ వేంకటేశుని భూకాంతయొక్క పయోధరాలు అనే బంగారు కొండలపై విహరించే మయూరంగా పేర్కొన్నాడు.

సరిఁ బచ్చల కొండలు చనుమొనలు 24- 108

అని నాయిక చన్నులేగాదు చనుమొనలు గూడ కొండలేనట. అవి పచ్చల కొండలు ! పచ్చలు నవరత్నాలలో ఒకటైన మరకతాలే. పర్వతాలలో రత్నాలుంటాయనే కవిసమయమే ఈ ప్రయోగానికి కారణం. అంతేగాని యదార్థానికి పచ్చల కొండలుండడం అసంభవం. ఇక్కడ హరిత నీల వర్ణాలకు ఐక్యాన్ని పాటించాలనే కవి సమయానుసంధానం గూడ జరిగింది. నల్లని చనుమొనలను పచ్చల కొండలుగా అభివర్ణించడానికి కారణమిదే.

### 3.1.1.10. ముక్తాహారాలు – యువత :

ముత్యాలు తామ్ర పర్ణీనదిలో మాత్రమే లభిస్తాయని యువతీ యువకులు ముత్యాల హారాలు ధరించినట్లుగా కావ్యాలలో వర్ణించాలని కవి సమయం. ముత్యాలు నవరత్నాలలో ఒకటి. నవ రత్నాలు నవగ్రహాలకు ప్రతీకలుగా భావించడం ప్రసిద్ధం.

ఈ రత్నాలలో ముత్యం చంద్రునికి ప్రతీక. చంద్రుడు చల్లనివాడు ఆరోగ్య ప్రదాత. కాబట్టి ముక్తాహారధారణవల్ల కేవలం సౌందర్యమేకాక శరీరానికి చల్లదనం, ఆరోగ్యం చేకూరుతుంది. కాబట్టి మన కవులు స్త్రీలనేగాక పురుషులను సైతం ముక్తాహారాలతో అలంకరించారు. దీనికి కారణం ప్రాచీన సాహిత్యంలోని నాయికా నాయకులందరు ఉత్తమ కులజాలు ఐశ్వర్య సంపన్నులు. కాబట్టే తాళ్ళపాక కవులు ముత్యాలకు తామ్ర పర్ణీనదికి గల అనుబంధాన్ని పేర్కొనలేదు. కాని తమ నాయికా నాయకులను ముక్తాభరణాలను కైసేసినవారే. ఇక అన్నమయ్య నాయికే నవరత్నాలరాశి అపురూపసుందరి అయిన అలమేలుమంగమ్మ. నాయకుడు కోటికి పడగెత్తిన కొండలరాయుడు.ఇకవారికి కొదమేమి? నవరత్నాలలోను అన్నమయ్యకు ప్రీతిపాత్రమైనది ముత్యం. తెల్లని మాలిన్యంలేని ఆ పులుకడిగిన ముత్యాలను అమ్మవారి నవ్వులకు, చూపులకు, మాటలకు,చెమటలకు, పులకలకు, సిగ్గులకు అన్నిటికీ ఉపమానాలుగా గ్రహించాడు. ఆమె తన ప్రతిచేష్టతో స్వామిని అలరించింది. అలంకరించింది కూడ.

చిక్కుకొనెనో నాసలఁ జెలియనగవులెల్లా
అక్కరముత్తెపు నామమై నీకున్నది -13-218

రతికేళిలో పరవశించి తన్మయత్వంతో స్వామిపైనే చూపులు నిలిపిన అలమేలుమంగ చిరునవ్వే ఆయనకు ముత్యపు నామంగా అలరింది. వైష్ణవులకు ముఖ్యము అందునా స్వామి ముఖంలో ప్రస్ఫుటంగా గోచరించే నామాన్ని అన్నమయ్య ముత్యాలతో తీర్చిదిద్దాడు.

ముచ్చట సెలవినవ్వుల ముత్యాల దండలు గట్టి 24 -344

అని తన నవ్వుల ముక్తాహారాలతో నాయకునలంకరించింది. మరి అమ్మవారు స్వామిని అలంకరిస్తే స్వామి

ముద్దియ చెక్కుల కెలఁకుల ముత్యపు జల్లుల చేర్పుల
వొద్దికలాగు లివేమో వూహింపరె చెలులు

గద్దరి తిరవేంకటపతి కామిని వదనాంబుజమున

అద్దిన సురతపుఁజెమటల అందముగాదుగదా 12 84

అని చెలులు చెవులు కొరుక్కునే లాగున సురతపు చెమటలనే ముత్యాలతో ఆమె చెక్కిళ్ళను అలంకరించాడు. ఆమె చూపులలోనే ముత్యాల గనులున్నాయి. ఆమె సిరి సంపదలన్నీ అతనివే . అంచేతే అలమేలుమంగ శ్రీనివాసుని తన పలుకుల ముత్తెపు సరుల (30- 104) తో అలంకరించింది. ముత్తెపు నివాళులర్పించింది (13-292) చెమటల ముత్యాల ముగ్గుల (4-17) తీర్చింది. నిలువెల్ల పులకల ముత్యాలతో (27-415)తానే అలరారింది. ఈ విధంగా అన్నమయ్య నాయికా నాయకులనేగాదు వారి ఇంటిని ఒంటిని అంతా ముత్యాలతో ముంచెత్తాడు. అన్నమయ్య వారికి ముత్తెల గద్దియ (12-68) ముత్యాల మేడ (12 - 185) ముత్యాల పందిరి (13-192)ని సమకూర్చాడు.

## 3.1.1.11. జ్యోత్స్న- అంజలిగ్రాహ్యకుంభోపవాహ్యాలు :

చంద్రుడు అమృత కిరణుడు.

విధు ః దేవా ఏవం విశేషణ దయంతి పిబంతి విధుః ధేట్ పానే - దేవతలు ఇతనిని మిక్కిలి పానము చేస్తారని చంద్రుడు చల్లనివాడని అమరకోశం పేర్కొనడం వెన్నెల ద్రవ పదార్ధమనే ఊహకు అవకాశమిస్తుంది. యదార్ధానికి వెన్నెల ఘన పదార్ధంగాని, ద్రవ పదార్ధంగాని, వాయువుగాని కాదు. అది కేవలం కాంతి పుంజం. అటువంటి వెన్నెలకు ద్రవత్వాన్ని కల్పించి అది దోసిళ్ళతో త్రాగడానికి అనువుగా కడవలలో నింపదగినదిగా వర్ణించడం కవి సమయం.

అన్నమయ్య వెన్నెలను దోసిట పుడిసిలించడ మనేది అందరికి సాధ్యమయ్యే పనికాదు అదికేవలం ఆ శ్రీ వేంకటేశ్వరుడికే సాధ్యమని ఈ క్రింది పాదాలలో నిరూపించాడు.

నీచిత్తము కొలఁదింతే నేనేమనేను

నీ చేతనేమిసేసినాఁ జెల్లు నీకునన్నియు

దోసిట వెన్నెల వట్టి తొడికి చూపవచ్చునా

..............................................

శ్రీ వేంకటేశుఁడయింకఁజెల్లునీకు నన్నియు 13-451

ఇటు వెన్నెలను దోసిట పట్టి గ్రోలాలనేది నాయకుని అత్యాశగా నాయిక అభివర్ణన. అయితే ఈ నాయకుడు సామాన్యుడు కాడు. అసాధ్యాలను సాధ్యం చేయగలండు అంచేత ఏమైనాచేయగలడని ఏం చేసినా అతనికే చెల్లుతుందని నాయిక అభిభాషణ. ఈ పలుకుల్లో కవి సమయాల అశాస్త్రీయత అలౌకికతలను అన్నమయ్య చాటాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

లాలా సుధారసోల్లసితమై చంద్రు

పోలిక ముఖబింబమును దేజరిలఁగ 18-26 పుట.

అని శకటాసురుని సంహరింపబోయే గోపాలబాలుని చొంగగారే ముఖ బింబాన్ని వెన్నెలలు స్రవించే చంద్ర బింబంతో పోల్చి వెన్నెల లాలాజలంలా స్రవించే ద్రవ పదార్థంగా వర్ణించాడు

అష్టమహిషీ కల్యాణంలోనే

.............. పొడుపు గుబ్బలిని

బొడుసూపెనంత వేల్పుల మేత కుప్ప 5అ-220 పుట

అని చంద్రుని దేవతల ఆహారపు రాశిగా నిరూపించాడు. ఈ విధంగా తాళ్ళపాక కవులు వెన్నెలను ద్రవ, ఘన పదార్థాలుగా వర్ణించాడు.

### 3.1.1.12. తమస్సు – ముష్టిగ్రాహ్య సూచీ బేధ్యాలు :

అమరకోశం, అంధతమస్సు, అవతమస్సు, అంతమస్సు గాఢాంధకారం, క్షీణాంధకారం అని అంధకారాన్ని పలురకాలుగా వివరించింది. చీకటి ఘనపదార్థంగాని ద్రవపదార్థంకానికాదు. అమూర్తమైన దీనికి మూర్తత్వాన్ని

ఆపాదించి సాంద్రమైనది గాఢమైనదిగాను పిడికిటిలో యిమిడేదిగాను సూదులతో పొడవడానికి వీలైనదిగాను వర్ణించాలని కవి సమయం.

అంధకారానికి ఆకృతి కల్పించడం వల్లనే కురులను చీకటితో పోల్చే సంప్రదాయం ఏర్పడింది. తాళ్ళపాక సాహిత్యంలో అంధకారాన్ని ఉపమానంగా గ్రహించిన సందర్భాలు కోకొల్లలు. మచ్చుకు

చీఁకటి తురుముదాన చేరకునన్ను

చీఁకటి నల్లనిమేని చెలువుఁడను 12- 350

అని అన్నమయ్య నాయిక కొప్పును చీకటితో పోల్చి చీకటిని పిడికిట పట్టే వస్తువుగా దానికొక ఆకృతిని కల్పించాడు. పెద తిరుమలయ్య చక్రవాళ మంజరిలోసూర్యాస్తమయానంతరం

"సలలితగతి నిండుఁజంద్రుండు వొడిచి

పొడిచి చీఁకటులు మాన్పె...................."

అని చీకటిని చంద్రకిరణ భేద్యమయినదిగా పేర్కొన్నాడు.

చిన్నన్న అష్ట మహిషీ కల్యాణంలో

కఱుకు చీఁకట్లను కరుల మాయింపఁ

బఱితెంచు సింగంబు పగిది జూపట్టుఁ

భానుండు సారుణ భానుఁడై పొడిచె - 5 ఆ- పుట 220

అని చీకట్లను ఏనుగులుగా వాటిని సమయించే సింహంగా సూర్యుని వర్ణించి చీకటికి ఘనరూపాన్ని ఆపాదించడమేగాక "భానుడు సారుణభానుడై పొడిచె" అని 'పొడుచు' పద ప్రయోగంచే చీకటి సూర్య కిరణ భేద్యమైనదని సూచించాడు.

## 3.1.1.13. యశోహాసపుణ్యాలు– ధావళ్యం

నిజానికి యశస్సు, హాసం, పుణ్యం మూర్త పదార్థాలు కావు. వీటికి రంగు రుచి వాసన లేదు. కాని మన కవులు వీటికి ధవళవర్ణాన్ని ఆపాదించి వీటిని ఆ

వర్ణంతోడి అన్ని వస్తువులతో పోల్చి అమూర్తమైన వీటికి రూపురేఖలు కల్పించి సామాన్యుల నేత్రాలకు సైతం కనువిందొనరిస్తున్నారు. వీటిని తెల్లనివిగా వర్ణించాలనే ఈ కవి సమయోద్దేశం తెలుపు స్వచ్ఛము. ఆహ్లాదకరమైనది. ఎల్లరకు వాంఛనీయమైనది. కాబట్టి యశోహాసపుణ్యాల పట్ల కూడ ప్రజలకు మోజు పెంచి తద్వారా వారిని సన్మార్గగాములుగా చేయాలని గావచ్చు. ఈ కవి సమయంచేత వీటిని వర్ణించడానికి మన కవులకు ఉపమానాలు కోకొల్లలు.

నడుమేల బడుగాయ నవ్వులేల తెలుపాయ 30-44

అని ప్రశ్నించిన అన్నమయ్య

పాలవంటి నవ్వు నవ్వి పదరి సిగ్గుపరచె 30 -596

అని స్వచ్ఛము, మధురము అయిన నవ్వును మధురమైన పాలు, పెరుగు, వెన్న, అమృతం, వెన్నెల మొ॥ తెల్లని పదార్థాలతో పోల్చి వర్ణించాడు.

తిమ్మక్క సుభద్రా కళ్యాణంలో

పాలించు ముత్యముల పణతి చిర్నగవు 15 పుట

అని సుభద్రనవ్వును ముత్యాలతోను, పెద తిరుమలయ్య

మేటి తంత్రాలు మీలో మించు నవ్వులు 23 - 165

అని తెల్లని సేసలతోను, చిన్నన్న అష్టమహిషీ కళ్యాణంలో క్షీరాబ్ధిని వర్ణిస్తూ

చెలువుమై యేటి నెచ్చెలువల నవ్వు
పాలుపున డిండీరముల నొప్పుదాని 1ఆ - పుట11.

అని నురుగును నవ్వుతో పోల్చాడు. ఎంతో వైవిధ్యంగల తెల్లని వస్తుజాలంతోడి పోలికతో నవ్వు తెల్లనిదిగా తాళ్ళపాక కవులు నిరూపించారు.

### 3.1.1.14. అయశపాపాలు – కార్ష్యం :

యశోహాసాల వలెనే అయశపాపాలు కూడ అమూర్త పదార్థాలే. అయితే ఇవి అవాంఛనీయాలనే భావంతో వీటిని నల్లనివిగా వర్ణించాలనే కట్టడిచేశారు.

నలుపురంగు అశుభం, అవాంఛనీయం, భయదం కాబట్టి అయశపాపాలు కూడా అట్టివే. ప్రజలు వీటికి దూరంగా తొలగాలని కవుల ఆశయం అన్నమయ్య

ఒనర విజ్ఞాన సూర్యోదయ మాయ
కలుషము లనేటి చీఁకట్లెల్లఁ బెడఁబాసె 11-1-170

అని పాపాన్ని చీకటితో పోల్చి భయావహమైనదిగా పేర్కొన్నాడు. ఆ కలుషములనే చీకట్లు తొలగాలంటే విజ్ఞాన సూర్యోదయం కావలెనని ప్రజలలో జ్ఞానవికాసాన్ని ఉద్బోధించాడు. పెద తిరుమలయ్య కూడ

సహజ కలుషతమిస్రఁ ముఁ దొలగింపగనహ
రహముల వెలిగెడి రవిబింబమైనది మీనామము 21-458

అని పాపాలనే చీకట్లను తొలగించే తేజస్సుగా భగవన్నామాన్ని పేర్కొన్నాడు.

## 3.1.1.15. క్రోధానురాగ ప్రతాపాలు – రక్తిమత్వం :

క్రోధ, అనురాగ, ప్రతాపాలు కూడా అమూర్తాలైన మనోగుణాలు. ఇవి రజోగుణ ప్రధానాలు.

రజః అనగా రంజ్యతే అనే నీతి రజః రంజరాగే- దీనిచేత ఎఱ్ఱగా చేయబడును- అని అమరకోశం. రజోగుణానికి రక్తత్వమారోపింపబడింది కాబట్టి క్రోధానురాగ, ప్రతాపాదుల వలన మనలో ఉత్తేజం కలిగి ఉడుకెత్తిన రక్తంతో కళ్ళెఱ్ఱబడడం, ముఖం కందగడ్డలా కందిపోవడం సహజం. అంచేత వీటికి రక్తవర్ణాన్ని ఆరోపించి ఉంటారు. అన్నమయ్య

అనిశముఁ గ్రోధాగ్ని నణచేనా 10.69

అని క్రోధాన్ని ఎఱ్ఱని అగ్నికణాలతోను

కొయ్య చూపు ( గోపముల ( గుంకుమ పూచె 20.120

అని ఎఱ్ఱని కుంకుమలతోను పోల్చగా

సాలసేటి కొపపుఁ జూపుల సంతలో

తళుకునసూర్యోదయమాయె 23-401

నని పెద తిరుమలయ్య కోపాన్ని ఎఱ్ఱని సూర్యునితో పోల్చాడు.

కనుగొన చూపులే ఘన దీపములట 2 - 82

అని అనురాగపూరితమైన చూపులను అన్నమయ్య కాంతివంతమైన ఎఱ్ఱని దీపాలుగా అభివర్ణించాడు

## 3.1.2. సత్ అనిబంధనం :

సత్ అంటే సత్యమని భావం. అనిబంధనమంటే నిబంధించకపోవడం. వాస్తవ జగత్తులోని అంశాలను నిరాకరించి కవిత్వంలో నిబంధించకపోవడం సత్ అనిబంధనం. పరంపరగా కవుల కావ్యాలలో కనిపించే ఈ సత్ అనిబంధన కవి సమయాలు తాళ్ళపాక సాహిత్యంలో ఎన్నిగలవో పరిశీలిద్దాం.

### 3.1.2.1. చందన వృక్షం – ఫలపుష్ప రాహిత్యం :

చందన, గంధసారాలు పర్యాయవాచకాలు. ఇది పసుపు, ఎరుపు రంగుల్లో ఉంటుంది.ఎఱ్ఱనిది రక్తచందనమని పచ్చనిది హరి చందనమని ప్రసిద్ధి. హరి చందనాన్ని పంచదేవ తరువులలో ఒకటిగా అమరకోశం పేర్కొంది. చందనం సుగంధానికి శైత్యాలనికి ప్రసిద్ధి. ఇది వేసవి కాలంలో పుష్పిస్తుంది. దీని పూలు చిన్నవిగా గొట్టాలులా ఉంటాయి. గింజలు గురివింద గింజలులా ఎఱ్ఱగా ఉంటాయని వృక్షశాస్త్రం పేర్కొంది. కాని ఈ పూలకుగాని పండ్లకుగాని చందనం కొమ్మలకుండే పరిమళం ఉండదు. అంచేత ప్రజలకు ఆస్వాదనీయమైనది చందనం కొమ్మలేగాని ఫల పుష్పాలుగావు. కాబట్టే కవుల కావ్యాలలో చందన వృక్షాలకు ఫల పుష్పాలున్నట్లు వర్ణించరాదని కవి సమయం. చాలామంది కవులీ నియమానుసారం తమ కావ్యాలలో వీటి వర్ణనను పేక్షించారు. కాని అన్నమయ్య తన శృంగార మంజరిలో వసంతోశోభ వర్ణనా సందర్భంలో ఆరామం లోని చెట్లన్నీ ఫల పుష్పభరితాలై శోభిల్లాయని వర్ణించాడు.

పొన్నలు వికసించెఁ బొగడలు నించె

బనసలు నెరిసె సంపెంగలు బిరిసె

మలయజంబు లెలర్చె మరువంబు పేర్చె

అని పొన్నలు, పొగడలు, పనసలు, సంపెంగలు, మరువాలతోబాటు చందన వృక్షాలుగూడ ఫల పుష్పభరితాలైనాయని వర్ణించాడు. అయితే అన్నమయ్య కూడా ప్రత్యేకంగా చందన వృక్ష ఫల పుష్పాదులను వర్ణించలేదు.

## 3.1.2.2. అశోక వృక్షం – ఫలరాహిత్యం :

మన్మథుని పూబాణాలైదింటిలో అశోక మొకటి. దీని అకులు మామిడి ఆకులులా ఉంటాయి. తెలుపు, పసుపు రంగుల పూలుగల అశోక జాతులున్నాయి. ఇది వసంత గ్రీష్మర్తువులలో వికసిస్తుంది. దీని కాయలు చిన్నవి, నల్లనివి. దట్టమైన ఆకులు, పూగుత్తుల మధ్య ఈ కాయలు కనిపించవు. అంచేత ఇవి ఉన్నాలేనట్లే భావించి అశోక వృక్షానికి ఫలాలున్నట్లు వర్ణించరాదనే కవి సమయం ఏర్పడింది.

అశోకమంటే శోకాన్ని పోగొట్టేదని అర్థం. దీనికి ఆయుర్వేద వైద్యంలో మంచి ప్రాశస్త్యముంది. స్త్రీల గర్భ, ఋతు రోగాలను పోగొట్టి వారికి సంతాన అనుగ్రహం కలిగించేది అశోకం. అంచేతనే కాబోలు అ కాలంలోనయినా అశోకాన్ని పుష్పింజేయడానికి స్త్రీల పాదతాడనం అకాలంలోనయినా దీనిని పుష్పింజేసిన కవులు దీని ఫలాలను మాత్రం ఉపేక్షించడం కడు విడ్డూరం.

తాళ్ళపాక కవులు కూడా అశోక ఫలాల వర్ణన నుపేక్షించి ఈ కవి సమయానన్నుసరించినవారే.

## 3.1.2.3. వసంతం – మాలతీ వికాస అభాసం :

జాజిపూలకే మాలతి, జాజి పర్యాయనామాలుగా అమరకోశం పేర్కొన్నది. మోనియర్ విలియమ్స్ మాలతీలత Jasmis Grandi florum మొక్కల జాతికి చెందినదిగాపేర్కొంది. ఇవి సాయంవేళల వికసించే

సుగంధభరితమైన తెల్లనిపూలు. మల్లె, మొల్ల, మాలతి అన్నీ ఒకేజాతికి చెందిన పూలు. యదార్థానికి అన్నీ వసంతర్తువులో వికసించే పూలే. అయితే మాలతి వర్ష, శరదృతువులలో కూడా వికసిస్తుంది. వసంతంలో మల్లెల గుబాళింపు ముందు మాలతి పరిమళం తీసికట్టే గాబట్టి మల్లెలురాని కాలంలో మాలతికి ప్రాశస్త్యముండడం లోక విదితం. వసంతంలో మాలతీ వికాసమున్నా దానికి ప్రాధాన్యత లేదు. గాబట్టే వసంతంలో మాలతి వికసించినట్లు వర్ణించరాదనికి సమయం అన్నమయ్య.

కందువైన వసంత కాలమునందును

పొందుగాని జాజిదఁ బువ్వులుండునా

అని వసంతంలో మాలతీ వికాసముండదని స్పష్టంగా పేర్కొన్నాడు.

## 3.1.2.4. నీలోత్పలాలు– దివాఅవికసనం

తెలుపు,నలుపు, ఎరుపు రంగులకలువలే కుముదం, నీలోత్పలం, చెంగలువలుగా ప్రసిద్ధి, నీలోత్పలాలకే ఉత్పలం, కృష్ణ కమలం, కువలయం, ఇందీవరాలని నామాంతరాలుగా అమరకోశం పేర్కొంది. ఇవన్నీ తామరల జాతికి చెందిన అవాంతర భేదాలుగా మోనియార్ విలియమ్స్ పేర్కొనింది. ఇవి పగటివేళ వికసించిన ఎండకు తాళలేక ముకుళించినట్లుంటాయి. సంధ్యా సమయానికి సంపూర్ణంగా విప్పారుతాయి. అంచేత వీటి పగటిపూట వికాసాన్ని ఉపేక్షించడం కవిసమయమైంది. ఇవి రాత్రివేళనే వికసిస్తాయనే ఈ దోహదక్రియగా వ్యాప్తిలోనికి వచ్చింది. దోహదక్రియలా చరింపజేసి కవిసమయమాధారంగా కవులు చంద్రుని కుముదబాంధవునిగాను సూర్యుని కుముదవైరిగాను ఉత్ప్రేక్షించడం ప్రసిద్ధమయింది. కలువలకు, చంద్రునికి ప్రేయసీ ప్రియాను బంధాన్ని వర్ణించడం సంప్రదాయమైంది. ఈకవి సమయంలో నీలోత్పలాలని అలంకారికులు పేర్కొన్నా కవులు ఆ జాతికే చెందిన కలువలు, చెంగలువలు అన్నిటికీ దీనిని వర్తింపజేస్తున్నారు. అన్నమయ్య

వాడికగా రమణుఁడు వలపుల చల్లితేను

యీడనే సిగ్గున శిరసేల వంచేవే
వేడుకతో చందురుఁడు వెన్నెలలగాసితేను
జోడుగాఁగలువలు మెచ్చుగ వికసించవా 30-423

అని చంద్రుని రాకతో కలువలు వికసిస్తాయని వారిది ప్రేయసీప్రియానుబంధమని పేర్కొన్నాడు. మరి చంద్రుడు ప్రియుడైనపుడు సూర్యుడు శత్రువుగాక తప్పదు కదా! అంచేత అన్నమయ్య వేరొక కీర్తనలో

వెలది నిన్నుఁ బిలిచెవిడెముచే కొనుమని
సెలవుల నవ్వు గండస్థలు మోవ
అల తాటంక రవులున్నవని కనుఁగల్వలకు
వెలయ మోముఁ జంద్రుఁడు వేగు చెప్పినట్లు 13-411.

అని చంద్రముఖి కలువకంటి అయిన నాయిక నాయకుని విడెము పుచ్చుకోవలసిందిగా ఆహ్వానించింది. ఆ ఆహ్వానంలో నవ్వుల వెన్నెలలున్నాయి. అవి ఆమె చెక్కిళ్ళపై విరిసాయి. ఆ చెంతనే చెవులలో సూర్య ప్రభాభాసమాసమైన తాటంకాలున్నాయి. దీనిని అన్నమయ్య సమీపంలోనే తమ శత్రువులైన తాటంకరవులున్నాయని కనుకల్వలకు ముఖ చంద్రుఁడు తన నవ్వుల వెన్నెలలచేత కబురంపించాడని ఉత్ప్రేక్షించాడు. ఈ ఉత్ప్రేక్షలో కలువలకు సూర్యచంద్రులతోగల శత్రుత్వ మిత్రత్వాలను తెలియజేశాడు.

పెదతిరుమలయ్య తన వైరాగ్య వచన మాలికా గీతాలలో "కుముదంబులు చంద్రోదయంబపేక్షించినట్లు నా కన్నుం గలువలు భవదీయ ముఖ చంద్రదర్శనంబపేక్షించుచున్నవి"

అని కలువలు చంద్రదర్శనాన్నపేక్షించినట్లు తన కళ్ళు భగవద్దర్శనాన్ని కాంక్షిస్తున్నాయని భక్తుడికీ, భగవంతుడికి గల అనుబంధాన్ని ప్రేయసీప్రియానుబంధంగా మధురభక్తిని చాటాడు.

చిన్నన్న అష్టమహీ కల్యాణంలో జాంబవతీ పరిణయ సందర్భంలో

నారమాపతిఁజేరి యాదవోత్తములు
ధవళాంశుగన్న యుత్పలముల రీతి
గంటిమె కృష్ణుతోఁ గలకలు వీడఁ                    5 అ - 224

అని యాదవులు ఆనందోత్సాహంతో కృష్ణుని ఎదుర్కొన్నట్లు పేర్కొన్నాడు. కృష్ణుడు ధవళాంశుడు. యాదవులు ఉత్పలాలవంటివారు. ధావళ్యం శమంతకమణివల్ల కావచ్చు లేదా అతిలోక సౌందర్యవతియైన జాంబవతి చేరికవల్ల కావచ్చు లేదా జాంబవతిని ఓడించడంతో చేకూరిన కీర్తి ధావళ్యం కావచ్చు. కృష్ణుని రాకతో విరిసిన యాదవ హృదయాలను చంద్రోదయంతో వికసించే కలువలతో పోల్చాడు.

### 3.1.2.5 కమల కుట్మలాలు – హరితవర్ణరాహిత్యం :

తెల్ల తామరైనా ఎర్రతామరైనా మొగ్గలుగా ఉన్నప్పుడు ఆకుపచ్చని రక్షక పత్రాలతో కప్పబడి యుంటాయి. కాబట్టి కమల కుట్మలాలు హరిత వర్ణంలో వున్నా ఆ హరితత్వాన్ని ఉపేక్షించాలని ఈ కవి సమయం. నేత్రాలను, కుచప్రరోహాలను తామర మొగ్గలతో పోల్చడం సంప్రదాయం. హరిత కృష్ణ వర్ణాలకు అభేదాన్ని పాటించడం నియమ నిబంధనం. స్త్రీలకు నల్లదనాన్ని వర్ణింపకుండడం సత్ అనిబంధనం. అంచేత స్త్రీ శరీరాంగాలను తామర మొగ్గలతో పోల్చినపుడు దాని హరితత్వానికి ప్రాధాన్యమియ్యకుండా ఆకృతినే ప్రధానంగా గ్రహించాలని ఈ కవి సమయాభిప్రాయం. అన్నమయ్య

తామర మొగ్గలవంటి తగిన నా చన్నులివి
కాముని యమ్ములనేరు కాంతలిదేమే
నా మగని కౌఁగిటిలోన
ప్రేమమున మారుఁబేరు పెట్టుదురటే                    13-56

అని నాయిక చన్నుల ఆకృతి ఆకర్షణల బట్టి తామర మొగ్గలతో పోల్చినట్లు విదితం. ఈ వర్ణనలో కమల కుట్మలాల హరితత్వాన్ను పేక్షించి ఈ కవి సమయాన్ని ఆదరించినట్లు గ్రహించవచ్చు.

కాని అన్నమయ్య కుచాలనేగాక కుచాగ్రాలను కూడా కమల కుట్మలాలతో పోల్చాడు. కుచాలకంటె కుచాగ్రాలు నల్లగా వుండడం సహజం.

చిన్నన్న పరమయోగి విలాసంలో

గాటంపు తమ్మిమొగ్గల చన్నుమొనలఁ

పలుకఁబాతెను ......... - 1ఆ - పుట 37

అని గర్భవతియైన నాయిక చనుమొనలను తమ్మి మొగ్గలతో పోల్చి వాటిపైన తేటకప్పు (నలుపు) కలిగిందని వర్ణించడం బట్టి తమ్మి మొగ్గల సహజ హరితత్వాన్ని ఉపేక్షించినట్లు గ్రహించవచ్చు.

### 3.1.2.6. కుందకుట్మలాలు – రక్తవర్ణ రాహిత్యం :

'కుందం' మాఘమాసంలో వికసించే 'మాఘ్య' కుసుమంగా అమరకోశం. Jasmine Multiflorum అని మొల్లల జాతికి చెందినదిగా మోనియార్ విలియమ్స్ పేర్కొంది. కుందాలకే మొల్లలని నామాంతరం. మొల్లలు మొగ్గలుగా ఉన్నప్పుడు ఎర్రగానుండి వికసించిన పిదప ఆ ఎరుపు పూరెక్కల అడుగు భాగానికి పోయి పూలు తెల్లగా గోచరిస్తాయి. అందుచేత కవులీ ఎరుపును విస్మరించి కుందములు వికసిత పుష్పాలైనా, కుట్మలాలైనా (మొగ్గలు) తెల్లగా వున్నట్లు వర్ణించాలని కుంద కుట్మలాల రక్తిమను గ్రహించరాదని కవి సమయం.

కుందకుట్మాలాలను దంతాలకు ఉపమానాలుగా చెప్పడం సంప్రదాయసిద్ధం. దంతాలకు రక్తిమను చెప్పకుండడం కూడ సంప్రదాయం. అందుచేత కుంద కుట్మలాల రక్తిమనుపేక్షించి వాటి ఆకృతికే ప్రాధాన్యతనిచ్చి దంతాలకు ఉపమానాలుగా గ్రహించడం సంప్రదాయం.

తాళ్ళపాక సాహిత్యంలో కుందములతో దంతాలను పోల్చడం ఉంది. నిజానికి దంతాల ఆకృతిని బోలినవి కుందకుట్మలాలేగాని కుందపుష్పాలుకావు. అంచేత వీరి వర్ణలలో 'కుందము'లనే పదాన్ని సామాన్యార్థంలో కుంద పుష్పాలను, కుట్మలాలను రెంటిని గ్రహింపవచ్చు కాబట్టి ఇక్కడి దంత ఆకృతిని బట్టి కుందములన్నప్పుడు కుందకుట్మలాలుగా భావించవచ్చు. అన్నమయ్య

అదె దంతములఁ గుందముల లకముల నీలములు 15-202

అని దంతాలను కుందాలతో పోల్చగా చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

దంత, హసిత కోమల కుందయగు మిత్రవింద 5 ఆ - 65

అని చిరునవ్వుతో వ్యక్తమయ్యే దంతాలను కుందములతో పోల్చడంకేవలం వాటి ఆకృతిని తలపింపజేయడమేగాక తెల్లనివని చెప్పడం కూడా విదితం.

## 3.1.2.7.కామిదంతాలు– రక్తవర్ణరాహిత్యం :

సహజంగా దంతాలు తెల్లనివి. తాంబూల చర్వణం రసికతా లక్షణం. అంచేత రసికుల దంతాలు ఎఱ్రగా గోచరించడం సహజమే అయినా నిరంతరం తాంబూల చర్వణం చేతగారబట్టినట్లు ఎఱ్రగా జుగుప్సావహమైన దంతాలను కలిగి వుండడం – సౌందర్య లక్షణం కాదు. అందువల్ల కామిదంతాలు ఎఱ్రగా వున్నా ఆ ఎరుపునుపేక్షించి తెల్లగా వున్నట్లు వర్ణించడం కవిసమయం. సౌందర్యతా సంపాదనే కవి సమయ ఆదర్శం. దంతాలకు కుందకుట్మలాలతో పోలిక ప్రసిద్ధమే అయినా ఆ ఉపమానంలోని కుందకుట్మలాల రక్తిమనుపేక్షించాలనడం కేవలం సౌందర్యతా సంపాదనకే. అయితే దంతాలను ఎఱ్రని మాణిక్యాలు, దానిమ్మ గింజలతో పోల్చడం ప్రసిద్ధం. తాంబూలం చర్వణంచేతగాని ఎఱ్రని పెదాలకాంతి ప్రతిబింబించడం చేతగాని తెల్లని దంతాలు ఎఱ్రగా గోచరించడం సహజమే. ఈ అరుణిమ సుందరమైనదేగాని జుగుప్సా వహమైనదికాదు. అంచేతే అన్నమయ్య

శ్రీ వేంకటేశు మోవి చిన్నికెంపులంటించి

ఆవేళ దంతాలు వజ్రాలై యెట్టు వోలెనే 30-204

అని దంతాలేమో వజ్రాలు మరి అవి అంటించిన గుర్తులేమో కెంపులు (ఎర్రనివి). మరి ఈ రెంటికి పొత్తు కలవడం ఎలా ? అది ఆ తల్లికే సాధ్యం అని కవి సమయాల అసాధుత్వాన్ని ఉట్టంకించాడు.

చిన్నన్న అష్ట మహిషీ కల్యాణంలో

కురువిందరదను నక్రూరాంశురదను 5ఆ - పుట 255

అని అనిరుద్ధుని దంతాలను ఎర్రని గురువింద గింజలతో పోల్చడం తాళ్ళపాక కవుల స్వాతంత్ర్యేచ్ఛను చాటుతుంది.

## 3.1.2.8. శుక్ల పక్ష తిమిరం – కృష్ణపక్ష జ్యోత్స్నారాహిత్యం :

అమావాస్య తరువాత శుద్ధ పాడ్యమినుండి పౌర్ణమి దాకా శుక్ల పక్షం. పౌర్ణమి తర్వాత బహుళ పాడ్యమి నుండి అమావాస్య వరకు కృష్ణపక్షం. శుక్ల పక్షంలో చంద్రుడు దిన దినాభివృద్ధి పొందుతూ పౌర్ణమినాటికి సంపూర్ణ కళలతో విలసిల్లడం, కృష్ణపక్షంలో చంద్రుడు రోజు రోజుకు క్షీణించి అమావాస్య నాటికి అంతరించడం సహజం. వృద్ధి క్షయాలు కలిగినవాడు చంద్రుడు. శుక్ల పక్షంలో చంద్రోదయం సూర్యాస్తమయమైన వెంటనే ప్రారంభమవుతుంది గనుక లోకంలో ప్రజలు తాము నిద్రించే లోపలే ఆ చల్లని వెన్నెలలను ఆస్వాదిస్తారు. కృష్ణ పక్షంలో చంద్రోదయం రోజు రోజుకు ఆలస్యం కావడంచేత కొద్ది రోజులు మాత్రమే ప్రజలకు అనుభవయోగ్యమయ్యేది శుక్ల పక్షంలోని వెన్నెలే. ఆ శుక్ల పక్షంలో ప్రజలు నిద్రాముద్రితులైన పిమ్మట చంద్రాస్తమయంతో చీకట్లు వ్యాపించినా దానిని వారు లెక్కింపరు. అలాగే కృష్ణపక్షంలో చంద్రోదయం ఆలస్యం కావడంచేత ప్రజలు నిద్రించిన తర్వాత వెన్నెలున్నా అది గణనలోకి రాదు. అంచేత యదార్థానికి శుక్ల పక్షంలో చీకట్లు, కృష్ణపక్షంలో వెన్నెలలు ఉన్నా అవి కవుల కావ్యాలలో చోటు చేసుకోరాదని ఈ కవి సమయభావం.

తాళ్ళపాక సాహిత్యంలో శుక్ల, కృష్ణపక్షాల వర్ణనలు స్పష్టంగా లేకపోయినా కృష్ణపక్షానికి మారుగా చీకటి కాలమని శుక్ల పక్షానికి మారుగ వెన్నెల కాలమని వ్యపదేశించి పోల్చిన వర్ణనలున్నాయి. అన్నమయ్య -

వెసకాంతనవ్వు వెన్నెలకాలము

పసిఁ గొప్పు చీఁకటి జారనీకుమీ 26-439

అని వెన్నెలకాలం కాబట్టి చీకట్లను రానీకుమని శుక్ల పక్షంలో చీకట్లుండకూడదనే కవి సమయాన్ని పాటించాడు. పెదతిరుమలయ్య -

కాటుక నీ కనుచూపు కలికిపైఁ జల్లితేనే

గాటము విభునికిఁ జీకటి కాలము

పాటపాట నవ్వుమోవిఁ బాడనటు నవ్వితేను

నీటున నీ పతికి వెన్నెల కాలము - 23 -522

నల్లని కాటుక తోడి కనుచూపులను చీకటి కాలం (కృష్ణపక్షం) గాను తెల్లని నవ్వులను వెన్నెల కాలం (శుక్ల పక్షం) గాను అభివర్ణించడం కృష్ణ పక్షంలో చీకటి, శుక్ల పక్షంలో కేవలం వెన్నెలలుంటాయనే భావాన్ని ప్రకటించడమే.

### 3.1.3. నియమ నిబంధనం :

నియమ్యతే అనే నేతి నియమ ః యమ ఉపరమే- దీని చేత నియమింపబడునది. అని అమరకోశం.

Restraining, Checking, Taming, Subduing, Confining Preventing. A restraint, check, Restriction, Limitation a rule or precept, law ( in general) usage, Regularity, Certainity, ascertainment, An agreement, Promise, Vow............ observance...................... A poetical common place or convention as the description of the cuckoo in spring, peacock in the rains & co......... Apte

Restraing, Checking, holding lack any convensional expression. Any fixed rule or law .............Moeunier Williams

నియమ శబ్దానికి నిరోధించుట, ఆపుట, వెనుకకులాగుట, సంప్రదాయసిద్ధమైన భావ ప్రకటన, నియమ బద్ధమైన సూత్రము ఇత్యాద్యర్థాలను పేర్కొన్నాయి. వీటి పరిశీలనలవల్ల నియమ శబ్దానికి సంప్రదాయార్థం వెల్లడవుతోంది. యదార్థస్థితి ఎలా వున్నప్పటికి దానికతీతంగా ఒక కట్టుబాటుకు లోనై వుండడమే నియమం. కవి సమయంలోని ఈ నియమ నిబంధనలన్నీ కావ్య సౌందర్యాన్ని ఇనుమడింపజేసే నియమాలే.

తాళ్ళపాక సాహిత్యంలోని ఈ నియమ నిబంధనలను పరిశీలిద్దాం.

## 3.1.3.1. వర్షాగమనం– మయూరనృత్యం :

మయూరం, బర్హిణం, బర్హి, నీలకంఠం, భుజంగభుక్, KA, కేకి మొదలైనవి నెమలికి పర్యాయపదాలు. నల్లని మెడగలది. అందమైన పింఛం గలది. సర్పాలను భుజించేది. మేఘ గర్జనకు పురివిప్పి నాట్యమాడేది నెమలి అని అమరకోశం నెమలి లక్షణాలను పేర్కొంది. ఆకర్షణీయమైన పింఛం కలది మగ నెమలేగాని ఆడనెమలి గాదు. నెమలి మన భారత జాతీయ పక్షి.

వర్షాకాలం నెమళ్ళకు గర్భాదానం కాలం కాబట్టి ఆ కాలంలో కామోద్దీపితమైన మగ నెమలి ఆడనెమలిని ఆకర్షించాలనే తాపత్రయంతో దానిని సమీపించి క్రేంకారం చేస్తూ పురివిప్పి నాట్యమాడుతుంది. ఈ నాట్య ప్రకంపనలు దానిలోని కామోద్రిక్తలను వ్యక్తం చేస్తాయి. వర్షాకాలం తర్వాత అందమైన దాని పింఛంలోని ఈకలు రాలిపోయి అది కళావిహీనంగా గోచరిస్తుంది. కాబట్టి యితర ఋతువులలో అది నాట్యం చేసినా అందగించదు. అంచేత వర్షాకాలంలోనే మయూర నృత్యాన్ని వర్ణించాలని కవి సమయం.

నాట్యానికి మృదంగ ధ్వానంలా మయూర నృత్యానికి మేఘ ధ్వానాలు ఉత్తేజాన్ని కలిగిస్తాయి. అంచేతే మేఘ గర్జన వినిపించగానే నెమలి పురివిప్పి నాట్యమాడుతుంది.

తాళ్ళపాక సాహిత్యములో ఈ నియమనిబంధననుసరించిన వర్ణనలనేకం. మచ్చునకు కొన్ని అన్నమయ్య

సారె శ్రీ వేంకటేశుఁ డిచ్చ గాగిలించి తేను
కూరిమి నలమేల్ మంగ కూడితి వౌనే
మేర తోడఁ గొండమీఁద మేఘము వాలితేను
చేరి చేరి మయూరాలు చెంగలించి ఆడుఁగా 30-423

అని శ్రీ వేంకటేశుడు సమీపించి కౌగలించితే ఆనందంతో పరవశించి అతనిని చేరిన అలమేల్మంగను మేఘోదయం తో పరవశించి నాట్యమాడే మయూరంతో పోల్చాడు. ఇక్కడ నల్లని వేంకటేశ్వరుని మేఘంతోను అందాల భరిణ అలమేల్మంగను మయూరంతోను ఉపమించి మేఘ మయూరాలకు గల ప్రేయసీ ప్రియానుబంధాన్ని అభివర్ణించాడు.

పెద తిరుమలయ్య వైరాగ్య వచన మాలికా గీతాలలో
"మయూరంబు మేఘాగమనంబునకుం జెలంగినట్లు నామనో
మయూరంబు నీల మేఘ వర్ణంబైన తిరుమేను దలంచి
యానందించుచున్నయది."

అని భగవంతుని రాకకై ఎదురుచూచే భక్తుడి మనసును మేఘాగమనంకై ఎదురుచూచే మయూరంతో పోల్చి తన మధుర భక్తిని చాటాడు. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

.................................. పొదలె మేఘములు
తిరువు గట్టెడు సురస్త్రీల కాశియల
మురువున సితి కంఠములు పురుల్విచ్చె 2ఆ-పుట67

అని మేఘ మయూరాల అనుబంధాన్ని పేర్కొన్నాడు. నెమలి క్రేంకార ధ్వని సంగీతంలోని షడ్జమస్వరంగా ప్రసిద్ధి.

## 3.1.3.2. వసంతాగమనం – కోకిలగానం :

వనప్రియః పరభృతః కోకిలః పిక ఇత్యాది - అని అమరకోశం వనప్రియ పరభృత పిక శబ్దాలు కోకిలకు నామాంతరాలుగా పేర్కొంది. ఇది ఉద్యానవనాలలో నివసించే నల్లని పక్షి. తన గ్రుడ్లను పొదగడం చేతకాని పక్షి. ఇది ఇంచుమించు కాకిని బోలిన ఆకృతి కలది కాబట్టి తన గ్రుడ్లను కాకి గూళ్ళలో పెట్టడంచేత కాకులు తమ గ్రుడ్లే అనే భావంతో వాటిని పొదిగి పెద్దవి చేస్తాయి. పరులచేత భరింపబడేవి కాబట్టి వీటికి పరభృతమనే పేరు వచ్చింది. వసంతంలో మావి చిగుళ్ళ మెసవడంచేత కోకిల కంఠంలోని జీర తొలగి శ్రావ్యమైన నాదం వెలువడుతుందని ప్రసిద్ధి. అంచేత గ్రీష్మ, వర్షర్తువులలో కోకిలగానం వినిపించినా వసంతంలోనే కోకిల కూస్తుందని వర్ణించాలని నియమనిబంధనం. కాకి కోకిల ఆకారాలలో ఒకటిగానే గోచరించినా వసంతకాలం వచ్చి కోకిల కంఠం విప్పినపుడే ఆరెంటికి వున్న వ్యత్యాసం స్పష్టమవుతుందని

"వసంతకాలే సంప్రాప్తః కాకః కాకః పికః పికః"

అని ఆర్యోక్తి ఏర్పడింది. దీనినే అన్నమయ్య

కోవిలలుఁ గాకులును కోరి యొక్క రీతినుండు
యీవల వసంతవేళ నేరుపడును
శ్రీ వేంకటేశ్వరుని సేవకులు మనుజుల
భావమొకరీతినుండు ఫలములే వేరు 10–267

అని శ్రీ వేంకటేశ్వరుని సేవకులను కోకిలలుగా సామాన్య మానవుల కాకులుగా ఉపమించి మామూలుగా కాకి కోకిల చూడడానికి రెండూ ఒకేరకంగా ఉన్నా వసంతం రాగానే ఆ రెంటికి గల వ్యత్యాసం ఎలా ప్రస్ఫుటమవుతుందో అలాగే ఫలానుభవంలో భగవద్భక్తులు సామాన్యులు వేరవుతారని సూచించాడు. వేరొక కీర్తనలో అన్నమయ్య

నీవు మన్నించఁగా నిన్నుఁ గొసరితిఁగాక

వేవేగఁ బనిలేదంటే వేసరించేనా

తావి వసంతము రాఁగాఁ గోవిల గూసెఁగాక

వావాత నారు నెలలు వాయెత్తునా - 28 - 100

అని వర్ణించాడు. ఇచట పతి చనువిస్తే ఆ అవకాశాన్ని పురస్కరించుకొని మరింత కొసరేది నాయిక. ఆరునెలలు నోరెత్తక తనకనుకూలమైన వసంతంరాగానే గళం విప్పేది కోకిల. ఈ రెంటికి పోలిక వాటికిగల అనురాగబంధమే. అన్నమయ్య భగవద్భక్తులను, సామాన్య మానవులను కోకిల కాకులతో పోల్చగా పెద తిరుమలయ్య

వెడ కూటముల కంటె విరాహమే మేలు

.............................................

వానరుఁగోకిలగాకి నొక్కవన్నెవుండుఁగాని

యెనసి వసంతవేళ నేరుపడురా -23-379

అని ఉత్తమ, నీచ స్త్రీలను కోకిల కాకులతో పోల్చాడు. చూడడానికందరూ ఒకేరకంగా గోచరించినా వసంతాగమనంతో కాకికోకిల వేరయినట్లు సమయం వచ్చినప్పుడే ఆ యింతుల మంచి చెడ్డలు బయట పడగలవని భావం. ఇది వసంతర్తువునకు కోకిలకు గల అనుబంధాన్ని చాటుతుంది.

శ్రావ్యమయిన కోకిల కంఠాన్ని సంగీతంలోని పంచమ స్వరంగా మయూర కంఠాన్ని షడ్జమస్వరంగా పేర్కొంటారు. చిన్నన్న అష్టమహిషీ కళ్యాణంలో యమునానదీ వర్ణనా సందర్భంలో

నిండు జాక్కలతోడి నింగియుఁబోలె

బుండరీకములచేఁ బొలుపొందుదాని

సంగీతపంచమ షడ్జములమ్మార్తు

అంగీకరించెనోయనఁజెంతఁబల్కు

కల కంఠముల భుజంగ గ్రాసనిరత

కల కంటములతోడు గడునొప్పుదాని 2అ - పుట 69

అని యమునా నది చెంది విహరించే కేకి కోకిలల కంఠాలను షడ్జమ పంచమ స్వరాలుగా నిరూపించాడు.

## 3.1.3.3. సూర్యాగమనం – కమల వికాసం :

ప్రకృతిలోని చాలా పూలలాగే సూర్యోదయంలో వికసించేవి తామరలు. ఇవి రాత్రులందు ముకుళితావస్థలో వుండి తిరిగి సుర్యోదయంతో సంపూర్ణ వికాసంతో ఒప్పారుతాయి. కాని ఈ కించిత్ ముకుళితావస్థనే కవులు అతిశయోక్తులతో అలంకరించారు. చంద్రోదయంతో తామరలు వాడిపోతాయని అంచేత తామరలకు చంద్రుడు శత్రువని సూర్యుడు మిత్రుడని అభివర్ణించాడు. తామరలు పగటిపూటే వికసిస్తున్నట్లు వర్ణించడం కవి సమయం. ఇట్టి వర్ణనలు తాళ్ళపాక సాహిత్యంలో అనేకం. అన్నమయ్య -

రాతిరెల్ల సతులతో రతులనలసెనేమో

రీతిగాదు హరి నెచ్చెరికె సేయరే ॥ పల్లవి ॥

పైపైఁ బొద్దువొడచీ పంకజములు విరిసె

గోపగోవిందుని మేలుకొనుమనరే 10-130

అని సూర్యోదయమైంది తామరలు వికసించాయి. ఇక లేలెమ్మని కృష్ణునికి మేల్కొల్పు. వేరొక కీర్తనలో

జలజాక్షి మోమువాడె చంద్రుఁడు కళలు గూడె 28-29

నని చంద్రోదయంతో తామరలు ముకుళిస్తాయనే సంప్రదాయాన్ని సూచించాడు. సామాన్యంగా తామరలకు సూర్యునికి ప్రేయసీ ప్రియానుబంధాన్ని వర్ణించడం కవి నైజం కాని అన్నమయ్య

ఘనయోగి హృదయపు కమలాలు వికసించె
నొనర విజ్ఞాన సూర్యోదయమాయె 11-1-170

అని ఆధ్యాత్మికాంశాలకు కూడ అన్వయించాడు. హృదయాన్ని కమలంతోను విజ్ఞానాన్ని సూర్యునితోను పోల్చడం సంప్రదాయమే. జ్ఞానోదయమైతే హృదయ వికాసం కలుగుతుంది. సూర్యోదయమైతే కమలాలు వికసిస్తాయని కవి సమయం. అంచేత ఈ రెంటికి పోలిక. పెద తిరుమలయ్య వైరాగ్య వచన మాలికా గీతాలలో

"క్షీరాబ్ధిశయనా కమలంబు సూర్యుని కెదురు చూచినట్టు
నా హృదయ పద్మంబు రవి మండల వర్తివైన నీకెదురుచూచు చున్నది"

అని తామరలు సూర్యుని రాకకై ప్రతీక్షిస్తున్నట్లు తాను భగవంతునికై నిరీక్షిస్తున్నానని పేర్కొన్నాడు. ఇక్కడ తామర సూర్యుల అనుబంధాన్నిభక్తుడు భగవంతుని అనుబంధంగా తన మధుర భక్తి నిరూపించాడు.

చిన్నన్న అష్ట మహిషీ కళ్యాణంలో శమంతక మణిని దానితోబాటు జాంబవతిని గ్రహించి సురక్షితంగా ఏతెంచిన కృష్ణుని జూచి యాదవోత్తములు

ఆ రమాపతిఁజేరి యాదవోత్తములు
రవిదేరఁగొన్న సారసరాజిరీతి
.........................................
గంటి మనుచు వేడుకలఁజొక్కు చుండి......... 5అ-పుట 224

అని సూర్యుని గాంచిన తామరలవలె పరవశించారని వర్ణించాడు.

## 3.1.3.4. హేమంత శిశిర ఆగమనం – కమల వికాసం ఆభాసం :

అన్ని ఋతువులలోను శరదృతువు పద్మ వికాసానికి మిక్కిలి అనుకూలమైన కాలం. హేమంత, శిశిరాలు చలి ఈదరగాలుల వల్ల పద్మ వికాసానికి అనుకూలమైన కాలంకాదు. అంచేత ఈ ఋతువులలో పద్మస్థితిని

వర్ణించరాదని కవి సమయం. చిన్నన్న అష్ట మహిషీ కల్యాణంలో శరదృతువును వర్ణిస్తూ

...................... శరత్కాలమే తేర
గమలాంకరంబులు కడు తేటలయ్యె
గమలాకరశ్రీలు కడు విస్తరించె
రసముల వింట సారసపు నా రసములు
పాసగించి విరహులఁబొంచె మన్మథుఁడు 2ఆ-పు67

అని శరత్కాలం తామరకొలనులు తేటగా వుండి సంపూర్ణ కమల వికాసంతో ఒప్పారుతున్నట్లువర్ణించాడు. హేమంత శిశిరాలలో పద్మస్థితిని ఉపేక్షించి పై కవి సమయాన్ని పాటించాడు.

## 3.1.3.5. చందన వృక్షం – మలయావాసం :

పంచైతే దేవతరువో మందారః పారిజాతకః
సంతానః కల్పవృక్షశ్చపుంసినా హరి చందనమ్ 1-1-50

అని అమరకోశం పంచదేవతరువులలో హరిచందనమొకటిగా పేర్కొంది. చందన, గంధాలు పర్యాయవాచకాలు. పీత, రక్త వర్ణాలలో నిధి లభిస్తుంది. పసుపుపచ్చ చందనానికి హరి చందనమని ఎర్రచందనానికి రక్తచందనమని ప్రసిద్ధి. చందనం సుగంధ శైత్యాలకు ప్రసిద్ధి. చందన వృక్షాలు మలయపర్వతాలు, హిమాలయాలు, ఉత్తర దక్షిణ పశ్చిమ భారత భూభాగంలోని పలు ప్రాంతాలలో ఉన్నప్పటికి ఇవి మలయ పర్వతాలలోనే ఉన్నట్లు వర్ణించడం నియమ నిబంధన కవి సమయం. మలయ పర్వతాలలో వీటి ఉనికి అధికం కావడమే ఈ నిబంధనకు కారణం గావచ్చు. ఈ వృక్షాల సుగంధశైత్యాల కాకృష్టమై కాలనాగులసైతం వాటిని పెనవేసుకొని ఉంటాయని కవుల వర్ణన. దక్షిణాపథంలోని మలయపర్వతాలు చందన వృక్షాలకు నిలయాలు కాబట్టి దక్షిణ దిక్కునుండి వీచే చల్లని గాలులు మలయమారుతాలు, మలయపవనాలని ప్రసిద్ధి. మలయ

పర్వతాలను చందనపు కొండలనీ, చందనాన్ని మలయజమనీ వ్యవహరించడం ఈ రెంటికి గల అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది. అన్నమయ్య

కలుపుకోలున చల్లగాలి మన్నించుగాని
మలయజమలదరె మందగాను మేనను
ముద్దియకు దాపరవిమొక మోడి వుండుగాని 30-545

అని విరహిణి అయిన నాయిక తాపోపశమనార్థం ఆమె శరీరానికి చందనం పూయమని చెలుల సలహా. ఇక్కడ చందన శబ్దానికి మారుగా 'మలయజ'మనే పదప్రయోగం చేత చందన వృక్షాలకు మలయపర్వతాలకు గల అనుబంధాన్ని తెలియజేశాడు. మరో కీర్తనలో

గంధము పుయ్యకువే కలికి నీ కుచములే
చందనపుఁ గొండలంటాఁ జల్లీగాలి 13-285

అని చందనమలదిన నాయిక చనుగొండలను చందనపు కొండలనడం మలయపర్వతాలనే భావంతోనే.

కాని తాళ్ళపాక సాహిత్యంలో ఉద్యానవనాలలోని అన్ని చెట్లతో పాటు చందన వృక్షాలు కూడా ఉన్నట్లు వర్ణించడం వారి స్వాతంత్ర్యేచ్ఛను తెలుపుతుంది. అన్నమయ్య శృంగార మంజరిలో

"పొన్నలు వికసించె బొగడలు నించె
బనసలు నెరిసె సంపంగలు విరిసె
మలయజంబులెలర్చె మరువంబు పేర్చె"

అని వసంతోత్సవ సందర్భంలో ఆరామంలోని అన్ని చెట్ల తోపాటు చందన వృక్షాలు కూడా ఉన్నట్లు పేర్కొన్నాడు.

చిన్నన్న....ఉషాకళ్యాణంలో

చాంపేయ చందన సారరసాల

చంపక జంబీర సరళపాటీర

కరవీర ఖర్జూర ఖదిర కదంబ

కరకరాలవ కౌశిక క్రముకములు

నలరిన యట్టి యుద్యానవనంబు 1భాగం - పుట 13

అని ఉషాసుందరి చెలులతో విహరించడానికేగిన ఉద్యానవనంలో చందన వృక్షాలు కూడ ఉన్నట్లు వర్ణించాడు.

## 3.1.3.6. శుక్లగౌరవర్ణాలకైక్యం :

శుక్లవర్ణమంటే తెలుపు. గౌరవర్ణమంటే తెలుపు, ఎరుపు, పసుపు కలిసిన ఎరుపు అనే అర్థాలున్నాయి. అయినా గౌరవర్ణమన్నా తెలుపు అనే సామాన్యార్థంగా గ్రహించి శుక్ల గౌరవర్ణాలకు ఐక్యాన్ని పాటించడం నియమనిబంధనం.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

శారద నీరద సంఛన్న గిరుల

గౌరత పరిధాన కలితంబులైన

యుదుట పాలిండ్లపై నొత్తి యూరార్చి 1ఆ-పుట33

అని యశోద పాలిండ్లపైగల గౌరవస్త్రాన్ని గిరులపై ప్రాలిన శరన్మేఘంతో పోల్చాడు. శరన్మేఘం తెల్లనిది దానితో గౌరవస్త్రాన్ని పోల్చడం చేత గౌరశుక్ల వర్ణాల ఐక్యాన్ని పాటించాడు.

## 3.1.3.7. కృష్ణవర్ణ–నీల, హరిత శ్యామ వర్ణాల కైక్యం :

నీలం (ఆకాశరంగు), హరిత(ఆకుపచ్చ) శ్యామల (ముదురుపచ్చ) వర్ణాలకు కృష్ణ( నలుపు) వర్ణంతో అభేదాన్ని చెప్పడం కవి సమయం. నీలహరిత శ్యామ వర్ణాలు వేర్వేరు రంగులే అయినా ముదురు(గ్గ) తిరిగినప్పుడు అవన్నీ నలుపుగా గోచరించడం సహజమే. అంచేతే వీటికి ఐక్యానుసంధానం. అన్నమయ్య–

అలరి శ్రీ వేంకటేశ కలసేనోతాభాసతై
నిలిచి శ్యామ వర్ణము నీమేనై వున్నది 13-155

అని కృష్ణ, శ్యామ వర్ణాల కభేదాన్ని పాటించి నల్లని శ్రీ వేంకటేశుని శ్యామ వర్ణంగా అభివర్ణించాడు. వేరొక కీర్తనలో

నీలాల వంటివి నీ కప్పు నెఱిఁగురులు 13-155

అని నల్లని కురులను నీలాలతో పోల్చి కృష్ణ, నీలాలకభేదాన్ని పాటించాడు. పెద తిరుమలయ్య -

నెలత నీ తురుమిది నిండు నీలపుగని 23-570

అని కృష్ణనీలాలకైక్యాన్ని
చిన్నన్న పరయమోగివిలాసంలో
ననవిల్తునను గుందనపు బొమ్మరముల
కొనలు నీలపు ములుకులు దాచినట్లు
వలుదలై తళుకెక్కి వట్రువలైన
ములుగుబ్బ పాలిండ్ల మొనలు కప్పొదవె 3 ఆ -148 పుట

అని గర్భవతియైన నాథనాయిక నల్లని కుచాగ్రాలను బొంగరాల నీలపు ములుకులతో పోల్చి కృష్ణ నీలాల కైక్యాన్ని పాటించాడు.

### 3.1.3.8. కళ్ళు – శ్వేత, శ్యామ, కృష్ణ మిశ్రాద్యనేక వర్ణాలు :

హృదయానికి గవాక్షాలలాంటివి కళ్ళు. ఆ హృదయగత భావాలను చెప్పక చెప్పేవి. ప్రేమ, దయాదాక్షిణ్యం, క్రౌర్యం, కామం ఇత్యాది విభిన్న భావ ప్రదర్శనా సందర్భములలో ఆ భావాలలోని స్వచ్ఛత, మాలిన్యతలు కళ్ళలో ప్రతిబింబించడం సహజం. ఇది కారణంగా కళ్ళను శ్వేత, శ్యామ, కృష్ణ మిశ్రాద్యనేక వర్ణాలలో వర్ణించాలని కవి సమయం.

అన్నమయ్య

చెందమ్మి కన్నులవాఁడు చేతిపిల్లఁగోవివాడు 24-251

అని కృష్ణుని కళ్ళను ఎర్రతామరలతో ఉపమించి ఎర్రనివి గాను

కలువరేకులవంటి కన్నుల వెన్నెల తేట 17-64

అని కళ్ళను తెల్లకలువలతో పోల్చి శ్వేతవర్ణంగాను

కాంతకాటుకలు కనుచూపులకును

శాంతపు నవ్వులు సరిసరియే

వింతగఁ గస్తూరి వీణెలలోపల

కాంతులఁగప్పురము గలసినయట్లు 30- 147

అని కాటుక దిద్దిన అందమైన నాయిక కళ్ళను నల్లని కస్తూరి వీణెలతో పోల్చి, కృష్ణ వర్ణమైనవిగా కళ్ళను నిరూపించాడు. పెద తిరుమలయ్య గూడ కళ్ళను తామరలతోను (23-271) కలువలతోను (23-202) పోల్చి తెలుపు నలుపు రంగులు వాటికాపాదించాడు. చిన్నన్న పరమయోగి విలాసంలో

తెలిదమ్మి కొనలదేఁటి నూగెసఁగు

కలికి బాగుల సన్న కాటుకటఁ దీర్చి 5ఆ-429

అని గోదాదేవి కాటుక కళ్ళను తుమ్మెదలు వ్రాలిన తామరలతో పోల్చి వాటినలుపు తెలుపుల అందమైన సమ్మేళనాన్ని నిరూపించాడు.

### 3.1.3.9. పుష్ప, జల, ఛత్ర, వస్త్రాలు–శుక్ల, సామాన్యత్వం :

లోకంలో పలువన్నెల పూలున్నప్పటికి తెల్లనిపూలే అధికశాతం. అంచేత కవుల కావ్యాలలో వర్ణించినపుడు ప్రత్యేకించి ఆ పూలరంగు తెలపక సామాన్యార్థంలో 'పూలు' అని ప్రయోగిస్తే అవి తెల్లనివిగానే భావించాలని కవిసమయం.

నీరు ప్రవహించే నేలను బట్టి పలురంగులలో గోచరించడం సహజం. కాని స్వచ్ఛమైన నీటికి రంగు, రుచి, వాసన ఉండవని శాస్త్రజ్ఞులు పేర్కొంటున్నారు. తెలుపురంగు స్వచ్ఛతకు ప్రతీక కాబట్టి స్వచ్ఛమైన నీటిని తెల్లగా భావించి వర్ణించడం నియమనిబంధనం.

ఛత్రాలకు ఉపయోగించే గుడ్డను బట్టి చామరాలకు అద్దే వన్నెలబట్టి పలువర్ణాలలో ఛత్రచామరాలు లభిస్తున్నాయి. కాని స్వచ్ఛత పవిత్రతలకు ప్రతీకగా ఛత్రచామరాలను తెల్లనివిగా గ్రహించడం కవి సమయం.

తెల్లని పత్తినుండి తయారయ్యేవి వస్త్రాలు తెల్లనివే. కాని వాటిపై అద్దే రంగుల వన్నెల చిన్నెల బట్టి లోకంలో పలు రంగుల్లో వస్త్రాలు లభిస్తున్నా వస్త్రాల వర్ణనలో ప్రత్యేకించి వాటి రంగును పేర్కొననప్పుడు 'వస్త్రం' అన్నపుడు సామాన్యార్థంలో వాటిని తెల్లనివిగానే భావించాలని కవి సమయం.

అన్నమయ్య

పొలఁతి నీ చిఱునవ్వు పువ్వులాతఁడు గోసె 12-211

నని నాయిక నవ్వును పువ్వులతో పోల్చాడు. నవ్వుకు శ్వేతత్వాన్నాపాదించడం కవి సమయం. ఆ నవ్వును పువ్వులతో పోల్చడం చేత ఆ పూలు తెల్లనివేనని ధ్వనింపజేశాడు. తాళ్ళపాక కవులందరూ నవ్వులను పువ్వులతో పోల్చి వాటి శ్వేతత్వాన్ని చాటినవారే. అలాగే వేరొక కీర్తనలో అన్నమయ్య

చలువైన నవ్వులే ఛత్రచామరములు 18-76

అని చల్లని తెల్లని నవ్వులను ఛత్రచామరాలతో ఉపమించడం ఆ ఛత్ర చామరాలు తెల్లనివని తెలియజేయడమే తిమ్మక్క సుభద్రాకళ్యాణంలో

ఉమ్మెత్త పువ్వువలె - నుతికిన మడత

నఖముల గొని తెచ్చి- నాతి యిచ్చినను పుట 25

అని సుభద్ర వస్త్రాలను ఉమ్మెత్త పువ్వుతో పోల్చి వాటి శ్వేతత్వాన్ని మన కళ్ళకు కట్టించింది.

### 3.1.3.10 ధ్వజ, హంస, హార, బక, భస్మాలు –శుక్లత్వం :

హంసలు, కొంగలు తెలుపు, నలుపు, బూడిద రంగులవి ఉన్నా సామాన్యంగా తెల్లనివే అధికభాగం కాబట్టి వీటన్నిటిని తెల్లనివిగానే గ్రహించాలని కవిసమయం.

హారాలూ, ముత్యాలహారాలు, రత్నాలహారాలు తెల్లనివి, పలువన్నెలవి ఉన్నా ప్రత్యేకించి వాటి రంగును పేర్కొననప్పుడు తెల్లనివిగానే గ్రహించడం నియమ నిబంధనం.

భస్మం రంగే బూడిద రంగుగా ప్రసిద్ధికెక్కింది. ఇది తెలుపుకంటే భిన్నమైన రంగే అయినా తెల్లనిదిగానే భావించాలని కవుల నిబంధనం.

ధ్వజాలకు చేసే అలంకారాన్ని బట్టి గుడ్డను బట్టి పలువన్నెలలో గోచరించినా యశస్సు తెల్లనిదిగా భావించి ఆయశస్సుకు సంకేతమైన ధ్వజాన్ని తెల్లనిదిగా వర్ణించడం సంప్రదాయం. లోకంలో ఇతర రంగులలో ఈ పదార్థాలు లభిస్తున్నా తెల్లనివిగా ఉండడంలోనే వాటి సార్థకతగా భావించడమే ఈ కవి సమయ ఆవిర్భావ కారణం గావచ్చు.

అన్నమయ్య తెల్లని ముత్యాల హారాలనెన్నిటినో వర్ణించడమేగాక

నెమ్మదిఁజన్నుల మీఁద నీల హారముల్ వేసె

తుమ్మిదలు జక్కవలు దొరలినట్లు 24-1884

అని నాయిక ధరించిన హారాలను ప్రత్యేకించి నీలాల హారాలని పేర్కొన్నాడు. ఈ విధంగాకాక ప్రత్యేకించి హారాల రంగునుపేర్కొననట్లైతే అవి తెల్లనివిగా గ్రహించడం పరిపాటి.

చిన్నన్న అష్టమహిషీ కళ్యాణంలో

తారపంక్తుల వియత్తల మొప్పు కరణి

హారజాలముల బాహామధ్యము మెరె 1-2255

అని కృష్ణుని నల్లని వక్ష స్థలాన్నలంకరించిన హారాలను వినీలాకాశంలోని తారపంక్తులతో పోల్చి ఆ హారాల శ్వేతత్వాన్ని ధ్వనింపజేశాడు. చిన్నన్న అష్టమహి షి కల్యాణంలో వర్షర్తు వర్ణనా సందర్భంలో

ధారుణీ కుచ హారతతులో యనంగ

జారుశై లాగ్ర నిర్ఝము లింపొందె 2ఆ-66-67 పుటలు

ఎత్తైన పర్వతాగ్రాలనుండి జాలువారే తెల్లని సెలయేళ్ళను భూదేవి కుచహారతతులతో ఉత్ప్రేక్షించి బక, హారాల స్వచ్ఛతను శ్వేత వర్ణాన్ని తెలియజేశాడు. ఉషాకళ్యాణంలో చిన్నన్న ఉషాసుందరిని పార్వతీదేవి హంసగమన అని పిలువడానికి మారుగ

సితపక్షగమన భాసిల్లు వైశాఖ

సిత పక్షమున ద్వాదశీదినాంతమ్ము 1 భా- పుట 19

అని సితపక్షగమన అని సంభోదించి హంసను శ్వేత వర్ణంకలదిగా పేర్కొన్నాడు.

## 3.1.3.11. మాణిక్య, జపాపుష్ప, పద్మ, పల్లవ, బంధూక, దాడిమ, నఖాలు– అరుణిమత్వం :

ఎఱ్ఱని రంగు కాంతి ఆకర్షణలకు ప్రతీక. ఆకర్షణీయము, కాంతివంతమైన మాణిక్యాదులు ఎఱ్ఱనివిగా గ్రహించాలని కవి సమయం. నవరత్నాలలో మాణిక్యం ఒకటి. ఇది సూర్యునికి ప్రీతిపాత్రమైనది. ఎఱ్ఱనిది కాంతివంతమైనది. సామాన్యంగా రత్నాభరణాలన్నిటిని మణిమాణిక్యాదులని వ్యవహరించడం ప్రసిద్ధం. ప్రత్యేకించి ఆయారత్నాలను వ్యవహరించనపుడు ఆ మణి మాణిక్య శబ్దాలకు ఎఱ్ఱనివనే అర్థాన్ని గ్రహించాలని నియమనిబంధనం.

నఖాలు ఎఱ్ఱగా వుండడం ఆరోగ్య లక్షణం. తెల్లనిగోళ్ళు రక్తహీనతను అనారోగ్యాన్ని తెలియజేస్తాయి. అంచేత గోళ్ళను ఎఱ్ఱగా వ్యవహరించాలని కవిసమయం.

జపాకుసుమ, పద్మ, పల్లవ, బంధూక, దాడిమలు ఎక్కువభాగం ఎఱ్ఱనివే. అలాకాక వర్ణాంతరమైన వాటిని సూచించాలంటే పచ్చని చిగురు, తెల్లతామర, తెల్లదానిమ్మ ఇత్యాదులుగా పేర్కొనాలి. అలా ప్రయోగించనట్లైతే వీటన్నిటిని ఎఱ్ఱనివిగా గ్రహించాలి. అన్నమయ్య

మొగ మాణిక్యములవంటి ములు వాడిగోళ్ళు 2-121

అని గోళ్ళను మాణిక్యాలతో పోల్చి ఆ రెండు. ఎఱ్ఱనివేనని ధ్వనింపజేశాడు.

ఘనతమైఁ గూడి వేంకటపతి మోము సో
కిన నీదు మోవి మంకెన పూవు పూజ 12-95

అని నాయిక మోవిని మంకెనపూవుతో పోల్చాడు. మంకెన పూవు అంటే బంధూకం. పెదవులకు అరుణిమత్వం సహజం. బంధూకం ఎఱ్ఱనైనదనే కవి సమయాన్ని పురస్కరించుకొనే ఎఱ్ఱని పెదాలను బంధూకంతో పోల్చాడు. ఇట బంధూకానికి పెదాలకు సామ్యం అరుణిమత్వమే. అన్నమయ్య

చిగురుఁ బెదవులే శ్రీ తులసీ దళములు 28-502

అని పెదాలను చిగురుతో పోల్చి ఆ రెంటి అరుణిమత్వ, సౌకుమార్యాల ధ్వనింపజేశాడు.

కరకమలములను కందువ గోపికలెల్లా
పారసి నిను జూపులే పుష్పయాగము 13-60

అని అరచేతులను తామరలతో పోల్చి ఆ రెంటి అరుణిమత్వాన్ని సూచించాడు.

## 3.1.3.12.శైలవృక్ష రాక్షస మేఘ సముద్ర లతా ధూప పంకకేశాలు – నైల్యం

శైల సముద్ర పంకాలు అవి ఉన్న రాతిని నేలను బట్టి పలువన్నెలలో ఉంటాయి. లోకంలో అవి పలువన్నెలుగలవే అయినా వాటిని నల్లనివిగా భావించి వర్ణించడం కవి సమయం. వృక్షాలు లతలు ముదురు లేత హరిత వర్ణంతో కూడినవే అయినా హరిత కృష్ణవర్ణాల కైక్యాన్ని పాటించాలనే కవి సమయం వల్ల వాటిని నల్లనివిగా భావించి వర్ణించడం కవిసమయం. వినీలాకాశంలోని మేఘాలు పలువన్నెలతో కూడినవే అయినా నల్లనివిగానే గ్రహించడం కవి సమయం. ధూపానికి ఉపయోగించే ద్రవ్యాన్ని బట్టి దాని రంగు మారుతుంది అయినా ధూపమనగానే నల్లనిదని గ్రహించడం కవి సమయం. కేశాలు వయోధర్మాన్ని బట్టి రంగుమారినా వాటిని నల్లనివిగా వర్ణించడం సౌందర్యతాపాదకం. రాక్షసులలో ఎంతో అందమైనవారు తెల్లనివారు ఉండవచ్చు. కాని రాక్షసులనగానే మన మనోనయనాలకు భయంకారాకారం గోచరించాలి గాబట్టి వారిని నల్లగానే వర్ణించడం కవి సమయం . అన్నమయ్య

కదిసి నీ న్నెడుము గగనమందు
పొదలి ఆరనే పొగ నిండఁగా 12-288

అని నాయిక నల్లనినూగారును పొగతో పోల్చి ఆ రెంటి నైల్యాన్ని మనకు స్ఫురింపజేశాడు.

మిక్కిలి శిరసుమీఁద మేఘములు గారుకొనె 24-82

అని నాయిక కురులను మేఘాలతో పోల్చి వాటి నల్లదనాన్ని నిరూపించాడు. చిన్నన్న పరమయోగి విలాసంలో

లాలిత రోమాళి లతిక జనించు
నాలవాలంబన నసలారెనాభి 5ఆ - పుట 385

అని గోదాదేవి నల్లని రోమావళిని లతికతో పోల్చి లత నల్లదనే కవిసమయాన్ని ధ్వనింపజేశాడు.

## 3.2 స్వర్గ్యం:

స్వర్గవాసులైన దేవతలకు సంబంధించినవి స్వర్గ్యాలు. వీటిని సత్, అసత్, నియమ నిబంధనలుగా విభజించకపోయినా కొన్ని స్వర్గ్య కవిసమయాలను రాజశేఖరుడు దహరించాడు. తాళ్ళపాక సాహిత్యంలోని వీటి ఉనికిని పరిశీలిద్దాం.

### 3.2.1. శివుఁడు – చంద్రశేఖరుడు :

శివుని జటాజూటంలోని చంద్రుని గురించి అనేక పురాణాగాథలున్నాయి.

చంద్రుడు దక్షప్రజాపతి అల్లుడు తన కుమార్తెలైన ఇరువదియేడు మంది తారకలలో రోహిణిని తప్ప మిగిలినవారిని అలక్ష్యం చేస్తున్నాడనే ఆగ్రహంతో దక్షుడు చంద్రుని క్షయుడవు గమ్మని శపించాడు. అప్పుడు చంద్రుడు శివుని శరణుజొచ్చి క్షయవృద్ధులు లేక అతని జటాజూటంలో స్థానమేర్పరచుకొని తారకలందరికి మరింత దూరమయ్యాడు. చంద్రుడి కాశ్రయమిచ్చాడనే కోపంతో దక్షుడు శివునే శపింపబోగా విష్ణుమూర్తి శివ, దక్షులకు మధ్యవర్తిత్వం చేసి చంద్రుని రెండు ముక్కలు చేసి క్షయ వృద్ధులు లేని ఒక భాగాన్ని శివునికి క్షయవృద్ధులు గల మరోక భాగాన్ని తారకలకు ఇచ్చాడని వరాహపురాణగాథ.

దక్షయజ్ఞధ్వంస సందర్భంలో శివుని కాళ్ళక్రిందపడి చంద్రుడు నలిగిపోయి శివుని శరణువేడుకొనగా కరుణించిన శివుడు నాటినుండి చంద్రుని తన శిరస్సునందు ధరించాడని మార్కండేయ పురాణగాథ.

చంద్రుని జటాజూటంలో ధరించాడు గాబట్టి శివుని చంద్రమౌళి అని ఆ చంద్రునకు క్షీణవృద్ధులు లేవు, గాబట్టి ఎప్పుడూ బాలత్వాన్నే చెప్పాలని కవిసమయం. చంద్రునితోపాటు శివుని జటాజూటంలో గంగ వున్నప్పటికి శివుని 'గంగామౌళి' అనరాదని, శూలం గలవాడు గాబట్టి 'శూలి' అనవచ్చుగాని 'సర్పం' ఆభరణంగా గలవాడైన శివుని 'సర్పి' అనరాదని భాషా సంబంధ కవి సమయాలను

కేశవ మిశ్రుడు పేర్కొన్నాడు. కాని గంగాధరుడని, నాగభూషణుడనే వ్యవహారం శివుడికి ఉంది. చిన్నన్న ఉషా కళ్యాణంలో

ఖండేందుధరుడు వేడ్కలనొక్కనాడు
తాండవంబొనరించు తరి నేర్పుమెరసి 1ఆ-పుట7

అని శివుని మెప్పింపదలచిన బాణాసురుడు అతడు తాండవమాడు తరి సమీపించినట్లు వర్ణించాడు. ఇక్కడ శివుని 'ఖండేందుధరుడ'ని

పంకజరిపుమౌళి పాలింపుమనిన 1ఆ-పుట 9

అని 'చంద్రమౌళి' అని శివుని వ్యవహరించడం పై కవి సమయపాలనే.

## 3.2.2. చంద్రుడు –అత్రినేత్ర సముద్రోత్పన్నతలకైక్యం :

వినీలాకాశంలో తెల్లగా అందంగా ఆహ్లాదకరంగా కనిపిస్తూ దివినుండి భువిపై చల్లని తెల్లని వన్నెల వెలుగుల ప్రసరించే చంద్రుఁడు ఖగోళ శాస్త్రజ్ఞుల దృష్టిలో స్వయంప్రకాశంలేని కేవలం సూర్యుని ఉపగ్రహమే. కవుల కల్పనలలో అందానికి ప్రతీక అయిన శృంగార పురుషుడు. ప్రసిద్ధ ఉపమా వస్తువు. పౌరాణికుల దృష్టిలో నవగ్రహాలలో ఒకడైన దివ్య పురుషుడు. చంద్రునికి సంబంధించిన పురాణ గాథలనేకం వ్యాప్తిలో ఉన్నాయి.

చంద్రుఁడు అత్రినేత్రం నుండి ఉద్భవించాడని మత్స్య, మార్కండేయ పురాణాలు, సముద్ర మథన సందర్భంలో పాలకడలినుండి జన్మించాడని భారతం పేర్కొంటున్నా అత్రినేత్ర సముద్రోత్పన్న చంద్రులకు ఐక్యాన్ని పాటించి వర్ణించడం కవి సమయం.

అన్నమయ్య సముద్రుడికి చంద్రుడికి గల తండ్రీ తనయుల అనుబంధాన్ని పుస్కరించుకొని

జలజాక్షి లావణ్య జలధినుప్పొంగింప
నలివేణి ముఖ చంద్రుఁడభ్యుదయమాయ 4-164

అని నాయిక ముఖ చంద్రోదయంతో ఆమె లావణ్య జలధి ఉప్పొంగి అందం ఇనుమడించిందని వర్ణించాడు.

వేరొక కీర్తనలో

కోటి మన్మథాకార గోవింద కృష్ణ
పాటించి నీ మహిమలే పరబ్రహ్మము

............................................

చంద్రుఁడు నీ మనసులో జనించెనటుగాన
చంద్రికలు క్రపకాపై సరినిండెను 2-280

అని చంద్రుఁడు విష్ణువు మనసునుండి జన్మించినట్లు కూడా పేర్కొన్నాడు.

## 3.2.3. చంద్రుడు – శశాంక – హరిణాంకాలకైక్యం :

చంద్రుఁడిలోని నల్లనిమచ్చ కవుల కల్పనలకాలవాలమైంది. కొందరామచ్చను జింకగా భావిస్తే మరికొందరు శశము (కుందేలు)గా భావించి వర్ణించారు. అంచేతే చంద్రుడికి మృగలాంఛనుఁడు శశాంకుఁడు అనేపేర్లు వచ్చాయి. చంద్రునిలోని శశ, హరిణాలకు ఐక్యాన్ని పాటించాలని కవిసమయం. అయితే చంద్రుడిని శశము కలవాడు గాబట్టి 'శశి' అనవచ్చును గాని మృగము, హరిణము గలవాడు గాబట్టి 'మృగి' 'హరిణి' అనరాదని భాషా సంబంధం కవి సమయాలు కూడా ఏర్పడ్డాయి. అన్నమయ్య

చెలియకు నీవిప్పుడు చేరి మోము చూపితేను
కలువలకును శశి గనినట్లాయ........... 30-438

నని చంద్రుని 'శశి' అని వ్యవహరించి చంద్రుని శశాంకుడుగాను వేరొక కీర్తనలో

చింకచందురుఁడు కందుఁ జీకటిమై చీకటే

యింకఁ జేసి పారదోలీనేఁటి పొందులే 2-279

అని చంద్రుని చింక (జింక) చందురుఁడని హరిణాంకుడుగా పేర్కొన్నాడు.

## 3.2.4. మన్మథుని ధనుర్గుణ, చాపబాణాలు –భ్రమర పుష్పాలు :

మన్మథుని ధనుర్గుణాలను భ్రమరపంక్తిగాను చాపబాణాలను పుష్పాలుగాను వర్ణించడం; కామబాణాలచేత ప్రేమికుల హృదయాలు విదీర్ణమౌతాయని వర్ణించడం కవి సమయం.

ప్రసూయత ఇతి ప్రసూనమ్ ఘూజ్ ప్రసవే - పుట్టునది.

శృంగార ప్రసజన హేతువు ప్రసూనము. ఇది ప్రసజనమును సూచించుచున్నది గాన శృంగార రసోద్భవానికి పువ్వులు సాధనాలు.

అరవింద మశోకంచ చూతం చ నవమల్లికా

నీలోత్పలంచ పంచైతే పంచబాణస్య సాయకా

అని అరవిందం, అశోకం, చూతం, నవమల్లిక, నీలోత్పలాలు మదనుని పంచబాణాలని అమరకోశం.

మన్మథుని విల్లు చెరకు. బాణాలు పూలు. వాటి నాశ్రయించి సంచరించే భ్రమర పంక్తే అతని వింటి అల్లెత్రాడు. తుమ్మెదల ఝుంకారమే ధనుర్గుణటంకారము. వాహనం చిలుక. ఇవి యువతీ యువకులను క్షోభపెట్తాయని అమరకోశం పేర్కొంది. పంచబాణాలలో ఒక్కొక్క బాణం చేత యువతీ యువకుల హృదయాలలో ఒక్కొక్క మన్మధావస్థ ప్రేరేపింపబడుతుందని ఆవస్థాభేదాలను,

1. ద్రవణం, శోషణం, తాపనం, మోహనం, ఉన్మాదం.

2. సమ్మోహనం, ఉన్మాదనం, శోషణం, తాపనం మరియుస్తంభనం.

3. సమ్మోహనం, సముద్వేగబీజం, స్తంభం, ఉన్మాదనం మరియు జ్వలనాలని, అమరకోశం పేర్కొంది. పైన పేర్కొనబడ్డ మానసికావస్థలలో స్తంభద్రవణాలకు, శోషణ సముద్వేగ బీజాలకు, తాపన జ్వలనాలకు వస్తుతః భేదం లేదు. మిగతాది సమ్మోహన ఉన్మాదాలు. మన్మథుని ఐదుబాణాలు ఈ అయిదు మానసికావస్థలకు ప్రేరకాలు.

చూతం - ద్రవణం లేదా స్తంభనం

అశోకం - శోషణం లేదా సముద్వేగబీజం

చూతం - తాపనం లేదా జ్వలనం

నవమల్లిక - సమ్మోహనం

నీలోత్పలం - ఉన్మాదాలను కలిగిస్తాయని అమరకోశం పేర్కొంది.

ఈ అయిదు బాణాలు శబ్ద స్పర్శ రూప రస గంధాలనే పంచజ్ఞానేంద్రియాలకు ప్రతీకలని మరొకమతం.

కామబాణాలచే ప్రేమికుల హృదయం విదీర్ణమవుతుందని వియోగంచే గుండె పగులుతుందని వర్ణించడం కవి సమయం. అన్నమయ్య

ఒకటికి నుమడాయ వువిద నీ బలఁగము
వొకఁడింతె మరునికి వొదుగనేమిటికి

..............................................

అండనే వొంటి తామర అతని బాణముగాని
రెండు దామరలు నీ రిచ్చల హస్తములు.

..............................................

అలులనారి విల్లు అతనికై తేను నీకు
అలుల బొమ్మల విండ్లు రెండుగదవే 13-289

అని పూలు మన్మథుని బాణాలని, తుమ్మెదలు వింటినారని పేర్కొన్నాడు. వేరొక కీర్తనలో

కమలలోచన హృదయ కమలంబె మరుచేతి
కమలమై తన మనసు గాడి పారినది
గములైన యాపదలు గదిరినప్పుడు దమ్ము
తమచేతి యమ్ములే తాఁకునోకాక 12-187

అని కామబాణంచేత కమలలోచన హృదయ కమలం విదీర్ణమైందని వర్ణించాడు.

అమూర్తమైన హృదయాన్ని భాండంగా అది వియోగ బాధను భరించలేక బ్రద్దలయినట్లు చిత్రించడం కూడా కవి సమయం. అన్నమయ్య విరహిణి అయిన నాయికకు

కొండలోఁ గోవిలగుయ్య గుండె వగిలెనే
యండకు రాగాఁ బ్రాణమంతలో బ్రదికెరా 12-324

అని కోవిలకూత వినిపించగానే ఆమెకు విరహం ఇనుమడించి గుండె పగిలిందని నాయకుడు దరిచేరగానే అంతలోనే ప్రాణంపోక తిరిగి నిలిచిందని వర్ణించాడు. గుండె పగిలినా ప్రాణంపోక నిలవడం లేదా ప్రాణంపోయినా తిరిగి రావడం అన్నది అత్యధునాతనమైన వైద్యరంగానికి కూడా అసాధ్యమైనది.

పెద తిరుమలయ్య -

అలుల తుధుముగదే అది నీకు
వలరాజు విలునారి వడిఁ బెట్టెనటవే 23-147

అని పతినిబాసిన విరహంచేత నాయికకు మతి భ్రమణం కలిగి తుమ్మెదల బోలిన తన కురులనే మన్మథుని వింటినారి అలులుగా భావించినట్లు పేర్కొన్నాడు. శ్రీ వేంకటేశ్వరోదాహరణంలో

భావజు తండ్రి కుసుమబాణుని మామ మఱందియై     10వ పద్యం

అని శ్రీ వేంకటేశ్వరుని మన్మధునికి మేనమామ అయిన చంద్రుడికి మరిదిగా పేర్కొంటూ మరుని కుసుమబాణుడని వ్యవహరించాడు. చినతిరుమలయ్య తన శృంగార కీర్తనలలో

సొగసి చెలిచూపు చూడఁ జూచి ప్రియుఁడు

పగతో మరుఁడేసిన బాణమని భ్రమసె     16-8

అని కామబాణాలు అనే నారీకటాక్షాల కారణంగా ప్రియుని హృదయం విదీర్ణమయినట్లు వర్ణించాడు. చిన్నన్న ఉషాకల్యాణంలో

విరహాగ్ని వొదవె వేవేగ మన్మధుడు

విరితూపు తన తీపువింట సంధించి

వరుగూర్చి యీ తాపవార్ధి వెల్వడగ

దరిజేర్చుపల్లవాధరి ! నన్ను ననిన     1భా - ఫుట 24

అని కామబాణపీడత విచలిత మనస్కయైన ఉషాసుందరి ఆ తాపవార్ధినుండి తనను కాపాడమని చిత్రలేఖను కడుదీనంగా ప్రార్ధించినట్లు వర్ణించాడు. ఇక్కడ మన్మధుని పూవింటిజోదుగాను చెఱకు సింగిణి కలవాడుగాను పేర్కొన్నాడు.

### 3.2.5 మన్మథపతాకం –మకరమత్స్యాలకైక్యం :

మకర మత్స్యాలు రెండూ జలచరాలు. మన్మధుని పతాక చిహ్నంగా మకర మత్స్యాల రెంటిని అభివర్ణించడం సంప్రదాయం. మన్మధ పతాకంలో ఈ రెంటికి ఐక్యాన్ని పాటించాలని కవిసమయం. అంచేతే మన్మథునికి మకరధ్వజుడు మీనకేతనుడు అని నామాంతరాలున్నాయి. అన్నమయ్య

పొడవు మీను టెక్కెము పూవులయమ్ములపొది

వెడలె మరుఁడు దండు విరహులపై     17-349

అని మన్మధుని మీనకేతునుడని అభివర్ణిస్తే చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

అకట చూచిన యంత నలుగనేమిటికి

మకరాంకు చిలుకులె మాకటాక్షములు 2ఆ-2409

అని గోపికలు తమ కళ్ళను జూచి మన్మధ బాణాలని భ్రాంతి చెందారా అని కృష్ణుడినే ప్రశ్నిస్తున్న సందర్భంలో మన్మథుని మకర ధ్వజుడుగా నిరూపించాడు. చిన్నన్నే ఉషా కల్యాణంలో

చెఱకు సింగిణి మీనుసిడెము తుమ్మెదల

గఱుల తూపుల నల్లగలువ జోడంటి 1ఆ-పుట 25

అని మన్మథుని మీనకేతునుడుగా అభివర్ణించి మన్మథ పతాకంలో మకర మత్స్యాల కభేదాన్ని పాటించాడు.

## 3.2.6. మన్మథుని – మూర్త అమూర్తత్వాల కైక్యం :

శ్రీమన్నారాయణుని కుమారుడే మన్మథుడు. మన్మథుని జననాన్ని గురించిన పూర్వగాధలు పెక్కులు.

సంతనార్థియైన విష్ణువు శివుని ప్రార్థించి అతని అనుగ్రహంచేత మన్మధుని సంతానంగా బడిసినా శివుని అర్ధాంగి అయిన పార్వతి విష్ణువు తనను అలక్ష్యం చేశాడనే భావంతో శివనేత్రానలంచేత మన్మథుడు భస్మం కాగలడని శపించింది. తిరిగి విష్ణువు ప్రార్థనచే మన్మథుడు పునరుజ్జీవితుడు కాగలడని అనుగ్రహించినట్లు పూర్వగాధాలహరి.

బ్రహ్మదేవుడు మదన బాణ పీడితుడై కామంతో తాను సృష్టించిన సరస్వతితో సంగమించిన పిమ్మట తన తప్పిదాన్ని తెలుసుకొని దానికి కారకుడైన మన్మధుడు అచిరకాలంలో భస్మం కాగలడని శపించినట్లు – మత్స్యపురాణం.

ఇంద్రుని అభ్యర్థనపై తారకాసుర సంహారం చేయగల కుమారుని జనన నిమిత్తమై మన్మథుని తన బాణ ప్రయోగంలో శివునికి తపోభంగం కలిగించి అతని నేత్రాగ్నికి ఆహుతైనాడని కొంతకాలం తర్వాత అతడే ప్రద్యుమ్నుడుగా అవతరించాడని - శివపురాణాలు పేర్కొన్నాయి.

మన్మథుడు సశరీరుడైనా అశరీరుడైనా సకల జీవకోటి మన్మథ వశమవుతూనే ఉన్నారు. అంచేత మన్మథుని మూర్త అమూర్తత్వాల కభేదాన్ని పాటించాలని కవి సమయం. మన్మథుని సకల సైన్యంతో కూడిన సాకారుడైన పూవింటిజోదుగాను, అనంగుడు, మనసిజుడు, భావజుడు, అని నిరాకారుడుగాను పేర్కొంటూ ఈ రెంటికి అభేదాన్ని పాటించి కవుల కావ్యాలలో వర్ణనలు నెలకొన్నాయి. అన్నమయ్య

నొసలి కంటి కాఁక నణగి నొగిలినపుడె తొడుగలేక

కుసుమ శరము మదనుఁడతివ కొరకు దాఁచెనే 12-315

అని శివనేత్రాగ్నికి ఆహుతైన మరుడు తన ఆకృతిని కోల్పోయినా ప్రతాపాన్ని కోల్పోక తన నాయికపై ప్రయోగించడానికే కుసుమ శరాలను దాచాడని అభివర్ణించి మన్మథుని మూర్త అమూర్తత్వాల కభేదాన్ని పాటించాడు. వేరొక కీర్తనలో

అతఁడు మొదలనే యనంగుఁడూ

రతి వసంతమిటు రాదుగదా 29-599

అని మన్మథుడు అనంగుఁడు గాబట్టి అర్ధాంగి అయిన రతీదేవిగాని మిత్రుడైన వసంతుడుగాని అతనితో రాలేరని పేర్కొన్నాడు. పెద తిరుమలయ్య చక్రవాళ మంజరిలో

మణిమయకేళి హర్మ్యమునఁబంతాన

దానకంబైన గంధంపు వేదికను

గనుపట్టు మరుని చొక్కపు రూపువ్రాసి

అని వేంకటగిరీంద్రునికై విరహంతో తపిస్తున్న నాయిక మరుని చొక్కపు రూపును పూజించిందని మన్మథుని సాకారుడుగా పేర్కొని

కినియు చిత్తజు చేతఁ గెరలె దాపంబు

అని ఆమె అశరీరుడైన 'చిత్తజు'నిచేత పీడింపబడుతోందని వర్ణించాడు. చినతిరుమలయ్య

సొగసిన చెలిచూపు చూడఁజూచి ప్రియుఁడు

పగతో మరుఁడేసిన బాణమని భ్రమసె 16-8

అని మన్మథుని మూర్తరూపాన్ని

చిన్నన్న ఉషాకల్యాణంలో

కలలోన మన్మథాకారుడొక్కరుఁడు

కలికి లాగుల తన కళలంటి యంటి

కలసి పై కొనమేలు కాంచి బిట్టులికి 1ఆ-పుట21

అని ఉషాసుందరి కలలో మన్మథాకృతిని బోలిన పురుషుడొక్కఁడు ప్రవేశించినట్లు వర్ణించి మన్మథుని మూర్తత్వాన్ని

కన్నియ పలికె గద్గద కంఠియగుచు

చేరి యెవ్వడో కాని చిత్తజుకేళి

వలనొప్పననుగూడి వంచించి చనియె 1ఆ-పుట22

అని మన్మథుని కేవలం నిరాకారుడైన చిత్తజునిగా పేర్కొన్నాడు. ఈ విధంగా మన్మథుని మూర్త అమూర్త రూపాలను వర్ణించాడు.

## 3.2.7. ద్వాదశాదిత్యుల కైక్యం :

అదితేరపత్యం ఆదిత్యః కశ్యప ప్రజాపతి భార్యయైన అదితి కొడుకే ఆదిత్యుడు - సూర్యుడు. ఆదిత్య హృదయ స్తోత్రంలో సంవత్సరంలోని పన్నెండు నెలలు సూర్యుని పండ్రెండు రూపాలుగా అభివర్ణింపబడ్డాయి.

ధాతో మిత్రోర్యమా రుద్రో వరుణ స్సూర్య ఏవచ

భగో వివస్వాన్ పూషాచ సవితా దశమః స్మృతః

ఏకాదశస్తథా త్వష్టా విష్ణుర్ద్వాదశ ఉచ్యతే

అని ఆదిత్య హృదయం సూర్యుని ద్వాదశ నామాలను పేర్కొన్నా కొన్నిచోట్ల ఈ నామాలు భిన్నంగా ఉన్నాయి.

మిత్రుడు, రవి, సూర్యుఁడు, భానుఁడు, భగుఁడు, పూషుడు, హిరణ్యగర్భుడు, మరీచి, ఆదిత్యుడు, సవిత, అర్కుడు, భాస్కరుడు అని సంకేతపదకోశం సూర్యుని ద్వాదశ నామాలను పేర్కొనింది. ఈ ద్వాదశ నామాలు గల ఆదిత్యులకు ఐక్యానుసంధానం చేయడమే ఈ కవిసమయం. అన్నమయ్య.

పన్నిద్దరు సూరియుల బండి కండ్లతేరు 2-239

అని ఆదిత్యుల పన్నిద్దరుగా పేర్కొన్నా ఆ పండ్రెండు రూపాలు భగవంతుని రథ చక్రాలేనని అన్ని చక్రాలు కలిస్తేనే బండి సక్రమంగా సాగుతుందని ధ్వనింపజేశాడు. పెద తిరుమలయ్య

"క్షీరాబ్ధిశయన కమలంబు సూర్యుని కెదురుచూచినట్లు నా హృదయ పద్మంబు రవి మండలవర్తివైన నీకెదురు చూచుచున్నది".

అని సూర్య, రవి శబ్దాలను పర్యాయ వాచకాలుగా ప్రయోగించాడు.

### 3.2.8. క్షీరక్షార, సాగర– మహాసాగరాలకైక్యం:

వాస్తవానికి సాగరాలన్నీ క్షార సాగరాలే. క్షీర సాగరం కేవలం పురాణ ప్రసిద్ధమే. క్షీర సాగరాన్ని దేవ దానవులు మథించగా ఉచ్చైశ్రవం, ఐరావతం, చంద్రుఁడు జన్మించినట్లు పురాణప్రసిద్ధి, కాని కావ్య ప్రపంచంలో క్షీరక్షార వ్యత్యాసం లేక సాగర సామాన్య శబ్దంచేతనే వ్యవహరించడం కవి సమయం. వైశాల్యాన్ని బట్టి సాగర మహా సాగరాలకు భౌగోళికులు వ్యత్యాసాన్ని పాటించినా కవుల దృష్టిలో సాగరమంటే ఉత్తుంగ తరంగాలతో కనుల ముందు సాక్షాత్కరించే జలరాశే. అంచేత సాగర మహాసాగరాలనే వ్యత్యాసం లేక నిజాం సాగర్, నాగార్జున సాగర్, హుస్సేన్ సాగర్ అని జలరాశులన్నిటినీ సాగరాలుగానే పేర్కొన్నారు. అన్నమయ్య

మదిరాక్షి చన్నులనే మందర గిరులు మోవ

చెదరని యారనే శేషునిఁ బూఁచి

ముదమున లావణ్య సముద్రము మరుఁడుదచ్చె 13-409

అని మన్మధుడు మదిరాక్షి చన్నులే మందరగిరులుగా నూగారే శేషుని బూచిగా లావణ్య సముద్రాన్ని చిలికినట్లు వర్ణించాడు. మందరగిరి కవ్వంగా వాసుకి త్రాడుగా దేవదానవులు చిలికింది పాలకడలినే అయినా అన్నమయ్య సముద్ర పాల సముద్రాల కైక్యాన్ని పాటించి ఇట వర్ణించడం ప్రస్ఫుటం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

శ్రీ యలమేల్మంగఁ జిర కృపాపాంగఁ

గాయజుమాత సాగర తనూజాత అవతారిక – పుట 1

అని లక్ష్మీదేవిని కేవలం సాగర తనూజాతగా పేర్కొనడం క్షీర క్షార సాగరాలకైక్యాన్ని పాటించే.

### 3.2.9. దేవతలనాపాదమస్తకం మానవులను శిరసాపాదాంతం వర్ణించడం:

దివ్యుల పట్ల మనకున్న భక్తి శ్రద్ధలకు తార్కాణ మీ కవి సమయం. దీనిని కవి సమయంగా దేవేశ్వరుడు, కేశ మిశ్రుడు పేర్కొన్నారు. కాని ఇది అలౌకిక అశాస్త్రీయాంశం కాదు గాబట్టి కేవలం సంప్రదాయమే గాని కవి సమయంగాదని కవి సమయ ఆభాసం మాత్రమేనని డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు పేర్కొన్నారు. 6

తాళ్ళపాక సాహిత్యం స్వతంత్రతా నిలయం. ఈ సాహిత్యంలో దివ్యులైన అలుమేలుమంగా శ్రీ వేంకటేశ్వరులను నాయికా నాయకులుగా భావించడం చేత కాబోలు శిరసాపాదాంతం చేసిన వర్ణనలు, ఒక క్రమం లేకుండ చేసిన వర్ణనలు అధికం. ఆపాదమస్తకం చేసిన వర్ణన నా పరిశీలన కందినదొకటే. అది అన్నమయ్య-

అన్నియుఁ గూడఁ అలుమేలుమంగ యాయ
కన్నుల విట్టి కొత్తలు కనుఁగొనవయ్యా ॥ పల్లవి ॥
చిగురు మరుకాళెలు జిగి గల యరఁటులు
సొగసైన యట్టి యిసుక దిబ(బ్బ?)లు
తగిన బిలము మంచి తరఁగలు సింహము
మొగిచిన చక్రవాళముల పిల్లలు ॥ అన్ని ॥
జవళి తామరతూండ్లు చక్కని శంఖముపోఁక
పవడాలు వజ్రాలు పసిడి యద్దాలు
నువ్వుఁబూవు కలువలు నూలుకొన్న శ్రీకారాలు
అవిరళమైన విండ్లు అరచంద్రుఁడూ ॥ అన్ని ॥
తమ్మివిరి నీలాలు తళుకు మెఱుఁగులు

తుమ్మిదలు (ల?) బెదరని తోరపు గుంపు

ఇమ్ముల శ్రీ వేంకటేశ యిదె నీ పురము మీఁద

నెమ్మదిఁదావుకొని నిండెను యీ సిరులు ॥అన్ని॥

24-239

అని అలమేలు మంగ వర్ణన. ఈ వర్ణనలో ఉపమేయాంశం చెప్పకుండా ఉపమానం చేతనే ఉపమేయాని తలపింపచేయడం విశేషం. ఈ కవి సమయసిద్ధోపమ క్రమం ఆపాదమస్తకం గల శరీరాంగ వర్ణనే.

## 3.3 పాతాళీయం :

పాతాళవాసులకు సంబంధించిన కవి సమయాలు పాతాళీయాలు. రాజశేఖరుడు పేర్కొన్న పాతాళీయ కవి సమయాలు తాళ్ళపాక సాహిత్యంలో ఎన్ని కలవో పరిశీలిద్దాం.

### 3.3.1. నాగసర్పాల కైక్యం :

నాగ కాద్రవేయ శబ్దోమానుషాకారేషు ఫణ లాంగూలాది యుక్తేషు దేవయోనిషు భోగిషు వర్తేతే - పడగలు, తోకలు కలిగి మనుష్యాకారంలో ఉండే దేవయోనులు నాగ కాద్రివేయులు అని

సర్పతీతి సర్పః సృప్ గతే - చరించునది

ఉరగ, పన్నగ, భుజంగ, ఫణాది శబ్దాలు సర్పానికి పర్యాయ పదాలు- అని అమరకోశం పేర్కొంది.

సర్పాలకు లేని దేవతాత్వం నాగులకున్నది. నాగజాతి పవిత్రము పూజనీయమైనది. నాగసర్పాలు రెండు విభిన్న జాతులైనా రెండింటికి ఐక్యాన్ని పాటించడం నియమ నిబంధనం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

నాగబాలకులు చందన శాఖలందు

బాగొప్పుగతిఁగరఫణి భూషలమర 1ఆ-పుట

అని బాలకృష్ణుని చేతికి అలంకరింపబడిన ఫణి భూషణాలను చందన శాఖలకు చుట్టుకొన్న నాగబాలకులుగా ఉపమించాడు. ఇక్కడ కృష్ణుని చేతులను చందన శాఖలుగాను వాటిని పెనవేసిన ఫణిభూషణాలంకారాలను నాగబాలకులుగాను పేర్కొని నాగులకు సర్పాలకు ఐక్యాన్ని పాటించాడు. చందన గంధంచేత ఆకృష్టమై ఆ తరుశాఖలను చుట్టి వుండేవి. సర్పాలేగాని దేవతా స్వరూపులైన నాగజాతికాదు.

## 3.3.2. దైత్య దానవ అసురుల కైక్యం :

దితి సంతానం దైత్యులు. దనువు సంతానం దానవులు. సుర (అమృతం) లేనివారు అసురులు.

హిరణ్యాక్ష హిరణ్యకశిప ప్రహ్లాద విరోచన బలిబాణాదులు -దైత్యులు

విప్రచిత్తి శంబరనముచి పులోమాదులు -దానవులు

బలవృత్ర విక్షరస్త వృషపర్వాదులు -అసురులు

అని వారికైక్యాన్ని పాటించాలని పాతాళీయ కవిసమయాన్ని రాజశేఖరుడు పేర్కొన్నాడు.

దైత్యదానవులకు భేదమున్నా అసురత్వ లక్షణ సామాన్యం వల్ల ఈ ఇద్దరికి అభేదాన్ని అమరకోశం పేర్కొంది. అంచేతే కావ్యాలలో దైత్య, దానవ, అసుర శబ్దాలు పర్యాయవాచకాలుగా ప్రయోగింపబడుతున్నాయి. అన్నమయ్య-

కుడువఁడా ప్రాణములు గొనుచుఁ బూతకిచన్ను
తుడువడా కపట దైత్యుల నొసటివ్రాలు
అడువఁడా నిలలో నలమి శకటాసురుని
వడవఁడా నెత్తురులు వసుధ కంసుని
పెట్టఁడా దనుజారి బిరుదులోకమునందు
కట్టఁడా బలిదైత్యు కర్మబంధముల

మెట్టఁడా కాళింగుమేటి శిరములు నలియ

గొట్టఁడా దానవులఁ గోటానఁ గోట్ల 1-126

అని దైత్యదానవ అసుర శబ్దాలను రాక్షసులకు పర్యాయవాచకాలుగా ఉపయోగించాడు. చిన్నన్న ఉషాకల్యాణంలో బాణాసురుని వంశక్రమాన్ని పేర్కొంటూ

బలితనూభవుండై బాణాసురుండు 1ఆ-పుట 6

అని దైత్యుడైన బలికుమారుఁడు బాణుని అసురునిగాను వేరొక పర్యాయం

మానినీయుక్తుఁడై మధుపాన సక్తి

దానవేశ్వరుఁడుండ తదనంతరంబ 1ఆ-పుట 11

అని మధుపానాసక్తుడైన బాణుని దానవేశ్వరుఁడుగాను పేర్కొనడం దైత్యదానవ అసురుల కైక్యాను సంధానమే.

ఇంతవరకు తాళ్ళపాకసాహిత్యంలో కనిపించే ఆలంకారిక కవిసమయాలను పరిశీలించాం. ఇక నాల్గవ ప్రకరణంలో తాళ్లపాక సాహిత్యంలోని విశిష్ట కవి సమయాలను పరిశీలిద్దాం.

## సంఖ్యాసూచిక

1. కవిసమయములు - పుట 44
2. A hand book of the birds of India & Pakistan Vol .3 - పుట 194
3. కవిసమయములు - పుట 61
4. తాళ్ళపాక సాహిత్యం - ఆధ్యాత్మ సంకీర్తనలు - సంపుటం 3 (పుట 154)
5. వసుచరిత్ర 1 ఆ - 157వ పద్యం
6. కవిసమయములు - పుట 138

# ప్రకరణం - 4

# తాళ్ళపాక సాహిత్యంలో విశిష్ట కవిసమయాలు

# 4. విశిష్ట కవిసమయాలు

ప్రాచీన విద్వాంసులు సహస్రశాఖలు కలది సాంగమైనది అయిన వేదాధ్యయనం చేసి, శాస్త్రాలను పఠించి, దేశాంతర, ద్వీపాంతరాలు సంచరించి ఏ విషయాలనైతే గ్రహించి రచించారో ఆ విషయాలు దేశాంతర కాలాంతరాలలో మార్పులు చెంది వేరే విధంగా వున్నప్పటికి వాటిని పూర్వ విద్వాంసులు పేర్కొన్న విధంగానే కావ్యాలలో కూర్చడం కవి సమయం. ఈ కవి సమయాల మూలంచూడక వాటి ప్రయోగాలను మాత్రం చూచి తరువాత కవులచే ప్రయుక్తమైన కవిసమయశబ్దం ఇప్పుడు రూఢమైంది అని కవి సమయ ఆవిర్భావ హేతువులను రాజశేఖరుడు వివరించాడు.1

నేడు కేవలం అశాస్త్రీయాలు, అలౌకికాలుగా పరిగణింపడడుతున్న కవి సమయాలు ఒకప్పుడు శాస్త్రీయాలు, లౌకికాలేనని పై వాక్యాలబట్టి గ్రహించవచ్చు. అంటే కవి సమయాలు కొంత సత్యాలు కొంత అసత్యాలు. అయినప్పటికీ పరంపారాయాతతే వీటి మనుగడకు మూలాధారం. ఈ లక్షణం ఉపమానాలకు గూడ సామాన్యం.

కావ్యానికి శోభను చేకూర్చేవి అలంకారాలు కాగా అలంకారాలకు అలంకారం కవి సమయం. అలంకారాలకు మూలాధారం ఉపమానం. కవి సమయసిద్ధం కాని ఉపమ దోషజుష్టమని జగన్నాథపండితుని అభిప్రాయం కాబట్టే అలంకార గ్రంథాలలో ప్రసిద్ధోపమానాల పట్టికలు తావు చేసికొన్నాయి.2

విద్వాన్ కపగల్లు మఠం కరిబసవ శాస్త్రి గారు 'కవి సమయము'లనే వ్యాసంలో ఉపమానాలను కవి సమయాలుగా భావించి చర్చించారు. డా॥ సి. నారాయణరెడ్డిగారు తమ సిద్ధాంత వ్యాసంలో "సంస్కృత సాహిత్యమున కవి సమయములు నిర్ణీతములై యున్నవి. కొందరు కవులు అప్పుడప్పుడు వానినికాదని కొన్ని నవ్యప్రయోగములు చేసినారు. కనులను కలువలతోనో కమలములతోనో పోల్చుట కవి సమయం. దండి 'ప్రౌఢ కందళీకుట్మలమివ' అని ఉపమించెను.[3] అని దండి ఉపమాన ప్రయోగ వైశిష్ట్యాన్ని వివరించి ఉపమానాలను

కవి సమయాలుగా సంభావించారు. శ్రీ కె.వి. రాఘవాచార్య 'కవి సమయాలు - క్రొత్త ప్రయోగాలు' అనే వ్యాసంలో కూడ ఉపమానాలను కవి సమయాలుగా పరిగణించి చర్చించారు. సుప్రసిద్ధ కవి, తెలుగు పండితులు జ్ఞానపీఠ అవార్డు గ్రహీత అయి కవి సమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు విజయ విలాస పీఠికలోని "స్త్రీ యొక్క మొగము, కన్నులు, చేతులు, కాళ్ళు- ఇవన్నియు తామర పూవులవలె నున్నవనుట. ఆమె స్తనములు పర్వతములవలెనున్నవనుట. తొడలు అరటి కంబములవలె నున్నవనుట. జుట్టు మేఘమువలె, రాత్రివలె, చమరీ మృగము యొక్క తోకవలె ఇవి యన్నియు కొంత సమయములు, కొంత ఉపమాలంకారాదులు' అని, వసుచరిత్ర పీఠికలో 'కవి సమయాలు, శ్లేషలు, యమకాలు' అను శీర్షికలోను ' కవి సమయములనగా కవులు కొన్ని ప్రసిద్ధములైన యుపమానములను దెత్తురు. కన్నులు, మొగము తామర పూవులందురు. కంఠము శంఖమందురు. అందరు కవులిట్లే యందురు. ఒక్కొక్క కవి దానిపై తన కల్పన చేయును" అని ఉపమానాలను కవి సమయాలుగా పేర్కొన్నారు. కళ్ళు, కాళ్ళు,చేతులు, ముఖము అన్నీ తామరలను బోలిఉండడం సహజమా ? ఇది కొంత సత్తు కొంత అసత్తు అయినప్పటికి పరంపరాయతతవల్లే వాటిని శాస్త్రీయములుగా సంభావిస్తున్నాము. డా॥ ఇరివెంటి కృష్ణమూర్తిగారు ' కవి సమయాలు' అనే తమ సిద్ధాంత వ్యాసంలో ఉపమానాలను కవి సమయ ఆభాసాలుగా పరిగణించారు.[4]

తాళ్ళపాక సాహిత్యంలో కనిపించే సంప్రదాయ సిద్ధ ఉపమాన ప్రయోగాలనేగాక అపూర్వము, అపురూపము అయిన ఎంతో వైశిష్ట్యాన్ని సంతరించుకున్న ఉపమాన ప్రయోగాలను విశిష్ట కవి సమయాలనే ఈ శీర్షికలో పరిశీలిద్దాం.

తాళ్ళపాక సాహిత్యంలో కనిపించే కవి సమయాలను వస్తు దృష్ట్యా రెండు రకాలుగా వర్గీకరింపవచ్చు.

1. శరీర సంబంధి 2. మనస్సంబంధి

## 4.1 శరీర సంబంధి

శరీర సంబంధి అయిన దీనిని మరల శరీరావయవ సంబంధి, శారీరక ప్రవృత్తి సంబంధి అని రెండు రకాలుగా విభజింపవచ్చు.

శరీరావయవ సంబంధి :

శరీరానికి శరీరంలోని ఆయా అంగాలకు సంబంధించి తాళ్ళపాక సాహిత్యంలో ప్రయుక్తమైన ఉపమానాలు యిందులో చేరతాయి. ఆపాద కేశాంతం శరీరం యావత్తు దృష్టిలో పెట్టుకొని తాళ్ళపాక సాహిత్యంలో కనిపించే కవిసమయాలను పరిశీలిద్దాం.

### 4.1.1 పాదాలు

దేవతా మూర్తులను అపాద మస్తకం వర్ణించడం ఆచారం. పాద పూజ చేయడం, పాదోదకాన్ని తీసుకోవడం, పాద నమస్కారం చేయడం, పాదాలను ఆశ్రయించడం అనాదిగా లోకం పాదాలకిచ్చే గౌరవం. పాదాలను తామరలు, ఎర్రకలువలు, చిగురుటాకులు, పగడాలతో పోల్చడం కవి సమయం. అన్నమయ్య పాదాలను తామర, చిగురు, తులసీదళం, చింతకొమ్మ కూర్మం, సంతముద్రకోల, నాగళ్ళు, లత్తికలతోను, పెదతిరుమలయ్య తామరలు, తాబేళ్ళతోను, చిన్నన్న తామరలు, చిగురుటాకులు, తాబేళ్ళు, లత్తిక, పగడాలు, విట హృదయ శల్యాలతోను పోల్చారు.

#### 4.1.1.1. పాదాలు – తాబేలు :

'కూర్మ పృష్ఠ జయిష్ణు ప్రపదాన్వితా' - లలితా సహస్రనామావళి -16శ్లో

అని రాజరాజేశ్వరి పాదాల వర్ణన.

పృష్ఠభాగం కఠినంగా ఉబ్బెత్తుగా ఉండి ఆత్మరక్షణాది అవసరసమయాలల్లో తల, కాళ్ళను లోపలికి ముడిచి వేసి కేవలం కఠిన శిల అనే భ్రాంతిని కలిగించేది తాబేలు. .పాదాల పృష్ఠభాగం ఉబ్బెత్తుగా ఉండడం అదృష్టసూచకమని సాముద్రిక

శాస్త్రం. కేవలం ఆకృతిని బట్టే గాక ఎదుటివారి చేతికందక తప్పించుకొనే వాటి స్వభావాన్ని బట్టి కూడ అన్నమయ్య ఈ ఉపమానాన్ని ప్రయోగించాడు.

నిండిన నాపాదములు నీటిలోని తాఁబేళ్ళు
చండిపడ నీవు నన్ను సారెఁ బెనకకురా 15-130

అని నాయకుని చేజిక్కక అలయించే నాయిక పాదాలను తాబేళ్ళతో పోల్చడం స్వభావగతమే. పెద తిరుమలయ్య -

తక్కక యాకె పాదాలు తాబేళ్ళఁబోలుచరే
నిక్కితని చెమటేరు నిండుఁగాని 23-240

అని తాబేటికి నీటికి గల అనుబంధాన్ని పురస్కరించుకొని వర్ణించాడు.

"వపుర్జలోద్గమ స్వేదోరతిఘర్మ శ్రమాదిభిః"

ఇక్కడ నాయకుడికి రతిచే చెమటలు ఏరులు గట్టి ప్రవహిస్తుండగా ఆ ఏటిలో మునిగి ఒదిగివున్న తాబేళ్ళే నాయిక పాదాలు చిన్నన్న ఉషాకల్యాణంలో

పదములా యివి యాత్మభవు నడబావి
పాదలి మించిన కూర్మ పోతముల్ గాక పుట 6

అని పాదాలను మామూలు తాబేళ్ళతోగాక సాక్షాత్తు మన్మధుని నడబావిలో సంచరించే అపురూపమైన కూర్మపోతము (పిల్లల) తో పోల్చి ద్వారకానగరవాసినులైన యువతుల సౌందర్యాతిశయాన్ని చాటాడు.

## 4.1.1.2. పాదాలు – తామర :

అందమైనవి, మరకందంతో నిండినవి. ఆస్వాదించేవారి బడలికను పోగొట్టేవి తామరలు. కేవలం రూపాన్ని బట్టేగాక గుణ సామ్యంచేత అన్నమయ్య భగవంతుని పాదాలను తామరలతో పోల్చాడు.

పొంచి తామర పువ్వుల ఁబోలిన పాదాలాతఁడు
వంచి తుమ్మిదల కొప్పు వడిసోక మొక్కవే 24-251

ఇవి బ్రహ్మ కడిగిన పాదాలు, బ్రహ్మము తానైన పాదాలు, వాటి నాశ్రయించిన వారికి శాశ్వతానంద మకరందం లభించడం తథ్యం. అంచేతే తుమ్మెదల కొప్పు వడిసోకగా ఆ పాదాలకు మొక్కమని నాయికకు చెలుల సూచన. పురుషోత్తముడొక్కడే పురుషుడు. తక్కిన జీవులందరూ స్త్రీలే అని ఆధ్యాత్మిక భావన. మనస్సు, పంచేంద్రియాలే ఆరుపాదాలుగా గల జీవుడే తుమ్మెద. పద్మాలను చేరి మకరందాన్ని ఆస్వాదించేది తుమ్మెద. జీవుడు భక్తుడై భగవంతుని సాన్నిధ్యంలో శాశ్వతానంద మకరందాన్ని పొందాలని అన్నమయ్య ఆదేశం. పెద తిరుమలయ్య

చెందమ్మి పాదాలు చేనొత్తగానే
అందందే కూడేవు అవురానీవు 23-86

అని అమ్మవారిచేత పాదాలు పట్టించుకొనే స్వామి పాదాలను ఎర్రతామరలతో పోల్చాడు. ఈ ఊహలో ఎన్నో విశేషాలున్నాయి. మొదటిది స్వామి పాదాలు చెందమ్మిలాంటి వని చెప్పడం రెండవది అమ్మవారి చేతులు అరుణవర్ణం కలవి కావడం వల్ల ఆ చేతుల అరుణిమ స్వామి పాదాలపై ప్రతిబింబించిందనడం. మూడవది అనురాగం ఎరుపని ప్రసిద్ధి ఆరక్తియే వారిచేతలలో ప్రతిబింబస్తోందని ధ్వని. నాయిక ఎంతో భక్తితో నాయకుని సేవించగా నాయకుడు రక్తితో దానిని స్వీకరించి ఆమెది మధుర భక్తిగా రూపొందించాడు. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

మంచి తామరల మర్మములు పాదములు
నని మెచ్చదగు నవయవముల నొప్పు 5ఆ-పుట 226

అని సత్యభామ పాదాలను శ్రేష్టమైన తామరలుగా వర్ణించాడు. మామూలు తామరలైతే ముకుళిస్తాయి. కాని ఈ పాద పద్మాలకు ముకుళించడమనే న్యూనత లేదు. తామరలు సూర్యకిరణ స్పర్శతో వికసిస్తాయి. ఈ పాదాలు స్వామి వీక్షణమాత్రం చేత పారవశ్యం పొందుతాయని భావం

### 4.1.1.3. పాదాలు –చిగురు :

సుకుమారమయిన పాదాలను చిగురుతో పోల్చడం ప్రాచీన సంప్రదాయం. అన్నమయ్య సఖీ నాయికా సంవాదంలో పాదాలను చిగురుతో పోల్చాడు.

చిగురుగ్గైదువ మరుచేతి దింతే నీకయితే
చిగురుఁబాదాలు రెండు చింతయేటికే 13- 289

అని మరునికి చిగురుకత్తి ఒకటే. నీకయితే రెండు పాదాలు రెండు చిగురులు. అలమేలుమంగ పాదాలు సున్నితము సుకుమారము అయినవే అయినా మదనుని కత్తిలాగే ఎదుటి వారిని పాదాక్రాంతుల చేసికొనగల శక్తివంతమైనవి. అంచేతే సునాయాసంగా నాయకుని వశపరచుకోగలవు కాబట్టి మరుని కంటే ఎక్కువ బలము గల మగువ మరునికి జడియ పనిలేదని అభిప్రాయం.

చిన్నన్న ఇంచుమించు ఇదే భావాన్ని పరమయోగి విలాసంలోని కుక్కుటపుర స్త్రీల సౌందర్య వర్ణనా సందర్భంలో

పొలుపులై సొలుపులై పూవిల్తువాలు
మెలుపులై వలపులై మించు పాదములు 3-183

అని పేర్కొన్నాడు.

### 4.1.1.4. పాదాలు – తులసీ దళం :

పాదాలను చిగురుతో పోల్చడం సంప్రదాయం. కాని ఆ చిగురును తులసీదళాలుగా భావించడం అన్నమయ్య భక్తికి భావనాశక్తికి ప్రతీక. తులసీదళం స్వామి పూజా ద్రవ్యాలలో ఒకటి. శ్రీ మహావిష్ణువు తులసీమాల అర్పణతో సంతోషిస్తాడు. నాయిక స్వామి కెంత ప్రీతి పాత్రురాలో ఈ క్రింది పాదాలలో అన్నమయ్య స్పష్టం చేశాడు.

ఆ పోలికౌనో కాదో అట్టే నీవు చూచుకొమ్మా

పూఁపలై వలపులెల్లా పూచినట్లున్నది
తగులుకొనెనో మెడఁదరుణి చూపులెల్లా
అగపడిఁబాదాల నిగ్గు జెడ గట్టెనో అప్పటి
తగియల్లదె తులసి దండవలె నున్నది 13-218

సున్నితము, సుకుమారము అయిన చిగురులాంటి అమ్మవారి పాదాలు స్వామి మెడ చుట్టు పెనగొని వుండడం విశేషం. అంచేతనే అమ్మవారి పాదాలు స్వామి మెడలోని తులసి మాలలా గోచరిస్తున్నాయి.

## 4.1.1.5. పాదాలు – చింతకొమ్మ :

చెట్లల్లో చింతకొమ్మ చాలా గట్టిది. ఈ కొమ్మను పట్టుకొని వ్రేలాడే వారికి అది విరిగి పోతుందనే భయం సుతారమూ లేదు. అలాగే స్వామి పాదాలు జీవికి చింత కొమ్మలాంటివి.

కొనల నీ పాద చింతకొమ్మయే దిక్కు 2-146

స్వామి పాదాలశ్రయించిన వారికి వేరే ఆశ్రయం ఏది అవసరం లేదని నిర్భయంగా వుండవచ్చునని అన్నమయ్య అభిప్రాయం.

## 4.1.1.6. పాదాలు – తేప :

జలధులను దాటించగలది తేప (తెప్ప). మానవ నిర్మితమైన తేప సాగర మహా సాగరాలను ఈదింపగలదేమో గాని మానవుని చింతా జలధులను దాటింపలేదు. ఆ చింతా జలధులను ఈ దింపగలది భగవత్పాదమొక్కటే.

'జన్మ దుఃఖం జరా దుఃఖం తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త'

ఈ దుఃఖ వారాశినుండి దరిజేర్చే తేప భగవత్పాదం. ఎటువంటి క్లేశం లేకుండా జలధులను దాటింపగల తేపతో చింతా జలధుల దాటింపగల భగవత్పాదాన్ని అన్నమయ్య పోల్చాడు.

చింతా జలధులఁ జిక్కిన దాటించ

నంతట నీ పాదమే తేప 11-1-107

అని సంసార సాగరాన్ని దాటే తరుణోపాయాన్ని అన్నమయ్య మనకు సూచించాడు.

## 4.1.1.7. పాదాలు – పరశువు :

పరశువంటే గొడ్డలి. ఇది బలిష్టమైన చెట్లును ఛేదించగలది. సంసార వృక్షాన్ని ఛేదించగల పరశువు భగవత్పాదం. సంసార వృక్షానికి మూలం స్త్రీ పురుషుల సంయోగం. 'తరుణస్తావ తరుణీసక్తః' 'ఎంత వారలైన కాంతాదాసులే'. మరి ఈ స్త్రీ వ్యామోహాన్ని ఛేదించగల సమర్థుడెవరు ? కాంతా వ్యామోహం అనే బంధనాలను తెంచగల పరశువు భగవత్పాదమే.

కాంతల మోహపు కట్లు దెంచగ

పంతపు నీ పాద పరశువు గలిగె 11-1-107

భగవంతుని పాదాలాశ్రయించి మోహాతీతుల కమ్మని అన్నమయ్య సలహా.

## 4.1.1.8. పాదాలు – మిన్నేరు :

మిన్నేరు అంటే ఆకాశగంగ . విష్ణు పాదోద్భవమైనదిగ ప్రసిద్ధి నొందింది గంగ. సర్వపాపక్షాళన సమర్థమైనది. శరీరాని కంటిన పంకాన్ని తొలగించేది నీరు. మనోవాక్కాయకర్మల కంటిన దురిత పంకాన్ని తొలగింప సమర్థమైనది భగవత్పాదము. 'క్షీణే పుణ్యే మర్త్యలోకా విశంతి' చేసుకున్న పుణ్యం అంతరిస్తే తిరిగి భూలోకంలో జన్మించక తప్పదు. పాప సంభవులైన జీవులు తిరిగి పాపాలు చేయక తప్పదు. ఈ జన్మ పరంపరలు పాపకూపాలు. పాప పంకిలాన్ని క్షాళన మొనరించుకొని ఈ పాప కూపాన్నుండి తప్పించుకోవాలంటే భగవంతుని పాదాల నాశ్రయించడమొక్కటే దిక్కు. భగవంతుని పాదాలే మన పాప పంకిలాన్ని కడిగి వేయగలవి. అంచేతే ఆ పాదాలను మిన్నేరుతో అన్నమయ్య పోల్చాడు.

అతి దురిత పంకమందినఁగడుగఁగ

మితి నీ పాదమే మిన్నేరు -11-1-107

ఈ పంకిల క్షాళన అనితర సాధ్యమైనది అంచేతే భగవంతుని పాదాలాశ్రయించి జీవన్ముక్తులు కండని అన్నమయ్య ఉద్బోధ. అయశ పాపాలను నల్లగా వర్ణించడం కవి సమయం. అంచేతే ఇక్కడ పాపాన్ని నల్లని బురదగా ఉపమించడం కవి సమయం.

## 4.1.1.9. పాదాలు – వాన

అనంత సాగరాలను సైతం పొంగి పొర్లింపగల నీటిని వర్షరూపంలో ప్రసాదించే దాత వరుణుడు. అగ్నిని ఆర్పగలదీవాన. కర్మాగ్నిగల నార్పగలది భగవత్పాదం. అంచేతే ఈ రెంటికి పోలిక. నిలువెల్ల మానవుని దహించేది కర్మాగ్ని ఈ అగ్ని సామాన్యమైన అగ్నికాదు. సామాన్య జలానికి దీని నార్పు సామర్థ్యం లేదు. భగవత్పాద జలమొక్కటే దీని నార్ప సమర్థమైనది.

రీతిఁగర్మజ్ఞులు (ర్మాగ్నులు?) రాఁజిన నార్పఁగ
వ్రతము నీ పాదమే వానయై నిలిచే 11-1-107

భగవత్పాదాల నాశ్రయించి ఈ తాపోపశమనం పొందవలసిందిగా సూచన.

## 4.1.1.10. పాదాలు – ఉదయపురవి :

"ఆషాడే తపతే రవిః" అని ఆషాఢ మాసంలోని సూర్యునికి "రవి" అని నామాంతరమున్నట్లు ఆదిత్య హృదయం. ద్వాదశాదిత్యలలో రవి ఒక్కడు. తన కాంతి కిరణ సముదాయ ప్రసారంతో నిశినంతమొందించేవాడు ఉదయ భాస్కరుడు కాగా తన కాంతి పుంజాన్ని తనలో లీనం చేసుకొని చీకట్లకు దోహదమిచ్చేవాడు అస్తమయ భానుడు. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ' అని అనన్య భక్తితో తనకు పాదాక్రాంతులయిన వారి అజ్ఞానాంధకారాన్ని తొలగించేవి భగవంతుని పాదాలు. అంచేతే పాదాలను ఉదయపు రవితో అన్నమయ్య పోల్చాడు.

జిగినజ్ఞానపు చీఁకటి వాయగ

తగు నీ పాదము దయపు రవి 11-1-107

తన వే వెలుగులతో అంధకారాన్ని పార్రదోలే ఉదయపు రవిని బోలినవి భగవంతుని పాదాలు.

## 4.1.1.11. పాదాలు – నొగలు :

ఆత్మానం రధినం విద్ధి శరీరం రథమేవతు

బుద్ధింతు సారధిం విద్ధి మనం: ప్రగ్రహమేవచ కఠోపనిషత్తు 1-33

దేహాన్ని రధంతో పోల్చడం సంప్రదాయం. కాడికి ఆధారమై బండి మొదలైన వాటికి ముందుండే నిడుపాటి కర్ర నొగలు. శరీరమే రధంకాగా పాడవాటి ఆకార సామ్యం చేత పాదాలే నొగలని అన్నమయ్య వర్ణన.

సరి పిఱుదనే రెండు జంట బండికండ్లు

సరవితోఁబాదాలు చాఁపునొగలు 2-152

## 4.1.1.12. పాదాలు – సంతముద్ర కోల :

మన సరకును సంతల్లో అమ్ముకోవాలంటే ఆ సంతకు సంబంధించిన అధికారుల ముద్ర పొందాలి. ఈ ముద్ర పొందిన సరకు నాణ్యమైనదిగా నిర్ణయించి యధేచ్ఛగా అమ్ముకొనే అర్హత యజమానికి కల్పించడమే ఈ ముద్ర ప్రయోజనం. అన్నమయ్య నాయకుని పాదాలను సంత ముద్ర కోలతో పోల్చాడు.

ఇందరు సతులలో నాయెచ్చుకుందులు చూడవు

సందడి గాలుదొక్కేవు సారెసారెకు

చందమైన నీ పాదము సంతముద్రకోలాయ

యిందుకు నేనూ లోనై యిరవుకోవలెనా 13 - 185.

నాయకుడు నాయిక పాదాలతో పాటు సందడిలో పలువురు కాంతల పాదాలను తొక్కడం సంతలో ముద్రలు అందరికీ వేసినట్లుందని భావం. తనతో పాటు వారందరి కాళ్ళు తొక్కడం అందరినీ సమాన సౌందర్యవతులుగా నిర్ణయించి నట్లుగా భావించి కుపితయైన నాయిక తన ఆధిక్యత గ్రహించలేని నాయకుని నిందించడమే ఈ కీర్తన భావం.

కొలపాత్రలకు గాని, లేదా ప్రభుత్వం నిర్ణయించిన వస్తువులకు గాని సర్కారు వారు వేసే ముద్ర నాటికి నేటికి వుంది. ఈ ముద్ర వేయడం వల్ల ఖజానాకు ఆదాయం వస్తువులు కొనేవారికి నమ్మకం రెండూ వుంటాయి కాని కొన్ని సమయాల్లో సర్కారు ముద్ర వేయకుండ తామే నకిలీ ముద్రలు వేసిన వస్తువుల్ని, కొలపాత్రల్ని సంతల్లో అమ్మడం జరుగుతుంది. అవి నకిలీవి నమ్మదగినవి కావు. సరియైన విలువల్ని సూచించేవి కావు. స్వామి పాదాలను సంతముద్రకోలతో పోల్చడం వల్ల అమ్మవారి విలువ తెలుసుకోకుండ ప్రవర్తించే స్వామి చేతల వర్ణన యిది - అని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ గారి అభిప్రాయం

## 4.1.1.13. పాదాలు – శల్యములు :

చిన్నన్న పరమయోగి విలాసంలో దేవదేవి పాదాలను విట హృదయ శల్యాలుగా అభివర్ణించడం విశేషం.

కడతొడల్ పొందుల కట్టు కంబంబు

అడుగులు విట హృదయ శల్యములు 4 ఆ -271

దేవదేవి పాదాలే విటుల హృదయాల్లో నెలకొని ములుకుల్లా బాధిస్తున్నాయంటే మరి ఆమె ఇతరాంగాల అనితర సౌందర్యమెంతటిదో కదా! అట్టి ఆమె పొందు లభించని విటుల మానసిక తాపమెట్టిదో ఊహాతీతమే.

## 4.1.2. పిక్కలు :

పాదాలను ఊరువులతో కలుపుతూ బలంగా అందంగా వుండే శరీరాంగమే పిక్క. పాదసంసేవనాన్ని అందుకొనే భాగ్యం వీటిదే. పైన లావుగా ఉండి క్రమేపి

సన్నగిలే ఈ అవయవాన్ని వరిపొట్టలు, బంగారు సన్నాయిలు, అంప పాదులు, స్తంభాలు మొదలైన వాటితో పోల్చడం కవి సమయం. అన్నమయ్య చిన్నన్నలు పిక్కలను రాజనపు పొట్ట, మరుకాళెలు, అంప పాదులతో పోల్చారు. పిక్కల వర్ణన పెద తిరుమలయ్య చినతిరుమలయ్యల రచనలలో మృగ్యం.

### 4.1.2.1. పిక్కలు – రాజనపు పొట్టలు :

వరివంగడాలెన్నో రకాలు, వాటిలో రాజనాలు శ్రేష్టమయినవి. ఆ రాజనాల పొట్టలకు అమ్మవారి పిక్కలకు అన్నమయ్య సామ్యం చెప్పాడు.

ఆదిమ పురుషుని యండనదె
సోదించి చూచిన సుదతై నిలచె
.........................................
సరిననంట్లు రాజనపుఁబొట్టలవె
వెరవున తామర విరులునవె 13-281

ఉపమేయం చెప్పకనే కేవలం ఉపమాన ప్రయోగం చేతనే విషయాన్ని స్ఫురింపజేయడం అన్నమయ్య వర్ణనలలోని ప్రత్యేకత. పై వర్ణనలోని రాజనపు పొట్టలు అమ్మవారి పిక్కలను స్ఫురింపజేస్తున్నాయి. శ్రేష్ఠమైన రాజనపు పొట్టలతో పోల్చడం వల్ల ఆమె సౌందర్యాన్ని తెలియజేయడమే గాక స్త్రీ జాతిలో ఆమె శ్రేష్ఠత్వాన్ని సూచించడమే కవి ఆశయంగా గోచరిస్తుంది. ఇలాగే చిన్నన్న ఉషాకల్యాణంలో

కొదమల సొబగు కొన్న యూరువులు
బటువులై నిగుడి చొప్పడి రాజనంపు
పొటీక శిరుల ....................... దొడలు 2-93 పుట

అని ఉషా సుందరి సౌందర్య వర్ణనా సందర్భంలో రాజనపు పొట్టలతో ఆమె చిరుతొడలను (పిక్కలను) పోల్చినట్లు గ్రహింపవచ్చును.

## 4.1.2.2. పిక్కలు – అంపపొదులు :

అమ్ము లుంచే పొది అంపపొది. పైన వెడల్పుగా క్రమేపి సన్నగా ఉండే దీని ఆకృతికి పిక్కలకు సామ్యం చెప్పడం కవి సమయం.

'ఇంద్రగోప పరిక్షిప్త స్మరతూణా భజింఘికా

– లలితా సహస్ర నామావళి -18 శ్లో

అని రాజరాజేశ్వరి పిక్కల వర్ణన. అన్నమయ్య చిన్నన్నలు కూడా ఈ సంప్రదాయాన్ని పాటించి పిక్కలను అంప పొదులతో పోల్చారు. అన్నమయ్య

అనటులంపపొదలు నబ్జములు ముత్తేలు
వొనరి వరుసఁగూడి వుండగాను
ఘనుడైన శ్రీ వేంకటేశు నురము మీద
పను పడల మేల్మంగ పాదములై నిలిచె 13-337

అని అనటులు, అంపపొదులు, అబ్జములు, ముత్తేలు, వరుసగా పేర్కొనడంతో ఊరువులు, పిక్కలు, పాదాలు, గోళ్ళు సూచింపబడ్డాయి. శత్రు సంహారకమైనవి అమ్ములు తమలో నిక్షిప్తమైన సమ్మోహన శక్తిచే ఎదుటివారి నవలీలగా వశపరచుకోగలవి పిక్కలు. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

సరసరంభోరు కాంచన తూణ జంఘు 56-249 పుట

అని మిత్రవిందాదేవి పిక్కలు ఆకృతినేగాక, రంగు కాంతిని మన కళ్ళకు కట్టేటట్లు బంగారు అంప పొదులతో పోల్చాడు.

## 4.1.2.3. పిక్కలు – మరుకాళెలు :

కాళెలు ఒక వాద్య విశేషం. ఆకృతిని బట్టే కాళెలకు, పిక్కలకు పోలిక. అన్నమయ్య చిన్నన్న లిరువురు పిక్కలను కాళెలతో పోల్చారు. అన్నమయ్య

అన్నియుఁగూడఁగాను అలమేలు మంగమాయ

కన్నుల నిట్టి కొత్తలు కనుగొనవయ్యా

.............................................

చిగురు మరుకాళెలు జిగ గల యరటులు

సొగసైన యట్టి యిసుక దిబ (బ్బ)లు 23-239

అని అమ్మవారి పిక్కలను కేవలం సామాన్యమైన కాళెలతో గాక మరుని కాళెలతో పోల్చాడు. సరిగ్గా చిన్నన్న కూడ ఉషా కల్యాణంలో

జానులాయివి పుష్పచాపుని జయము

కానుపించిన జయకాహుళుల్ గాక 98-99

అని ద్వారకా నగర వాసులైన సుందరీ జనుల సౌందర్య వర్ణనా సందర్భంలో ఆ స్త్రీల పిక్కలను మదనుని బాకాలతో పోల్చడం కనిపిస్తుంది.

## 4.1.3. మోకాలు :

పిక్కలు ఊరువులను కలిపే సంధి మోకాలు. మోకాటి చిప్పలను తాబేళ్ళతో పోల్చడం సంప్రదాయం. అయినా కావ్యాలలో దీని వర్ణన చాలా అరుదు.

'మాణిక్య మకుటాకార జానుద్వయ విరాజితా' -లలిత స.శ్లో 17

అని రాజరాజేశ్వరి మోకాటి చిప్పలను మణిగణఖచితమైన కిరీటాలతో పోల్చగా చిన్నన్న స్వామి మోకాళ్ళను మైనాక పర్వతంతో పోల్చాడు.

## 4.1.3.1. మోకాలు – మైనాకపర్వతం :

మైనాకమొక పర్వతం. ఇది మేనకా హిమవంతుల పుత్రుడు. ఇది ఇంద్రుని వజ్రాఘాతానికి భయపడి దక్షిణ సముద్ర గర్భంలో దాగింది. హనుమంతుడు సముద్రాన్ని దాటునప్పుడు మాత్రం నీటినుండి పైకి ఉబికి వచ్చి తనపై విశ్రమించమని అతనిని కోరినట్లు రామాయణం పేర్కొంది. పర్వతం కఠినమైంది.

కఠినమైన మోకాటి చిప్పతో కూడి ఉబ్బెత్తుగా ఉండే మోకాలిని చిన్నన్న పర్వతంతో పోల్చాడు.

శృంగార జలధి రాజిల్లు మైనాక

శృంగంబులనఁగ మించిన జానుయుగము - పరమయోగివిలాసం-1ఆ-16

ఇది శ్రీమన్నారాయణుని జానువర్ణన. సహజంగా వస్త్రాచ్ఛాదనతో గుప్తంగా ఉంచబడే భాగం మోకాలు. అయినా శృంగార సన్నివేశంలో అనాచ్ఛాదితమై తన సహజ దీధితులతో వ్యక్తమయ్యే మోకాటిని శృంగార జలధిలో తేలియాడే మైనాక పర్వతంతో పోల్చడంచేత సముద్ర గర్భంలో దాగి అవసర సమయంలో బయటపడే మైనాక పర్వత స్వభావాన్ని స్ఫురింపజేస్తుంది.

## 4.1.4. తొడలు :

శరీరంలోని అధోభాగమైన కాళ్ళల్లో ప్రధానమైనవి ఊరువులు. మొదలు లావుగా వుండి క్రమేపి సన్నగిలే అంగమిది. దీనిని అరటి బోదె, ఏనుగు తొండం, కరభం మొ॥ వాటిలో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య వీటిని ఏనుగు తొండాలు, అరటులు, కొమ్మలు, తేరు, పెండ్లిపీట, పట్టెమంచం, కొలువు కూటాలతోను పెద తిరుమలయ్య కంబాలతోను, చిన్నన్న అరటులు, ఏనుగు తొండాలు, కంబాలు, కరభం, శరభం, కాడులతోను పోల్చారు.

## 4.1.4.1. తొడలు – ఏనుగు తొండాలు :

పరువంతో విర్రవీగే స్త్రీని మదపు టేనుగుతో పోల్చే సంప్రదాయముంది. గజోపమానం సంప్రదాయంలోనే కాదు అంగ విన్యాసంలోనూ ఊరువులకు సరివచ్చేది. కాబట్టే ఏనుగు తొండాలకు ఊరువులకు పోలిక. ఇది అన్నమయ్య చిన్నన్నల రచనలలో కనిపిస్తుంది.

అక్కర యేనుఁగ తొండాలరంట్ల తొడలు 13-287

తొడలకు ఏనుగు తొండాలతో ఆకారంలో పోలికగాని కాంతి వర్ణాలలో కాదు. ఈ లక్షణాలు గలవి అరటులు. అమ్మవారి తొడలకు వీనిలో ఏ ఒకటి

సంపూర్ణంగా సరిరాదు. అంచేతే ఈ రెండు ఉపమానాలను అన్నమయ్య జతచేశాడు.

### 4.1.4.2. తొడలు – కరభం :

మణికట్టు మొదలు చిటికెన వ్రేలుదాకా గల చేతి వెలుపలి భాగం కరభం. ఆకృతిని బట్ట కరభానికి ఊరువులకు పోలిక సంప్రదాయ సిద్ధమే.

చిన్నన్న అష్ట మహిషీ కల్యాణంలో

కరి తుండముల తీరు కరభంబుబాగు

సరసరంభల నిగ్గు సవరించు తొడలు 5ఆ-పుట 245

అని కాళింది ఊరువులు ఏనుగు తొండాలు, కరభం, అరటి బోదెల ఆకృతి, సౌందర్యం, నైగనిగ్యాలను పుణికి పుచ్చుకున్నట్లు వర్ణించాడు.

### 4.1.4.3. తొడలు – శరభం :

శరభమంటే గున్న ఏనుగు. ఏనుగు తొండాలతో ఊరువులను పోల్చే సంప్రదాయముండగా చిన్నన్న ఏనుగు తొండాలేం ఖర్మ ఆమె వూరువులు ఏనుగులే అని చమత్కరించాడు. అష్టమహిషీ కల్యాణంలో

అనటులో యుగములో హస్తిహస్తములో

ఘన శరభములో యీ కాంత యూరువులు 4ఆ-204 పుట

అని రుక్మిణీ కాంత ఊరు సౌందర్యాన్ని కళ్ళకు కట్టించాడు. ఏ ఒక్క ఉపమానంతో తృప్తి పడక ఆయా శరీరాంగాల సమగ్ర సౌందర్యాన్ని దర్శింపజేయాలని రెండు, మూడు, నాలుగు ఉపమానాలు కూడా ఒకేచోట గుదిగ్రుచ్చడం తాళ్ళ పాక సాహిత్యంలో ప్రసిద్ధం.

### 4.1.4.4. తొడలు – అరటులు :

లావుగ పచ్చగ నిగనిగలాడుతూండేవి అరటి బోదెలు. నునుపుదనం, కాంతి పరిపుష్టతల కారణంగా తొడలకు అరటులకు పోలిక. ఊరువుల్ని అరటులతో పోల్చడం అన్నమయ్య చిన్నన్నల రచనలలో కనిపిస్తుంది. అన్నమయ్య

ఏఁటికింకా నీ విభునేల దూరేవే
గాటపు మదమునను గరిసించనేఁటికే
అరఁటులుఁ జిగురులు నాసపడి చూచితే
వెరపు తోడతఁ దెరవేయనేఁటికే 13-172

అని అలుమేలుమంగమ్మ ఊరువులను భంగ్యంతరంగా అరటులతో పోల్చాడు. అలమేలు మంగమ్మ స్వామిపై కినుకవహించి అతనిని దూరంగా వుంచింది. తత్ఫలితంగా స్వామి విరహాతిరేకంతో అమ్మవారి శరీరాంగాలను తలపింపజేసే అరటులు, చిగురులను ఆశగా చూస్తే అందలి మర్మాన్నెరిగిన ఆయింతి ఆకార గోపనం చేస్తూ తెరవేసిందని ఈ కీర్తనలోని వర్ణన.

సామాన్యంగా స్త్రీల వూరువుల్ని అరటులతో పోల్చి వర్ణించడం ప్రసిద్ధి. కాని చిన్నన్న స్త్రీల వూరువులనే గాక శ్రీమన్నారాయణుని వూరువులను యౌవనారామంలో ఉండే అరటులతో పోల్చడం విశేషం. పరమయోగి విలాసంలో

యౌవనా రామంపు టనఁటులో యనఁగ
దేవసోయగము వాటిల్లు నూరువులు 1-16

అని శ్రీమన్నారాయణుని సోయగాన్ని దేవతలే పొగిడినట్లుగా వర్ణించాడు.

### 4.1.4.5. తొడలు – కొమ్మలు :

చెట్లలో బలిష్టంగా పొడవుగా వుండి క్రమేపి సన్నగిల్లే కొమ్మలతో ఆకార సామ్యంచేత వూరువులకు పోలిక అన్నమయ్య కీర్తనలో కనిపిస్తుంది.

ఇంతులాల చూడరమ్మ యెన్నఁగొత్తలు
సంతతము నీపె జవ్వన మందు

........................................

కొఱగల తొడలే కొమ్మలాయను 24-219

### 4.1.4.6. తొడలు – కంబం :

నున్నగా, బలిష్టంగా, పొడవుగా వుండే స్తంభాలతో తొడలను పోల్చడం పెద తిరుమలయ్య చిన్నన్న రచనలలో కనిపిస్తుంది. పెద తిరుమలయ్య

గరిమఁదొడలు ముట్టి కంబాలాట లాడేనంటా
పరగనాడఁ బరచీ పడుచావీఁడు 23-173

అని శ్రీ వేంకటేశ్వరుని శృంగార క్రీడల నభివర్ణించాడు. కాంతల తొడలనే స్తంభాలుగా భావించి వాటిని ముట్టుకొని స్తంభాలాటలాడిన సరసుఁడు శ్రీనివాసుఁడు. చిన్నన్న పరమయోగి విలాసంలో

కడ తొడల్ పొంధుల కట్టు కంబంబులు 4-271పు

అని జగన్మోహనాంగియైన దేవదేవి ఊరువులు పొంధుల నాకట్టుకొని వారిని కట్టి పడవేసే కంబాలుగా అభివర్ణించడం మనోజ్ఞం.

### 4.1.4.7. తొడలు – తేరు :

దేహాన్ని తేరుతో పోల్చే సంప్రదాయముంది. దాని శరీరాంగాల్లో ఒక దానిని తేరుతో పోల్చడం అన్నమయ్యలో కనిపిస్తుంది.

తేరునుఁడెక్కములును ధృతి నంగజాముద్రలు
వూరులుఁబిరుదు నీకై వొనరినవి 19-379

పై చరణాల వల్ల తొడలు తేరు; జంఘన భాగం టెక్కెం, ప్రతాపవంతుడైన వీరుడు రథా రోహణం కోరుకుంటాడు. ఇక్కడ స్వామి వీరుడు. అమ్మవారిని అన్ని విధాలా ఏలుకొంటాడనే అర్థంలో ఈ రథోపమానం సార్థకం.

## 4.1.4.8. తొడలు – పెండ్లి పీటలు :

పీటలెన్నో రకాలు. వాటిలో పెండ్లి పీటలకు సౌభాగ్య లక్షణా లుంటాయి. నిత్య కల్యాణం పచ్చ తోరణంలా సాగే శ్రీనివాసునికి పెండ్లి పీటలు ప్రత్యేకంగా నుండవచ్చునేమోగాని ఇక్కడ అమ్మవారి వూరువులు స్వామికి, స్వామి వూరువులు అమ్మవారికి పెళ్ళి పీటలుగా ఉన్నాయి. వివాహపు తంతులో వరుని తొడలపై వధువును వధువు తొడలపై వరుని కాసేపు కూర్చోపెట్టే సంప్రదాయాన్ని అన్నమయ్య ఈ క్రింది చరణాలలో స్పష్టం చేశాడు.

పొద్దు పొద్దు కిట్లనే భోగించరయ్యా

ఇద్దరికిఁ గలిగె నేడిదివో సోబనము

......................................

పెంచెపు మీ తొడలే పెళ్ళిపీటలు మీకు 27-417

## 4.1.4.9. తొడలు – పట్టె మంచం

పవ్వళించడానికి అనుకూలంగా విశాలంగా వుండేది పట్టెమంచం. దీనిపై పరుపు వుంటే మరీ సుఖం. అందంగా విశాలంగా వుండే అమ్మవారి తొడలను పట్టెమంచంతో అన్నమయ్య పోల్చాడు.

భామిని తొడలు నీకు పట్టెమంచములాగున

నాముకొని పవ్వళించేవప్పటి నీవు

గోముతోడ పట్టుచీర కుచ్చెల పరపుగాఁగ 24-139

ఎన్నో భోగ భాగ్యాలున్నా అమ్మవారి తొడలనే పట్టెమంచంగా పట్టుచీర పరపుగా పవ్వళించడం స్వామికి అమ్మవారిపైనుండే మోహాతిశయాన్ని తెలియజేస్తుంది.

## 4.1.4.10. తొడలు – కొలువుకూటం :

రాజు దర్పంతో కొలువుతీరి వుండేదే కొలువు కూటం. నాయకుడు కొలువుదీరింది నాయిక తొడలపైననే అందువల్లే నాయిక తొడలే నాయకుని కొలువు కూటాలని అన్నమయ్య వర్ణన.

హత్తిన కొలువు కూటాలయఁదొడలు 24-58

నాయిక మేనంతా నాయకునికి మేటి రాజ్య పదవిగా భాసిస్తుండగా అందులో నాయకుని కొలువుకూటమే నాయిక తొడలు.

## 4.1.4.11. తొడలు – యుగములు :

యుగము అంటే బండి మొదలగు వాని కాడి మధ్యలో లావుగా నున్నగా ఉండి చివరలు సన్నగా వుండే కాడికి తొడలకు ఆకార సామ్యం. అపూర్వమైన ఈ ఉపమానాన్ని ప్రయోగించినవాడు చిన్నన్న.

అష్టమహిషీ కల్యాణంలో

అనటులో యుగములో హస్తి హస్తములో

ఘన శరభములో యీ కాంత యూరువులు 4-4336-37

అని రుక్మిణీ కాంత ఊరువుల్ని యుగములతో పోల్చడం విశేషం.

## 4.1.5. పిఱుదు :

గుండ్రంగా, విస్తారంగా, దృఢంగా, ఉన్నతంగా వుండే శరీరాంగం నితంబం. అటు వక్షోజాలు, ఇటు నితంబాలు ఔన్నత్యానికి పెట్టింది పేరుగా ప్రసిద్ధికెక్కాయి. నితంబాలను ఇసుకదిబ్బలు, పీఠం, చక్రం, భూమి, కొండలతో పోల్చడం కవి సంప్రదాయం. అన్నమయ్య పిఱుదును దీవి, ఇసుక దిబ్బలు,

గద్దెలాతి కనుమ, కరికుంభం, వేటపాలం, మరుబండ్లు, మదనమందిరం, మరుని టెక్కెం, చక్రం, పెండ్లి చవికె, పెళ్ళిపీట, వలపుల రాసులతోను పెదతిరుమలయ్య చక్రం, చక్రపు బిల్ల, చక్కెర దీబలు, ఇసుక దిబ్బలు, మదనుని తేరుల తోను, చిన్నన్న ఇసుకదిబ్బలు, చక్రాలు, కరికుంభాలతోను పోల్చారు.

### 4.1.5.1. పిఱుదు – కరికుంభం :

మదమతి గమనాన్ని గజగమనంతో పోల్చడం సంప్రదాయం కాగా బటువును బట్టి మదవతుల పిఱుదును కరికుంభంతో పోల్చడం అన్నమయ్య, చిన్నన్నల రచనలలో కనిపిస్తుంది. అన్నమయ్య

పెనుగజయానకు పిరిఁది బటువులే
మొన కుంభస్థలములు దొరసె
చెనసిఅందుపై సింహపు నడుమే
వెనక ముందరికిని విరసము లాయ 13-298

అని నాయిక పిఱుదును కరికుంభాలతో పోల్చాడు. ఏనుగుకు సింహం స్వప్నంలో వస్తే భయంతో తలపగిలి చచ్చిపోతుందట. మరి నాయికకు నడుమనే సింహం కరికుంభాలనే పిఱుదుపై అధిష్టించి వుంటే నడక ఎలా సాగుతుంది? ఆ భారంతో మందగించిన నాయిక నడక మదగజగమనాన్ని పోల్చి వుండడం అత్యంత సహజం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

సైకతముల నవ్వు చక్రంబు బటువు
నాకేభమస్తకోన్నతి గల పిఱుఁదు
కరి తుండముల తీరు కరభంబాగు
సరసరంభల నిగ్గు సవరించు తొడలు 5ఆ-పు.245

అని పిఱుదును కరికుంభంగా ఊరువు ఆ కుంభ స్థలం నుండి వ్రేలాడే కరితుండంగా వర్ణించాడు.

## 4.1.5.2. పిఱుదు – ఇసుక దిబ్బలు :

నీటి ప్రవాహం చెంత విస్తృతంగా ఉన్నంతగా ఇసుక దిబ్బలుంటాయి. ఉన్నతము, విశాలము అయిన కటిస్థలిని కలిగి వుండడం స్త్రీ సౌందర్య లక్షణం. అంచేత వైశాల్య ఔన్నత్యాలలో ఈ రెంటికి పోలిక. ఇది తాళ్ళపాక సాహిత్యంలో ప్రస్ఫుటం. అన్నమయ్య -

ఎరగొని చెమటల యేరు కతమున

పిరిది యిసుక దిబ్బలు వొదలె 13-305

ఇక్కడ నాయికకు రతి శ్రమచే చెమటలు ఏరుగా ప్రవహించాయి. ఏటిచెంత యిసుక దిబ్బలుండడం సహజం. ఈ చెమటల యేటి చెంతనున్న ఇసుక దిబ్బలే నాయిక పిఱుదు

పెద తిరుమలయ్య

పెంచి యిసుక దిబ్బగాఁ బిఱుఁదువోలు చేరే

అంచల నీతని మనోహంస వాలుఁగాని 23-240

ఇక్కడ శ్రీనివాసుని మనస్సే శ్రేష్ఠమైన హంస. ఈ హంస నాకర్షించి అది వాలడానికి అనువుగా వుండే ఇసుక తిన్నె శ్రీసతి పిఱుదు. ఇది శ్రీనివాసుని మనోహంసకు శ్రీసతి కటిసైకత స్థలులకు గల అనురాగబంధం.

చిన్నన్న పరమ యోగి విలాసంలో

నినుపులై నునుపులై నెఱయు దిబ్బలకు

నునుపులై పెనుపులై యనువొందు కటులు 3ఆ-183పు

ఇది కుక్కుట కూటంలోని స్త్రీల నునుపు, పెనుపు అయిన పిఱుదుల వర్ణన. ఇసుక తిన్నెలు ఎత్తుగా, నున్నగా జారిపోతున్నట్లు ఉండడం సహజం. కేవలం ఆకృతిని బట్టేగాక నున్ననైన ఇసుక తిన్నెల బట్టికూడ పిఱుదుకు పోలిక చెప్పడం మనోజ్ఞం.

## 4.1.5.3. పిఱుఁదు – చక్కెర దీబలు :

దీబ దిబ్బకు రూపాంతర కావచ్చు. కేవలం సౌందర్యం ఆకృతిని బట్టి ఇసుక దిబ్బలతో పిఱుదును పోల్చడం వ్యాప్తిలో వుండగా కేవలం శుష్కమైన ఇసుక దిబ్బలతో గాక రుచికరము, మధురము అయిన చక్కెర దిబ్బలతో పిఱుదును పోల్చడం పెద తిరుమలయ్య విశిష్టత.

చతురతఁ బిఱుదులు చక్కెర దీబలంటా
తతిగాని యంటేని దామోదర కృష్ణుఁడు 23-206

ఇది బాలకృష్ణుని చిలిపి చేష్ట. పిల్లలకు చిరుతిండ్లపైన అందునా చక్కెర మొదలైన తీపి పదార్థాలమీద వ్యామోహం మిక్కుటం అంచేతే ఈ కొంటె కృష్ణుడికి గోపికల పిఱుదు చక్కెరదీ బలంత మధురంగా గోచరించాయి.

## 4.1.5.5.4. పిఱుఁదు – దీవి :

నీటి మధ్యలో కొంచెం ఎత్తుగా విశాలంగా వుండే భూభాగం దీవి. నీటితో చుట్టబడి ఉంటాయి గాబట్టి దీవులు అందమైనవి, ఆహ్లాదకరమైనవి. నాయిక పిఱుఁదూ అంటువంటిదే అని అన్నమయ్య భావం.

చెప్పరాని పిఱుఁదిది చేకొన్న దీవి 22-515

ఇక్కడ నాయిక పిరుదు కేవలం ఎక్కడో దూరంగా వుండే దీవికాదు. చేకొన్న దీవి. అంటే నాయకుని చేతికి అందుబాటులో అతి సమీపంగా వుండే అందమైన దీవి. ఇది శృంగార జలధిలోని దీవి.

## 4.1.5.5. పిఱుఁదు – గద్దెటూతి కనుమ :

గద్దెటూతి కనుమ తాళ్ళపాక సమీపంలో 'సుద్దరాతికనుమ' అనే వ్యవహారంలో నేటికి ఉంది. ఈ కనుమలు ఆరు. షట్కోణాంతర్గతాలై షట్చక్రాకృతిలో వుంటాయని ప్రసిద్ధి. ఈ ఆరు కనుమలలోను వైష్ణవాలయాలున్నాయి.

అన్నమయ్య

కలికి నీపిఱుఁదనే గద్దెఱాతి కనుమ

మొలనూళ్ళ లతలనే ముంచుకొన్నది 12-115

అని అమ్మవారి పిఱుదును గద్దెఱాతికనుమతో పోల్చడంతో తన గ్రామం చుట్టూ ఉన్న ప్రదేశాన్ని అమ్మవారి ఆకారంగా భావించడం అన్నమయ్యకు గల జన్మభూమి అనురక్తిని భగవద్భక్తిని స్పష్టం చేస్తుంది.

## 4.1.5.6. పిఱుఁదు– మదన మందిరం :

మందిరాలు అనేక రకాలు. మందిరమంటే దేవుడు నెలకొనే మందిరమని అంతరార్థం. అన్నమయ్య అమ్మవారి పిఱుఁదును మదనుని హేమ మందిరంతో పోల్చాడు.

ముదిత జఘనము మీఁది మొలనూలి గంటలివి

కదలు రవమెట్లుండెఁగంటిరే చెలులు

మదనుడుండెడి హేమ మందిరము దిరి గిరాఁ

గదిసి మ్రోసెడి పారిఘంటలో కాని 12-259

మందిరం చుట్టూ గంటల రవళి వినిపిస్తూంది. అలాగే అమ్మవారి మొలనూలి గంటల రవళి దేవాలయాన్ని జ్ఞప్తికి తెస్తుంది.

## 4.1.5.7. పిఱుఁదు – మరుబండ్లు :

మదనుఁడాసీనుఁడై పయనించే బండి మరుబండి. బండి చక్రాలతో పిఱుదును పోల్చే సంప్రదాయముందికాని తాళ్ళపాక కవుల రచనలలో పిరుదును బండితో పోల్చడం విశేషం. అన్నమయ్య

చెట్టపట్టావట్టేరు చేరి పిరుఁదులు రాయ

బట్ట బయలయ్యె మరుబండ్లు 14-76

అని మరుబండ్లతో పిఱుఁదును పోల్చడంచేత వాటి సౌందర్యాతిశయం ద్యోతక మవుతుంది. అన్నమయ్య ఊరువులను కూడ తేరుతో పోల్చాడు.

పెద తిరుమలయ్య

ప్రేమపు రమణి మేఁటి పిఱుఁదు దానే వ్రాసి

కాముని తేరనుచుఁ గలఁగగబారే 23-511

అని శ్రీ వేంకటపతి విరహాతిశయంతో తన ప్రియురాలి చిత్ర పటంలో పిఱుదును తానే వ్రాసి తానే దానిని చూపి మదనుని తేరుగా భ్రమించి కలత చెందినట్లువర్ణించడం మనోజ్ఞం.

## 4.1.5.8. పిఱుఁదు– చక్రం :

ఇది బండి చక్రమైనా కావచ్చు లేదా శ్రీమన్నారాయణుని చేతి సుదర్శన చక్రమయినా కావచ్చు. ఏదైనా వర్తుల ఆకృతి గలదే. ఈ ఆకృతి చేతనే పిఱుఁదుని చక్రంతో పోల్చే సంప్రదాయముంది. తాళ్ళపాక కవుల రచనలలో పిఱుదును బండి చక్రంతోనేగాక సుదర్శన చక్రంతో కూడా పోల్చే సంప్రదాయం కనిపిస్తుంది. అన్నమయ్య

లలితాంగి జవరాలు లావణ్య వతి యీాకె

కలువ కంటి మంచి కంబుకంఠి

జలజవదన చక్ర జఘున సింహమధ్య

తలిరుఁబోడి చక్కఁదన మిట్టిదయ్యా 24-164

అని వనిత కంఠాన్ని శంఖంతోను పిఱుఁదును చక్రంతోను పోల్చడం ప్రస్ఫుటం. పెద తిరుమలయ్య -

కోమలపు నీ పిరుఁదు చక్రభావమని

నేమమై చక్రము చేత నిడి నాఁడతఁడు 23-1

అని శ్రీ వేంకటపతికి ఇంతిపైగల మోహముచేతనే చక్రాలను తలపించే ఆమె పిరుఁదును చూచి తాను నిరంతరం సుదర్శన చక్రాన్ని చేపట్టాడని చమత్కరించాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

హరిమధ్య గిరికుచ హరిచక్రజఘన -5అ-249పుట

అని మిత్రవింద పిరుఁదును సుదర్శన చక్రంతోను ఉషా కల్యాణంలో

పిరుఁదులా యివి కాము పృథులరథాళి

మురువైన చక్ర సమూహంబుగాక 1భా-6 పుట

అని ద్వారకానగర వాసినులైన సుందరీ మణుల సాటిలేని మేటి సౌందర్యాన్ని తలపింపజేయాలని వారి పిరుదును సాక్షాత్తు మదనుని రథ చక్రంతోను పోల్చడం కనిపిస్తుంది.

## 4.1.5.9. పిఱుఁదు- పెండ్లిపీట :

ఊరువులనేగాక పిఱుఁదును సైతం పెండ్లిపీటతో పోల్చడం అన్నమయ్య కీర్తనలలో కనిపిస్తుంది. పెండ్లిపీట ఎంతో ఆకర్షణీయము, శుభకరము అయినది అయినా కఠినమైంది. కాని యిక్కడ ఈ పీటనధిష్ఠించే నాయకుడు కాఠిన్యాన్ని ఓర్వలేడని కాబోలు అన్నమయ్య నాయిక పిఱుఁదుని మెత్తని దిండుతో కూడిన పెండ్లి పీటగా అభివర్ణించాడు.

పెనగొన్న సింగారపుఁ బిరుఁదు బటువు దిండు

తనరారు మంచి రత్నాలు పెండ్లి పీట 24-536

ఇది కేవలం మెత్తని పీటేకాదు. సామాన్యుల కందుబాటులో వుండే పీట అసలేకాదు. రత్నాల పెండ్లిపీట. అది కేవలం కోటికి పడగెత్తిన ఆ స్వామికే దక్కేది.

### 4.1.5.10. పిఱుఁదు – పెండ్లి చవికె :

పెండ్లి పీటతోనేగాక పిఱుఁదును పెండ్లి చవికెతో గూడ అన్నమయ్య పోల్చాడు. పెండ్లి చవికె అంటే పెళ్ళి మండపం. నిత్య కళ్యాణం పచ్చతోరణమైన స్వామికి ప్రత్యేకమైన పెండ్లి చవికెయిది. అన్నమయ్య

వాటపు పెండ్లి చవికె వనిత నీ పిరుఁదు
మేటి రాజ్య పదవి నీ మేనెల్లా 24-58

అని సాక్షాత్తు అలమేలు మంగమ్మ పిరుఁదే స్వామికి పెండ్లి చవికెగా అమరించాడు.

### 4.1.6 నడుము :

శరీరానికంతటికి నడిమి భాగం నడుము. అంచేతే దీన్ని కేవలం 'మధ్య'గా పేర్కొంటారు. అటు వక్షోజాలను ఇటు నితంబాలను ఎంతో ఉన్నంతగా విస్తారంగా వర్ణించే కవులు ఆ రెంటిని కలిపే నడుమును మాత్రం అసలది వుందా? లేదా? అనిపించేటట్లు వర్ణించడం ప్రసిద్ధం. నడుము ఎంత సన్నగా నాజూకుగా వుంటే అంత అందం. అంచేతే నడుమును పిడికిట పట్టేదిగాను కృశత్వానికి ప్రాధాన్యమిచ్చి అణువుగా, సూది మొనగా శూన్యంగా వర్ణించడం. ఆకాశం, సింహమధ్యాలతో పోల్చడం కవి సంప్రదాయం. అన్నమయ్య నడుమును గగనం, సింహ మధ్యం, బయలు, పోఁక బోదె, కరువులతో పోల్చగా పెద తిరుమలయ్య గగనంతోను, చిన్నన్న సింహమధ్యం, గగనం, అణువులతోను పోల్చాడు.

### 4.1.6.1. నడుము – సింహమధ్యం :

మృగరాజైన సింహానికి సన్నని నడుము వుండడం లోక విదితం. నాయికా రత్నాని కట్టి నడుము సౌందర్యాపాదకం. అన్నమయ్య చిన్నన్నల రచనలలో ఈ పోలిక కనిపిస్తుంది.

అన్నమయ్య -

చెంది యాకె యప్పటిని సింహమధ్యఁగనుక

అంది నిన్ను నరసింహుఁడని పిల్వఁదగును 30-652

పురుషుల బట్టి స్త్రీలకు పేరు ప్రసిద్ధులు రావడం లోక విదితం కాని ఈ దంపతుల విషయంలో సింహమధ్య అయిన నాయికవల్లే నాయకునికి నరసింహుడని పేరు వచ్చిందనడం అన్నమయ్యకు ఆ తల్లి పట్ల గల పక్షపాతమే. చిన్నన్న అష్ట మహిషీ కల్యాణంలో

అలికులాక బిసహస్తలతాంగి

హరిమధ్య గిరికుచ హరిచక్రజఘన 5-6452-53

అని మిత్రవిందా దేవి నడుమును సింహ మధ్యంలో పోల్చాడు

## 4.1.6.2. నడుము – పోఁకబోదె :

సన్నగా పొడవుగా నునుపైన కాండంతో కూడి వుండేది పోకచెట్టు. అన్నమయ్య సన్నని నాయిక నడుమును పోకబోదెతో పోల్చాడు.

కంతు బాణమున నారికడపుఁ గాయలుగాచె

చెంతఁబోఁకబోదె యేల చెలువొందెనే 30-559

పోకచెట్టుకు పోకకాయలు కాయడం సహజం. పోకబోదె సన్ననిది. పోకకాయలు చిన్నవి. కాని ఇక్కడ సన్నని పోకచెట్టుకు పెద్దనారికేళాలు కాచాయి. అదెలా సంభవమని చెలికత్తె వేసిన పొడుపు ప్రశ్న. దానికి సమాధానం నాయిక నడుమే పోకబోదె కుచాలే నారికేళాలని సమాధానం.

## 4.1.6.3. నడుము – పరమాణవు :

పాంచభౌతికమైన ఈ సృష్టికంతటికి మూలపదార్థంగా శాస్త్రజ్ఞులు భావించే సూక్ష్మాతిసూక్ష్మమైన పదార్థం పరమాణవు. నడుమును పరమాణువుతో పోల్చడం దాని సూక్ష్మతను తెలియజేయడమే. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

హరి మధ్యమొ సందియమొ బట్టబయలో

పరమాణువో దీని పసనిగ్గు నడుము 4ఆ. 204పు

అని రుక్మిణీ కాంత నడుమును దేనితో పోల్చాలా అని అనిశ్చిత పరిస్థితిలో పడ్డాడు.

## 4.1.6.4. నడుము – మిన్ను :

'ఆకాశం గగనం శూన్యం' అని ప్రసిద్ధి. ఉందా లేదా అనిపించే నాయిక నడుముకు గగనానికి పోలిక సంప్రదాయ సిద్ధమే. అన్నమయ్య

ఉమ్మడి నడుమఁబైడి వొడ్డాణము గట్టుకొనే

నెమ్మది మెరువు (పు?) మిన్ను నేస్తము సేసినట్టు 24-188.

అని వొడ్డాణంతో కూడిన కాంత నడుమును మెరుపులతో కూడిన మిన్నుగా అభివర్ణిస్తే పెదతిరుమలయ్య

సోయగపు నీనడుము చుక్కలు మోచిన మిన్ను

బాయటఁజూచిన పట్టఁ బసలేదు గాని 23-389

అని చుక్కలతో కూడిన మిన్నుగా అభివర్ణించాడు. చుక్కలు మనకు చాల చిన్నవిగా గోచరించినా నిజానికి భూమికంటే ఎంతో బరువైనవి. అటువంటి బరువును మోసేది శూన్యాకాశం. అలాగే పిడికిటికి కూడ చిక్కని కాంతనడుము అటు ఇటూ ఎంతో బరువును మోసేమిన్నుగా ఉపమించడం సుందరం.

చిన్నన్న పరమయోగి విలాసంలో

గగన భాగంబు సాకారమై యొప్పు

పగిదిఁ గౌఁదీగ చూపట్టునాఁనాఁట 3-148.

అని నిరాకారమైన మిన్నుకు ఆకారం కల్పించాడు. గర్భవతియైన నాథనాయికకు గగనమే సాకారమై నడుముగా నిలిచిందట. ఉందా లేదా అనిపించే నడుము గర్భవతియైనపుడు ప్రస్ఫుటంగా ద్యోతకమవుతుంది. అంచేత గర్భవతియైన ఈ కాంత నడుముకు సాకారగగనంతో పోలిక సమంజసం.

### 4.1.6.5. నడుము – బయలు :

బయలు అంటే శూన్యప్రదేశం. శూన్యమైన నడుముకు బయలుకు పోలిక అన్నమయ్య చిన్నన్నల రచనలలో కనిపిస్తుంది. అన్నమయ్య

సిరుల నీనడుమేమి సింహమా నామనసు
పరువు వెట్టే వయ్యాళి బయలు గాక 13-443

అని నాయకుని ఆకర్షించి అతని మనసును పరుగులు తీయించే బయలే నాయిక నడుమని అభివర్ణించాడు.

చిన్నన్న పరమయోగివిలాసంలో

వలరాజు రాచిల్కు వయ్యాళి బయలు
తెలివియై నసదుఁ గౌదీవ చూపట్టె 5అ - 385పు.

అని గోదాదేవి నడుమును మదనుని వాహనాలు పరుగులు తీసే బయలుతో పోల్చడం చేత ఆ నడుమెంత మనోజ్ఞమో ఊహించవచ్చు.

### 4.1.7. పొట్ట :

సకల జీర్ణవ్యాపారానికి ఆలవాలమైన శరీరభాగం పొట్ట, నోటి ద్వారా ఆహారాన్ని స్వీకరించి శరీరాని కంతటికిని కావలసిన సత్తువ నందించేదీ పొట్ట. ఇంతటి ప్రధానమైన శరీరాంగానికి ఆలంకారికులు పేర్కొన్నసంప్రదాయసిద్ధమైన ఉపమానాలేవి లేవు. దీనికి కారణం బహుశః పొట్ట ప్రత్యేకంగా పైకి కనుపించడం సౌందర్య లక్షణం కాదని కాబోలు. కాని వికృతమైన పొట్టను మాత్రం కుండలతో పోల్చడం కావ్యాలలో కనిపిస్తుంది. చిన్నన్న పొట్టను గున్న ఏనుగుతో పోల్చాడు.

### 4.1.7.1. పొట్ట – గున్న ఏనుగు :

ఇది నల్లనయ్య బొజ్జ. ఆరకార వర్ణాలను బట్టి గున్న ఏనుగుతో దీనికి పోలిక. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

పలుచని చెక్కులపై వెన్నరవలు
కలభోరు కట పద్మకములన నొప్పు
శరభపోతంబు మై శశికళ పొలయు
సరవి బొజ్జను జాఱలు నొఱయ 1ఆ - 37

అని గోపికల ఇండ్లలో దొంగతనంగా వెన్నమెక్కి ఆ తెల్లని వెన్న చారికలతో కూడిన నల్లనయ్య పొట్టను తెల్లని వెన్నెలలో తళతళ మెరిసే గున్న ఏనుగుతో పోల్చడం సహజసుందరం.

## 4.1.8. నాభి :

ఇది మణిపూర చక్రస్థానము. నతనాభి ప్రసిద్ధి గాంచినది. తల్లీ బిడ్డల కనుసంధాన ద్వారమిది. ఇది ఎంతలోతుగా వుంటే అంత అందం. దీని గాంభీర్యాన్ని బట్టి పాతాళం, కూపం, హ్రదం, నదం, రంధ్రం, నీటిసుడి, రసాతలాలతోను రంగును బట్టి రక్తపుష్పం, పద్మాలతోను పోలిక చెప్పడం కవిసంప్రదాయం. అన్నమయ్య నాభిని గుహ, సరసు, హోమగుండం, కాళాజి, గుంతపోకలాట యందలి గుంతలతోను పెద తిరుమలయ్య దీనిని పద్మం, గుంతపోకలతోను చిన్నన్న పద్మం, పాదు, సురపొన్నలతో పోల్చారు.

## 4.1.8.1 నాభి – పాదు :

"నాభ్యాల వాలరోమాళి లతారోమలతాధారతా సమున్నేయ మధ్యమా -
లలితాసహస్ర నామావళి. ||శ్లో||

తీగెలు, చెట్లకు ఆలవాలమైంది పాదు. రోమావళి అనే లతికకు ఆలవాలమైన పాదు నాభి. చిన్నన్న పరమయోగి విలాసంలో

లాలిత రోమాళి లతికజనించు
నాలవాలంబన నసలారెనాభి 5ఆ- పుట 385.

అని అలమేలుమంగ నాభిని పాదుతో పోల్చాడు.

### 4.1.8.2. నాభి – సురపొన్న :

పచ్చని కేసరాలతో తెల్లగా అందంగా సుగంధంతో పరిమళించే పూలు సురపొన్నలు. వృక్షాలలో సురపొన్న కు ప్రత్యేకత వుంది. సురపొన్న కామోద్దీపకమని ప్రసిద్ధి. కృష్ణుని లీలా వినోదాలలో గోపికావస్త్రాపహరణం ప్రధానం. గోపికా వస్త్రాపహరణంలో సురపొన్నకు ప్రాధాన్యం. కామకళాస్థానాలలో నాభికి ప్రత్యేకతవుంది. అంచేత నాభికి సురపొన్నకు పోలిక. చిన్నన్న ఉషాకల్యాణంలో

పరిమళించు తేట పడలోతుగల్గి

సురపొన్న విరిమాడ్కి సొంపారు నాభి 2ఆ - పుట 93.

అని కొత్త పెళ్ళికూతురైన ఉషాసుందరి నతనాభిని తన పరిమళం తోను సౌందర్యంతోను ఆకట్టుకొనే సురపొన్నతో పోల్చి దాని కామోద్దీప్తిని ధ్వనింపజేశాడు.

### 4.1.8.3. నాభి – సరసు :

నీటికి నిలయమై గంభీరమైనది సరస్సు. మగువ మేను మదనుని బండారం కాగా అందులోని నాభే సరోవరం గా అన్నమయ్య పేర్కొన్నాడు.

ప్రేమపు కేళాకూళి గంభీరనాభి

తేమ చెమటల చేత దిగుపారెగాన 29-196

రతిశ్రమవల్ల కలిగిన స్వేదం శరీరంలో లోతైన నాభిని చేరగా ఆనాభే సరోవరంగా రూపొందింది.

### 4.1.8.4. నాభి – హోమగుండం :

యజ్ఞ యాగాదులలో పవిత్రమైన అగ్ని కార్యం చేయడానికి ఉపయోగపడేది హోమగుండం. అన్నమయ్య నాయిక నాభిని హోమగుండంతో పోల్చాడు.

మలయు నీనాభిహోమగుండమునను
నెలకొన్న విరహాగ్ని నిండాఁబోసి
పొలయు నీనిట్టూరుపుల విసరుచును
వొలుకుఁజెమటల నాహుతి వోసెనతడు 12-288.

నాయిక శరీరమే కల్యాణ వేదికగా నాయకుడు జవ్వన యాగం చేశాడు. నాభి అనే హోమగుండంలో విరహాగ్నిని పోసి నిట్టూరుపులతో విసరుతూ చెమటలు అనే నెయ్యి ఆహుతిగా సాగిన యాగమిది. ఈ కీర్తనలో నాయిక విరహవేదననే నాయకుడు చేసే యాగంగా అన్నమయ్య అభివర్ణించాడు. వేదంలో గూడ రతి హోమప్రక్రియగా వర్ణింపబడినట్టు శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు పేర్కొన్నారు.

## 4.1.8.5. నాభి – గుహ :

కొండలలో తొలవబడిన లేదా సహజంగా ఏర్పడ్డ గొప్పబిలమే గుహ. ఆకారసామ్యంవల్ల దీనికి నాభికి పోలిక. అన్నమయ్య.

కొండలును దీగెలును గుహలోని సింహమును
మెండుకొని యీ వనిత మేనాయ 13-279.

నని నాయిక వక్షోజాలే కొండలు, నూగారే తీగ, నాభియే బిలం, ఆ చెంతనున్న నడుమే సింహమని కొండల, తీగల మధ్య బిలం అందులో సింహం అంతా కలిసి స్త్రీ శరీరంగారూపొందించాడు.

## 4.1.8.6. నాభి – కాళాంజి :

తాంబూలాన్ని ఉమ్మివేయడానికి కుపయుక్తమయ్యే పాత్ర తమ్మపడిగ అదే కాళాంజి. ఇది నేటి ఉమ్మితొట్టి వంటిది. దీని ఆకృతిని బట్టి బొడ్డుకు పోలిక.

పట్టముగ గట్టితివింక బతుకరయ్యా
చిట్టకాలు లేవు మీకు శ్రీ వేంకటేశుఁడా

- - - - - - - - - - - - - - -

కొంత నియ్యారును బొడ్డు కుంచెయుఁగాళాఁజి
చెంతల నన్నీ నమరె శ్రీ వేంకటేశుఁడా 27-152.

సామాన్యంగా కవుల నాకర్షించి వారి వర్ణనలలో తావు చేసికొనేది స్త్రీల నాభియే. కాని ఇక్కడ అన్నమయ్య శ్రీ వేంకటేశుని నాభిని అలమేలుమంగ కుపయుక్తమయ్యే కాళాఁజిగా వర్ణించడం అపురూపమైన వర్ణన.

## 4.1.8.7. నాభి – గుంతపోఁక :

గుంతపోఁక ఆటలో పోకలుంచడానికుపయోగ పడే గుంటగా నాభిని అభివర్ణించడం అన్నమయ్య, పెద తిరుమలయ్యల కీర్తనలలో కనిపిస్తుంది.

పొలసి ముట్టి ముట్టాడే పోఁకముడి గుంతపోఁక
కొలఁదైన నాభే యిక్కువైన గుంత.
వెలయ శ్రీ వేంకటేశ వెసఁగూడి సారెసారె
చెలరేఁగి ఆడేవు చెల్లునయ్య యిఁకను 29-273.

ప్రేమపరాకును చెలికాండ్రు పిలిచినా ఎరుగనంతటి ప్రేమపరాకుతో శ్రీ వేంకటేశుఁడు చెలరేగి అలమేలుమంగ నాభినే గుంతగా చేసుకొని గుంతపోఁకలాట ఆడుతున్నాడని అన్నమయ్య అభివర్ణన. పెదతిరుమలయ్య

కొచ్చినా బొడ్డు దమ్మిని గుంతపోఁకలాడేనంటా
పచ్చావి వేడుకొనీని బాలుఁడా వీఁడు 23-173.

ఈ విధంగా కాంతల శరీరంతో ఆటలాడేవాడు వీడు బాలుడా ? అని నాయిక ప్రశ్న. పెదతిరుమలయ్య ఈ వర్ణనపై అన్నమయ్య ప్రభావం విదితం.

### 4.1.9. నూగారు :

శరీరంలో నాభినుండి కుచాలవరకు నల్లగా పొడవుగా వ్యాపించిన రోమరాజే నూగారు. నూగారును కలిగి వుండడం ఉత్తమకాంతా లక్షణం. అయితే సామాన్య స్త్రీలందరికి ఇది ఉండకపోవచ్చు అయినా కావ్యాలలో స్త్రీలందరికీ నూగారును వర్ణించాలని కవిసమయం. దీనిని చీమల బారు, తుమ్మెదల బారు, నాచుతీగె, లత, పొగ, ఇనుపకడ్డీలతో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య నూగారును పాము, రాహువు, నీలాహి, బాణం, పొగ, లత, కుంచె, ఏరులతో పోల్చగా పెద తిరుమలయ్య పాముతోను, చిన్నన్న పాము, లతిక, నల్లకల్వల బంతి, తేఁటిచాలు, నల్లపూసల పేరులతోను పోల్చారు.

### 4.1.9.1. నూగారు – పాము :

ఆకార సామ్యంచే నూగారుకు పాముకు ఎపోలిక ఈ పామునే సందర్భానుకూలంగా శేషాహి గా, రాహువుగా, నీలాహి గా వర్ణించడం తాళ్ళపాకకవుల సంప్రదాయం.

శేషాహి :

అన్నమయ్య :

అలమేల్మంగ అహి రోమాళిగలదిగన
యిల శేషాద్రి శ్రీ వేంకటేశుఁడనఁదగును 30-552

పెదతిరుమలయ్య :

చెలగిపోయి వైకుంఠాన శేషునిపైఁబండితివి
చెంగట నీచెలి యారు శేషుఁడే కాఁడా 23-469

నీలాహి :

అన్నమయ్య :

నేవళపు నీయారు నీలాహిఁమోలిలతేను

యీవలమేను మెఱపునేల పోలెనే 30-204

చిన్నన్న :

నీలాహినలుపో కన్నియ యీరునలుపో

- అ.మ.క. 5 అ - పుట 226.

రాహువు :

అన్నమయ్య :

అగుడు దాపపురవికి నారనే రాహువదె

తెగియందు మీద నది నధిష్టించగలదా 13 - 1.

కాలాహి :

చిన్నన్న :

దిట్టగుబ్బెతయీరు తెఱుఁగెల్లఁజూచి

నిట్టూర్పు విడకెట్లు నిలుచుఁగాలాహి - అ.మ.క. 4అ - పుట 204.

## 4.1.9.2 . నూగారు – తుమ్మెదల బారు :

నల్లని తుమ్మెదలబారుకు రోమావళికి పోలిక సంప్రదాయసిద్ధమే. కాని చిన్నన్న పరమయోగి విలాసంలో

బంధురోడ్యాణ శంపాలతా జఠర

బంధరోమాళి షట్పద పంక్తి యుతుఁడు 2అ - పు.135

అని పురుషుని నూగారును నల్లని తుమ్మెదల బారుతో పోల్చి వర్ణించడం అపురూపం.

### 4.1.9.3. నూగారు – చీమల దొంతర :

నల్లగా సన్నగా పొడవుగా పైకెగఁబ్రాకే నూగారును లత, చీమల బారుతో పోల్చడం ప్రసిద్ధమే గాని అన్నమయ్య నూగారు సన్నని ఆకృతిని బట్టి లతతోను వరుసగా ఇరువైపులకు వ్యాపించిన నల్లని వెంట్రుకలను ఆ లతపై చిగిరించిన చీమలదొంతరతోను పోల్చడం విశేషం.

కాల(లి?)కడఁదెగెఁజెలియగర్వంపుఁబాలిములు

కాలగతి యిఁకనెంత గాఁగలదో మీఁద.

– – – – – – – – – – – – – –

భామకుచముల మీఁద ఁబ్రతి చందురులు వొడమె

చీమదొంతర లతలఁ జిగిరించెను 12–249.

కాలవైపరీత్యం చేత ఏమేమి వింతలు పొడమనున్నాయో ? అని చెలుల కలవరము. ఆకాలవైపరీత్యం చేతనే లతపై ఆకులు చిగిరించవలసివుండగా దానికి మారుగా నల్లచీమల బారులు చిగిరించాయని. నూగారు ఆకృతిని బట్టి లతతోను రంగును బట్టి చీమలదొంతరతోను పోల్చాడు.

### 4.1.9.4. నూగారు – లతిక :

నూగారుకు లతకు పోలిక ప్రసిద్ధం. 'క' ప్రత్యయం అల్పార్థంలో జేర్చబడుతుంది. కాబట్టి లతిక అంటే అప్పుడప్పుడే కొనసాగుతున్న చిన్నలత. నవయౌవన ప్రాంగణంలో అడుగిడబోతున్న గోదాదేవి నూగారును లతికతో పోల్చడం ఔచిత్యవిలసితం. చిన్నన్న పరమయోగివిలాసంలో

లాలిత రోమాళి లతిక జనించు

నాలవాలంబన నసలారె నాభి 5ఆ– పుట 385.

గోదాదేవి నాభి పాదుకాగా ఆ పాదునుండి బయలుదేరిన చిరుతీగె రోమావళి.

### 4.1.9.5. నూగారు – శైవలం :

శైవలం అంటే పాచి. ఏవో కొన్నిజాతుల పాచితప్ప సర్వసాధారణంగా ఇది నిలువనీటిలో ఉంటుంది కాని నదీజలాశయాలన్నిటిలో శైవలం ఉన్నట్లు వర్ణించడం కవిసమయం. శైవలం శ్యామల వర్ణంలో ఉంటుంది. కృష్ణశ్యామల వర్ణాలకైక్యం పాటించడం కవిసమయం కాబట్టి నల్లని రోమావళికి పోలిక సంప్రదాయసిద్ధం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

శైల నిర్ఝరనీర సంగతాఖండ
బాల శైవలలతా పంక్తుల యొప్పు
దొలుక గుబ్బలొకింత దొలఁక దన్మధ్య
జలసిక్తరోమాళి సరణులేర్పడఁగ 2ఆ-పుట 72.

ఇక్కడ జలక్రీడలాడుతున్న గోపికల కుచాలు పర్వతాలు వాటిపై జాలువారే నీళ్ళు సెలయేళ్ళు ఆ మధ్యనుండే రోమరాజి సెలయేటిపై తేలే శైవలం! ఎంత మనోజ్ఞమైన వర్ణన !

### 4.1.9.6. నూగారు – నల్లకల్వల బంతి :

నవయువతుల శరీరంపై స్పష్టాస్పష్టంగా ఉండే నూగారు లతిక, చీమలదొంతర, శైవలాల బోలి వుంటే ప్రస్ఫుటంగా గోచరించే గర్భవతి నూగారును విస్తృతంగా వ్యాపించిన నల్లకలువల దొంతరతో పోల్చడం సముచితం. చిన్నన్న పరమయోగి విలాసంలో కాసారలక్ష్మి గర్భచిహ్నాలను అభివర్ణిస్తూ

వలనొప్పునల్లఁగల్వల బంతియారు 1ఆ-పుట 37.

అని నూగారును నల్లకల్వల పంక్తితో పోల్చాడు. అసలే ఆమె కాసారలక్ష్మి. అందునా గర్భవతి. కాసారం (కొలను)లో కలువలుండడం సహజమే గదా ! గర్భవతియైనపుడు నూగారు మరింత నల్లగా స్పష్టంగా గోచరించడం మరింత సహజం. కాసారంలోని నల్లకలువలు ఆ కాసారలక్ష్మి నూగారుగా భావిస్తున్నాయి.

## 4.1.9.7. నూగారు – కంతునిబాణం :

నూగారుకు బాణానికి ఆకారసామ్యం. అన్నమయ్య

కంతుబాణమున నారికడపు(గాయలుగాచె 30–559.

అని ముదిత ఆరును సకల జనుల సమ్మోహితపరచే మదనబాణంతో పోల్చగా చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

కంతు విల్లదియన(గా విందు మదియు

గాంతనూగారు సంగతి నుండ(బోలు 5ఆ– పుట 271.

కాంత నూగారును మదనుని, వింటితో పోల్చాడు.

## 41.9.8. నూగారు – పొగ :

నల్లగా పైకి సాగిపోయేది పొగ. ఆకృతినిబట్టి నూగారుకు పొగకు పోలిక చెప్పాడు అన్నమయ్య.

కదిసి నీ నెన్నడుము గగనమునందు

పొదిలి ఆరనే పొగనిండ(గా 12–288

నాయకుడు చేసే జవ్వనయాగంలో నాయిక నాభే హోమగుండం. దానినుండి వెలవడే పొగే నూగారు. అది నడుమనే ఆకాశంలో వ్యాపించింది.

## 4.1.9.9. నూగారు – పొగబాణం :

స్త్రీల నూగారును పొగ, బాణాలతో పోల్చడం సంప్రదాయం కాగా అన్నమయ్య నూగారును పొగబాణంగా అభివర్ణించడం నవ్యతనాహ్వానించడమే. పొగ బాణం ఒకరకమైన యుద్ధపరికరమే గాని శక్తిహీనమైంది. నేటి బాష్పవాయువును బోలింది. అన్నమయ్య మన్మథుని సంప్రదాయ సిద్ధమైన ఆయుధాలతో గాక సరికొత్త ఆయుధాలతో సవరించాడు.

మించెనివె సింగారాలు మెలు(తలాల

పంచబాణు సవరణ పరగినయటు

\- - - - - - - - - - - -

ముదిత కుచాంతరమునను యీ రోమరాజి

అదిదో యంత చూపట్టె సంగనలాల

కదిసి పెటలు గుండ్లు కంఠనాళమున మరుఁ

డెదిగించ బొగబాణ మెడ చొచ్చినట్లు 13-405.

స్త్రీ శరీరంలోని అత్యంత ఆకర్షణీయమైన కుచాలు మన్మథునికి శక్తివంతమైన మారణాయుధాలైన పెటలుగుండ్లు (తుపాకిగుండ్లు) గా ఉపకరించగా నేను మాత్రం పనికిరానా ! అది వాటి మధ్య ఇంచుమించు నిరుపయోగమైన పొగబాణంలా నూగారు తావుచేసుకొందిట ! పొగబాణం తన పొగతో శత్రువుల కళ్ళు గప్పగలదేగాని వారిని సంహరింపలేదు. నూగారు యొక్క ఆకర్షణ శక్తీ అంతటిదే.

## 4.1.9.10. నూగారు – కుంచె :

దట్టమైన వెంట్రుకలతో కూడినది కుంచె. దీనికి నూగారుకు పోలిక. అన్నమయ్య కీర్తనలో కనిపిస్తుంది.

కొంత నియ్యారును బొడ్డు కుంచెయుఁగాళాఁజి

చెంతనన్నీ నమరె శ్రీ వేంకటేశుఁడా 27-152.

తన పట్టపురాణి అయిన అలమేల్మంగను రాజలాంఛనాలతో శృంగార సీమకు ఆహ్వానిస్తున్నాడు శ్రీ వేంకటేశుడు. వీవనలతో వీచడం లాంఛనాలలో ఒకటి. ఇక్కడ శ్రీనివాసుడు తన నూగారే కుంచెగా అలమేల్మంగకు ఉపచరిస్తున్నాడు.

## 4.1.9.11. నూగారు – ఏరు :

నల్లని ఏటిచాలుతో నూగారును అన్నమయ్య పోల్చాడు.

యేరు నడుమఁబెట్టుక యెల యించే విదియేమే

యేరువంటి యారు నీకు నిదె వుండగా 30-482

అహోబిలంలో రెండు కొండలపై ఇందిరా ఔభళేశులు ఆ కొండమధ్య భవనాశినీ నది వుంటుంది. భవనాశినీనదిని మధ్యనుంచకొని అహోబలేశుని దరిజేరక అలయించే ఇందిర వర్ణన యిది. ఆ భవనాశినిని పోలినది ఇందిర నూగారే. నీ శరీరంలోనే యేరు ఉండగా వేరొక ఏటితో నీకు పనియేమని చమత్కారము.

## 4.1.9.12. నూగారు – నల్లపూసల పేరు :

చక్కగా గుది(గుచ్చిన నల్లపూసల దండకి రోమావళికి ఆకారసాదృశ్యం. చిన్నన్న పరమ యోగి విలాసంలో

సవరైన నల్లపూసల పేరువోలె

నవిరళంబగుచు రోమాళి చూపట్టె 3అ-పుట

అని గర్భవతియైన నాథనాయిక రోమావళిని చక్కని చిక్కని నల్లపూసల పేరుతో పోల్చడం మిక్కిలి సహజం.

## 4.1.10. వళులు :

పొట్టపై వుండే ముడతలే వళులు. ఇవి మూడు వళిత్రయంగా ప్రసిద్ధి. నాయిక అస్తినాస్తి విచికిత్సా హేతు శాతోదరి అయినా ఆమె పొట్టపై ముడతలుండడం సౌందర్యలక్షణం. అంచేత లోకంలో స్త్రీలందరికీ వళులున్నా లేకపోయినా కావ్యంలో స్త్రీలందరికి వళులున్నట్లు వర్ణించడం కవిసమయం. వరుసగా ఒకదానిపైనొకటి దీర్ఘంగా వుండే వీటిని మెట్లు, నిచ్చెన, అలలు, పాశాలు, తీగెలతో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య వళులను అలలు, పూలదొంతరలతోను చిన్నన్న అలలతోను పోల్చారు.

### 4.1.10.1. వళులు – పూలదొంతరలు :

సుందరంగా సుకుమారంగా వుండి పూజకు పనికి వచ్చేవి పూలు. నాయిక సర్వాంగాలు నాయకునికి పూజాకుసుమాలే కాగా సుందరంగా సుకుమారంగా దొంతరగావుండే వళిత్రయాన్ని దొంతరపూలతో అన్నమయ్య పోల్చాడు.

తనరు నీవళుల దొంతరపూవుల పూజ 12-95

పవిత్రము, సుందరము, సుకుమారము అయిన తన శరీరాన్ని నాయకునికర్పించడమే నాయిక చేసేపూజ. ఆపూజలలో ఒక భాగమే వళులనే దొంతరపూల పూజ.

### 4.1.10.2. వళులు – తరంగాలు :

సముద్రంలో తెల్లని నురగలతో ఒక దానివెంట ఒకటి తీరాన్ని సమీపించేవి తరంగాలు. అన్నమయ్య

అలరువళితరంగాలుఅందపుటారనుపాము 29-193

అని లక్ష్మీదేవి వళులను తరంగాలతో పోల్చాడు. లక్ష్మి సముద్రతనయ కాబట్టి ఆమె వళులు తరంగాలను పోలివున్నాయి. శ్రీ మన్నారాయణుడు పాలకడలిలో ఆదిశేషునిపై శయనిస్తాడు. ఇక్కడ అతని శయనాన కనువైన కడలి తరంగాలు నాయిక వళులు కాగా ఆమె నూగారే ఆదిశేషువని ధ్వని. నాయకునికి అనువైన భాగమిది.

చిన్నన్న పరమయోగి విలాసంలో

తరగల వళులు మందంబులై తనరె 1ఆ-పుట 37.

అని గర్భవతియైన కాసారలక్ష్మి వళులు మందములైన తరంగాలతో పోల్చాడు. గర్భవతియైన స్త్రీకి నెలలు నిండుతుండగా పొట్టపై ముడతలు పోయి నునుపు దేలడం సహజం. క్రమేపి మాయమయ్యే వళులను వేగం తగ్గి మందగతి పొందిన అలలతో పోల్చడం సహజం.

## 4.1.11. కుచములు :

స్త్రీ శరీరంలో ఉన్నతము ఆకర్షణీయము అయిన భాగమే వక్షోజాలు. వయోధర్మాన్ననుసరించి స్త్రీలకు స్తనపాతం కలిగినా వాటిని ఉన్నతంగా ఆకర్షణీయంగా వర్ణించాలేగాని జుగుప్సావహమైన స్తనపాతాన్ని వర్ణించరాదని కవిసమయం. అంచేతే వీటిని కొండలు, కుండలు, కరికుంభాలు, చక్రవాకాలు, పూగుత్తులు, పలురకాలపండ్లు, బొంగరాలు, శివలింగాలు ఇత్యాదులతో పోల్చడం సంప్రదాయం తాళ్లపాక కవులందరు స్తనపాతాన్ని పరిహరించడమేగాక కుచాలను కొండలు, కుండలు, పూగుత్తులు, పలురకాలపండ్లు కరికుంభాలు, చక్రాలు, చక్రవాకాలతోనేగాక అన్నమయ్య సుదర్శన చక్రం, పాంచజన్యం, పెటలుగుండ్లు, మరుధనరాశులు, మరుమిద్దెలు, సామ్రాజ్యదుర్గాలు, వేటపాలం, సంగడాలు, పరుపు, తలగడబిల్లలు, మంచంకోటిగుబ్బలు, పిడిగుండ్లు, రాళ్ళు కిన్నెరకాయలు, కుప్పెలు, కొప్పెరలు, ఉగాది, పోకలు, జాజపుసారెలతోను చిన్నన్న బంతులు, చట్టుతిప్పలతోకూడ పోల్చారు.

### 4.1.11.1. కుచములు – కరికుంభాలు :

మదవతిని మదగజంతో పోల్చడం సంప్రదాయం. ఆమె శరీరంలో వక్షోజాల ఔన్నత్యాన్ని బట్టి కరికుంభాలతో పోల్చడం సముచితం. అన్నమయ్య

తానకపు నీకుచాలు దంతి కుంభాలఁబోలితే

యీ నడుము సింహము నేలపోలెనే 30-204.

అని ప్రశ్నించాడు. సింహానికి కరికుంభాలకు గల వైరం జగత్ప్రసిద్ధం. సహజ సిద్ధమైన తమ శత్రుత్వాన్నికూడ మరచి ఆ జగన్మాత శరీరంలో సింహం కౌనుగా కరి కుంభాలు కుచాలుగా అమరడం ఇక్కడి విశేషం.

చిన్నన్న ఉషాకల్యాణంలో

ముక్కులున్నవి చక్రములో కాక చూడ

రెక్కలులేవు మీరినవి కుచములో

మృదువులగావు కుంభీంద్ర కుంభములో

మదవతి చన్నుల మాడ్కియే మాడ్కి 1భా-పుట 42.

అని అనిరుద్ధుడు ఉషాసుందరి కుచసంపదను సంభ్రమాశ్చర్యాలతో వీక్షించి పరవశుడయ్యాడు. స్తనకాఠిన్యం యౌవనలక్షణం. అంచేత ఇవి కుంభీంద్ర కుంభాలలా విస్తృతమైనవే అయినా వాటివలె మృదువైనవి మాత్రం కావు. ఎంతటి పురుష వరేణ్యునైనా ఎదురొడ్డగల కాఠిన్యం కలవి.

## 4.1.11.2. కుచములు – చక్రవాకాలు :

చక్రవాక మిధునం విడివడని జంట. ప్రేమాతిశయానికి ప్రతీక. గుండ్రని ఆకృతినిబట్టి ఎప్పుడూ జతగూడి వుండేటి స్వభావాన్నిబట్టి కుచద్వయాన్ని వీటితో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య-

జక్కవ చన్నులనీడ సరినీయందునంటెనో

నిక్కి నీ చేతుల సంకుఁజక్కురాలై వున్నవి 13-218.

అని కుచాలను జక్కవలతో పోల్చాడు. నిరంతరం నాయిక కుచస్పర్శననుభవించే నాయకుని చేతులలో వాటి తాలూకు చిహ్నాలు మిగిలిపోయాయి. అవే శంఖచక్రాలు. అంటే నిజానికి శ్రీవేంకటేశుని చేతులోనివి శంఖచక్రాలు కావు శ్రీసతి కుచముల ఛాయయే అని చమత్కారం. తిమ్మక్క సుభద్రాకల్యాణంలో

ఇంతి పయ్యెదలోన - నేకాంతమునను

ఆ చక్రవాకములు - అతి వహారములు పుట 37.

అని పయ్యెదలోనివి చక్రవాకాలుగా ఉత్ప్రేక్షించింది.

పెదతిరుమలయ్య

కొమ్మ నీకుచములివి కొనవాండ్లాయింత

యెమ్మెలేల నీకు నందుకేమి వోదురా

అమ్మేడు జక్కవలంటా నడిగి తీవే వోరి

కమ్మర మానేవు నేమంగడి వారమా 23-15.

నాయకుని కొంటెతనానికి ప్రతీకలీ పలుకులు. నాయిక కుచాలను చక్రవాకపక్షులని తలచి డబ్బుతో వాటిని కొనాలని ప్రయత్నించగా కుపిత అయిన నాయిక మేమేమి (శరీరాన్ని) అమ్ముకొనే అంగడివారమా? అని అతనిని దులపడం ఇక్కడి విషయం. చిన్నన్న ఉషాకల్యాణంలో

కాయజుండను వేఁటకాఁడు నిచ్చలును

పాయని కుచచక్రపక్షులంబట్టి 1భా - పుట 13.

పక్షులను వలపన్ని పట్టుకోవడం వేటకాని నైజం. ఇక్కడ వేటకాడు కాయజుడే. ఉషాసుందరి కుచ చక్రవాకాలను పట్టి పీడిస్తున్నాడు. మామూలు వేటకాని వలలో నుండి తప్పించుకోవచ్చేమోకాని ఈ వేటకాని వలనుండి తప్పించుకోవడం ఆ ఈశ్వరునంతటివాడికైనా అసాధ్యం.

## 4.1.11.3. కుచములు - పూగుత్తులు :

సుకుమారము, సుందరము, సుగంధ భరితము, ఆకర్షణీయమైనవి పూలు. స్త్రీ శరీరంలో అందము ఆకర్షణీయమైనవేవో అందరెరిఁగినదే. అంచేత వీటిని పలురకాల పూలు, పూగుత్తులతో పోల్చడం సంప్రదాయం.

ఈ పూలే మన్మధుని తిరుగులేని అస్త్రాలు.

తామరలు :

అన్నమయ్య :

తామరమొగ్గలవంటి తగిననా చన్నులివి

కాముని యమ్ములనేరు కాంతలిదేమో 13-56.

పెదతిరుమలయ్య :

మించుఁజన్నులీ కెవితామరలఁబోలుచరే

ముంచి విభుచూపు(దేంట్లు మూ(గు(గాని 23-240.

పూగుత్తులు।

అన్నమయ్య।

అంచెలరతివేళల నంగననిన్ను(గూడ(గా

మించిగుబ్బల పూగుత్తులు మెరయ(జొచ్చె

కొంచక శ్రీ వెంకటేశుడే నామని కాలము

చలించక యింపులు చల్లులాడరయ్య 24-8.

చిన్నన్న।

ఈ యింతి చనుగవ యెడ రంగవిభు(డు

పాయకయుండు(జొప్పుడు మీ(దన నుచు(

దెలిపెడి గతి మిండ తే(టి మొత్తంబు

అలరు గుత్తుల యెడ నలరి చూపట్టె

-పరమయోగి విలాసం - 3ఆ - 240.

## 4.1.11.4. కుచములు - పండ్లు :

మధురమైనవి ఫలాలు. ఆ మాధుర్యం ఎన్నోరకాలు. నిమ్మ, గజనిమ్మలలా పండ్లు పులియజేసేవి, వెలగపండ్లలా నోటిని తీపిచేసేవి, నారికేళాలలా దప్పికను తీర్చేవి. ఇవన్నీ గుండ్రని ఆకృతితోను వాటి నైగనిగ్యంతోను కళ్ళు మిరుమిట్లు గొలిపేవి. వీటిని బోలినవి రసికుల రసపిపాసను దీర్చి చవులూరించేవి కుచాలు. ఈ మాధుర్యాన్ని చవి చూపించినవారు తాళ్లపాక కవులు.

నిమ్మపండ్లు।

అన్నమయ్య। సారెనిమ్మపండ్ల వంటి చన్నులవొత్తులజెలి

17-64.

పెదతిరుమలయ్య:

జవళి నిమ్మపండ్లు సరిఁగానుకియ్యవే

అవి నాచన్నులఁబోలునని తలఁపయ్యీగాని 23-237.

గజనిమ్మపండ్లు:

అన్నమయ్య:

----------శ్రీ యలమేలు మంగనీ

లికుచకుచ ప్రభావమున లేతవయస్సున నింత సేతురా -వేం.శ.అప.

చిన్నన్న :

తళుకు గుబ్బలతోడ ఁదడబడి నిరులు

గలిగి ప్రకాశించు గజనిమ్మపండ్లు -అ.మ.క. 5ఆ - పుట 264.

వెలగపండ్లు:

అన్నమయ్య:

ఇంపుల వెలఁగ పండ్లిందవయ్య కానికె

గుంపుఁదేకుటాకు మరఁగుననున్నవి 12-35.

టెంకాయలు :

అన్నమయ్య:

ఇంతి తెంకాయ కానుక యిచ్చె నీవు గైకొంటివి

యింతలేసి యాపెకుచాలివియంటాను 15-177.

### 4.1.11.5. కుచములు – పిందెలు :

కుచాలను పరిపక్వఫలాలతోనే గాక యౌవన ప్రాదుర్భావంలోని నాయిక చనుమొనలను లేతపిందెలు, పోకలతో పోల్చడం అన్నమయ్య విశిష్టత.

పిందెలు -

పిన్నలై చన్నులనేటి పిందెలుపుట్టి 24-249.

పోఁకలు -

ముచ్చటగా నాపోఁకలం తేసికావా 31-88.

## 4.1.11.6. కుచములు - కొండలు :

పర్వతాలన్నీ ఔన్నత్య కాఠిన్యాలు కలిగినవే. అయినా వాటివాటికి గల ప్రత్యేకతలబట్టి పురాణాలలో ఎన్నో పర్వతాలు విశిష్టస్థానాన్నలంకరించాయి. ఆయా పర్వతాలతో తమ నాయికల కుచాలను పోల్చి ఆ వైశిష్ట్యాన్ని వీటికి సంతరింపజేశారు తాళ్లపాక కవులు.

వేంకటపతికి ప్రీతిపాత్రము నిత్యనివాసము అయినది వేంకటాచలశిఖరం. అంతే ప్రీతి పాత్రము అయినవి తన యిల్లాలి కుచాలు. అంచేతే వాటికి శ్రీ వేంకటాచల శిఖరాలతో పోలిక.

కృష్ణుని చేతిలో అలవోకగా అమరింది గోవర్థనగిరి. ఆ గోవర్థన గిరిని బోలినవే గోపికల వక్షోజాలు. కృష్ణుడు గోపికాలోలుడని ధ్వని.

సూర్య చంద్రాదులను సైతం తన చుట్టు తిప్పుకొనేది మేరుపర్వతం. అంతటి సమర్థవంతమైనవి భూకాంత పయోధరాలు. వేంకటగిరీంద్రుని తనచుట్టు తిప్పుకొనేవివి.

బలవైరి హేతికి భయపడి సముద్రగర్భంలో దాగింది మైనాకగిరి. బలిష్ఠుడైన శివునిజూచి సిగ్గిలి సరసీజలంలో దాగిన పార్వతి చనుగవలే మైనాకగిరులు.

పాలకడలిని మథించి అమృతాన్ని జూరగొనడానికి దేవదానవులకు ఉపకరించింది మందరగిరి. వనిత లావణ్య సముద్రాన్ని ద్రచ్చి ఆనందామృతాన్ని అందరికి అందించడానికి మదనునికుపకరించే నాయిక చన్నులే మందరగిరులు.

కొండలతోనే గాక కొండకనుమలతో కూడ కుచాలను పోల్చడం అన్నమయ్య ప్రత్యేకత. కొండలమధ్యవుండే సన్ననిదారి కనుమ. దొంగలకు దోపిడీకాండ్రకుపయుక్తమయ్యే రహస్యమార్గమిది. స్త్రీల మానాన్ని దోచుకొనే నల్లనయ్య నాయకుడు కాగా నాయిక కుచాలే గుబ్బలికొండ కనుమలని అన్నమయ్య అభివర్ణన. నేటికి ఇది లంజెకనుమనే వ్యవహారంలో వుంది.

**వేంకటాచల శిఖరాలు :**

అన్నమయ్య :

చెలియ తన కుచగిరులు శ్రీ వేంకటాచలపు
నిలువు శిఖరములనుచు నిధుల నిలిచె 30-176.

పెదతిరుమలయ్య :

గిరికుచవని నిన్న గెరలిగౌగిటఁగూడె
పరగ శ్రీ వేంకటపతి యాయనతఁడు 23-1.

**గోవర్ధనగిరులు :**

అన్నమయ్య :

చెలుల జవ్వనమెల్లా చేరువబృందావనము
కులుకుఁజన్నులుపెక్కుగోవర్ధనాలు 27-100.

**మేరుపర్వతాలు :**

అన్నమయ్య :

ధరణీ వధూ పయోధర కనకమేదినీ
ధర శిఖరకేళి తత్పర మయూర 4-160.

పెదతిరుమలయ్య :

కనకాంబరుఁడతఁడు కనకకుచగిరియాకె 23-537.

**మైనాక పర్వతాలు :**

చిన్నన్న :

హరుఁడు వీక్షించునోయను నాసవాడమ

సరసీజలంబులచనుగవల్మంప

బలవైరిహేతికి బరచి శైలములు

జలధిలో డాగిన చందంబు దోప

చెలువొందు నొకచోట చెలులు పార్వతియు -ఉషాకల్యాణం-1భాపుట17.

**మందరగిరులు :**

అన్నమయ్య:

మదిరాక్షి చన్నులనే మందరగిరులు మోవ

చెదరని యారనే శేషునిఁ బూచి

ముదమున లావణ్య సముద్రము మరుఁడు దచ్చె 13-409.

**గుబ్బలి కొండకనుమ :**

అన్నమయ్య:

పంతపు నీగుబ్బలే గుబ్బలి కొండ కొంకనుమ 12-115.

## 4.1.11.7. కుచములు – కుండలు :

గుండ్రని ఆకృతిని బట్టి కుచాలకు కుండలతో పోలిక ప్రసిద్ధం. అయితే సందర్భానుకూలంగా ఆ కుండలను పూజాసామగ్రి ఉత్సవసామగ్రి, రససామగ్రి అయిన పూజకుండలు, అయిరేణి కుండలు, పూర్ణకుంభాలు, ఉంకువ బిందెలు, బంగారు కుండలు, పాలకుండలు, చల్లకుండలు, తేనెకుండలు, నేతికడవలు,

చక్కిలాలంబానలతో పోల్చడం తాళ్ళపాక సాహిత్యంలో కనిపిస్తుంది. అయిరేని, అయిరాణి, ఇంద్రాణి శబ్దభవంగా తోస్తున్నదని అయిరేని కుండలలో జరిపేపూజ శచీపూజయేనని అది వివాహకాలంలో సౌమంగల్య సిద్ధికై చేసే శచీపూజ ప్రశస్తమై యున్నదని శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారి అభిప్రాయం.

అయిరేణికుండలు :

బచ్చెల మెఱుగు గుబ్బల అయిరాణి దెచ్చి
కుచ్చుఁబులకల (ఁ) పూజఁ గుండలాయను (?) 12-189.

పూజకుండలు :

అన్నమయ్య -

కోరి నీమోహపుసతి గుబ్బలవలె నున్నవి
పోరచినీ పెండ్లిలోని బూజకుండలు 13-164.

పెద తిరుమలయ్య -

పూపచన్నులివి బూజగుండలు 23-165.

పూర్ణకుంభాలు :

అన్నమయ్య -

పొంగేటి కుచములే పూర్ణకుంభములు 30-218.
నాకుచదుర్గములే కరుణతో గై కొమ్ము

పెద తిరుమలయ్య -

చన్నులు పూర్ణకుంభముల సాటిగ యెవ్వతె నీకు
జూపెనో - శృం.వృ.ప.శ. - 7ప.

ఉంకువబిందెలు :

అన్నమయ్య -

వనజాక్షి పయ్యదలో వ(ట్రువ చన్నులు నీకు
ననుపున నుంకు ధనముబిందెలు 24-536.

బంగారు కుండలు :

అన్నమయ్య -

బడి నీ సింగారానకు పైడికుండలెత్తినట్టు
కడుమించీనివిగో కాంత గుబ్బలు 24-454.

చిన తిరుమలయ్య -

ఎక్కు(వ(బయ్యదలోని వే(టివెయింతి ।అవి।
పక్కనె వలపునించే పై(డి కుండలు 16-42(శృం)

చిన్నన్న -

సన్నలా యివి మీనశరు మేడమీ(ది
పన్నిన హేమ కుంభములుగాక ఉ.క.1భా-6.

పాలకుండలు :

అన్నమయ్య -

గోవులగాచి పాలకుండలు మోచినట్లనే
మోపరాని మా చన్నులు మోచితివి 19-467.

చల్లకుండలు :

అన్నమయ్య -

గొల్లదాననైతే నేమి కొలువుకు వచ్చితేను
చల్లకుండలంటాను నా చన్నులంటేవు 13-156.

పెద తిరుమలయ్య -

వాంటి గోపికల చన్నులుట్లపై కుండలంటా
అంటుచుఁచేతులు చాఁచీనదే కృష్ణుఁడు 23-206.

నేతికడవలు :

అన్నమయ్య -

కడుఁబేర్చినేతికడవల గుబ్బెతల జేరి
అడుగడుగునకు-నాటలాడి 12-12.

తేనెకుండలు :

అన్నమయ్య -

కొత్త జవ్వనులైన కొమ్మల చన్నులు తేనె
దుత్తలంటా పొందించ దొరకొనీని 20-454.

చక్కిలాలబానలు :

అన్నమయ్య -

వీదివీదిఁబాలువిన్నవెసఁగొల్లలాడినాఁడు
ఆదెస జాడెలు నిండి అట్టెవున్నవి
పాదుకొని చక్కిలాల బాన విడువమని
పాదాలకు మొక్కితేను పయ్యెద దెరచీని 24-29.

### 4.1.11.8. కుచములు – చక్రాలు :

గుండ్రని ఆకృతి కలిగినది చక్రం. ఆకారసామ్యం వల్ల స్తనాలను చక్రాలతో పోల్చడం సంప్రదాయ సిద్ధమే. కాని శుష్కమైన బండి చక్రాలతోనే గాక తిరుగులేని ఆయుధమైన శ్రీమన్నారాయణుని చేతి సుదర్శన చక్రంతో కూడ పోల్చడం పరమవైష్ణవ శిఖామణులైన తాళ్లపాక కవులకే చెల్లు.

అన్నమయ్య -

ఒక్క చక్రమే నీకున్నది గాని యింతి

రెక్కల చక్రాలెపో రెండు గుబ్బలు 12-71.

విష్ణుమూర్తికున్నది ఒక్కటే చక్రం. అది సుదర్శన చక్రం. భద్రంగా దానిని చేతితో మోస్తున్నాడు. మరి అతని యింతికి రెండు చక్రాలున్నాయి. అవికూడ ఆమెకెట్టి శ్రమలేకనే చక్కగా చేతిక్రిందనే అమరివున్నాయి. ఇది నాయికాతిశయ సూచన. రెక్కల చక్రాలనడంబట్టి చక్రవాక పక్షులలాంటివనే సూచనకూడ వున్నది.

- - - - - - - పడతుల చన్నులివి

కంతలనొడ్డిన బండి గండ్లనుండి 2-26.

అని శుష్కమైన కొయ్యతో తయారయ్యే బండి చక్రాలవలెనే ఈ కుచాలు నిస్సారాలని జ్ఞానులు, యోగులు, విరక్తుల నుద్దేశించి అన్నమయ్య పలికిన పలుకులివి. నిస్సారమైన పడతుల చన్నులనమ్మి మోసపోరాదని అభిప్రాయం.

### 4.1.11.9. కుచములు - శంఖం :

మొనదేలి వర్తులాకారంలో ఉండేది శంఖం నాయకునికి విజయసూచకంగా మ్రోగించడానికి ఉపయుక్తమయ్యేదిది. కుచాలను ఆకారాన్ని బట్టి చక్రంతోనే గాక శంఖంతో గూడ పోల్చవచ్చునని నిరూపించినవాడు అన్నమయ్య.

పడతి గుబ్బలు నీకుఁబాంచ జన్యములుగా

కడివోని మొనలోలిఁగదియనొత్తి

తడయక మదనయుద్ధము గెలిచితినంటా

వొడలి చెమటలార నూదితివిగా నీవు 12-116.

శ్రీమన్నారాయణుని శంఖమైన పాంచజన్యంతో కుచాలకు పోలిక. ఇది ఒక రతిక్రీడా విశేషం. నాయికా నాయకుల మదన యుద్ధంలో నాయకుడైన

శ్రీనివాసుడు తన విజయ సూచకంగా పాంచజన్యానికి మారుగా ఆమె చన్నుల నొత్తి పూరించాడు.

## 4.1.11.10. కుచములు – పెటలు గుండ్లు :

పెటలు గుండ్లంటే తుపాకి గుండ్లు. మన్మధునికి సంప్రదాయ సిద్ధమైన పూబాణాలను చిగురుకత్తులనేగాక సరికొత్త ఆయుధాలనుగూడ సంతరించాడు అన్నమయ్య. బహుశః ఆనాటి తురుష్కదండయాత్రా ప్రభావం కావచ్చు. ఆనాటి శక్తివంతమైన అత్యంత ఆధునిక ఆయుధాలు పెటలు గుండ్లు. నాయిక కంఠనాళం దాకా ఎదిగిన కుచాలే మన్మధుని పెటలుగుండ్లు.

మించెనివె సింగారాలు మెలుతలాల
పంచబాణు సవరణ పరగినయట్లు
– – – – – – – – – – – – – – –
ముదిత కుచాంతరమును యీ రోమరాజి
అదివో అల్లంతు చూపట్టె నంగనలాల
కదిసి పెటలు గుండ్లు కంఠనాళమున మరుఁ
డెదిగించఁబొగ బాణమెడ చొచ్చినట్లు 13-405.

మదనుని సుకుమారమైన ఆయుధాలదాడి నుండి తప్పించుకోవడమే కష్టంకాగా మరి ఇట్టి మారణాయుధాలనుండి తప్పించుకోవడం ఎవరికి సాధ్యం?

## 4.1.11.11. కుచములు – రాసులు :

ఏదైనా ఒక వస్తుసముదాయాన్ని ప్రోగుచేస్తే అదేరాశి. ధనధాన్యాలను రాసులుగా పోస్తే కళ్ళు చెదరడం వాటిని తనవిగా చేసుకోవాలనుకోవడం సహజం. అలాగే స్త్రీ కుచసంపద పురుషని ఆకర్షించేది. అంచేతే అన్నమయ్య వాటిని గుప్తంగా దాచుకోవలసిన ధనరాసులతో పోల్చగా పెదతిరుమలయ్య

పంటరాసులతోను చిన్నన్న మరింత కళ్ళు చెదరించే కొత్త రూకల రాసులతోను పోల్చడం విశేషం.

కనకపురాసులు :

కలిమి మీరి చన్నులు కనకపురాసులాయ
కొలిచి కోరుగొందువు కొటారుకు రావయ్యా 28-320.

ధనరాశులు :

కొమ్మ పయ్యెదలోని కుచమూల రుచి వెలికిఁ
జిమ్మటది యెట్లుండెఁ జెప్పరే చెలులు
యిమ్మైన మరుధనములెల్ల రాసులు పోసి
కమ్ముకొని చెంగావి గప్పిరోగాని 12-259.

అని దాచి నాదాగక తమ కాంతులు వెదజల్లే మరుని ధన రాసులతో అన్నమయ్య పోల్చగా పెదతిరుమలయ్య

కన్నెలు పదారువేలు గలవాడవు మొదల
చన్నుల పంటరాసుల సరిమోవఁగలవా 23-497.

అని పదహారువేల మందిని పెళ్ళాడగానే సరికాదు. వారి చన్నులు అనే పంటరాసులను మోయగలవా ? అని కృష్ణుని ప్రశ్నించాడు. చిన్నన్న ఉషాకల్యాణంలో

క్రొత్తరూకల బోలు కొదమశిబ్బెంపు
గుత్తంపు గుబ్బల కొమరు దీపింప 2భా-88పుట.

అని నవయౌవనవతి అయిన ఉషాసుందరి గుత్తంపుగుబ్బలను అత్యంత ఆకర్షణీయమైన క్రొత్తరూకల రాసులతో పోల్చాడు. తళతళమెరిసే క్రొత్త రూకలెంత ఆకర్షణీయమో నూత్నయౌవనం లోని ఆ గుబ్బల నైగనిగ్యమట్టిదే.

### 4.1.11.12. కుచములు – మరుమిద్దెలు :

కలవారి కెపుడు ధనధాన్యాలు సమృద్ధిగా వుండడం మేడలు మిద్దెలతో వర్ధిల్లడం లోక సహజం కథానాయిక స్తనాలను ఠీవిగా, దర్పంగా ఉండే మరుని మిద్దెలతో పోల్చాడు.

ఎక్కువ మరుమిద్దెలు యింతి చన్నులు 13-287.

గ్రామంలోగాని, పట్టణంలోగాని మిద్దెలు అందరినీ ఆకర్షిస్తాయి. మిద్దెలున్నవారిని గౌరవంగా, లాలనగా చూడడం లోక సహజం. అలాగే మరుమిద్దెల్లాంటి స్తనసంపద కలిగిన స్త్రీ అందరి కళ్ళపడడం అందరి మన్ననలందడం సహజమే.

### 4.1.11.13. కుచములు – దుర్గాలు :

మిద్దెలవంటి ఎత్తైన కోటలే దుర్గాలు. నాయకుని ఏలుబడిలోని దుర్గాలు సామ్రాజ్య దుర్గాలు. నాయిక చన్నుగవలే అతని సామ్రాజ్యంలోని దుర్గాలుగా అన్నమయ్య అభివర్ణన.

చనుగవలే నీకు సామ్రాజ్యదుర్గములు 18-76.

### 4.1.11.14. కుచములు – వేటపాలం :

మగువ మేనెల్ల మగనికి మేటి రాజ్యపదవి కాగా ఆరాజ్యంలో వేటకనుకూలమైన ప్రదేశం కొండలను బోలిన చన్నులే కాన అన్నమయ్య

కొండల వేటపాలము గొప్పచన్నులు 24-58

అని కొండలపై వేటపాలముతో చన్నులను పోల్చాడు.

### 4.1.11.15. కుచములు – పరుపు :

నాయకుని సుఖశయనానికి అనువైన మెత్తని పరుపు, దిండ్లుగా నాయిక చన్నులను అన్నమయ్య అభివర్ణించాడు.

పరుపు :

మరువింటి పేరింటి మంచి లగ్నమునందు
పరువంపుఁ జనుదోయి పరుపుమీఁద
తిరువేంకటగిరి దేవుని కౌఁగిటఁగూడి
నిరతంపు సిరులందెనే నెలఁత 12-189.

దిండు :

తరుణి గుబ్బలు నీకు తలగడ బల్లలుగా
నొరగు కొన్నాడవు వుబ్బున నీవు
దొరవై పయ్యెద కొంగు దోమతెర బాగుగ
సరుగ మాఁటునే సుక జాణవై వున్నాఁడవు 24-139.

నాయిక చన్నులే నాయకునికి పరుపుగా , తలగడబిల్లలుగా ఉపకరిస్తున్నాయంటే ఆ శృంగారరాయనికి ఆ యింతిపైగల మోహమెంతటిదో ఊహాతీతము.

## 4.1.11.16. కుచములు – మంచం కోటి గుబ్బలు :

మంచం కోళ్ళపై నున్నగా, గుండ్రంగా, అందంగా చెక్కబడిన గుబ్బలు మంచంకోటిగుబ్బలు. నాయిక అందుబాటులో లేనప్పుడు

పట్టెమంచము కోటి గుబ్బలు నీచన్నులంటా
పట్టి పట్టి చూచి మోపప్పళించుకొను (ను?) -13-278.

అని నాయిక రాకకై ఎదురుచూస్తూ విరహాన్ననుభవించే నాయకుడు చేతికందుబాటులోవున్న మంచంకోటి గుబ్బలనే నాయిక చన్నులుగా భావించి మర్దిస్తున్నాడట.

### 4.1.11.17. కుచములు – సంగడాలు :

జెట్టి సాధన కుపయోగపడే ఇనుప గుండ్లే సంగడాలు. బలిష్ఠుడు మరింత బలిష్ఠుడు కావడానికి ఉపయోగపడే పరికరాలివి. మదనుని సాముగరిడీలోని సంగడాలే నాయిక చన్నులుగా అన్నమయ్య అభివర్ణన.

కాముని సాముగరిడి కాంతపురము

ఆమని చనుసంగడాలమరెఁ గాన 29-196.

మగువమేను మదనుని నిలయం. అందులోని సాముగరిడీ శాలే కాంతపురము. అక్కడ అమరివున్న చన్నులే సంగడాలు. నాయిక చన్నులు మదనుడు మరింత బలిష్ఠుడై నాయకునిపై వి జృంభించడానికి ఉపయుక్తకారులు.

### 4.1.11.18. కుచములు – పిడిగుండ్లు :

పిడితో కూడిన నున్నని గుండ్రాయే పిడిగుండు. వక్షోజాల కాఠిన్యాన్ని బట్టి ఊళ్ళతోను, పిడిగుండ్లతోను పోల్చడం అన్నమయ్య కీర్తనలలో కాననగును.

ఊళ్ళు :

అట్టుసేసి పిసికేని ఊలవంటి చన్నులు,

దిట్టయై చేతులు వట్టి తీసినాఁబోనియ్యఁడు 28-331.

పిడిగుండ్లు :

ఉవిద చన్నులనొత్తి వూరడించఁజూచితేను

యివె పిడి గుండ్లయితే నేమిసేయను

పవళించి అవి రతి పంతమాడే వేళనింతె

కవగూడితేను జక్కవల రూపులవును 14-293.

అని ఒకే అంగం సందర్భానుకూలంగా ఎలా గోచరిస్తుందో చక్కటి ఉపమానాలతో పోల్చడం అన్నమయ్య ప్రత్యేకత.

### 4.1.11.19. కుచములు – కుప్పెలు :

గొడుగుపై గుండ్రంగా కూచిగా వుండే కుప్పెలకు మొనదేలిన నాయిక చన్నులకు పోలిక. అన్నమయ్య

కుప్పెలవంటి చన్నులఁగుచ్చి నిన్నెట్టేతేను
అప్పుడే కా ఁగిలించనై తిననేవు 27-262.

అని వాడియై కుప్పెలబోలిన చన్నులతో దొరయైన శ్రీ వేంకటేశుని బాధించడం ఇష్టంలేక అలమేలు మంగ తన భక్తి ప్రపత్తులను ప్రకటించినట్లుగా పేర్కొన్నాడు.

### 4.1.11.20. కుచములు – బొమ్మరాలు :

కుచాలను కూచియైన బొంగరాలతో పోల్చడం తాళ్లపాక కవుల రచనలలో కాననగును. అన్నమయ్య –

సారె శ్రీ వేంకటేశుఁడు చన్నుల నిన్నునొత్తి
బోరునఁదా జాలె లేని బొమ్మరాలు వేసెను 13-402.

అని నాయిక చన్నులను తాడులేని బొంగరాలతో పోల్చాడు పెదతిరుమలయ్య.

రచ్చనా చన్నులు బొమ్మరాలు తానాడేనంటా
పెచ్చురేఁగి కొంగు వట్టీ పిన్నవాఁడావీఁడు 23-173.

అని కాంతల చన్నులనే బొంగరాలుగా ఆడే వీడు చిన్నవాడా ? అని కృష్ణలీలను ప్రశ్నించాడు. చిన్నన్న పరమయోగి విలాసంలో

ననవిల్తునును గుందనపు బొమ్మరముల
కొనల నీలపు ములుకులు దాచినట్లు
వలుదలై తళుకెక్కి వట్రువలైన

ములు గుబ్బ పాలిండ్ల మొనల కప్పొదవె 3-148.

అని గర్భవతియైన నాధనాయిక నల్లని మొనదేలిన కుచాలను నల్లని మొనతోడి బొంగరాలతో పోల్చాడు. ఆ బొంగరాలు మదనుని బంగారు బొంగరాలు.

## 4.1.11.21. కుచములు – జూదపు సారెలు :

జూదమాడే పాచికలకు కుచాలకు పోలిక శ్రీ వేంకటేశుఁడు అలమేలు మంగ వురమే నెత్తపలకగా ఆమె గుబ్బలే జూజపు సారెలుగా అక్కడి గోరిరేకలే పకలపైన గీచిన గళ్ళుగా చేజిక్కించుకొని జూదమాడుతున్నట్లు అన్నమయ్య వర్ణన.

చొక్కపు ఇంతి గుబ్బలే జూజపుసారెలు నీకు
నిక్కిన మంచి వురమే నెత్తవలక
అక్కడి గోరిరేకలే అమరవ్రాసిన యిండ్లు
చిక్కించుకాటలాడేవు చెల్లునయ్య యిఁకను 29-273.

ఇట్టి క్రీడలు శృంగారరాయనికే చెల్లుతాయి.

## 4.1.11.22. కుచములు – కొప్పెరలు :

కాగు మొదలగు (వెడల్పైన పెద్దమూతిగల) పాత్ర కొప్పెర. అన్నమయ్య హస్తిణి జాతికి చెందిన గొల్లెత గుబ్బలను కొప్పెరలతో పోల్చాడు.

కప్పులు దేరేటి కస్తూరి చంకల
కొప్పెర గుబ్బల గొల్లెత
చప్పుడు మట్టెల చల్లలమ్మెడిని
అప్పని ముందట హస్తిణి జాతి 12-92.

### 4.1.11.23. కుచములు – కిన్నెరకాయలు :

కిన్నెర ఒక జాతి వీణా విశేషం. వీణె కడుగున ఇరువైపుల గుండ్రని ఆకృతిలో వుండే కాయలే కిన్నెరకాయలు. నాయిక గుబ్బలను కిన్నెరకాయలతో పోల్చడం అన్నమయ్య, చిన్నన్నల రచనలలో కాననగును.

సన్నలేరీతిఁజేసెనో సముకమున నీకాపె
కిన్నెరవంటి గుబ్బలు గిలిగించేవు 22-73

అని శ్రీ వేంకటేశుని క్రొత్త చేష్టలను అలమేలుమంగ వ్యాఖ్యానిస్తున్నది. చిన్నన్న అష్టమహిషీకల్యాణంలో

వనజాక్షునెదుట జీవన జాక్షియొకటె
యనువుగానప్పుడు మోహనముగా నిలిచి
సరవిఁగిన్నెరకాయ చనుదోయి రాయ
మేలిమియగు తంత్రిమీటి చొక్కముగ 2-పుట 109

అని సంగీత సరస్వతి మూర్తీభవించనట్లుగా జగన్మోహనాకృతిని సాక్షాత్కరింపచేశాడు.

### 4.1.12. ఉరము :

విశాలము, దృఢము అయిన శరీరాంగం ఉరము. హృదయానికి నిలయమైన దీనిని తత్వశాస్త్రం అనాహత చక్రస్థానంగా పేర్కొంది. విశాలమైన ఉరాన్ని కలిగివుండడం ఉత్తమ పురుష సాముద్రక లక్షణం. దీనిని రాతిపలక, తలుపు మొదలైన వాటితో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య పురుషుని ఉరాన్ని జపశాల, సింహాసనం, కమలాల పానుపు, పొదరిల్లు, వజ్రం నురిపేకళ్ళెం, హరిగెలతో పోల్చడమేగాక స్త్రీ వురాన్ని సింహాసనం, నెత్తపలకలతో పోల్చాడు. పెదతిరుమలయ్య దీనిని ఉయ్యాలతోను, చిన్నన్న వియత్తలం తోను పోల్చారు.

### 4.1.12.1. ఉరము – జపశాల :

ఒక మంత్రాన్ని పదేపదే ఆవృత్తి చేయడమే జపం. జపించడానికి అనువుగా ఉండే ప్రదేశం జపశాల. అన్నమయ్య.

ముదితకు నీతో మాట మోహనమంత్రము
చదరపు నీవురము జపశాల 13-271.

అని నాయకుని తోడి మాటలే నాయికకు మోహన మంత్రాలు కాగా ఆ మంత్రాలను పదేపదే జపించే నాయికకు నివాస స్థానం నాయకుని ఉరం అంచేత నాయకుని ఉరానికి జపశాలకు పోలిక. నాయకుని పలుకులనే నాయిక జపిస్తోందంటే ఆ పలుకుల పట్ల ఆమెకుగల పారవశ్యం పవిత్రతలు విదితం.

### 4.1.12.2. ఉరము – సింహాసనం :

సింహ లాంఛనంతో కూడిన ఆసనం సింహాసనం. రాజు రాణి దేవతలు మొదలైన ఉత్తములాసీనమయ్యే ఆసనమిది. అన్యోన్యానురాగానికి ప్రతీకలైన అలమేలుమంగా శ్రీనివాసులు ఒకరి మనుసులో మరొకరు కొలువుదీరి వుండడం లోకవిదితం. అంచేతే అన్నమయ్య ఆ యిద్దరి ఉరాలను సింహాసనాలతో పోల్చాడు.

అలమేలు మంగకు సింహ్వ (హా) సనము నీవురము 27-152.

మంగమ్మ సింహమధ్య. సింహమధ్యమ కూర్చోవలసింది సింహాసనం. అందువల్ల స్వామి వురము సింహాసనము కావడంలో వింతలేదు.

కాంతవురమె నీకు కందువ సింహాసనము
పంతపు కూటములే పట్టబద్ధము 31-318.

పురుషసింహం కొలువుదీరే సింహాసనమే అలమేలుమంగ వురం.

### 4.1.12.3. ఉరము – కమలాల పాన్పు :

ప్రేయసికేది యిష్టమో దానిని సమకూర్చడం ప్రియునికి అలవాటు. ఇక్కడ ప్రేయసి లక్ష్మి. ఆమె కమలాలయ. అందువల్ల స్వామి తన వురాన్నే కమలాల పానుపుగా ఆమెకు సమకూర్చాడు.

కమలాల పానుపు కాంతకు నీ వురము
ప్రమదపు నీ మనసు పాలజలధి 15-299.

### 4.1.12.4. ఉరము – పొదరిల్లు :

నాయకుని ఉరం నాయిక శయనించే కమలాల పానుపే గాదు. ఆమె దోబూచులాడే పొదరిల్లు. భుజాంతరం కేశ సంపదతో విలసిల్లడం పురుషత్వసూచన. అట్టి పురుషవరేణ్యుని భుజాంతరానికి తీగెలతో పెనవేసుకున్న పొదరింటితో పోలిక.

అమరు నీ భుజాంతరమట్టె తీగె పొదరిల్లు
రమణీయ (ప) హారాలు రత్నాలమేడలు 15-299.

నాయకుని భుజాంతరంలో విహరించే నాయిక ప్రతిబింబం అతని వక్షస్థలంపై నుండే రత్నాల హారాలలో గోచరించగా ఆ హారాలే అమె నివాసమైన రత్నాలమేడలయ్యాయి.

### 4.1.12.5. ఉరము – హరిగె :

హరిగె అంటే డాలు. ఇది కేవలం ఆయుధాలను ఎరుడొడ్డి ఆత్మరక్షణకు ఉపకరించగల ఆయుధ విశేషమే గాని శత్రుసంహారం చేయగల పరికరం కాదు. మన్మధుడు శ్రీ సతిపిరుదును తిరుగులేని చక్రాయుధాలుగా వివరించగా ఆ చెంతనే ఉన్న శ్రీనివాసుని ఉరము శుష్కమైన హరిగెను బోలివుందని అభివర్ణన.

శ్రీసతి పిరుఁదుచెంత శ్రీ వెంకటేశు నురము
ఆసరి నెట్టుండెనో అంగనలాల

రాసిమధ్యరంగానఁ జక్రాలు మరుఁడొనరింప

ఈ సుదీర హరిగె దానెడ చొచ్చినట్లు 13-405.

నాయిక పిరుదు శక్తివంతమైన చక్రాయుధంగాను ఆ చెంతనే వున్న నాయకుని ఉరం కఠినము, శుష్కము అయిన హరిగెగా అభివర్ణించడం స్త్రీ శరీరాంగాలకు గల ఆకర్షణ వశీకరణ శక్తులు పురుష శరీరాంగాలకు లేవని తెలియజేయడమే.

## 4.1.12.6. ఉరము – వజ్రం :

కాఠిన్యం వజ్రలక్షణం నాయకుని ఉరఃకాఠిన్యానికి దీనికి పోలిక. అన్నమయ్య.

చిక్కని చెమటల జీరులు వారగ

వుక్కుగుబ్బలను వొత్తీఁజెలి

నిక్కి నీవురము నెలకొని వోర్చెను

చక్కని పెనువజ్రముఁగాబోలును 22-429.

అని నాయిక ఉక్కు గుబ్బల తాకిడి నెదుర్కొనగల కఠినమైన నాయకుని ఉరాన్ని వజ్రంతో పోల్చాడు.

## 4.1.12.7. ఉరము – నురిపేకళ్ళం :

ధాన్యాన్ని కాళ్ళ తొక్కి రాల్చే ప్రదేశం నురుపు కళ్ళం. పలువుర కాళ్ళత్రొక్కిడిని భరించడం దీని లక్షణం. అన్నమయ్య.

ఇక్కువ శ్రీ వేంకటేశయెనసి ఇద్దరివల్లా

అక్కర నురిపే కళ్ళ మాయను నీవురము 13-404.

అని శ్రీదేవి, భూదేవులకు నిలయమయిన శ్రీనివాసుని వురాన్ని నురిపే కళ్ళంతో పోల్చాడు. సవతిపోరు లోకవిదితం. సవతులిద్దరినీ ఒకే చోట చేర్చి వారి రాపిడిని భరించేది శ్రీ వేంకటేశుని ఉరం. అంచేతే దీనికి నురిపే కళ్ళానికి పోలిక.

### 4.1.12.8. ఉరము – నెత్తపలక :

పాచికలాడడాని కుపయుక్తమయ్యే పలక నెత్తపలక. శ్రీసతి ఉరం శృంగారరాయడు పాచికలాడడానికుపయోగించే నెత్తపలక. స్త్రీల వక్షోజాలను వర్ణించడం సామాన్యం. కాని స్త్రీ వురాన్ని వర్ణించడం అన్నమయ్య విశిష్టత.

చొక్కపు ఇంతిగుబ్బలే జూజుపుసారెలు నీకు
నిక్కిన మంచి వురమే నెత్తపలక
అక్కడి గోరిరేకలే అమరవ్రాసిన యిండ్లు
చిక్కించు కాటలాడేవు చెల్లునయ్య యిఁకను 29-273.

ఇట ఇంతి ఉరమే నెత్తపలక దానిపైని గీచిన గళ్ళేనఖక్షతాలు. పాచికలే చనుగుబ్బలు. ఆటకాడు శ్రీవేంకటేశుడు.

### 4..1.12.9. ఉరము – ఉయ్యాల :

స్త్రీల విలాస విహారాలకు ఉపయుక్తమయ్యేది ఉయ్యాల. కాళ్ళతో నేలను తొక్కిపట్టి ఆ పట్టు విడిచి వియత్తలంలో విహరించడానికనువైంది. ఊయలకు బరువు కావచ్చుకాని దానినెక్కిన వారందరికీ అమందానందాన్ని కలిగించే క్రీడ ఇది. పెదతిరుమలయ్య శ్రీనివాసుని ఉరాన్ని ఉయ్యాలతో పోల్చాడు.

ఇయ్యెడ నన్నుఁగూడే వీపెనింత సేసితేను
వుయ్యాలగా రొమ్ముదొక్కి వుండకిట్టే మానునా 21-172.

శ్రీనివాసుని ఉరంపై స్థిరనివాసమేర్పరచుకొన్నది శ్రీసతి. ఆమెను తనను ఇద్దరినీ స్వీకరించాలని అత్యాశపడితే మరి ఆమె.. ఉరాన్ని తొక్కిపట్టి ఒక్క

పూపు ఊపకుంటుందా ? అని రెండవనాయిక ప్రశ్న. చిన్నన్న పరమయోగి విలాసంలో

- - - - - శ్రీ వత్సంబుచే నొప్పునురము
సతతంబుఁదన యురస్థలి బాయకుండు
నతివ లీలాడోలయన నొప్పు మిగిలి 1ఆ-పుట 16.

శ్రీసతి డోలోత్సవానికనువైంది శ్రీవత్సాంకితుని ఉరం.

## 4.1.12.10. ఉరము – వియత్తలం :

మెరిసే తారలతో కూడిన వినీలాకాశానికి హారాలతో ఒప్పారే శ్రీకృష్ణుని ఉరానికి పోలిక. చిన్నన్న అష్టమహిషీకల్యాణంలో

తారపంక్తుల వియత్తల మొప్పు కరణి
హారజాలముల బాహామధ్యమమర 2ఆ-పుట 80.

కృష్ణుడు నీలమేఘ శ్యాముడు కావడం వల్ల ఈ ఉపమానం సార్థకం.

## 4.1.13. వీపు :

శరీరంలో ఊర్ధ్వ అధోభాగాలను కలిపే పృష్ఠభాగమే వీపు. దీనిని కాంచనఘట్టంతో పోల్చడం సంప్రదాయం. అయినా కావ్యాలలో దీని వర్ణన అరుదు అన్నమయ్య వీపును వీణాదండంతో పోల్చాడు.

## 4.1.13.1. వీపు – వీణెవాళవు :

నేడు కిన్నెర కాయలు రెంటిని కలిపే వీణా దండం వీణె వాళవు. అన్నమయ్య కాలంనాటి వీణెకు కిన్నెరకాయలు రెండులేవు. ఒక్కటే వున్నది. అయినా సకల స్వరాలను పలికించే తంత్రుల కిది నిలయం. మానవ శరీరంలో శరీరాను భూతులన్నిటినీ మెదడుకు చేర్చే వెన్నుపాముకు ఆలవాలం వీపు. శరీరంలోని పదహారు కళాస్థానాలలో ఇది ఒకటి.

వెలది పిపిది నీకు వీణెవాళవుగా
ములువాఁడి కొనగోళ్ల మోపిమోపి
కలసి కౌఁగిట ను వేంకటగిరి విభుఁడనీ
మెలుపుఁ గళల తంత్రి మీటి తివిగానీవు 12-116.

తంత్రులు మీటి రాగాలు పలికించడానికి అనువైంది వీణ వాళవు. కొనగోళ్లతో కళాతంత్రుల మీటి అనురాగాలు పలికించడానికి అనువైంది నాయికవీపు. వాదకుని ఒడిలో వీణలా నాయకుని ఒడిలో ఒదిగింది నాయిక. ఆ నాయకుని మృదు స్పర్శచే శతకోటి రాగాలు పలికే అనురాగ వీణ యిది. కుచపాళిని కిన్నెరకాయల తోను శరీరాన్ని వీణతోను పోల్చడం అన్నమయ్య కీర్తనలలో కనిపిస్తుంది.

## 4.1.14. బాహు మూలాలు :

శరీరానికిరువైపుల వుండే బాహువులకు మూలస్థానం బాహుమూలం. వీటిని శంఖాలతో పోల్చడం ప్రసిద్ధం. అన్నమయ్య బాహుమూలాలను కస్తూరి ముద్రలు, చెలమలలతోను చిన్నన్న శంఖాలతోను పోల్చారు.

## 4.1.14.1. బాహుమూలాలు –కస్తూరి ముద్రలు :

విలువైన వస్తువులుంచే పెట్టెలు, ఇళ్ళు మొదలైన వాటి భద్రతకోసం వాటి తలుపులు వేసి తమ ముద్రలు వేయడం (సీలుచేయడం) అనాదిగా వస్తున్న ఆచారం. నల్లనైన కస్తూరితో వేసే ముద్రలు కస్తూరి ముద్రలు. శరీరంలో ఇతర భాగాలకన్న నల్లనైనవి బాహుమూలాలు. అన్నమయ్య ఈ నలుపును కస్తూరి ముద్రలతో పోల్చాడు.

కాంత హస్తిణి జాతిగాఁబోలు కరమూలము
లంతకంతకు నలుపులై యున్నవి
పంతంపు మరుఁడు తన భండారమిండ్లకును

దొంతిగా నిడిన కస్తూరి ముద్రలనఁగా 12-123.

నాయిక శరీరం మదనుని భాండాగారం. ఆ భాండాగారం లో గుప్తంగా దాచుకోవలసిన సంపద నాయిక కుచసంపద అంచేతే మదనుడు ఆ సంపద కిరువైపుల తన రాజముద్రికల నుంచి భద్రపరిచాడు. దాచుకోకుంటే దొంగలు దోచుకుంటారేమో!

## 4.1.14.2. బాహు మూలాలు – చెలమలు :

కొద్ది నీటితో కూడిన గుంటలు చెలమలు. శరీరంలో ఇరుకైన తావుల్లో చమట ఎక్కువగా పట్టడం అందరెరిగిందే. 'వపుర్జలోద్గమ స్వేదోరతి ఘర్మశ్రమాదిభిః' ఎండకాక చేతగాని రతిచేతగాని శ్రమచేతగాని శరీరంనుండి వెలువడే నీటిబిందువులే స్వేదం. చెమటతో కూడిన చంకగుంటలను చలమలతో అన్నమయ్య పోల్చాడు.

పలుచని చెమటల బాహుమూలముల

చెలమలలో నాఁజెలువములే

ధళధళమను ముత్యపుఁ జెఱఁగు సురటి

దులిపేటి నీళ్ల తుంపిళ్ళో 12-179.

ఈ చెమట రతివల్ల కలిగిన చెమట. శరీరానికి చెమట పట్టినప్పుడు చెరగుతో విసురుకోవడం సహజం. ఇక్కడ నాయిక చెరగుతో విసురుకోబోతే చెమట ఆరడం కాదు చెరగంతా తడిసి నీటి తుంపరల చిలకరిస్తోంది.

## 4.1.14.3. బాహు మూలాలు – సంకురాలు :

బొంగరపు కీలుతో కూడినవి బాహుమూలాలు. పైవైపు వెడల్పుగా క్రిందిభాగం సన్నగా వుండే శంఖానికి బాహుమూలాలకు ఆకృతిని బట్టి పోలిక. చిన్నన్న అష్టమహిషీకల్యాణంలో

పసిడి సంకులురాలు బాహు మూలముల 3ఆ-పుట 164.

అని ద్వారకానగరంలోని సుందరీమణుల బాహుమూలాను బంగారు శంఖాలతో పోల్చాడు.

### 4.1.15. చేతులు :

శరీరానికి కిరువైపులా పొడవుగా వుండి సకల కార్యాచరణ కుపయుక్తమయ్యే అంగాలు చేతులు. మృదుత్వం కాంతి దైర్ఘ్యాల వల్ల చేతులకు తామరతూడలు మెరపుతీగెలు, లతలు, త్రాళ్ళు, తరంగాలతో పురుషుల బాహువులకు శేషసర్పం, గజతుండం, వజ్రాయుధం, స్తంభం, తలుపుకు వేసే గడియకోల, కొమ్మలతో పోలిక కవిసమయసిద్ధం. అన్నమయ్య చేతులను కరితుండాలు, కొమ్మలు, తీగెలు, నళినాలు, తోరణగంభాలు, తోరణాలు, పాములు, పగ్గాలు, కంకణదారాలు, కోటలు, టెక్కెలు, బొందెకోలలతో పోల్చగా పెదతిరుమలయ్య తామరలు, మకర తోరణాలు, తరంగాలతోను, చిన్నన్న తామరతూండ్లు, బీగంబు చేతులు, పాశాలు, పూగొమ్మలు, చిగురులు, తరంగాలు, లతలతో పోల్చాడు.

### 4.1.15.1. చేతులు – కరితుండం :

ఆకృతినిబట్టి ఏనుగుతుండాలకు చేతులకు పోలిక సంప్రదాయ సిద్ధం. అయినా గజేంద్రుని పరిరక్షించిన హస్తం కాబట్టి శ్రీ మన్నారాయణుని చేతిని కరితుండంతో పోల్చడం అన్నమయ్య ప్రత్యేకత.

కరిరాజుఁగాచిన చక్రము వట్టిన హస్తము
కరితుండమని చెప్పగా నమరును 2-221.

ఇది కరిరాజుకు అభయమిచ్చిన హస్తం.

### 4.1.15.2. చేతులు – పాము :

'పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాప నార్థాయ సంభవామి యుగేయుగే

భగవద్గీత 4 అ - 8 శ్లోకము

దుష్టశిక్షణ, శిష్టరక్షణ భగవంతుని కర్తవ్యం. సాధువైన కరిరాజును రక్షించిన చేయే దుష్టుడైన కాళింగుని సంహరించింది. కరిరాజును గాచినహస్తం కరితుండాన్ని బోలగా కాళింగుని కాటువేసిన హస్తం ఫణీంద్రుని బోలడంలో వింతలేదు. కాటువేయడం సర్పస్వభావం.

బలు కాళింగునితోఁకపట్టిన కటి హస్తము

పొలుపైన ఫణీంద్రుఁని పొగడఁగదగును 2-221.

ఆకృతిని బట్టి పాముతో చేతిని పోల్చడం సంప్రదాయమే అయినా కేవలం ఆకృతిని బట్టిగాక ఆ చేతి ధర్మాన్ని బట్టి ఉపమానాన్ని ప్రయోగించడం అన్నమయ్య ప్రత్యేకత.

## 4.1.15.3. చేతులు – కొమ్మలు :

బలిష్ఠమైన పురుషహస్తాలను చెట్టు కొమ్మలతోను స్త్రీల హస్తాలను సుకుమారుమైన లతలతోను పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య ః

గందవుమాని కొమ్మల చేతులతఁడు

అందుకొని లతాంగివి అల్లుకోవే 24-251

అని తిరుమలేశుని హస్తాలను కొమ్మలతో పోల్చగా చిన్నన్న

గందంపుకొమ్మల గాలాహి చుట్టు

చందంబునను గరజలజాతయుగళిఁ

బెడమరలఁగఁబట్టి బిగియించి కుదిచి

నిడుద తుమ్మెద కప్పు నెరివేణిఁగట్టి-పరమయోగివిలాసం4ఆ-పుట329.

శ్రీరంగని పైడిగిన్నె దొంగిలించిందన్న నెపంపై పెడమలరగబెట్టి కట్టబడిన దేవదేవి చేతులను కొమ్మలతో పోల్చడం విశేషం.

నల్లని జడతో చుట్టబడిన ఆమె చేతులు కాలాహి పెనవేసిన గంధపుమాని కొమ్మల బోలి వున్నాయి. గంధపుచెట్ల సువాసనకు చల్లదనానికి ఆకృష్టమై విషనాగులు పెనవేసికొని వుంటాయని ప్రసిద్ధి.

### 4.1.15.4. చేతులు – తీగెలు :

బలిష్ఠమైన పురుషహస్తాలు కొమ్మలు కాగా సుందరము సుకుమారము అయిన కోమలాంగుల హస్తాలు లతలు. అన్నమయ్య ఈ తీగెలు పూదీగెలుగా, మోహన వల్లికలుగా అభివర్ణించాడు.

పూదీఁగెలు :

పాలతికి బాహువుల పూవుఁదీగెలు కొనలు

పాలసి ప్రాణేశు వలపుల లతలఁబెనచె 12-112

### 4.1.15.5. చేతులు – తామరలు :

చేతులను తామరలు, తామరతూండ్ల తో పోల్చడం ప్రసిద్ధం. కేవలం ఆకృతిని బట్టేగాక వాటి ప్రయోజనాన్ని బట్టి ఉపమాన్నాన్ని ప్రయోగించడం అన్నమయ్య ప్రత్యేకత.

నలిన హస్తంబుల నడుమనున్న నీయుర

మలిమేలు మంగ కిరవనఁదగును 2-221.

శ్రీనివాసుని వక్షస్థలంలో నెలకొన్నది అలమేల్మంగ. అలమేల్ మంగ అన్నపదానికి "అలర్ మేల్ మంగై" అంటే పూవుమీద నిలచిన యవతి అని అర్థం శ్రీనివాసుని రెండు చేతులు రెండు తామరపూలు. ఆ పూల మధ్యనున్న వక్షస్థలంపై నెలకొన్నది అలమేల్మంగ. పెదతిరుమలయ్య.

కమ్మి కాటుక కన్నుల కాలువలు నావిగాక

తమ్మిచేతఁదుడి చేటి తడి నీదిగాదా 23-129

ప్రియమార నాయిక కష్టసుఖాలలో పాలుపంచుకొని ఆమెను ఊరడించే నాయకుని చేతులివి. నాయిక కన్నీటిని తుడిచి తడి అయినవి. నాయకుని తామరలను బోలిన చేతులు. జలావాసం తామర స్వభావం. అది ఇట సార్థకం. చిన్నన్న అష్టమహిషీకల్యాణంలో

కమలాంత్తరపు సూన కమల ముల్లస్త

కమలంబునందుఁ జొక్కమలర్పఁబూని 2అ-పు.112.

అని శ్రీకృష్ణుని తో శృంగార రసాబ్ధిదేలు స్త్రీల హస్తాలు తామరలు. అవి తామరలే కాదు తామర తూండ్లు కూడ అని

బిసముల హస్తము ల్భేదింపలేక

పసని సొమ్ములు గాచి పాటి పట్టుచును 2అ-పు.112.

హస్తాలను తామరతూండ్లతో పోల్చాడు.

## 4.1.15.6. చేతులు – తరగలు :

పొరచాచినట్లుండే సముద్రుని హస్తాలే జధి తరంగాలు. తరంగాలకు హస్తాలకు పోలిక కవిసమయం. ఈ సంప్రదాయం తాళ్ళపాక కవులు పాటించారు. అన్నమయ్య -

జలధిఁబుట్టినపాంచజన్యహస్తమునీకు

జలధి తరఁగయని చాటవచ్చును 2-221

సముద్ర తరంగాలనుండి వెలువడినది పాంచజన్యం. ఆ పాంచజన్యాన్ని చేబూనిన శ్రీమన్నారాయణుని హస్తమే తరంగం. పెదతిరుమలయ్య -

మదన జనకుఁడిట్టే మజ్జనమాడేటివేళ

కదిసిఁహస్తాలుఁదానుఁగారు కమ్ముచు

చదలఁగడళ్లతోడి సముద్రమె రూపై

యెదుట నిలుచున్నట్టు యిదె వున్నాఁడీతఁడు 23-489.

మజ్జన మాడేటి శ్రీ వేంకటేశుడే సముద్రం. అతని చేతులే సముద్ర తరంగాలు. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

యమునా తరంగం బులనమించి నిగిడి

యమలంబులైనబాహాదండములును 2ఆ-పు.106.

ఇవి నల్లనయ్య బాహువులు. మరి నల్లని యమునా తరంగాలు కాక మరేమవుతాయి ?

## 4.1.15.7. చేతులు – తోరణాలు :

ముఖద్వారానికి వ్రేలాడే మాల తోరణం. ఇది శుభసూచకం. తోరణం కట్టడానికి ఉపయుక్తమయ్యే స్తంభం తోరణకంబం. అన్నమయ్య పెదతరుమలయ్య లిద్దరు చేతులను తోరణాలు తోరణగంబాలతో ఉపమించారు.

తోరణాలు సుకుమారమైన ఆకులు లేదా పూల మాలలు. తోరణ గంభాలు ఆ మాల మనుగడకు ఆధారభూతమైన బలిష్ఠమైన స్థంబాలు. అన్నమయ్య సుకుమారమైన నాయిక చేతులను తోరణాలతోను వాటికాధారభూతమైన బలిష్టమైన పురుష హస్తాలను తోరణగంబాలతోను పోల్చాడు.

తొలకు నీహస్తములే తోరణగంబము 27-152.

పడఁతి గౌఁగిటిలోని బాహులతలు నీకు

తొడిఁబడవానరిఁచే తోరణాలు 24-536.

నాయకుని శుభాన్వాశించే తోరణాలు నాయిక బాహులతలలే. పెదతిరుమలయ్య వైరాగ్యవచన మాలికా గీతాలలో

నీకు మ్రొక్కనెత్తిన చేతులు రెండును మకరతోరణంబులు

అని స్వామికి మ్రొక్కే భక్తుని చేతులే మకరతోరణాలుగా అభివర్ణించాడు. దేవాలయంలో గర్భగుడిద్వారానికి ఇరువైపుల మకరాకృతి అమరిఉన్న తోరణగంబాలు మకరతోరణాలు.

ఉత్సవాలలోని ఉత్సాహ సూచకాలయినవి తోరణాలు. యౌవన రాజ్యాభిషిక్తుడైన నాయకుని శృంగార రాజ్యానికి నాయిక తన చిగురు చేతులతోనే తోరణాలు కట్టి ఆహ్వానించింది.

ఎంతపనికోకాని యిటు నిన్నురమ్మని
సంతసాన తన చేత సన్న సేసేని
యింతలోనే తాను నీ యౌవనరాజ్యమెల్ల
రంతులోఁజిగురు తోరణ కట్టినట్లు 23-159.

రెండు చేతులు రెండు ఆకులుకాగా ఆకరాలను కదిలించి నప్పుడు అవి వాటికి వ్రేలాడే తోరణాలుగా గోచరించడం సహజం. నాయకుని రమ్మని చేతులూపి సైగచేసి పిలిచే నాయిక చేతులే చిగురు తోరణాలు.

### 4.1.15.8. చేతులు - త్రాళ్ళు :

చేతులను పొడవైన ఆకృతిని బట్టి త్రాళ్ళతో పోల్చడం సంప్రదాయం. కాగా చేతులను పగ్గాలు, పాశాలతో పోల్చడం విశేషం. ఇరుజీవితాలను పెనవేసే త్రాళ్ళు పెళ్లితంతులోని కంకణదారాలు. గుఱ్ఱాలు పారిపోకుండ పట్టిబంధించే త్రాళ్ళు పగ్గాలు. ఎదుటి వారిని ఆకర్షించి పట్టి బంధించేవి మదనపాశాలు కాగా ప్రాణాంతకమైనవి యమపాశాలు. అన్నమయ్య -

పగ్గాలు : అన్నమయ్య -

అలమేల్మంగ కాఁగిటి హస్తములే పగ్గాలు 29-375.

స్వామిని యధేచ్ఛగా పోనీక పట్టి బంధించే అమ్మవారి కౌగిటిలోని హస్తాలే పగ్గాలు.

మదన పాశాలు : చిన్నన్న అష్టమహిషీకల్యాణం :

పదరి పళ్ళెదవు చేపట్టినంతటన్

మదన పాశంబులె మా బాహులతలు 2ఆ-పుట 92.

యమపాశాలు : చిన్నన్న పరమయోగి విలాసం :

కరపల్లవ కంఠపాశములు 4ఆ-పుట 271.

కృష్ణుని పెనవేసే గోపికల హస్తాలు మదన పాశాలు కాగా దేవదేవిని వలచి విఫలులైన వారి పాలిటికి ఆమె హస్తాలే యమపాశాలు.

## 4.1.15.9. చేతులు – టెక్కెలు :

రథం పైన నిడుపాటి కర్రతో కూడింది టెక్కెం. టెక్కెనికి చేతులకు ఆకారసామ్యం. ఈ శరీరమే జీవుడుతోలే రథంకాగా ఆరథంలో భాగమైన 'టెక్కెమే' చేతులని అన్నమయ్య అభివర్ణన.

పంచమహా..భూతములు పంచె వన్నెకోకలు

పంచల చేతులు రెండు బలుటెక్కెలు 2-152.

సామాన్యంగా రథానికి ఒక టెక్కెం వుండగా, విశిష్టమైన ఈ రథానికి రెండు చేతులు రెండు టెక్కెలు.

## 4.1.15.10 చేతులు – బొందెకోల :

జెట్టి సాధన పరికరం బొందెకోల. నాయిక శరీరమే నాయకుని సాముగరిడీశాలగా ఉపమించాడు అన్నమయ్య. ఈ గరిడీలో బలిష్ఠుడు మరింత బలిష్ఠుడు కావడానికుపయుక్తమయ్యే పరికరం బొందెకోల. రతిక్రీడకుద్యుక్తుడయ్యే నాయకుని నాయిక ఈ క్రింది విధంగా ప్రశ్నిస్తోంది.

బోరనఁబట్టేవు చేయి బొందెకోలా 29-217.

నీ సాముకు ఉపయోగపడే బొందెకోలగా నాచేతిని భావించి చేపడ్తున్నావా? అని సుకుమారి అయిన నాయిక ప్రశ్న. ఆకృతిని బట్టి బొందెకోలకు చేతికి పోలిక.

## 4.1.15.11. చేతులు – బీగం చేతులు :

బీగం చేతులు అంటే తాళాలగుత్తి. తాళాలే వ్రేళ్ళు. వాటి సమూహం తాళాలగుత్తిని బోలిన చేయి. తాళాల గుత్తి నిర్జీవము శుష్కము అయినది. నిరర్థకమైన చేతికి దీనికి పోలిక చిన్నన్న ఉషాకల్యాణంలో కనిపిస్తుంది.

వేదండ తుండ ముల్వి దళింపలేని

చేతులే బీగంబు చేతులు గావె 1ఆ-పుట 8.

తన తపోశక్తితో కైలాసవాసుని మెప్పించి తన వాకిట నిలుపుకొనిన బాణాసురుడు అతనితో తనకుగల యుద్ధకాంక్షను వెల్లడిస్తూ కరితుండాలను విదళింపలేని తన బాహువులు (బాహుబలలం) నిరర్థకమని బాధపడడం ఇందలి విషయం.

## 4.1.16. కరములు :

బాహువుల చివరి భాగం అరచేతులు. నిత్య జీవితంలో సర్వకార్యాచరణకు ఉపయుక్తమయ్యే శరీరాంగమిది. దానధర్మాది పుణ్యాకార్యాచరణంలో ఎముకలేని చేయి (మృదుహస్తం) చల్లని చేయిగా ప్రశస్తికెక్కిన అంగమిది. దీనిని తామర, చిగురు, పగడాలతో పోల్చడం సంప్రదాయం. వీటికి చిగురు తామరలతో పోలిక తాళ్ళపాక సాహిత్యంలో కనిపిస్తుంది.

## 4.1.16.1. కరములు – చిగురులు :

రక్తిమత్వం, మృదుత్వంగల లేత ఆకు చిగురుటాకు. చిగుళ్ళలో మిక్కిలి సుకుమారమైంది తమలపాకు చిగురు. మిక్కిలి ఎర్రనిది దాడిమ చిగురు. అన్నమయ్య.

తమలపు చిగురోఁ దాడిమ చిగురో

అమరెఁగరమునె అంగనకు 26-291.

అని నాయిక అరచేతులను రెంటితోను పోల్చాడు.

పెదతిరుమలయ్య:

మెడని తులసిదండ మెల తలల కోరికలు

పొడమి చిగురులై పొందినటు వలెనుండె

అడరి వారి తనువులచ్చుగా ధరించితివో

కడు నిన్నుఁజెనకేటి కరపల్లవములో 23-288.

చిగురుటాకుల బోలిన ఇతరకాంతల చేతులే పండరంగ విఠలుని మెడలోని తులసిదండలా? అని నాయిక సందేహం. దక్షిణ నాయకుని నిలువెల్ల సందేహించడం నాయిక నైజం. అన్నమయ్య నాయిక పాదాలను తులసిదండలతో పోల్చగా పెదతిరుమలయ్య నాయిక చేతులను తులసిదండలతో పోల్చడం ప్రస్ఫుటం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

కిసలయంబుల పగ గెల్చుహస్తముల 3-164 పుట.

అని స్త్రీల చేతులను చిగురులతో పోల్చడమే గాక

స్మరగేహ పల్లవాంచత్తోరణముల

కరణి సిగ్గుల పట్ల కరములింపొంద 2-72 పుట.

అని గోపికా వస్త్రాపహరణ సందర్భంలో సిగ్గులపట్ల చిగురు టాకుల బోలిన గోపికల కరాలను ఆకులతోడి తోరణాలుగా అభివర్ణించడం విశేషం. అన్నమయ్య పెదతిరుమలయ్య లు చేతులను తోరణాలతో పోల్చగా చిన్నన్న కరాలను తోరణాలతో పోల్చాడు.

### 4.1.16.2. కరములు – తామర :

కమలం పుష్పరాజం. చేతులను కమలాలలతో పోల్చడం సంప్రదాయం. అయితే ఈ కమలాలతో స్వామిని అర్చించడం తాళ్లపాక కవులనైజం. ప్రకృతిలోని పూలన్నీ స్వామిపూజకే.

కరకమలములను కందువ గోపికలెల్లా
పారసి నినుఁజూపులే పుష్పయాగము 13-60.

అని తామరల బోలిన చేతులతో గోపికలు స్వామిని చూపులే ఆయనకు ప్రీతిని కలగించే పుష్పయాగంగా అభివర్ణించడం విశేషం. ప్రతి ఏడాది తిరుమలలో జరిగే పుష్పయాగ సంప్రదాయాన్నిది జ్ఞప్తికి తెస్తుంది. పెదతిరుమలయ్య.

దొంతరపువ్వుల మరుఁదొల్లి పూజించఁగఁబో
కాంత చెక్కుఁచేత నేఁడు గదియించెను 23-412.

చెక్కిట చేయి చేర్చిన కాంత దొంతర పువ్వులతో మరుని పూజిస్తున్నట్లుంది. ముఖకమలం, కరకమలాలు ఒకచోట చేరడం దొంతర పువ్వులలా గోచరిస్తున్నాయి. చిన్నన్న పరమయోగివిలాసంలో

గందంపుఁగొమ్మలఁగాలాహి చుట్టు
చందంబునను గరజలజాతయుగళి 4-327-28.

అని దేవదేవి కరాలను తామరలతో పోల్చడం విదితం.

### 4.1.16.3. కరములు – బాణాలు :

శత్రుసంహారకమైన వాడియైన ఆయుధాలు బాణాలు. వడివడిగా రెండు చేతులతోను బాణ ప్రయోగం చేయగల సమర్థులే సవ్యసాచులు. సవ్యసాచుల బాణాల పోలినవే ఆకటికి అలమటించి గిజగిజలాడే చిన్నారి పాపల కాలుసేతులు. చిన్నన్న అష్టమహిషీకల్యాణంలో

కపట వర్తన నున్నఁగపట బాలకుఁడు

కపట పుటాఁకటం గావు కావునను

జయకాఁముఁడలుగులు జళిపించి చిమ్ము

క్రియఁగరచరణముల్ గింజియాడుచును 1అ-26పు.

అని బాలకృష్ణుని కరచరణాలను జయకాముని అలుగులతో పోల్చాడు. కపట వర్తనుడైన శకటాసురుని చంపబూని అమాయకంగా నటిస్తూ కపటపుటాకలిలో ఏడుస్తూ కాళ్ళు చేతులు గింజుకొంటున్న బాలకృష్ణుని కరచరణాలు జయకాముడైన వీరుని బాణప్రయోగాన్ని బోలాయి. ఇక్కడ ఈ రెంటికి సామ్యం వేగంగా విసరడమే.

## 4.1.17. గోళ్ళు :

వ్రేళ్ళకు చివరగా సన్నగా కూచిగా వుండే శరీరాంగం గోరు వీటికి మల్లెమొగ్గలు, మొగలిపూలు, చంద్రకళలు, నక్షత్రాలు, ముత్యాలు, దీపాలు, పూలు, పద్మరాగాలు, చిగురుటాకులకు పోలిక కవిసమయప్రసిద్ధం. అన్నమయ్య గోళ్లను గేదగులు, కల్హారదళాలు, సురపొన్నలు, చుక్కలు, వజ్రాలు, వృశ్చికం, కత్తులు, వైఢూర్యాలు, మాణిక్యాలతో పోల్చగా ఇతర తాళ్లపాక కవులరచనలలో గోళ్ళ వర్ణన కనిపించదు.

## 4.1.17.1. గోళ్ళు - పూలు :

పలురకాల పూలతో గోళ్లను పోల్చడం సంప్రదాయసిద్ధమే. ఎరుపుతెలుపు వర్ణాలతో కూడింది కల్హారం, తెల్లనిది సురపొన్న, వాడియైంది గేదగి. వీటన్నిటిని బోలినవి గోళ్ళు. అన్నమయ్య.

కల్హారం :

ధవళమగు కలుహారదళ నఖంబులచేత

యువతి కుచగిరులఁజంద్రోదయంబాయె 4-49.

సురపొన్నలు :

చక్కులు సురపొన్నలు సూది వజ్రాలు గోళ్ళు 13-287.

గేదగులు :

చెనకు నీ గోళ్లే చిఱుగేదగుల పూజ 13-287.

## 4.1.17.2. గోళ్ళు – కత్తులు :

పదునైనది కత్తి. అన్నమయ్య కూచిగా వుండే కత్తులతోనే గాక వాడియైన వృశ్చికంతో గూడ గోళ్లను పోల్చడం విశేషం.

కత్తులు :

చెంతలఁబెనఁగబోతే చేకత్తి గోళ్లేతాకు 17-458.

వృశ్చికం :

తిన్నని వాడి గోళ్ళసతికి వృశ్చికరాశి 12-143.

## 4.1.17.3. గోళ్ళు – నవరత్నాలు :

గోళ్లను ముత్యాలు , పద్మరాగాలతో పోల్చే సంప్రదాయముంది. అన్నమయ్య మాణిక్యాలు, పద్మరాగాలు, వజ్రాలు, వైఢూర్యాలతో పోల్చాడు. గోళ్ల ఎర్రగా, కాంతివంతంగా వుండడం ఆరోగ్యలక్షణం. పద్మరాగాలు, మాణిక్యాలు ఎర్రనివికాగా వజ్రాలు, వైఢూర్యాలు కాంతివంతమైనవి.

వజ్రాలు :

తరుణి పాదపుగోళ్ళు తళుకుల వజ్రములు 24-108.

పద్మరాగాలు :

పర గుఁజేతిగోళ్లె పద్మరాగాలు 24-108

వైఢూర్యాలు :

నడచితే వైడూర్యాలు వెడలీగోళ్ల 29-30.

మాణిక్యాలు :

మొగమూణికాలవంటి ములువాడిగోళ్ళ 20-121.

## 4.1.18. మెడ :

మానవ శరీరంలో ఉత్తమాంగమైన శిరస్సును మొండెముతో కలిపేభాగం కంఠం. ఇది విశుద్ధ చక్రస్థానమని ఆధ్యాత్మవిదుల అభిప్రాయం. దీనిని శంఖం, కపోతం, వీణా దండాలతో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య మెడను శంఖం, కీరపులాయం, సాముకంబాలతోను పెదతిరుమలయ్య శంఖం, మేరువులతోను చిన్నన్న శంఖంతోను పోల్చారు.

## 4.1.18.1. మెడ – శంఖం :

వర్తులాకారంలో ఒకవైపు మొనదేలి వుండేది శంఖం. ఇది ఒక వాద్యవిశేషం. స్వరపేటికకు నిలయమైన కంఠం సకలధ్వనుల కాకరం. ఆకార ప్రయోజన సామ్యంచే కంఠానికి శంఖానికి పోలిక. ఈ శంఖం మదనుని విజయశంఖం కావచ్చు, పాంచజన్యం కావచ్చు. అన్నమయ్య.

వెలది కంఠము నీకు విజయ శంఖమదివో

నిలువెల్ల సాధనాలు నీకునాపె 14-90.

అని నాయిక కంఠాన్ని మదనుని విజయశంఖంగా అభివర్ణించాడు. యుద్ధంలో గెలుపొందిన వ్యక్తి విజయసూచకంగా శంఖధ్వానం చేయడం సంప్రదాయం. ఇక్కడ నాయిక సర్వాంగాలు తన యుద్ధ సాధనాలుగా నాయకునిపై దండెత్తి అతనిని వశపరచుకొన్న మదనుడు నాయిక కంబుకంఠాన్నే తన విజయశంఖంగా పూరించాడు. పెదతిరుమలయ్య-

కలికి నీ గళము శంఖము ఁబోలుననితాఁ

దలచి పాంచజన్య ధరుఁడాయనతఁడు 23-1

అని నాయిక కంఠాన్ని పాంచజన్యంతో ఉపమించాడు. శ్రీమన్నారాయణుడు నిరంతరం పాంచజన్యాన్ని చేత ధరించుట కు కారణం అది

నాయిక కంఠాన్ని తలపింపజేయడమే. ఆ ఇంతిపై నారాయణునికి గల వ్యామోహమెంతటిదో గదా ! చిన్నన్న ఉషాకల్యాణంలో -

గళములా యివి నీలగళతపోవైరి

కళిత సంగర జయకంబువుల్ గాక 1భా-పుట 5.

అని ద్వారకానగర వాసినులైన స్త్రీల కంఠాలను మదనుని విజయశంఖాలతో పోల్చాడు.

## 4.1.18.2. మెడ – కీరపులాయం :

లాయమంటే అశ్వశాల. మదనుని అశ్వాలు కీరాలు. ఆ కీరాలకు నెలవు కీరపులాయం. అన్నమయ్య.

ఇరవై కీరపు (ము?) లాయమీపెగళము

సరసపు మాట లెల్లఁ జరపెఁగాన 29-196.

అని చిలుక పలుకుల్లాంటి పలుకులకు ఆకరమైన మగువ కంఠాన్ని కీరపులాయంతో పోల్చడం విశేషం. మగువ మేనే మదనుని భాండారమట. ఆ భాండారంలో భాగమైన అశ్వశాల నెలత కంఠమే.

## 4.1.18.3. మెడ – సాముకంబం :

సాములో ఉపయోగించే ఒకానొక మల్లపరికరం సాముకంబం. మల్లక్రీడలో పెనగుట కాధారమిది. రతి క్రీడలో పెనగుట కాధారం కంఠం. అంచేత అన్నమయ్య

గుత్తపు సాముకంబము కోమలమైన గళము 24-58.

అని నాయిక కంఠాన్ని సాముకంబంతో పోల్చాడు. శరీరానికి మరింత బలాన్ని తద్వారా ఉత్సాహాన్ని చేకూర్చేవి మల్లపరికరాలు.

### 4.1.19. గడ్డం :

ముఖ దర్పణానికి పిడికిలి బోలినది చుబుకం. దీనిని మామిడి గింజ, నారింజగింజలతో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య చుబుకాన్ని పోకతోను చిన్నన్న రాహువుతోను పోల్చారు.

### 4.1.19.1 గడ్డం – పోక :

క్రముక ఫలం పోక. ఇది గుండ్రనిది చిన్న పరిమాణం కలది. దీనికి గడ్డానికి ఆకారసాదృశ్యం. అన్నమయ్య

అన్నియుఁగూడఁగాను అలమేలుమంగయాయ

- - - - - - - - - - - - - - - - - - - - - -

జవళితామరతూండ్లు చక్కని శంఖము పోఁక

పవడాలు వజ్రాలు పసిడియద్దాలు

నువుఁబూవు కలువలు నూలుకొన్న శ్రీకారాలు

అవిరళమైన విండ్లు అరచంద్రుఁడూ 24-259

ఈ వర్ణనలో తామరతూండ్లే చేతులు, శంఖం మెడ, పోఁక గడ్డం, పగడాలు పెదాలు, వజ్రాలు దంతాలు, అద్దాలు చెక్కులు, నువు పూవుముక్కు, శ్రీకారాలు చెవులు విండ్లు కనుబొమలు, అరచంద్రుడే నుదరు. అన్నీ కలిసి అలమేలుమంగ రూపుదాల్చింది. ఈ వర్ణనా క్రమంలో చుబుకస్థానాన్ని ఆక్రమించింది పోఁక.

### 4.1.19.2. గడ్డం – రాహువు :

రాహువు సూర్యచంద్రుల కబళించే నల్లని సర్పంగా పురాణప్రసిద్ధం. రాహువు నవగ్రహాలలో ఒక గ్రహం. నల్లని వెంట్రుకలతో కూడిన పురుషుని గడ్డాన్ని రాహువుతో చిన్నన్న పోల్చాడు. చిన్నన్న పరమయోగివిలాసం –

- - - - - చందురుని రాహువు డాసినట్లు

కప్పారు నిడు వాలుగడ్డంబు వాని 4ఆ - పు.280.

విప్రనారాయణుని ముఖం చంద్రుడు. ఆ ముఖ చంద్రుని కబళించే రాహువే అతని నల్లనిగడ్డం. స్త్రీల ముఖ చంద్రుని కబళించే రాహువే వారి కొప్పు అని అన్నమయ్య వర్ణన ప్రభావం చిన్నన్నపై స్పష్టం.

## 4.1.20. నోరు :

పెదవులు, దంతాలు, నాలుకలతో కూడిన ముఖద్వారం నోరు. సకల వాగ్వ్యాపారానికి, భోజనాది కార్యకలాపాలకు ఉపయోగపడే శరీరాంగమిది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుందని సామెత. నోటిలోని విడిభాగాలకు లాక్షణికోపమానాలు లేవు. అయినా నోటిని ఆకృతిని బట్టి గుహతో పోల్చడం ఉంది. తాళ్లపాక కవులలో గూడ అన్నమయ్య కీర్తనలలోనే నోటి వర్ణన కనిపిస్తుంది. అన్నమయ్య నోటిని బందెయెద్దు మోర, కలగూరగంప, లక్కబుఱ్ఱ, మాణిక్యాల గనులతో పోల్చాడు.

### 4.1.20.1. నోరు – బందెయెద్దు మోర :

పొగరుగా ఎక్కడబడితే అక్కడ మేసి బందెలదొడ్డికి చేరిన ఎద్దు బందెఎద్దు. విచక్షణా రహితంగా పలుకాంతల చుంబించి ఆ స్వాదించే నాయకుని నోరే బందెయెద్దుమోర.

జంగిలి కాంతల నెల్లా సంగతులెంచకనీవు •
యెంగిలి సేసేవు మోవి యేకముగాను
పంగించ నీనోరు బందెయెద్దు మోరాయ 13-185.

ఇది నాయికదూషణ. తానింటనుండగా పరకాంతలను అందునా అనాగరికులైన గోపకాంతలను ఎంగిలిచేసే నాయకుని నోటిని బందెయెద్దు మోర (నోరు) తో పోల్చి నాయిక నిందించింది. పురుషుని వృషభంతో పోల్చడం సంప్రదాయం. అందునా వారు గోపకాంతులు కాబట్టి నాయకుడు వృషభుఁడని వ్యంగ్యం.

## 4.1.20.2. నోరు – కలగూరగంప :

పలురకాల ఆకులతో కూడిన గంప కలగూరగంప. పలుకాంతలు మడిచియిచ్చే ఆకులతో కూడిన నాయకుని నోరే కలగూరగంప.

ఆకడాకె నీకు నాకు మడిచియ్యగాను
యీకడ నేనూ నీకు నిచ్చితినిట్టే
కైకొని యిద్దరూ నూడిగము నీకు (జేయ(గాను
కాకువడి కలగూరగంపాయ నీనోరు 13-404.

ఇంతులిద్దరి మధ్య వేగే నాయకుని దురవస్థయిది. ఎవరిని కాదన్నా వారికి కోపమే. కాదనలేక ఇద్దరినీ అంగీకరిస్తే ఇద్దరికీ కోపమే. ఎవరినీ నొప్పింపక తానొవ్వక మెలిగే సరసుడే దక్షిణ నాయకుడు. అందుకె ఈ అవస్థలు తప్పవు మరి.

## 4.1.20.3. నోరు – లక్కబుఱ్ఱు :

లక్క ఎఱ్ఱనిది. లక్కపూసిన చిప్ప లక్కబుఱ్ఱు. ఆకార వర్ణ సాదృశ్యంచే దీనికి నోటికి పోలిక.

లక్కబుఱ్ఱు వంటి నోరులలి(బగడపుమోవి 24-141.

## 4.1.20.4. నోరు – మాణిక్యాల గని :

మాణిక్యం ఎఱ్ఱనిది. నవరత్నాలలో ఒకటి. దంతాలకు మాణిక్యాలతో పోలిక. ఆ దంతాలకు నిలయమైన నోరే మాణిక్యాలకు జన్మస్థానము, నిలయము అయిన మాణిక్యాల గని.

నోరు మాణిక్యాల గని నాక్కతే (దేనెపెదవి
పేరుకొన(బోతేను పెలుచు మాగుణము 14-299.

నోరు ఎంతో విలువైన అందమైన మాణిక్యాల గని. చవులూరించే తేనెల చిప్పిలేది పెదవి. అయినా నాయిక గుణమే చాల పెలుసు.

## 4.1.21. మీసం :

పురుషత్వానికి ప్రతీకగా పెదాల పై భాగంలో వుండే రోమరాజే మీసం. పెంచేవారి సామర్థ్యాన్ని ఓపికను బట్టి పలు ఆకృతులలో ఒప్పారేది ఇది. దీనికి లాక్షణికసిద్ధ ఉపమానాలేవి లేవు. కాని జానపద సాహిత్యంలో దీని వర్ణన అధికం. పెసరకాయలు, మిరపకాయలు, తుమ్మెదరెక్కలతో పోలిక ప్రసిద్ధం. చిన్నన్న కావ్యాలలో దీని వర్ణన కనిపిస్తుంది. మీసాన్ని కాలకూటజ్వాల, తుమ్మెద రెక్కలతో పోల్చాడు.

### 4.1.21.1. మీసం – తేటిరెక్కలు :

తుమ్మెద నిగనిగలాడే నల్లని కీటకం. గుబురైన మీసానికి దీనికి వర్ణసాదృశ్యం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

సమకొని కెంగేలఁజక్కనొత్తుచును

జిఱుఁతేఁటి ఱెక్కలే జిగిదువాడించు

మెఱుఁగారు నూనూఁగు మీసలవాని 4ఆ-205పు.

ఇది రుక్మిణీ కల్యాణానికేతెంచే నల్లనయ్య మీసం. అందమైన పూవుమీద వాలడానికి సంసిద్ధంగా వున్న తేటి యిది.

### 4.1.21.2. మీసం – కాలకూట జ్వాల :

సముద్రమధునంలో జనించిన భయంకర విషజ్వాల కాలకూటం. దీనిని కరతలామలకం చేసుకోగల సమర్థుడు ఆ సదాశివుడొక్కడే. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

కాలవర్ణములతో గాలకూటంబు

జ్వాలలఁ బోలు మీసలు దిద్దికొనుచు 3ఆ-పు.139.

అని కయ్యానికి కాలుదువ్వే చాణూరుని మీస వర్ణన . తలచుకొంటేనే ఒళ్ళు గగుర్పొడిచే మల్లుల మీసమిది. ఎదుటివారిని నిలువెల్ల దహించడానికి పైపైకి వచ్చే కాలకూటజ్వాలను బోలినది. ఆ కృష్ణపరమాత్మునికొక్కడికే లొంగేదిది.

## 4.1.22. పెదాలు :

సుందరము సుకుమారమైన శరీరాంగమిది. ముఖద్వారానికి తలుపులవంటిదిది. సకల వాగ్వ్యాపారానికి ఉపయోగపడేది. రతికేళియందు మధురంగా భాసించేది. దీనిని చిగురుటాకు, దొండపండు, మంకెనపువ్వు, జపాకుసుమాలతోను, మధుర పదార్థాలతోను పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య పెదాలను పలురకాల పండ్లతోను, చిగురు, మంకెన, పగడం, ముత్యం, ఇంద్రగోపం, బాగాలు, కనుమలు, పత్రిక, చెలమ, గాలిగొట్టం, పిల్లగోవి, గాడిపట్టు, వత్తి, పలురకాల తీపిపదార్థాలతోను తిమ్మక్క నవ్వులదీవితోను పెదతిరుమలయ్య పలురకాల పండ్లు, మధుర పదార్థాలు, చిగురు, పగడాలతోను చినతిరుమలయ్య చిగురుతోను చిన్నన్న పండ్లు, చిగురు, పగడం, మధురపదార్థాలు, చిలకముక్కులతోను పోల్చారు.

## 4.1.21.1. పెదాలు – ఇంద్రగోపాలు :

ఆరుద్ర కార్తెలో వర్షం కురిసి నేల చిత్తడిగా ఉన్నప్పుడు బయల్వెడలే పరుగు ఆరుద్ర పురుగు ఇదే ఇంద్రగోపం. ఎర్రని పట్టువంటి దేహం గలదిది. వర్ణ సౌకుమార్యాలచే దీనికి పెదాలకు పోలిక.

అంగన జవ్వన మామని కాలము
సంగడినె నీకు జడిగొనె వలపు

\- - - - - - - - - - - -

యింతి కెమ్మోవు లింద్రగోపములు
చెంతల (గోరికల సెలయేరులు 25-260.

నాయిక జవ్వని. సమీపంలోనే నాయకుడు వలపులజడి కురిపిస్తున్నాడు. ఆజడినుండి బడల్వెడలిన ఇంద్రగోపాలే నాయిక కెమ్మోవులు ఈ వర్ణన అన్నమయ్యకు గల ప్రకృతి పరిశీలనా పాటవానికి ప్రతీక.

## 4.1.22.2. పెదాలు – చిలకముక్కు :

చిలకముక్కు ఎర్రగా వంపుతిరిగి వుంటుంది. ఎర్రని పూలు, పండ్లు, పగడాలతో పెదాలను పోల్చడం, సంప్రదాయం కాగా చిన్నన్న ఉషాసుందరి పెదవులను చిలుకముక్కుతో పోల్చాడు. చిన్నన్న ఉషాకల్యాణం :

కీరతుండాధరి ! కేలుగీలించి

ధీర వాక్యంబుల తేటగా బలికె 1భా-పుట 22.

పలురకాల ఫలమాధుర్యాన్ని చవిచూచేది చిలుకముక్కు. అధరఫల మాధుర్యాన్ని ఆశించేది ఈ అధరం.

## 4.1.22.3. పెదాలు – ఫలాలు :

ఎర్రని రంగు, రుచులను బట్టి పలురకాల పండ్లతో పెదవులకు పోలిక, తాళ్లపాక కవులు పెదవులను బింబఫలం, వటఫలం, మోవిఫలం, అమృత ఫలాలతో ఉపమించారు. బింబఫలం, వటఫలం, ఎర్రనివికాగా మోవిఫలం, అమృతఫలాలు మధురమైనవి. మోవిపండు వేంకటాద్రి మొదలగు కొండ ప్రాంతాలలో మాత్రమే లభించేది. ఈ చెట్టు ఆకులు పనస ఆకులను బోలివుంటాయి. పండ్లు తెలుపు, నలుపు రంగుల్లో ఉసిరిక కాయలంతవి. మిక్కిలి మధురమైనవి. మోవిపండుతో పెదాలను పోల్చడం తాళ్లపాకవారికి వేంకటాద్రితో గల అనుబంధాన్ని సూచిస్తుంది. చిలుకలకు ప్రీతి పాత్రమైనది బింబఫలం. నాయకుడు బింబాధరుడైతే నాయిక చిలుక పలుకులతో అతనిని మెప్పిస్తుంది. నాయకుడు వటపత్రశాయి అయితే నాయిక కెమ్మోవే వటఫలం. నాయకుడు వేంకటాద్రినిలయుడు. అంచేతే వేంకటగిరిలో లభించే మోవిపండ్లే నాయికమోవులు. రతి మాధుర్యాన్ని

చవిచూపించే అమృతఫలాలే రమణి కెమ్మోవులు. సమయోచిత మైన ఉపమానప్రయోగం తాళ్ళపాక కవుల వైశిష్ట్యం.

బింబఫలం : అన్నమయ్య -

బెళుకులేని యట్టి బింబాధరుఁడాతఁడు
చిలుకపలుకుల రంజిల్లఁజేయవే 24-251.

పెదతిరుమలయ్య :

కలికి బింబఫలము గదె నీ మోవి
పలుకు చిలుకలేం పగలాయనే 23-147

చిన్నన్న :

ప్రియములు రెట్టింప బింబాధరంబు
చవిగొను సతులెంత సౌభాగ్యవతులో

- ఉషాకల్యాణం -1భా - పుట 18.

వటఫలం : అన్నమయ్య -

వటఫలంబు వన్నెల మోవికి
గుటకలలోన గుక్కిళ్ళో 12-179.

చిన్నన్న :

వటపత్రశాయినా వాసుదేవుండు
వటఫలాధరి ! యిందువలన నొప్పుచుండు

-పరమయోగివిలాసం - 5ఆ - 393 పు.

మోవిపండు : అన్నమయ్య -

మోవిపండు నీకు మోవినిచ్చినదట 12-102

పెదతిరుమలయ్య :

వెంటనే అధరములు వెసమోవిపండ్లంటా
గొంటరియై అడిగీని గోవిందకృష్ణుఁడు 23-206.

అమృతఫలం : అన్నమయ్య -

రతి అమృతఫలాలు రమణి కెమ్మోవులు 22-490.

## 4.1.22.4. పెదాలు – పోఁక :

క్రముక ఫలం పోక. భోజనానంతర తాంబూల సేవనంలో ఒక భాగమిది. పండ్లతో కొఱికి తినవలసినది. నాయకుని దంతక్షతానికి గురిఅయ్యేది నాయిక మోవి. అంచేత ఈ లక్షణ సామ్యంచే పోకకు పెదవులకు పోలిక.

పలుకు తేనెల విందు పచ్చిమోవి బాగాలు -14-58

నాయిక పలుకులే నాయకునికి తేనెల విందు . ఆపిమ్మట సేవించే పచ్చిపోకలే నాయిక పచ్చిమోవి. పచ్చిమోవి అనడం చేత అది అనాస్వాదితమని సూచన.

## 4.1.22.5. పెదాలు – మంకెన పూలు :

మంకెనలు పూవు ఎర్రనిది, సుకుమారమైనది. తిరుమలలోని పూలన్నీ స్వామిపూజకే. ఇతరులకు దక్కేవికావు. అట్లే మంకెన పూవు బోలిన నాయిక పెదవులు ఆ స్వామికి దక్కేవే. మనసార స్వామికి వాటినర్పించడమే నాయిక చేసే మంకెన పూవు పూజ అని అన్నమయ్య భావం.

ఘనతమైఁగూడి వేంకటపతి మోముసో
కిన నీదుమోవి మంకెన పూవు పూజ -12-95.

## 4.1.22.6. పెదాలు – చిగురు :

సున్నితము, సుకుమారమై, రక్తిమతో కూడింది చిగురు. సర్వవిధాలా చిగురును బోలింది పెదవి. అయితే ఆ రక్తిమ సహజమైన ఎరుపురంగు చేత

కావచ్చు అనురాగం చేత కావచ్చు ఈ చిగురు ఎర్రని మామిడి చిగురు కావచ్చు. పరమ పవిత్రము శ్రీనివాసునికి ప్రీతిపాత్రము అయిన తులసీదళం కావచ్చు అన్నమయ్య దృష్టికి ఈ చిగురు పవిత్ర తులసీదళంగా గోచరిస్తే చిన్నన్న దృష్టికది మదనుని వాడి కైదువైన లేమావిచిగురులా గోచరించింది. అన్నమయ్య :

చిగురుఁ బెదవులే శ్రీ తులసీదళములు 28-502

చినతిరుమలయ్య :

గొంటరి యాపె దానె చిగురువంటి మోవి
అంటి యింత సేసెనెంత అగ్గలికో గాని 16-86 (శృం)

చిన్నన్న :

మోవులా యివి యుషా మోహితు తండ్రి
తావుల మావిలేఁదలిరులు గాఁగ 1భా - పుట 5. (ఉషాకల్యాణం).

## 4.1.22.7. పెదాలు - చెలమలు :

తియ్యని నీరు ఊరే చిన్నగుంట చెలమ మంచినీరు దప్పికను తీర్చేది. రసపిపాసను దీర్చే పెదవులే చెలమలు. అయితే అన్నమయ్య పెదవులను మంచినీటి చెలమల తోనే గాక తేనె లూరే చెలమలతో గూడ పోల్చడం విశేషం. ఈ చెలమలో ఊరే తేనె తియ్యని పలుకుతేనెలు కావచ్చు లేదా వలపు తేనెలు కావచ్చు. అవి వూరే చెలమలే ఇంతి పెదాలు.

తేనియ చెలమలు :

తేనియల చెలమలు తియ్యని మోవులు 4-33.

మంచినీటి చెలమ :

మంచినీటి చెలమాయ మరియును తేనెమోవి 28-164.

### 4.1.22.8. పెదాలు – మూసిన ముత్యం :

పెదవులను పగడాలతోను పలువరుసను ముత్యాలకోవతోను పోల్చడం కవిసమయం. ముత్తెపుచిప్పలో దాగివున్న ముత్యం మూసిన ముత్యం. ముత్యాలవంటి పలువరుసను గుప్తంగా దాచివుంచిన పెదాలను మూసిన ముత్యాలతో అన్నమయ్య పోల్చాడు.

మూసిన ముత్తెం వంటి మోవినోరూరించి

ఆసల విందులు చెప్పినదివో నీకు 28-189.

మనం ఏ వస్తువునైనా - గుప్తంగా వుంచినప్పుడు దానిని చూడాలి ఆస్వాదించాలి అనే ఆశ ఎదుటి వారి కుండడం సహజం. అలాగే మూసిన ముత్యం లాంటి నాయిక పెదవి నాయకుని మరీమరీ చవులూరిస్తోంది.

### 4.1.22.9. పెదాలు –పగడాలు :

నవరత్నాలలో ఎఱ్ఱనివి పగడం, మాణిక్యం. మాణిక్యం శుష్కమైన రాయి. కాని పగడం పగడపుచెట్టు ఫలం. రంగు ఆకృతులబట్టి పెదాలను పగడాలతో పోల్చడం సంప్రదాయం. కాగా తాళ్ళపాక కవులు పెదాలను - పగడాలు, పగడపుపండు, పగడపులత, పగడపు గనులతో పోల్చడం పగడాలపట్ల వారికున్న అభిమానమే.

పగడం : అన్నమయ్య -

పగడవా తెరమోవిఁబలుకవే పతితోడ 28-235.

పగడపులత : చిన్నన్న -

పనివడి తము దాము పవడంపులతలు

గనియులుగా ఁజేయుకావి మోవులును

–అష్టమహిషీకల్యాణం - 3ఆ -133పుట.

పగడపు పండు : పెద తిరుమలయ్య-

పాయపు మెఱుగు దీగెఁబగడపు పండువండె 23-154.

పగడాలగని : పెద తిరుమలయ్య -

అతివకెమ్మోవి పగడాలగని 23-514.

## 4.1.22.10. పెదాలు – ఎఱ్ఱశిలకనుమ :

కొండలో దారి కనుమ. ఎఱ్ఱశిలల మధ్యదారి ఎఱ్ఱశిలకనుమ. ఇది తాళ్లపాక సమీపంలోని ఒక ఊరు. నేటికి పోల అప్పరాజుపేట సమీపంలో 'కడియాల పల్లె కనుమ' అనే వ్యవహారంలో ఉంది. తాళ్లపాక చుట్టూ షట్చక్రాకృతిలో వున్న ఆరుకనుమలలో ఇది ఒకటి. ఈ కనుమలతో అమ్మవారి శరీరాంగాలను పోల్చడం అన్నమయ్యకు ఆ కనుమల పట్లగల భక్తి అనురక్తే కారణం

ఇదివో నీ కెమ్మోవి యెఱ్ఱశిలకనుమ

కదిలేఁజిగురులఁ గప్పుకొన్నది 12-115.

వర్ణసాదృశ్యంచే ఎఱ్ఱశిల కనుమనే ఆ జగజ్జనని కెమ్మోవులుగా భావించాడు - అన్నమయ్య. ఈ ఆరు కనుమలలో వైష్ణవాలయాలుండడం విశేషం.

## 4.1.22.11. పెదాలు – పత్రిక :

ఇది ప్రేమ పత్రిక (లవ్ లెటర్) పత్రాలు పలువర్ణాలలో లభిస్తాయి. నల్లని సిరాతో వ్రాయబడిన అక్షరాలతో కూడిన ఎఱని ప్రేమ పత్రమే నల్లని కస్తూరితో నిండిన నాయిక కెమ్మోవి.

ఏ మొకొ చిగురుటధరమున యెడనెడ కస్తురి నిండెను

భామిని విభునకు వ్రాసిన పత్రిక కాదుగదా 12-82.

అన్నమయ్య భావనాశక్తికి పరాకాష్ఠయిది. సాళువ నరసింగరాయల నాకర్షించిన వర్ణన యిది. ఇది సమాగమా నంతరం శృగార నాయిక వర్ణన. శృంగార కేళియందు కస్తూరి తిలకాంకితుడైన నాయకుని మోమును పలుమార్లు

చుంబించడం చే ఎఱ్ఱని నాయిక పెదాలపై నల్లని గుర్తులు నిలిచాయి. ఇట్టి సంభోగ చిహ్నలతో గృహాంతర్భాగం నుండి వెలవడ్డ నాయికను చూచి చెలులాడే పరియాచకాలు ఈ పలుకులు.

## 4.1.22.12. పెదాలు – వత్తి :

మెత్తని పత్తితో తయారయినది వత్తి. తాను కాలిపోతూ ఇతరల జీవితాలలో వెలుగులు నింపేది వత్తి. సంయోగంలో తాను నలిగిపోతున్నా భాగస్వామికి అపరిమితానందాన్ని ఒసగేది మోవి. అంచేతే నాయిక మోవిని వత్తితో అన్నమయ్య పోల్చాడు.

వడియుఁజెమటలతోడ వత్తివంటి మోవితోడ

నడపు మురిపెముతోడ నవ్వేవేమొ 13-42.

నిలువెల్ల చెమటలతో, నలిగిన పెదవులతో, మధురానుభూతులతో, చిరునవ్వులొలికించే నాయికను చూచిన చెలుల ప్రశ్న యిది. నలిగిన పెదవే వత్తి. దానిని ఆర్ద్రీభూత మొనరించే ఆజ్యమే స్వేదజలం. ఈ స్వేదం రతి శ్రమ జనితం.

## 4.1.22.13. పెదాలు - గాలిగొట్టం :

ప్రాచీన కాలంలో పంపుతో గాలికొట్టి గాలిపటాన్ని ఎరుగవేసేవారు. గాలికి ఎగిరే గాలిపటానికి నిట్టూర్పు గాలులకు విలవిలలాడే నాయిక మోవికి పోలిక.

మూలనున్న నిట్టూర్పు ముంగిటనేల వేసేవే

గాలిగొట్టె యధరము గరివడీని 13-44

గాలి అధికమైనపుడు గాలిపటం పట్టుతప్పి రెపరెపలాడడం సంభవం. నిట్టూర్పు గాలులధికంకాగా పెదవులు వణకడం సహజం. అంచేతే గాలిగొట్టానికి (గాలిపటానికి ) పెదవులకు పోలిక.

### 4.1.22.14. పెదాలు – పిల్లనగ్రోవి :

మధురమైన స్వరాలను పలికించేది పిల్లనగ్రోవి. కృష్ణునికి ప్రియాతిప్రియమైనిది ఎన్నడు అతని పెదవుల ఎడబాయనిది. నోటితో గాలిని పూరిస్తేనే పలికేది పిల్లనగ్రోవి. అన్నమయ్య పెదవులను పిల్లనగ్రోవి తో పోల్చాడు.

ఇత్తరి శ్రీ వేంకటేశ్వరుఁగూడ ఁగఁ
గుత్తిక లోపలి కోవిలలా
బిత్తరి యధరపుఁబిల్లఁగోవిలో
నొత్తి నిలిపి తనివొందించీని 30-63.

ఇంతవరకు పంతం నెరిపిన నాయిక శ్రీ వేంకటేశుని కూడిన తన్మయత్వంతో తన కుత్తికలోని కోవిలలన్నిటినీ తన అధరమనే పిల్లన గ్రోవిలో నింపి మధురస్వరాల పలికించింది.

### 4.1.22.15. పెదాలు – గాడిపట్టు :

స్త్రీల పెదవులనే గాక పురుషుని పెదవులను గూడ వర్ణించడం అన్నమయ్య ప్రత్యేకత. పశువులన్నీ కలిసి సామూహికంగా మేయడానికై రాతితో నిర్మింపబడిన తొట్టె గాడిపట్టు.

కాంతలకు నీమోవి గాడిపట్టు 31-451.

నీతి నియమం లేకుండా పలుకాంతల చుంబించే నాయకుని నిందించే నాయిక నిందలివి. పలువురు యింతుల కాస్వాద యోగ్యమైన నాయకుని మోవి గాడిపట్టు.

### 4.1.23. దంతాలు :

తెల్లగ గట్టిగా వుండి నమలడానికి ఉపయోగపడే నోటిలోని భాగం దంతాలు. కాముకుల దంతాలను ఎఱ్ఱగా వర్ణించరాదని కవిసమయం. ఇవి నోటిలో

రెండు వరుసలుగా మొత్తం ముప్పైరెండు వుంటాయి. వీటిని ముత్యాలు, మాణిక్యాలు, నారంగబీజాలు, దాడిమ బీజాలు, కోరకాలు, మల్లెమొగ్గలు, విద్యుత్తు, తారకలు, చంద్రకళలతో పోల్చడం కవి సంప్రదాయం. అన్నమయ్య దంతాలను కుందాలు, వజ్రాలు, ముత్యాలు, మాణిక్యాలు, దంతపుతలుపులకోట, చంద్రకాంతులు, దాడిమబీజాలతోను తిమ్మక్క ముత్యాలతోను పెదతిరుమలయ్య వజ్రాలు, ముత్యాలతోను, చిన్నన్న ముత్యాలు, వజ్రాలు, కెంపులు, కుందాలు, గురువిందలు, అంబుజోదర కేసరములతోను పోల్చారు.

## 4.1.23.1. దంతాలు – అంబుజోదర కేసరాలు :

చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

అంబుజోదర కేసరాగ్రంబులనఁగ

నంబుజోదరుఁడు దంతాళి గాన్పించె　　　　1ఆ-పుట 99.

ఇట నాయకుడు అంబుజోదరుడు. మరి అతని నోటిలోని దంతాలు అంబుజోదర కేసరాగ్రాలను పోలివుండడం సమంజసమే

## 4.1.23.2. దంతాలు - దాడిమబీజాలు :

దానిమ్మపండులోని ఎర్రని గింజలు దాడిమబీజాలు. దంతాలను ఎర్రగా వర్ణించరాదని కవిసమయం. గారబట్టి జుగుప్సావహమైన ఎర్రని పలువరుసను వర్ణింపరాదు నిజమే. పెదవుల కాంతిని ప్రతిబింబించే దంతాల ఎరుపును వర్ణించడం దోషంకాదు. దంతాలకు దాడిమ బీజాలకు పోలిక సంప్రదాయ సిద్ధమే. అన్నమయ్య.

సితచంద్రవదనా సింగార సదనా

చతురదాడిమ బీజరద చయనా　　　　15-16

ఇవి కాంతి వంతమైన రదనాలు. అంచేతే దాడిమబీజాలకు వీటికి పోలిక.

### 4.1.23.3. దంతాలు – కుందాలు :

కుందము అంటే మల్లెపూవు. దంతాలను సన్నని ఆకృతిని బట్టి మల్లెలు మొల్లలతో పోల్చడం సంప్రదాయ సిద్ధమే అన్నమయ్య చిన్నన్నలీ సంప్రదాయాన్ననుసరించారు. అన్నమయ్య -

అదె దంతములఁగుందములకములలనిలములు 15-202.

చిన్నన్న :

- - - - - - - - - - - - దంత

హసిత కోమల కుందయగు మిత్రవింద

-అష్టమహిషీ కల్యాణం (-5-249 పుట)

### 4.1.23.4. దంతాలు – గురువిందములు :

ఎరుపు నలుపు రంగులతో కూడిన నిడుముస్తె చెట్టుగింజలే కురువిందగింజలు. ఆకృతిని బట్టి దంతాలకు వీటికి పోలిక. చిన్నన్న అష్టమహిషీ కల్యాణం

గురువింద రదను నక్రూరాంశురదను 5-255 పుట

ఇవి గురవిందల బోలిన అక్రూరుని దంతాలు.

### 4.1.23.5. దంతాలు – నవరత్నాలు :

తాళ్లపాకకవులు దంతాలను ముత్యాలు, వజ్రాలు, మాణిక్యాలతో పోల్చారు ముత్యాలు, వజ్రాలు తెల్లనివి. మాణిక్యాలు ఎర్రనివి. రత్నాలన్నీ కాంతివంతమైనవే.

ముత్యాలు:

అన్నమయ్య -

మొలకముత్యాలవంటి మొనవాడి దంతములు 20-121.

తిమ్మక్క -

మొలకెత్తుముత్యంబుపుమొగ్గలబోలు

తళుకొత్తు శుభ్రదంతముల వాని - సుభద్రా కల్యాణం 27పుట

పెద తిరుమలయ్య -

ముత్తెపుఁ బలువరుస మొగిఁదెల్లగా (దోమి 23-378.

చిన్నన్న -

అలవిమీఱిన ముత్తియంబులనొక్క

కాలికికి (దెచ్చు నీ కొమ్మపల్వరుస -అష్టమహిషీకల్యాణం-2ఆ-97

వజ్రాలు :

అన్నమయ్య -

తొడిఁబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు 29-30.

పెద తిరుమలయ్య -

వనిత నీ దంతములు వజ్రాలపుట్టుగని 23-510.

చిన్నన్న -

రదనంబులా సువజ్రముల (గీలించు - అష్టమహిషీ కల్యాణం -4-186

## 4.1.24. నాలుక :

మెత్తగా పొడవుగా వుండే నోటిలోని భాగం నాలుక. ఆహార స్వీకారానికి సకల వాగ్వ్యాపారానికి దోహదకారి అయ్యే శరీరాంగమిది. దీనికి లాక్షణిక సిద్ధోపమానాలు ఏవి లేవు. కాని నాలుకను తాటిదబ్బగాను సరస్వతీదేవి నాట్యరంగస్థలంగాను వర్ణించడం ప్రసిద్ధం. తాళ్లపాక కవులలో అన్నమయ్య పదాల్లో మాత్రమే నాలుక వర్ణన కనిపిస్తుంది. దీనిని అన్నమయ్య నాచుబాముతోను, నార, గంటలతోను పోల్చాడు. ఇతర తాళ్లపాక కవుల రచనలలో నాలుక వర్ణన మృగ్యం.

### 4.1.24.1. నాలుక – నాచుబాము :

విషాన్ని కక్కే భయంకరమైనది నాగుబాము. విషతుల్యాలైన అనృతాలను కక్కే నాలుకకు నాగుబాముకు పోలిక.

నాలుకనియెడి గుహను నాచుబామది యొకటి
గాలి అనృతపు విషము గ్రక్కుచుండు 9-137.

నోరు గుహ. ఆ గుహలో నివసించే పాము నాలుక.

### 4.1.24.2. నాలుక – నార :

చెట్టుపైని పట్టనార. నిర్జీవమూ నిస్సారమూ అయిన నారకు నాలుకకు పోలిక.

నారవంటిదే నల్లెడు నాలుక 9-40.

భగవదర్పితం కాని శరీరమే నిస్సారం, నిరర్థకం. అయినపుడు అందులోని భాగమైన నాలుగు అంగుళాల నాలుక కూడా నిస్సారమైన నారను బోలినదే.

### 4.1.24.3. నాలుక – పిడిఘంట :

గణగణమని మ్రోగే పిడిగంటకు కలకలమని పలికే నాలుకకు ఆకార లక్షణ సామ్యాలున్నాయి. అన్నమయ్య నాలుకను పిడిగంటతో పోల్చడం విశేషం.

నిత్య పూజలివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి
– – – – – – – – – – – –
పలుకే మంత్రమట పొందైన నాలుకే
కలకలమను పిడిఘంటయట 2-82.

శరీరం పరమాత్మునికి నిలయమైంది కాబట్టి మన ప్రతి చేష్టతో అతనిని అర్చించాలి. అదే నిత్యపూజ. పూజకుపయుక్తమయ్యే పరికరాలలో గంట ఒకటి.

నైవేద్య వేళల భగవంతుని రాకను ఆహ్వానిస్తూ గుడిలో మ్రోగించబడేది, భగవంతుని కీర్తిని చాటేది గంట. అలాగే మానవశరీరంలోని నాలుక తన పలుకులతో భగవంతుని కీర్తించి ఆహ్వానించాలని భావం. నాలుకను భగవంతుని స్తుతించడాని కుపయోగించాలే గాని శుష్కవచనాలకు, పరనిందలకు ఉపయోగించరాదని భావం. అలా భగవదర్పితమైనపుడు ఆ నాలుక పలికే ప్రతిపలుకు పవిత్రమైన మంత్రతుల్యమౌతుంది.

## 4.1.25. చెక్కిళ్లు :

నున్నగా కాంతివంతంగా ముఖంలో ఇరువైపులావుండే కపోలాలే చెక్కిళ్లు. వీటికి చంద్రుడు, దర్పణం, విప్పపూలతో పోలిక కవిసంప్రదాయం. అన్నమయ్య చెక్కిళ్లను అద్దాలు తొలకరి మెరుపులతోను పెదతిరుమలయ్య అద్దాలతో చిన్నన్న అద్దాలు, తమల పాకులు, కనక పత్రికలు, చిగురులు, ఏనుగు గండస్థలాలతోను పోల్చారు.

## 4.1.25.1. చెక్కిళ్లు – తమలపాకులు :

సున్నితము సుకుమారము అయినవి తమలపాకులు. పలుచని స్త్రీల చెక్కిళ్లను చిగురులు తమలపాకులతో పోల్చడం ప్రసిద్ధం. చిన్నన్న స్త్రీల చెక్కిళ్లను తమలపాకులతో పోల్చాడు. చిన్నన్న అష్టమహిషీ కల్యాణం –

వరకపోల భావంబుఁదెలుపు

వరుసనొప్పెడు నాగవల్లీదళములు 5ఆ–పుట 264.

ఇది కేకయపుర స్త్రీలు కృష్ణుని కొసగిన అపూర్వ స్వాగతం. భద్రాదేవిని చేపట్టడానికై కృష్ణుడు కేకయనగరంలో ప్రవేశించాడు. పెళ్ళికొడుకు పురప్రవేశం చేయగానే పెళ్ళికుమార్తె తరపు ముత్తైదువలు ఫలపుష్ప తాంబూలాదులతో ఎదురేగి మగపెండ్లివారిని ఆహ్వానించడం మన సంప్రదాయం. ఈ పద్ధతినే కేకయనగర కామినులు పాటించారు. అయితే ఇక్కడ గోవిందున

కెదురైనవి ఆ మెరుగు బోణుల గుబ్బల గజనిమ్మపండ్లు పలుకుల బెల్లపుటచ్చులు, కపోలనాగవల్లీ దళాలు, ఉరోజ పూగములతోడి మర్యాదలు.

### 4.1.25.2. చెక్కిళ్లు – అద్దం :

పద్మరాగ శిలాదర్శపరిభావి కపోల భూః

– లలితా సహస్ర నామావళి – 9 శ్లోకం.

రాజరాజేశ్వరి కపోలాలే పద్మరాగమణి దర్పణం.

స్వచ్ఛత, ప్రకాశం, గౌరవర్ణం కలిగి తన ఎదుటి బింబాన్ని ప్రతిబింబించేది అద్దం. తాళ్లపాక నాయికల చెక్కిళ్లు నాయకుల రూపుల ప్రతిబింబించే నిర్మల దర్పణాలు. అసూయతో తదేకంగా చూస్తే మ్లానమయ్యే దర్పణాలు.

అన్నమయ్య :

నీ మేని వింతచేఁతలు నీడ చూచుకోవయ్య

కామిని చెక్కులే నీకు కంచుటద్దాలు 27-13.

పెదతిరుమలయ్య :

చిమ్మి చిమ్మి చూడకువే చెక్కులెల్ల నల్లనయ్యీ

నెఘ్ఘుదినద్దాలవంటి నీ చెక్కులు 23-285.

చిన్నన్న :

ధళధళఁబొల్లు నిద్దముల (యద్దముల

పొలుపు నటించు కపోల పాళికల

అష్టమమిషీ కల్యాణం – 3ఆ-పుట 164.

### 4.1.25.3. చెక్కిళ్లు – కనకపత్రికలు :

కనక పత్రికలంటే బంగారు రేకులు. లోహాలన్నిటిలోకి పచ్చని ఛాయతో నిగనిగలాడేది బంగారం. 'ఉత్తరవేది' అనే పట్టణంలోని స్త్రీల చెక్కిళ్లే కనకపత్రికలు. చిన్నన్న పరమయోగివిలాసం –

కనక పత్రికల నంగా వేఱ కలవె
చెకన మించిన వీరి చెక్కు లేకాక 1అ–పుట 32.

### 4.1.26. ముక్కు :

ప్రాణధారణకు ఊపిరి ప్రధానం. శ్వాసప్రక్రియకు అత్యంత ఆవశ్యకమయిన శరీరాంగం ముక్కు. సన్నగా పొడవుగా చివర రెండు రంధ్రాలతో కూడిన ముఖభాగమే ముక్కు. ఆకార సాదృశ్యం వల్ల దీనికి నువ్వుపువ్వు. సంపెంగ, పాటలీ పుష్పం, వెదురు బొంగు, అమ్ములపొది, పక్షిముక్కులతో పోలిక కవిసమయ సిద్ధం. అన్నమయ్య ముక్కును సంపెంగ, నువు పువ్వులతో తిమ్మక్క నువ్వు పువ్వుతోను చిన్నన్న సంపెంగ, నువుపువ్వు, దిరిసెన, సేతువులతోను పోల్చారు.

### 4.126.1. ముక్కు – పువ్వులు :

'నవచంపక పుష్పాభనాసా దండ విరాజిత'

–లలితా సహస్ర నామావళి –7 శ్లోకం.

రాజరాజేశ్వరి నాసిక సంపెంగను బోలివుంది. ఆకార, వర్ణ సామ్యంచే నాసికను నువుపువ్వు, సంపెంగలతో పోల్చడం సంప్రదాయం కాగా సౌకుమార్యం కారణంగా ముక్కును దిరిసెన పువ్వుతో కూడ పోల్చడం చిన్నన్న ప్రత్యేకత. అన్నమయ్య –

ఏరుపరచి చెప్పరే యింతి చక్కదనము
వుమ్మడి తిలపుష్పమో వొగి సంపెంగ ముక్కో 29–72.

అమ్మవారి నాసిక తిలపుష్పమో సంపెంగో అన్నమయ్యకే అంతుచిక్కలేదు. తిమ్మక్క సుభద్రా కల్యాణం

సతినాసిక తిలపుష్ప సమమైన దేమి పుట 15.

సుభద్ర నాసిక తిలపుష్పాన్ని పోలింది.

చిన్నన్న ఉషాకల్యాణం -

కొనగలిగి తిలకుసుమమో కాక

కనుగవ తెలిగాదు కాంచన సుమమె

వెట్టతావులు లేవు విరి దిరిసెంబొ

దిట్టగుబ్బెత నాస తెరగే తెరంగు -

కొనదేలింది తెల్లనిది తిలకుసుమం. పచ్చనిది సుగంధ భరితమైనది సంపెంగ. సున్నితమైనది దిరిసెనపువ్వు. ఉషాసుందరి నాసిక కొనదేలింది కాని తెల్లనిది కాదు. పచ్చనిది కాని వెట్టతావులు లేనిది. అంచేత అది నువ్వుపువ్వా? సంపెంగా ? దిరిసెనా ? అని నిర్ణయించలేని సందిగ్ధావస్థయిది. వీటన్నిటి మేలు కలయిక ఆ యింతి నాసిక.

## 4.1.26.2. ముక్కు – సేతువు :

ఒక ప్రవాహానికి మధ్యకట్టే కట్టసేతువు. శ్రీరామ చంద్రుడు సముద్రానికి సేతువు నిర్మించాడని ప్రసిద్ధి ఇది ప్రవాహాన్ని రెండు పాయలుగా చీలుస్తుంది. చిన్నన్న పరమయోగి విలాసంలో

మొనసిన నయన సముద్ర మర్యాద

కొనర సేతువు నాఁగ నొప్పు నాసికయు 1-18.

అని రెండు కళ్లమధ్య నుండే ముక్కును నయన సముద్రాన్ని రెండు పాయలుగా చీల్చే సేతువుతో పోల్చాడు. పురుషులకు పెద్దముక్కు అందం. ఇది నారాయణుని నాసిక. అంచేతే తాను నిర్మించిన సేతువునే తలపిస్తోంది.

## 4.1.27. కళ్లు :

'సర్వేంద్రియాణాం నయనం ప్రధానం' అని పంచేంద్రియాలలో ప్రధానమైనదిగా పరిగణింపబడి ఈ చరాచరజగత్తును దర్శించడానికి అనువుగా భగవంతుడొసగిన ఇంద్రియమే కన్ను. నాసికకు ఇరువైపుల ఉండే శరీరాంగం కళ్లు. కళ్లను తెలుపు, నలుపు, ఎరుపు మిశ్రవర్ణాలలో వర్ణించాలని కవిసమయం. వీటిని మృగనేత్రం, పద్మం, కుముదం, ఖంజనం, చకోరం, కేతకం, మన్మథబాణం, కందళీ కుట్మలాలతో పోల్చి చెప్పడం కవిసంప్రదాయం. అన్నమయ్య కళ్లను కమలాలు, కలువలు, కల్పభూజాలు, మృగలోచనాలు, చాతకాలు, చకోరాలు, చేపలు, ముత్తెపుచిప్పలు, దీపాలు, ఆరతులు, బాణాలు, చింతామణులతోను పెద తిరుమలయ్య కల్వలు, తామరలు, చేలతోను చిన్నన్న తామరలు, కలువలు, చకోరాలు, చేపలు, మృగనేత్రాలు, సముద్రం, చీమలు, బాణాలు, విల్లులతో పోల్చారు.

## 4.1.27.1. కళ్లు – లేడి కళ్లు :

బెదురు చూపులకు ప్రసిద్ధిగాంచింది లేడి. అందమైన చంచలనేత్రాలను లేడికళ్లతో పోల్చడం ప్రసిద్ధం. చంచలనేత్రాలు స్త్రీలకు మరింత ముగ్ధత్వాన్ని చేకూర్చేవి. అన్నమయ్య

ఓ చెలి ! యోలతాప్రతిమ ! యోమృగలోచన ! యోచకోరిరో

– వేంకటేశ్వర శతకం - 27 పద్యం.

అవి అందమైన కళ్లు. చంచలమైనవి స్వచ్ఛమైనవి. శ్రీనివాసుని కై ప్రతీక్షించేవి. అన్నమయ్యకు సాక్షాత్కరించిన అలమేలు మంగ కళ్లు. చిన్నన్న ఉషాకల్యాణం

ఈ రీతి నెచ్చెలు లేణనేత్రికిని
సారెకు శైత్యోపచారముల్ సేయ 1భా–పుట 27.

ఇవి విరహాతుర అయిన ఉషాకన్యక బెదురుచూపులతో కూడిన కళ్లు.

### 4.1.27.2. కళ్లు – చాతకాలు :

స్వచ్ఛమైన వర్షపు నీటికై ఎదురు చూచేవి చాతకాలు. చకోరాలతో కళ్లను పోల్చడం కవి సమయం. కాని అన్నమయ్య చాతకాలతో కూడ కళ్లను పోల్చి వాటి నైర్మల్యాన్ని నిరూపించాడు.

నడపుల హంసల నయన చాతకముల

పడఁతి శ్రీ వేంకట పతి పాదిగె 14-7.

నిర్మలమైన మానస సరోవరంలో మాత్రమే సంచరించేది హంస. నిర్మల వర్షజలాన్ని మాత్రమే గ్రోలేది చాతకం. ఈ రెంటి నైర్మల్యం కలిగినది కాబట్టే ఆ యింతి హరి అంతరంగ అయ్యింది.

### 4.1.27.3. కళ్లు – చకోరాలు :

చంద్రుని రాకకై ఎదురు చూచేవి, ఆ చంద్రుని వెన్నెలలను తనివితీరా గ్రోలే వెన్నెల పులుగులే చకోరాలు. ఈ ప్రతీక్షా స్వభావాన్ని బట్టే చంద్రచకోరన్యాయం ఏర్పడింది. నాయకునికై ప్రతీక్షించే నాయిక కళ్లే చకోరాలు. అన్నమయ్య.

కలికి చకోరాక్షికిఁగడ కన్నులు కెంపై తోఁచిన

చెలువంబిప్పుడి దేమో చింతింపరే చెలులు

నలువునఁ బ్రాణేశ్వరుపై నాటిన యాకొనచూపులు

నిలువునఁ బెరుకఁగ నంటిన నెత్తురు గాదుకదా 12-82.

రతి పరవశయై నిద్రలేక కెంపెక్కిన నాయిక కళ్లను చూచి చెలులాడే పరియాచకాలివి. వెన్నెల పులుగులు వెన్నెలలను గ్రోలడం చేత తెల్లగా వుంటాయని భావం. స్వచ్ఛంగా తెల్లగా వుండే ఈ చకోరాక్షి కళ్లు కెంపెక్కడానికి కారణం ? చెలువుని పై నిలిచిన తన చూపులను ఆ చెలి బలవంతంగా పెరకడమేనని వారి సమాధానం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

కొదమ వెన్నెల పులుగుల ( గూటనిడిన

చదురునఁగేల లోచనములు మూసె 1ఆ-పుట 29.

గోపకాంతల కౌగిళ్లచేరిన బాలకృష్ణుఁడు వారి కళ్లను మూసి దొంగాటలాడుతున్నాడు. తనరెండు చేతులతో వారి కళ్లను మూయడం వెన్నెల పులుగులను గూళ్లల్లో పెట్టినట్లుందిట. ఆ గోపకాంతల కళ్లే వెన్నెల పులుగులు.

## 4.1.27.4. కళ్లు - చేపలు :

'వక్త్రలక్ష్మి పరీవాహ చలన్మీనాభలోచనా -ల.స.నా- 6 శ్లోకం.

ముఖమనే లావణ్య సాగరంలో సంచరించే చేపలే అమ్మవారి కళ్లు. సన్నని పొడవైన ఆకృతిని బట్టి చేపలతో కళ్లకు పోలిక, సంప్రదాయ సిద్ధం. కాని ఆకృతిని బట్టేగాక స్వభావాన్ని బట్టి కూడ కళ్లను చేపలతో ఉపమించడం తాళ్లపాక కవుల ప్రత్యేకత. అన్నమయ్య

అంగన మీనాక్షి యైనందుకిదె దిష్టంబు

కంగి పతిఁబాసి ఇటుఁగనుముయ్యదు 30-65.

రెప్పపాటు లేని జలచరాలు చేపలు. పతిని బాసిన విరహం వల్ల కంటికి కునుకే లేని నాయిక కళ్లకు రెప్పపాటు లేని చేపలకు పోలిక. పెదతిరుమలయ్య -

మేకొని వేదాలకుఁగా మీనవై పొడమితివి

కైకొని సతికన్నులే గండుమీలుఁగావా 23-469.

వేదాలను అపహరించి సముద్రగర్భంలో దాగిన సోమకాసురుని నుండి వేదాలను ఉద్ధరించడానికై విష్ణువు మత్స్య రూపాన్ని ధరించాడు. నీ చెంతనే నీ సతి కన్నులనే గండుమీలను ఉంచుకొని వేదాలకై నీవు మత్స్యావతారాన్ని ఎత్తావా? నీ అవసరాలకు ఆదుకొనేది నీ యింతే కాదా ? ఆ విషయం మరచిపోదగునా ? అని చెలికాండ్ర ప్రశ్నయిది. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

- - - - - - - ధూపముల

నడలక తమకు నీడను బేడసలకు

గాడిమెడి సవరించు గొప్ప కన్నులును 3ఆ-పుట 132.

అందమైన చేపలు బేడిసలు. సతికన్నులతో ఈడు రాగలవని భావించే బేడిసలకే వలవేయగలవి మధురానగర కాంతల కన్నులు. బేడి సలకన్నా వారి కన్నులు అందంగా వున్నాయని భావం.

## 4.1.27.5. కళ్లు – చీమకళ్లు :

విశాలమైన, అందమైన కళ్లను కలువలు, కమలాలు, మృగనేత్రాలు, చకోరాలు, చేపలతో పోల్చే సంప్రదాయముండగా వికారమయిన కళ్లను పోల్చడానికెట్టి కవిసమయసిద్ధోపమానాలు లేవు. కాని చిన్నన్న పరమయోగి విలాసంలో

చీమకండ్లు మొండి చెవి బుట్టముక్కు 4ఆ-పుట 299.

అని వేశ్యమాత వికృతరూపాన్ని సాక్షాత్కరింపచేయడానికై ఆమె కళ్లను చిన్న చీమల కళ్లతో పోల్చడం సమంజసం.

## 4.1.27.6. కళ్లు – కమలాలు :

అన్నమయ్య-

కమలాప్తకులుఁడ నీ కమలాక్షి నీపాద

కమలములు దలపోసి కమలారిదూరె 26-229.

అని నాయిక కళ్లను కమలాలుగా అభివర్ణించాడు. ఇక్కడ నాయకుడు కమలాప్తకులుడు అంటే సూర్యవంశజుడు కావున నాయిక కమలాక్షి.

పెదతిరుమలయ్య:

జలజాక్షి గన నీవు చంద్రకావి గట్టగాను

వలనైన చూడక తలవంచెఁగాకా 23-271.

ఇక్కడ నాయిక జలజాక్షి. మరి తన శత్రువు అయిన చంద్ర సంబంధాన్ని భరించగలదా ! అంచేతే తన ప్రియుడైనా సరే చంద్ర కావివస్త్రాన్ని ధరించి సమీపిస్తే తలెత్తి చూడనైనా లేదు. చిన్నన్న అష్టమహిషీకల్యాణంలో

జలముల దోచిన జలజ పత్రముల

చెలువున బాష్పములు చిలుకు నేత్రముల 2ఆ-పుట 64.

ఇవి అశ్రుపూరితాలైన కాళీయాంగనల నేత్రాలు. బాష్పధారలతో కూడిన నేత్రాలు నీటితో కూడిన జలజపత్రాలను బోలినవి.

## 4.1.27.7. కళ్ళు – కలువలు :

కళ్లకు కలువలకు పోలిక సంప్రదాయ సిద్ధమే. అన్నమయ్య

కలువరేకుల వంటి కన్నులాతడు నీపతి

తొలుత నీ మోముజందురుజూపవే 24-251.

కలువకళ్లు గల నాయకుడు తన ప్రేయసి ముఖ చంద్ర దర్శనానికై ప్రతీక్షిస్తున్నాడు. పెదతిరుమలయ్య -

తరుణి యెందుండి వచ్చె తగునీ పోలికెలది

గరిమనీ ప్రతి రూపో కరుగో కాని

సరసబెట్టి చూచితే చాయొక్కరీతివే

సరిగనుగల్వలొక్క సరసివో కాని 23-202.

శ్రీ వేంకటేశుని కూడిన యింతులిద్దరి రూపులూ ఒక్కతీరునే ఉన్నాయట. ఒకవేళ ఇద్దరూ అమడలా ? అనికూడ చెలులకే సందేహం కలిగింది ఇద్దరి కళ్లూ కలువలే కాదు ఆ కలువలు రెండూ ఒకే సరస్సు నుండి పుట్టినవా ? అని చెలులాశ్చర్యపడుతున్నారు. ఇద్దరి రూపులు ఒక రూపానికి ప్రతిరూపాలు కాబట్టే ఇద్దరూ కలిసి ఒకవ్యక్తినే పతిగా పంచుకున్నారు. చిన్నన్న ఉషాకల్యాణం.

జిగిదమ్మి కలువలబోలు చెలువనేత్రములు

పగిలింటి కలువల పగిది జూపట్టె 1భా - పు.26.

ఉషాసుందరి కళ్లు తామరల బోలినవే. కాని ప్రస్తుతం మదన తాపంచేత వాడిన ఆమెకళ్లు సూర్యోదయం తో ముకిళించిన కలువల పోలివున్నాయి.

## 4.1.27.8. కళ్లు – కల్పభూజములు :

కళ్లను పూలు, పత్రాలతో పోల్చడం ఉంది. కాని చెట్లతో పోల్చడం అరుదు. అయితే ఇక్కడ ఈ చెట్లు మామూలు చెట్లు కావు కల్పవృక్షాలు. కల్పవృక్షం కామితార్థ ప్రదాయిని. అన్నమయ్య.

మోసమున మాయావి మోహితుఁడై పోయి

కాసుసేయని పనికి గాసిఁ బడెఁ బ్రాణి ॥పల్లవి॥

కన్నులని యెడి మహాకల్పభూజములివి

తన్నుఁబుణ్యునిఁజేయఁదగిలివచ్చినవి 1-159.

ధన వ్యామోహంలో పడిన జీవుడు ఆడబ్బే కామితార్థ ప్రదాయిని అనే భ్రాంతికిలోనై తత్సంపాదనకై అగచాట్లు పడుతున్నాడు. యదార్థానికి కామితార్థప్రదాయిని అయిన కల్పవృక్షాన్ని బోలినవి అతని కళ్లే. భగవద్దర్శనానికి పాత్రమైనవి ఈ కళ్లే. జీవునికి భగవద్దర్శనం కంటే కోరదగిన అర్థమేది లేదని అన్నమయ్య భావం.

## 4.1.27.9. కళ్లు – బాణాలు :

ఇవి మన్మథ బాణాలు. సున్నితము, సుకుమారము అయిన పూలే మరుబాణాలు. ఈ బాణాలు సుకుమారమయినవి అయినా ఎదుటివారి గుండెల్లో చొచ్చుకొని వారిని వశపరచుకోగల సమ్మోహన శక్తిగలవి. ఆకర్షణీయమైన కళ్లు అట్టి సమర్థత గలవే. అంచేత ఈ రెంటికి పోలిక. స్త్రీల కళ్లను మరుబాణాలుగా అభివర్ణించడం సామాన్యం కాని సర్వవశీకరణ సమర్థాలైన శ్రీ వేంకటేశుని కళ్లే మన్మథాస్త్రాలని అన్నమయ్య అభివర్ణన.

మిన్నక కేళాకూళిలో వున్న తమ్మివిరులు నీ
కన్నులంటాఁజేరఁబోగాను వేంకటేశ
పన్ని మరునమ్ములాయరా 13-223

అవి కేవలం తమ్మిపూలే గదా తస్కరించి తమవశం చేసుకుందామని సమీపించిన కాంతలను సమ్మోహన పరచి తనవశం చేసుకున్న వేంకటేశుని కళ్లే మరునమ్ములు. చిన్నన్న ఉషాకల్యాణం

కన్నులా యివి రతి కాంతుని చేత
సన్నుత మోహనాస్త్రంబులు గాక 1భా-పుట 5.

ద్వారకా నగర కామినుల కళ్లే సమ్మోహనాస్త్రాలు.

## 4.1.27.10. కళ్లు – విల్లు :

బాణ ప్రయోగ సాధనం విల్లు. చూపులే బాణాలు. అవి వెలువడుతున్నది కళ్లనుండి అంచేత కళ్లే విండ్లు. చిన్నన్న ఉషాకల్యాణం

కన్నుల విలు చెంగల్వ రెట్టంబు
గావించి యయ్యుషాకాంత వీక్షింప 1భా -పుట 14.

చెంగల్వలు అంటే ఎర్రకలువలు. ఇవి మన్మధబాణాలు. విరహ తప్త అయిన ఉషా కాంత కళ్లు కెంపెక్కాయి. ఆ కళ్లనుండి వెలవడే చూపులు తీక్షణమైనవి. ఉషా సుందరి తీక్షణ దృక్కులతో మన్మధుని మూర్తిని వీక్షిస్తోంది. వాడియైన చూపులనే బాణాలను ప్రయోగించే విల్లే ఆమె కళ్లు. అన్నమయ్య అర్ధనిమీలితాలైన కనురెప్పలను అమ్ములపాదిగా అభివర్ణిస్తే చిన్నన్న విప్పారిన కండ్లను విండ్లుగా అభివర్ణించాడు.

## 4.1.27.11. కళ్లు – ముత్యపు చిప్పలు :

మెరిసే ముత్యాన్ని భద్రంగా దాచిన అందమైన విశాలమైన చిప్పలు ముత్యపుచిప్పలు. తెల్లగా మెరిసే ముత్యాలవంటి కంటిపాపలను భద్రపరిచే

కనురెప్పలలో దాగిన కళ్లకు ముత్యపు చిప్పలతో పోలిక సమంజసం. అన్నమయ్య.

కలువలుఁజకోరాలు గండుమీలుఁ దామరలు

చలి ముత్తెపుఁజిప్పలు సతికన్నులు 13-287.

అని ఎన్ని ఉపమానాలను వేసినా ఆ యింతి కళ్ల సొగసు వర్ణింప నలవికానిది. పులుకడిగిన ముత్యాలను తనలో గుప్తపరచిన ముత్తెపు చిప్పలే ఆ యింతి నిర్మల నయనాలు.

## 4.1.27.12. కళ్లు – దీపాలు :

వెలుగును ప్రసరిస్తూ చీకట్లను పారద్రోలేవి దీపాలు. లోకానికి వెలుగుల వెదజల్లేవే గాక ఎదుటివారి దృష్టిదోషం తగులకుండా ఆరతిపట్టేవి – దీపాలే.

అన్నమయ్య :

మానినీ మణి మనసు మంచి యాసనమాయె

నానంద బాష్పజలమర్ఘ్యాదులాయ

మీనాక్షి కనుదోయి మించు దీపములాయ 12-301.

నాయిక తన సర్వస్వాన్ని భక్తి ప్రపత్తులతో స్వామి కర్పిస్తోంది. ఆ అర్పణలో ఆమె మనసే మంచి ఆసనం. ఆనందబాష్పాలు అర్ఘ్యపాద్యాలు, కళ్లే దీపాలు.

అక్కరోనీ వాలుఁగన్ను లారతిగా నెత్తవే

గక్కన నీ చెక్కు తొలకరి మెరుపులకు 12-221.

నాయిక యౌవన ప్రవేశానికినివాళులెత్తేవి ఆమె కనుల హారతులేనని వర్ణన.

## 4.1.27.1. కనురెప్పలు :

కంటిలో అతిప్రధానమైనవి సున్నితమైనవి అయిన కనుగ్రుడ్లను రక్షించేవి కనురెప్పలు. కనురెప్పలకు లాక్షణిక సిద్ధ ఉపమానాలేవి లేవు. కాని జానపదుల వర్ణనలల్లో వీటిని కిటకిటలాడే తలుపులతో పోల్చడం ప్రసిద్ధం. అన్నమయ్య కనురెప్పలను అంపపొదితోను చిన్నన్న చిప్పలతోను పోల్చారు.

## 4.1.27.1. కనురెప్పలు – అమ్ములపొది :

ఎదుటివారి హృదయంలో సూటిగా గ్రుచ్చుకొనే వాడియైన బాణాలే కలికి చూపులు. ఆ కడగంటి చూపు బాణాలను గుప్తంగా దాచే అమ్ములపాదులే రెప్పలు అన్నమయ్య.

పంచల వాఁడమ్ములలివె పట్టవయ్య కానికె

పొంచి తొంగలి రెప్పల పొది సున్నవి 12-35.

పొదిలోనున్న బాణాల చివర నున్న ఈకెలు మాత్రమే బయటకు కనిపిస్తాయి. అలాగే అర్ధనిమీలత నేత్రాలలో చూపులు గుప్త పరచినప్పుడు ఆ కనురెప్పల చివరన ఉండే వెంట్రుకలు బాణాల ఈకెలను తలపింపచేస్తాయి. ఆరెప్పలపొది నుండి బయటకు తొంగిచూచే బాణాలే నాయిక కటాక్షాలు. వాటినే మహాప్రసాదంగా స్వీకరించమని శ్రీ వేంకటేశునకు చెలికాంద్ర సలహా.

## 4.1.27.1.2. కనురెప్పలు – చిప్పలు :

కళ్లు ముత్యపు చిప్పలు. అంటే కళ్లలో ప్రధానమైన కనుగ్రుడ్లు ముత్యాలు వీటిని భద్రంగా పరిరక్షించి కప్పివుంచే చిప్పలే కనురెప్పలు. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

అనుచు బోయెత శితాయత కటాక్షంబు

లనుఁగుఁజిప్పల ఱెప్పలడ్డగింపఁగను 1ఆ-పుట 40.

కృష్ణునిపై బోయెత పరపే శితాయత కటాక్షాన్ని ఆమె కనురెప్పలనే చిప్పలు అడ్డగిస్తున్నాయని వర్ణన.

## 4.1.28. కనుబొమలు :

ఫాలభాగంలో కళ్లపై ధనురాకారంలో వంపు తిరిగిన వెంట్రుకల సముదాయం కనుబొమలు. వీటిని వల్లీ, తరంగం, మరుని విల్లు, భృంగావళి, సర్పం, కత్తి, చిగురుటాకులతో పోల్చడం సంప్రదాయం . అన్నమయ్య కనుబొమలను తుమ్మెదలు, అరచంద్రుడు, ధూమకేతువు, మరునివిల్లు, ఇంద్రధనువులతోను పెదతిరుమలయ్య విల్లు, ఇంద్రచాపాలతోను, చినతిరుమలయ్య మరునివిండ్లతోను చిన్నన్న వలరాజువిండ్లతోను పోల్చారు.

### 4.1.28.1. కనుబొమలు – తుమ్మెదలు :

నిగనిగ లాడే నల్లని రెక్కలతో పూలలోని మకరందాన్ని గ్రోలే కీటకాలు తుమ్మెదలు. తుమ్మెదలకు కనుబొమ్మలకు వర్ణసామ్యం. అన్నమయ్య

తుమ్మిద వంటి బొమ్మలతోడ ముడి వెట్టకువే
నెమ్మి శ్రీ వేంకటపతి నీతో నవ్వగా 26-243.

ఇట శ్రీ వేంకటపతి చిరునవ్వుల మకరందాన్ని తన నాయికకు అందిస్తున్నాడు. అయినా కుపిత అయిన నాయిక ఆ మకరందాన్ని స్వీకరించక బొమముడితో తన చీకాకును ప్రదర్శిస్తోంది. హాయిగా మకరందాన్ని ఆస్వాదించే తుమ్మెదలను బెదరగొట్టినపుడు అవి చెల్లాచెదురు కావడం సహజం. అలాగే అందమైన తుమ్మెదల బోలిన నీ కనుబొమలను చీకాకుతో ముడి పెట్ట వద్దని శ్రీనివాసుడందించే చిరునవ్వుల మకరందాన్ని స్వీకరించమని చెలుల సలహా.

### 4.1.28.2. కనుబొమలు – కస్తూరిరేఖలు :

కస్తూరి నల్లని సుగంధద్రవ్యం. దానితో తీర్చబడిన రేఖలే కస్తూరి రేకలు. కస్తూరి రేఖలకు కనుబొమలకు వర్ణసామ్యం. పెదతిరుమలయ్య –

పొంది పొంది జంకించకు బొమ్మలట్టే ముడి వడీ

సందిఁగస్తూరి రేఖల జాడబొమ్మలు 23-285

అని నాయిక కనుబొమలను కస్తూరి రేఖలతోపోల్చాడు.

## 4.1.28.3. కనుబొమలు – మరువిండ్లు :

ఆకార సామ్యంచే కనుబొమలకు మరువిండ్లకు పోలిక సమయసిద్ధం తాళ్లపాక సాహిత్యంలో ఈ ఉపమాన ప్రయోగం విస్తృతం. అన్నమయ్య -

వెలయ బొమలు మరువిండ్లుగాఁగా

నలి సంపెంగ విరి నాసిక యాయ 13-358.

నాయిక శరీరం మదనుని బండారం. ఆమె కనుబొమలే బాణ ప్రయోగానికి అనువైన విండ్లు. వాటి మధ్య సంధింపబడిన పూబాణమే సంపెంగను బోలిన నాసిక. పెదతిరుమలయ్య.

పాదల పూఁదూపులేడ భూమిఁజెఱకువిల్లేడ

సదర మీయింతి బొమ్మ జంకెనెలే గాక 23-269

మన్మధుని బాణాలైన పూలేమో పాదలలో దాగివున్నాయి. విల్లైన చెరకు నేలమీద ఉంది. ఆ రెంటిని ఒకచోట చేర్చిపుడే బాణ ప్రయోగం సాధ్యమవుతుంది. అంచేత ఆ బాణాలు, విల్లు యింతి చూపులు కనుబొమలుగా నెలకొన్నాయి. ఇక మన్మధ బాణ ప్రయోగం నిరాఘాటంగా సాగవచ్చు.

చిన తిరుమలయ్య :

మలయు జంకెనల బొమ్మలు చూచి రమణుఁడు

వెలయఁగ మదనుని విండ్లని భ్రమసె 16-8(శృం)

నాయిక కనుబొమలను చూచి మదనుని విండ్లుగా నాయకుడు భ్రమించాడు. చిన్నన్న పరమయోగి విలాసంలో

పాడిపాడి నెరులతో బొమదోయి బిగువు

సడలిన విండ్ల నా జాతె నాక్కిఁంత 2-105.

అని అందరివలె బిగువైన బొమదోయిని గుత్తైన విండ్లతో పోల్చడమే గాక వార్ధక్యంలో నెరసి వెంట్రుకలు రాలిన బొమలను పట్టు సడలిన విండ్లతో పోల్చడం విశేషం.

## 4.1.28.4. కనుబొమలు – ఇంద్రధనువు :

వర్షాకాలం ఉదయాస్తమయ సమయాల్లో ఆ వర్షపు నీటిబిందువులగుండా సూర్య కిరణాలు వక్రీభవనం చెంది ఆకాశంలో సప్తవర్ణాలతో కూడి ధనురాకారంతో గోచరించేదే ఇంద్రధనుస్సు. కనుబొమలను మరుని వింటితోనే గాక రంగుల హరివిల్లుతో కూడ అన్నమయ్య తిరుమలయ్యలు పోల్చారు. అన్నమయ్య

ఎలిమి బొమ్మల జంకె లింద్రధనువులు వొడిచె

మొలచెఁగన్నులఁగావి మొయిలు ఘనమై

కొలది కగ్గలపుగుంకుమ చెమట నెత్తురులు

పొలతిపై గురియుటకుఁ బోటివలె నాయ 4-100.

కుపిత అయిన నాయిక కళ్లలో కావిమొయిళ్లు ఆవరించాయి. నిలువెల్ల చెమటల వర్షం పట్టింది. వర్షపు నీటి బిందువుల ద్వారా ఎర్రని సూర్యకిరణ ప్రసారంచే ఏర్పడేదే ఇంధ్రధనువు ఇట కావిచూపులు, స్వేదవర్షం ఉండడం చేతే బొమల ఇంద్రధనువులేర్పడ్డాయి. పెదతిరుమలయ్య.

పొడవగు నీపై బొమ్మ జంకసనల

జడివాన క్రింద చాపములాయ 23-407.

జడివానలో ఇంద్రచాపాలే ఇంతి కనుబొమలు.

### 4.1.28.5. కనుబొమలు – అరచంద్రుడు :

అష్టమినాటి చంద్రుడే అరచంద్రుడు ఆకారసామ్యంచే విండ్లతోనే గాక అరచంద్రుడితో కూడ కనుబొమ్మలను పోల్చడం అన్నమయ్య ప్రత్యేకత.

అర చందురుఁ బోలినట్టి మా నొసలి బొమ్మ
లిరవై నిన్ను జంకించి యేమిసేసీని 19-466.

అని నాయిక కనుబొమ్మలను అరచంద్రునితో పోల్చాడు.

### 4.1.28.6. కనుబొమలు – ధూమకేతువు :

సూర్యుని చుట్టూ తిరుగుతూ ఘన పదార్థ కేంద్రంతో వెలుగుతున్న తోకకలిగినది తోకచుక్క అదే ధూమకేతువు. పలు సంవత్సరాల కొక పర్యాయం భూలోక వాసులకు దర్శనమిచ్చేదిది. తోకచుక్క అరిష్టదాయకమని మూఢనమ్మకం. ఈ నమ్మకం నాటికి నేటికి కూడ వున్నట్లు అన్నమయ్య వర్ణనవల్ల విదితం. అన్నమయ్య.

పడతి వేనలి జారి పగలు చీకట్లాయ
వొడలఁబులకల చుక్కలురకపొడమె
తొడరి కనుబొమ్మలనె ధూమకేతువు దోఁచె
పొడమె నుత్పాతములు పూటపూటకును
పరిగొనుచు విరహంపు పతి సూర్యుడుద ఇంచె 29-580.

అని విరహిణి అయిన నాయిక కనుబొమలను తోకచుక్కలతో పోల్చడం విశేషం. విరహిణి అయిన నాయిక శరీరంలో కలిగే మార్పులను జూచి ఎటువంటి ఉత్పాతం రానున్నదోననే చెలుల కలవరమిది. వేనలి జారి చీకట్లు క్రమ్మడం. పులకలనే చుక్కలు పొడమడం, కనుబొమలనే ధూమకేతువు దర్శనం అనంతరం విరహంపు పతి సూర్యుడుదయించడం ఈ వర్ణనా క్రమం. రాత్రి వేళల్లో

సూర్యోదయానికి పూర్వం తోకచుక్క వస్తుందనే ఖగోళం శాస్త్రాంశాల నెన్నింటినో తెలియజేస్తుంది.

## 4.1.29. చెవులు :

వినడానికికుద్దిష్టమైన ఇంద్రియమిది. ముఖానికిరువైపుల వుండే శరీరాంగం. దీనికి తొమ్మిది అనే సంఖ్య, శ్రీకారం, పల్లవం, ఉయ్యేల, ఉచ్చ్రతాడులతో పోలిక కవిసమయసిద్ధం. అన్నమయ్య చెవులను శ్రీకారాలతోను చిన్నన్న శ్రీకారం, తొమ్మిది అను సంఖ్య, చకోరాలు, మలగులతో పోల్చారు.

## 4.1.29.1. చెవులు –చకోరాలు :

చంద్రికాపానం చేసేవి చకోరాలు. కళ్లను చకోరాలతో పోల్చడం సంప్రదాయం. చిన్నన్న చెవులను కూడ చకోరాలతో పోల్చాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం।

- - - - - - - - - - పుష్పకార్మికు తండ్రిఁదలచి

యతని సద్గుణ కీర్తులనెడి చంద్రికల

శృతి చకోరములచే జూరలాడుచును 4ఆ-పు.174.

యశో హాస పుణ్యాలకు శ్వేతత్వ వర్ణనం కవిసమయం. చకోరాలు చంద్రికా పానం చేస్తున్నట్లు వర్ణించడం కూడ కవిసమయం. ఇట రుక్మిణీ కాంత చెవులే చకోరాలు. కృష్ణుని కీర్తే చంద్రిక కృష్ణుని సత్కీర్తి చంద్రికలను పారవశ్యంతో గ్రోలుతున్నవి రుక్మిణి శృతిచకోరాలు.

## 4.1.29.2. చెవులు – శ్రీకారం :

'శ్రీ' అనే అక్షరం శ్రీకారం . మెలికలు దిరిగిన ఆకార సామ్యంచే దీనికి చెవికి పోలిక కవిసమయసిద్ధం. అన్నమయ్య

చెక్కుటద్దముల దది శ్రీకార కర్ణములది 24-164.

అని నాయిక చెక్కులను అద్దాలతోను చెవులను శ్రీకారాలతో పోల్చాడు. చిన్నన్న ఉషాకల్యాణంలో

వీనులాయివి మరు వివిధాగమముల

గానంగ శ్రీకార వర్ణముల్ గా 1భా.పుట5.

శ్రీ అనే అక్షరం శుభ సూచకం. ఏదైన రచనను శ్రీ తో ప్రారంభించడం సంప్రదాయం. ద్వారకానగరంలోని స్త్రీల చెవులు మదన శాస్త్రాలకు శ్రీకారం చుట్టినట్లుందిట.

## 4.1.29.3. చెవులు – తొమ్మిది :

ఆకారాన్ని బట్టి చెవులను తొమ్మిది అనే సంఖ్యతో పోల్చడం కవిసమయం. చిన్నన్న అష్టమహిషీ కల్యాణంలో

ఇల దొమ్మిదవ లెక్కయొక్కటి మాకు

నే లెక్కలని హసియించు వీనులును 3-పుట 133

అని మధురానగరంలోని ఇంతుల చెవులు తొమ్మిది సంఖ్యను చూచి నవ్వుతున్నట్లు వర్ణించాడు. తొమ్మిదవ అవతారం కృష్ణావతారం. కృష్ణుని అవతార శ్రవణం కృష్ణలీలా వినోదాకర్ణనం చేస్తున్న మధురానగర మానినీమణుల చెవులు మమ్మల్ని నవసంఖ్యతో పోలుస్తారా మాకది ఒకలెక్కా అని తొమ్మిదిని అపహసిస్తున్నాయి.

## 4.1.30. నుదురు :

కళ్లకు కేశాలకు నడిమి భాగం నుదురు. ఆకారం, ఉజ్జ్వలతల సామ్యాల వల్ల అరచంద్రుడు, స్వర్ణపట్టిక, పలకలకు నుదుటికి పోలిక కవి సంప్రదాయం. అన్నమయ్య నుదుటిని అరచంద్రునితో పోల్చగా చిన్నన్న అరచంద్రుడు, హేమపత్రాలతో పోల్చాడు.

### 4.1.30.1. నుదురు – అరచంద్రుడు :

అష్టమినాటి అరచంద్రునితో నుదుటిని పోల్చడం కవిసమయం.

అష్టమీచంద్ర విభ్రాజ దళికస్థల శోభితా -ల.స.నా.5 శ్లోకం.

అని రాజరాజేశ్వరి వర్ణన. అన్నమయ్య

నువుఁబూవు కలువలు నూలుకొన్న శ్రీకారాలు

అవిరళమైన విండ్లు అరచంద్రుడూ 24-239.

అని అమ్మవారిని సకలోపమాద్రవ్యాల కూటమిగా వర్ణిస్తూ అరచంద్రుడే ఆమె నుదురుగా ఉపమించడం ఆ వర్ణనాక్రమాన్ని బట్టి స్పష్టమవుతుంది. ముఖాన్ని చంద్రునితో పోల్చడం కవిసమయం, కాని చంద్రుడు వర్తులాకారుడయినా అమ్మవారి నుదురుతో కూడా పోలలేక అరచందురుడయి పోయాడు.

ఖండేందు కైవడి గనుపట్టు నొసలు -1-పుట 40.

అని అనిరుద్ధుని నొసటిని అర్ధచంద్రుడితో పోల్చాడు. స్త్రీల నుదుటినే గాక పురుషుని నుదుటిని గూడ అర్ధచంద్రునితో పోల్చడం చిన్నన్న ప్రత్యేకత.

### 4.1.30.2. నుదురు – హేమపత్రం :

వాడుకలో భూర్జపత్రాలు, తాళపత్రాలు, తామ్రపత్రాలు ఉన్నాయిగాని హేమపత్రాలు లేవు.కాని నుదుటిని హేమపత్రంతో పోల్చడమిట ప్రత్యేకత.

చిన్నన్న ఉషాకల్యాణం

ఫాలంబులా యివి పంచసాయకుని

వ్రాలెడు హేమపత్రంబులు గాక 1భా-పుట 5.

ఇట ద్వారకానగర వాసినులైన సౌందర్యవతుల ఫాలభాగాలే హేమపత్రాలు. ఫాలంలోని గీతలు వ్రాలు. భవిష్యత్సూచకాలని విశ్వాసం. ఫాలంలోని వ్రాలును వ్రాసేవాడు బ్రహ్మ. కాని యిక్కడ వ్రాయసకాడు మన్మథుడు. పైగా

పంచసాయకుడు. సాయకమంటే బాణం., బాణాలు కూచిగా వుంటాయి, కూచిగా వున్న సాధనంతో వ్రాసిన వ్రాలు చెరగనిది. పైగా స్పష్టంగా ప్రకాశించేది. వ్రాసిన వాడు పంచసాయకుడైతే వ్రాయసం పనికి వాడబడినట్టిది నుదురయితే ఆ వ్రాత నారాయణుని కోసమేనని భావం.

## 4.1.31. ముఖం :

కళ్లు, ముక్కు, చెవులు, నోరు, చర్మం అనే పంచేంద్రియాల కూడలే ముఖం. కాంతి, ఔజ్వల్యాల సామ్యం వల్ల దీనికి చంద్రుడు, పద్మాలతో పోలిక కవిసమయం. అన్నమయ్య ముఖాన్ని తామర, దొంతి తామర, అంబుజం, పూబంతి, చంద్రుడు, వెన్నెలబయలు, అమృతపు బిళ్ల, అమృతపుఁజెలమ, జలధి, మెఱుగులగని, సోమశిల కనుమ, అద్దము, దీపం, సానబిల్లలతోను పెదతిరుమలయ్య చంద్రుడు, అద్దములతోను చినతిరుమలయ్య చంద్రునితోను చిన్నన్న చంద్రుడు, తామర, అద్దాలతో పోల్చారు.

## 4.1.31.1. ముఖం – తామర :

లక్ష్మికి నిలయం తామర పద్మముఖుల వదనాలలో లక్ష్మికళ ఉట్టిపడడం లోకవిదితం. పద్మం పుష్పరాజం. పద్మముఖులలోను ఆ రాజసం ఉట్టిపడడం సహజం. నాయిక ముఖం తామర. అందులోని కళ్లు తామరలు చెక్కిటపై చేర్చిన చేతులు (కరతలాలు) తామరలు. అంచేతే నాయిక ముఖాన్ని కేవలం తామరతోనే గాక దొంతితామర అంబుజాకరాలతో కూడ అన్నమయ్య పోల్చాడు. పద్మోపమానం వల్ల నాయిక పద్మినీ జాతి స్త్రీ అనే సూచన ఉంది.

తామర – అన్నమయ్య :

ఏటికే చెలియ నీవితడు యెదురెదుర
మోము వంచితిరి ముసిముసి సిగ్గులతో
తామరకుఁదామరే ధరఁజంద్రుఁడాయెనో మీ
మోముటద్దములలోనె మొరుగులు గంటిరో 30-194.

పెదతిరుమలయ్య :

సమ్మాళిగెలుమెట్టిసతిరాజసముతోడ
కమ్మియొక చెలిమీఁదగరము చాఁచి
తమ్మి మోము విచ్చి నీతో తలవాకిటనే వుంది
యెమ్మెలకేమాటలాడియేమనేరానిన్నును 23-83.

చిన్నన్న ఉషాకల్యాణం -

వదనంబులా యివి వలరాజు వల్లి
సదనంబులగు సరోజంబులు గాక 1భా-పుట5.

దొంతి తామర : అన్నమయ్య :

చెంతఁజెక్కునఁబెట్టిన చేతితోడ నుండగాను
దొంతితామరఆయ.తొయ్యాలిమోము 20-150.

అంబుజాకరం : అన్నమయ్య -

అంగనముఖమనేటి అంబుజాకరము పొంత
ముంగిటఁ జూపుల లేళ్లు మోహరించగా 30-195.

## 4.1.31.2. ముఖం – చంద్రుఁడు :

చంద్రుడు అమృత నిలయుడు. చల్లని తెల్లని వెన్నెలలతో అందరినీ అలరించే నెలరాజు. అయినా సూర్యునికాంతి తనపై పడడం చేత మాత్రమే వెలుగొందే ఉపగ్రహం. నాయకుని రాకతో కళలు దేరిన నాయికమోమే చంద్రుడు.

అన్నమయ్య :

ఉవిద వదన చంద్రోదయ వేళను
రవియగు సూర్యప్రభ నీవేఁగఁగ

యివల నవల మీ యిద్దరి వలననే

దివమును రాతిరి దెలియగఁగలిగె 30-197.

బ్రహ్మోత్సవాలలో శ్రీ వేంకటేశుడు సూర్యప్రభ, చంద్రప్రభలతో ఊరేగడం నాటికి నేటికి వుంది. సూర్యప్రభతో నాయకుడేతెంచగా నాయిక ముఖచంద్రుడు కళలు సంతరించుకున్నాడు. ఈ యిద్దరి వలననే లోకానికి రాత్రింబగళ్లు తెలియనవుతున్నాయి. పెదతిరుమలయ్య -

సతివదనము పూర్ణచంద్రుని బోలుచరే

అతని కన్నులు గలువలలరుఁగాని 23-240

చంద్రుడు కలువ బాంధవుడనుట కవిసమయం. ప్రేయసి వదన దర్శనం ప్రియునకు ఆహ్లాదజనకం. అంచేతే నాయిక ముఖచంద్రుని దర్శించిన నాయకుని కన్నులు కలువలై ఒప్పారాయి. చినతిరుమలయ్య -

మొలకనవ్వుల చెలిమోము చూచి విభుఁడు

తొలకు వెన్నెలకు చందురుఁడని భ్రమసె 16-8.

నవ్వుకు శ్వేతత్వాన్నాపాదించడం కవిసమయం. అంచేతే చిరునవ్వులతో ఒప్పారే నాయికముఖం వెన్నెలలు వెదజల్లే చంద్ర బింబమయింది. చిన్నన్న అష్టమహిషీ కల్యాణం -

కనలెడు రాహువు గళము చొత్తెంచు

వనజారిగతి నొప్పువాడు మోములును 2ఆ-పు.64.

రాహువు చంద్రుని కబళించడం పౌరాణికాంశం. రాహుగ్రస్తమైన చంద్రుడు కళావిహీనుడై గోచరించడం లోకవిదితం. కృష్ణుడు కాళియుని మర్దించగా బాధాతప్తమైన కాళియాంగనల మోములే రాహుగ్రస్త చంద్రబింబాలు.

### 4.1.31.3. ముఖం – అమృతపుచెలమ :

చంద్రుడు అమృత నిలయుడు. అమృతములూరే చలమ అమృతచలమ. అమృతం మధురమైనది. ఆస్వాదించినవారిని అమరులుగా జేసేది. స్త్రీ ముఖాన్ని చంద్రబింబంతో పోల్చడం కవిసమయం. ఆస్వాదించిన వారికి అమరసౌఖ్యాలిచ్చేది నాయిక వదనామృతం. అంచేత అన్నమయ్య ముఖాన్ని చంద్రునితోనే గాక అమృతపుచలమ, అమృతపుబిళ్ల, వెన్నెలబయళ్లతో గూడ పోల్చాడు.

అమృతపు చెలమ :

అతివేణి నీమోము అద్దమా మోవితేనె
చెలరేగే అమృతపుఁజెలమగాక 13-443.

అమృతపు బిళ్ల :

మించులైన యమృతపు బిళ్ల లానన పద్మములు 4-33.

వెన్నెల బయలు :

పండు వెన్నెల బయలు పడఁతి నీ నవ్వు మోము 24-58.

### 4.1.31.4. ముఖం – సోమశిల కనుమ :

ఇది కడపమండలంలోని ఒక గ్రామం. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి'

ఈ సూక్తిని అక్షరాల పాటించినవాడు అన్నమయ్య. జన్మభూమినే తన యిష్టదైవమైన కొండలరాయని కూరిమి భూకాంతగా దర్శించాడు.

సొంపుల నీవదనపు సోమశిల కనుమ
యింపులెల్లఁజేకొనగ నిల్లు నీపతికి 12-115.

నాయకుని సుఖ నివాసానికి అనువైన చంద్రకాంతశిలా నిర్మితమైన గృహమే నాయిక యింపైన వదనం. నాయకుడు కొండల రాయడు. అతని నివాసం కొండలు; కొండకనుమలే. ఆకొండ కనుమలే నాయిక రూపం.

### 4.1.31.5. ముఖం – మెరుగులగని :

మెఱపు ఒక కాంతిపుంజం. కనుల కాంతులతో కూడిన ముఖం మెరుపులగని.

గమకపు నీ ముద్దు టుంగరపు గురుతు చూచి
గములైన మెఱుగల గని యీయమొగము 13-233

ఇది రామముద్రికను గాంచిన సీతాసతిముఖం. రామముద్రిక మెఱపులతో కూడివుండవచ్చు. మెఱపులీనే వస్తువును చేత పట్టుకొన్నప్పుడు ఆ వస్తువుకాంతి నలువైపుల కమ్ముకోవడం సహజం. అందువల్ల సీతమ్మ ముఖం మెఱపులగని కావడం సహజం. అంతవరకు విషాదమేఘాచ్ఛాదితమైన సీతమ్మముఖం రామముద్రికను చూచి రాబోయే ఆనంద బాష్పవర్షాన్ని సూచించే మెఱపులగని అయ్యింది.

### 4.1.31.6. ముఖం – అద్దం :

అద్దం తెల్లనిది. స్వచ్ఛము నిర్మలము కాంతివంతమైనది. అయితే మృదువైనదికాదు. పూబంతి మృదువైనది కాని ప్రకాశవంతమైనదికాదు. చంద్రుడు అమృత కిరణుడు. కాంతికి నిలయుడు. కాని కళంకితుడు. బంగారు మేని ఛాయతోస్వచ్ఛము. నిర్మలము, కాంతి వంతము, సున్నితము అయిన తాళ్లపాక నాయికల ముఖ సౌందర్యాన్ని దర్శింప చేయగల సామర్థ్యం ఈ ఉపమా సామగ్రికి సమగ్రంగా లేదు. అంచేతే ఈ ఉపమాద్రవ్యాలన్నిటి మేలు కలయికే ఆ కాంతల ముఖం. అన్నమయ్య.

చందురుని బోలేటి సరసపు నామోము
అందపుబూబంతి యంటానాడుకోకురే

ముందునా రమణునికి మోము చూచెటద్దమిది
కందువలేని నిందలు గడింతురటే 13-56.

పెదతిరుమలయ్య -

వొద్దికఁజందురు కంటే నుదుటైన నెమ్మోము
అద్దమంటా నాడుకొంటే నందము తానా
పొద్దువోక చెలులెందుఁబోలిచిన తమలోని
సుద్దులింతే కాక వాని సొంపుదప్పినా 23-523.

చిన్నన్న ఉషాకల్యాణం :

కళలు దేరెడు నిశాకాంతుండో కాక
నలుపు లేదొక యింత నవ్వే దర్పణమొ
ధవళంబుగాదు కుందనపు తామరయొ
జవరాలి నెమ్మోము చాయమే చాయ 1భా - పుట 41.

### 4.1.31.7. ముఖం - దీపం :

కాంతి పవిత్రతలకు ప్రతీక దీపం. చీకటిలో మార్గదర్శకమైనది దివ్వె. దూరంగా వుంటే దారి చూపించే ఈ దివ్వె అత్యాశతో ఆలింగనం చేసుకుంటే నిలువెల్ల దగ్ధం చేస్తుంది. స్త్రీ ముఖాన్ని దివ్వెతో పోల్చాడు , అన్నమయ్య.

వలచి పైకొఁగరాదు వలదని తొలఁగరాదు

- - - - - - - - - - - - - - - - - -

అంగడి కెత్తినట్టి దివ్వెలంగన ముఖాంబుజములు 1-1.

ఇంటికి దీపం ఇల్లాలే. ఆ దీపకాంతిని కాదనలేము. కాని ఆ కాంతికి వశుడై మాయామోహితుడైన మానవుని జన్మనిలువెల్ల దగ్ధం. తస్మాత్ జాగ్రత్త ! అని అన్నమయ్య హెచ్చరిక.

## 4.1.31.8. ముఖం – సానబిల్ల :

కత్తులు, కటార్లు మొదలైన ఆయుధాలను పదను పెట్టడానికి ఉపయుక్తమయ్యేది సానబిల్ల. అన్నమయ్య –

అతివమోముఁజంద్రుఁడనేటిసానబిల్లకు
తతి జడి (డ?) యనేటి సూత్రము చుట్టి
అతనుఁడు చూపుల యమ్ములు సానఁబట్టితే
నతమై మోహపుఁబొడి సారె రాలీఁగోవయ్యా 13–409.

గుండ్రని సానబిల్ల గిరగిర తిరగడానికనువుగ దాని చుట్టూ తాడు చుట్టి ఒక యంత్రంగా దానినమర్చి ఆయుధాలు పదను పెట్టడం ఈ నాటికి వుంది. గుండ్రని నాయిక ముఖ చంద్రుడే సానబిల్ల. ఆ బిల్లను చుట్టిన తాడే ఆమెజడ. సానబెట్టబడే ఆయుధాలు ఆమెచూపులనే అమ్ములు. ఈ చూపులే మరుబాణాలు. పంచసాయకుని బాణులు మొక్కవోకుండడానికి గల ప్రధానకారణం నాయిక మోము అనే సానబిల్లే.

## 4.1.31.9. ముఖం – జలధి :

అనర్ఘ రత్నాలకాలవాలమైనది సాగరం. దేవతలు దివ్యులు కావడానికి కారణం అమృతం. ఆ అమృతానికి ఆకరమైనది పాలకడలి. మర్త్యులను సైతం అమర్త్యులుగా చేయగల వాడు తిరువేంకటాచలాధిపుడే. ఆ అమృతాన్ని మనకందించినవాడు బ్రహ్మ. ఆ బ్రహ్మ వదనమే జలధి. అన్నమయ్య.

జలజాసనుని వదన జలధి మధ్యమునందు
అలరవెలువడిన పరమామృతం బితఁడు 1–170.

బ్రహ్మ సృష్టికర్త. అతని సృష్టిలో అపూర్వమైన వాడు తిరువేంకటాచలాధిపుడు.

## 4.1.32. ముంగురులు :

ముందుండే కురులే ముంగురులు ముఖంపై వ్రేలాడే కురులు ముంగురులు. వీటికి ఆలంకారిక సిద్ధమైన ఉపమానాలేవి లేవు. అయినా అన్నమయ్య తోరణాలు, గాలాలతోను చిన్నన్న నెలవంకలతోను పోల్చారు.

## 4.1.32.1. ముంగురులు – తోరణం :

ద్వారానికి వ్రేలాడేది, ఆ యింట్లో జరిగే శుభకార్యాన్ని సూచించేది తోరణం. నాయిక నుదుటిపై వ్రేలాడే ముంగురులకు తోరణాలకు పోలిక.

అన్నమయ్య -

నెలత నుదిటిపై నీలపుఁగురులనె

తొలుతనె కట్టెను దోరణము 4-71.

ఇట నాయిక నిలువెల్ల నాయకుని రాకకై ఎదురుచూస్తోంది. నాయకుని రాక శుభసందర్భంగా ఆమె నుదిటిపై వ్రేలాడే ముంగురులే తోరణాలుగా అతని నాహ్వానిస్తున్నాయి. నాయిక శరీరమే నాయకుని రాకకై కైసేసిన గృహంకాగా ఆ గృహానికి వ్రేలాడే తోరణమే ఆమె నుదుటిపై నీలపు గురులు.

## 4.1.32.2. ముంగురులు – గాలాలు:

చేపలను పట్టడానికుపయుక్తమయ్యే పరికరం గాలం. నల్లని ఉక్కు కమ్మితో తయారు చేయబడి చివర వంకర తిరిగివుండేది గాలం నాయిక కనులే చేపలు కాగా ఆ చేపలను పట్టడానికి మరుడు పన్నిన గాలులగా ఆమె నుదుటిపై కురులను అన్నమయ్య అభివర్ణించాడు.

చింతచేతనిదె చెలియ నుదుటిపై

చెంతలఁజెదరిన చిరు నెరులు

కాంత కన్నులను గండుమీలకును

కంతుఁడు వేసిన గాలములే 12-174.

గాలానికి చిక్కిన చేప కాస్త సేపు గిలగిల కొట్టుకొని తర్వాత చేష్టలుడిగి పడిపోవడం కద్దు. అలాగే నాయకునిపై చింతతో నిశ్చేష్టురాలైన నాయిక కళ్లను మరుని గాలానికి చిక్కిన చేపలతో పోల్చాడు ఇక్కడ మరుని గాలాలే నాయిక ముంగురులు. ముంగురులు కూడ గాలాలవలె నల్లగా కొద్దిగా వంకర తిరిగి వుండడం సహజం. కళ్లను చేపలతో పోల్చే సంప్రదాయముండగా ఆ కళ్లదాకా వ్రేలాడే ముంగురులను గాలాలతో పోల్చి నూత్న సంప్రదాయాన్ని సంతరించినవాడు అన్నమయ్య.

## 4.1.32.3. ముంగురులు – నెలవంకలు :

వంకర తిరిగిన ముంగురులను గాలాలుగా అన్నమయ్య అభివర్ణిస్తే నెలవంకలుగా చిన్నన్న అభివర్ణన. అయితే ఇక్కడి విశేషం ఆ ముంగురులు అమ్మవారివి కావు స్వామివి.

చిన్నన్న పరమయోగి విలాసం –

ఆ పూర్ణసోముని హసియించు మోము

నిటల భాగంబున నెలవంకలైన

కుటిల కుంతలములు కొమరు దీపింప 1ఆ-పుట 36.

తనను కొలిచే భక్తబృందానికి వరములిచ్చే వరదరాజా ముఖబింబమే చంద్రబింబం. నిటల భాగంపై వ్రేలాడే ముంగురులే నెలవంకలు. ఆకాశంలోని ఒక్క నెలవంకే మనకింత చల్లదనాన్నిస్తుండగా అన్ని నెలవంకలతో నెలకొన్న వరదరాజస్వామి తన భక్తబృందంపై చల్లని దృక్కుల ప్రసరించడంలో వింతలేదు గదా !

## 4.1.33. కురులు :

తలమీద వుండే వెంట్రుకలే కురులు. వార్ధక్యంలో నెరసి పోవడం వీటిస్వభావం అయినా కురులను నల్లనివిగానే వర్ణించాలని కవిసమయం. కురులు నల్లగా వుండడం సౌందర్య లక్షణం. అంచేతే వయసుపైబడి నరసిన వెంద్రుకలను సైతం నల్లని రంగులతో అలంకరించుకోవడం ఈ కాలంలో మనమెరిగినదే కదా! ఈ సౌందర్యదృక్పథంతోనే పై కవిసమయ మేర్పడి వుంటుంది. కురులను చీకటి, నాచు, మేఘం, నెమలిపింఛం, తుమ్మెదలు, చామరం, యమునాతరంగాలు, నీలాలు, ధూమం మొ॥ వాటితో పోలిక కవిసమయసిద్ధం. అన్నమయ్య వీనిని తోరణం, గాలాలు, తుమ్మెదలు, నీలాలు, మోహపుటురులు, మరుని అంపగరులతోను పెదతిరుమలయ్య తెమ్మెదలు, చీకటి, నీలపుగనులతోను పోల్చారు.

## 4.1.33.1. కురులు – తుమ్మెదలు :

పూలలోని మకరందాన్ని గ్రోలే నల్లని కీటకాలే తుమ్మెదలు. మదనుని వింటినారిగా నెలకొన్నవివి. నల్లని కురులకు తుమ్మెదలకు పోలిక కవిసమయ సిద్ధం.

అన్నమయ్య:

గతిగూడ గుంపుగట్టి కాపురము సేసీనవే
మితిమీరి శిరసుపై మేఁటి తుమ్మెదలు 2-286.

ఇంతి జవ్వనవనంలో ప్రవేశించగానే మేము మేమంటూ వలరాజు పౌజులన్నీ వంతులు వాసులతో ఆమె దరిచేరాయి. ఆ పౌజులో అతిప్రధానమైనవి మదనుని వింటినారి అయినవి అయిన తుమ్మెదలే గుంపుకట్టి ఆమె శిరసుపై కాపురం ప్రారంభించాయి. ఇక మరుడు వింటినారిని సవరించి నాయకునిపై విల్లు ఎక్కుపెట్టడమే ఆలస్యం.

చిన్నన్న అష్టమహిషీకల్యాణం –

మావుల తేనెకు ముసురు తుమ్మెదల

కైవడి నలకలఁ గప్పు మోములు 1ఆ-పుట 29.

శైశవ మూర్తులైన బలరామకృష్ణుల ముఖాలపై చెలరేగిన అలకలు మావి మకరందాన్ని గ్రోలడానికై ఏతెంచిన తుమ్మెదల తలపిస్తున్నాయి.

## 4.1.33.2, కురులు – శైవలం :

శైవలమంటే నాచు. నాచు తీగెలతో కురులను పోల్చడం సంప్రదాయ సిద్ధమే.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం -

హరికురులని యొక్క యతివ శైవలము

సరఁగునఁబట్టి వేసరి కేరితిట్టి 2ఆ-పుట111.

యమునా నదిలో జలక్రీడలాడే గోపికలు ఆనదిలో తేలియడుతున్న శైవలాన్ని చూచి కృష్ణుని కేశపాశమేనని భ్రాంతిచెంది పట్టబోయి అపహాస్యం పాలయ్యారు. కృష్ణుని జుట్టు చేజిక్కించుకోవడం సాధ్యమా !

## 4.1.33.3. కురులు–నీలాలు :

నవరత్నాలలో నీలం ఒకటి. నవరత్నాలన్నీ కాంతివంతమైనవి. అన్నమయ్య నల్లని కురులను నీలాలతో పోల్చడం చేత నీలాలలోని నైగనిగ్యం నాయిక కురులకు ఉందనే భావం ప్రస్ఫుటం.

అలులు నీలపు మణులంధకారము మేఘము

నలుపుల రాశివో నలినాక్షి తురుము 13-288.

నాయిక తురుము యొక్క నైల్యాన్ని దృగ్గోచరం చేయడానికై నల్లని వస్తుసముదాయాన్నంతటిని మన కళ్ళముందుంచాడు. ఆ కురులే తుమ్మెదలు, నీలాలు, చీకటి, మేఘము, నలుపులరాశి కూడ. పెద తిరుమలయ్య -

నెలఁత నీ తురుమిది నిండు నీలపుగని 23-510.

అన్నమయ్య కురులను నీలాలతో పోల్చగా పెదతిరుమలయ్య ఏకంగా నీలాల కుత్పత్తి స్థానమైన నీలపుగనే అని అభివర్ణించాడు. చిన్నన్న అష్టమహిషీకల్యాణం -

నీలంపు సరులలో నిగ్గులు వెడలు

పోలికఁ గుంతలంబుల నీరు జాఱ 2ఆ - పుట 114.

కృష్ణునితో కూడి యమునలో జలక్రీడలాడే గోపకాంతల కురులనుండి జాలువారుతున్న నీరు నీలంపు సరులలో నిగ్గులు వెడలుచున్నట్లున్నదని అభివర్ణన. ఇట బారైన వారి కేశపాశాన్ని నీలాల మాలలుగా ఉపమించడం విశేషం.

## 4.1.33.4. కురులు – మోహపుటురులు :

ఉరులంటే త్రాళ్లు. మోహపరచి బంధించేవి మోహపుటురులు. నాయకుని మనసును మోహింపజేసి బంధించే నాయిక కురులే మోహపుటురులు. అన్నమయ్య

అంగన కురులట్టె మోహపుటురులు

సింగారపు గురులు మించిన తరులు 22-515.

## 4.1.33.5. కురులు – అంపగరులు :

బాణానికి చివర కట్టబడ్డ ఈకెలు అంపగరులు. నాయిక కురులకు ఆకార సామ్యంచే అంపగరులతో పోలిక. అన్నమయ్య -

తెఱవదలపోయ చిత్తిణి జాతిగాఁబోలు

నెఱుల విచ్చుచు వీధినిలుచున్నది

నెఱతనము మరుఁడు తను నిండనేసిన యంప

గరులిన్ని యనుచు లెక్కలు వెట్టు గతిని 12-123.

స్త్రీలను వారి రూపరేఖావిలాసాదులబట్టి శంఖిణి, చిత్తిణి, హస్తిణి, పద్మిని అని నాల్గుజాతులుగా ఆలంకారికులు విభజించగా అన్నమయ్య జగదేకమోహిని

అయిన సుందరి మోహిని జాతి అని అయిదవజాతిని గూడ చేర్చి తన నాయిక ఆ అయిదు జాతుల లక్షణాలు మూర్తీభవించిన స్త్రీ మూర్తిగా అభివర్ణించాడు. ఈ నాయిక తన కురుల సోయగాన్ని ప్రదర్శించడానికా అన్నట్లు తలారవెంట్రుకలను విరబోసుకొని వీధిలో నిలుచున్న నెరజాణ. ఈమె చిత్తిణి జాతిదే అయివుంటుంది. శ్రీ వేంకటేశునికై ఎదురు చూచే ఆమె శరీరం నిండా మరుడేసిన అంపగరులే సుమా ఇవి అన్నట్లు ఆ విరబోసిన నెఱులు ఆమె శరీరాన్ని కప్పివేశాయి.

## 4.1.34. కొప్పు :

అందంగా ముడిచిన కురుల సముదాయమే కొప్పు. దీనికి రాహువు, మయూర పుచ్ఛాలతో పోలిక ప్రసిద్ధం. తాళ్లపాక సాహిత్యంలో కొప్పువర్ణన విస్తృతంగా కనిపిస్తుంది. అన్నమయ్య కొప్పు నెమలి, కొత్తపేయలగూడు, శిఖరం, నీలమేఘం, చీకటి, రాహువు, అలులు, నలుపులరాణి, కామాంధకారం, చింతలచీకటి, మరుని ఆయుధ శాలల తోను పెద తిరుమలయ్య చక్కిలాలగంప, చీకటి, నీలపుగని, అలులతోను చిన్నన్న అలులు, మయూరము, నీలమేఘము, దుఃఖాంధకారము, నీలకంఠములతో పోల్చారు.

## 4.1.34.1. కొప్పు – కొత్తపేయలగూడు :

కొత్తగా పాలువిడిచిన ఆవు దూడ పెయ్య. ఆ పెయ్య దూడ చిన్ని మూపురమే గూడు. ఆకార పరిణామాలచే నాయిక కొప్పును కొత్తపేయల గూడుతో అన్నమయ్యపోల్చాడు.

కొత్తపేయల గూడంటా కొప్పంటేవు 13-156.

ఇక్కడ నాయకుడు గోవులపాలించే గోపాలుడు. అందువల్ల నాయిక కొప్పు అతనికి అనునిత్యం పరిచయమైన కొత్తపేయలగూడులా గోచరించడం సహజం.

### 4.1.34.2. కొప్పు – నెమలి :

నెమలి అందమైన పక్షి. విప్పారిన అందమైన పింఛం కలదిది. కొప్పుకు మయూర పుచ్ఛంతో పోలిక కవిసమయం. అన్నమయ్య -

నిచ్చలు మాసెంపలపై నెమలివంటిది కొప్పు 13-582.

పలురకాల ఆకారాలలో కొప్పులు వేయడం నాటికి నేటికి వుంది. చెంపలపైనుండి వెంట్రుకల దువ్వి నెమలి ఆకారంలో వేయబడ్డ నాయిక కొప్పు ఇది.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం -

ఉరగంబునుమియు మయూరంబువోలె

సరజాలు పూదండ సలవడు కొప్పు 1ఆ-పు.35

ఇది పెరుగు చిలుకుతున్న యశోదమ్మ అందమైన కొప్పు. దధి మధియించే శ్రమవల్ల ఆమె కొప్పులోని పూలదండ క్రిందికి జారింది. పాము నెమలికి ఆహారం. పాము తెల్లనిది పూలు తెల్లనివి. యశోదమ్మ కొప్పునుండి వ్రేలాడుతున్న పూదండ నెమలినోటినుండి వ్రేలాడుతున్న పామును తలపిస్తోంది. ఇది చిన్నన్న భావనాశక్తికి ప్రతీక.

### 4.1.34.3. కొప్పు – తుమ్మెదలు :

కురులన్నీ కూర్చి ముడివేసిందే కొప్పు. కురులు తుమ్మెదలుకాగా ఆ తుమ్మెదల గుంపే కొప్పు. మదనుని వింటినారి తుమ్మెదలు. అన్నమయ్య.

అలులే తురముగదే అదె నీకు

వలరాజు విలునారి వడిబెట్టీనటవే 13-189.

పతిని బాసిన విరహంతో నాయికకు చిత్తభ్రమణం కలిగింది. ఆ భ్రమణంలో తుమ్మెదలబోలిన తన కొప్పునే చూచి వలరాజు వింటినారిగా భావించి కలతచెందింది. నీ తురము తుమ్మెదలే, మరుని వింటినారి తుమ్మెదలే. రెండూ

ఒకేజాతికి చెందినవే మైత్రి కలవే అంచేత భ్రమించి కలత చెందవద్దని చెలుల సలహా. పెద తిరుమలయ్య -

మితిలేని తురుము తుమ్మెదల (బోలుచరే
ముంచి విభుచూపు(దేంట్లు మూ(గుగాని 23-240

"Birds of the same feathers flock together" - అని ఆంగ్లసామెత. ఒకే జాతి పక్షులు ఒకేగూటికి చేరడం సహజం. నాయిక కొప్పు నాయకుని చూపులూ రెండూ తుమ్మెదలే. అంచేత నాయిక తురుము తేంట్లు నాయకుని చూపుతేంట్లను ఆకర్షించాయి. రెండూ ఒకే గూటికే చేరాయి.

## 4.1.34.4. కొప్పు - రాహువు :

రాహువు నవగ్రహాలో ఒకటి. ఇది నల్లని సర్పాకృతిలో వుంటుందని పురాణప్రసిద్ధం. సూర్యచంద్ర గ్రహణకారకుడు రాహువు. నాయిక వదనమే పూర్ణచంద్రుడు. ఆ చంద్రుడు నింగిపై కెగసిపోకుండ కబళించడానికి సంసిద్ధంగా కాచుకున్న రాహువే నాయిక కొప్పు అని అన్నమయ్య అభివర్ణన.

పొల(తి వదనము పున్నమచంద్రు(డు
బలిమి నెగయునని భయమునను
మెలు(త చికుర ధమ్మిల్లపు రాహువు
తల(జెదరగ నిది దైవమె సేసె -4-17.

నాయిక వదనాన్ని పున్నమచంద్రుడుగా కొప్పును రాహువుగా అభివర్ణించడం పున్నమనాడే చంద్రగ్రహణం ఏర్పడుతుందనే ఖగోళ శాస్త్రాంశ సూచన.

చిన్నన్న పరమయోగి విలాసం.

- - - - - - వదనేందు బింబమును
కచభార రాహువు కబళింపకుండ

రచనఁగాపిడిన చక్రంబులో యనఁగ

మూల ఎన్మిదియైన తాటంకముల్ పూని 5ఆ-429.

ఇది సాక్షాత్తు గోదాదేవి కొప్పు. ఈ కొప్పుఅనే రాహువు ఆమె వదనేందుబింబాన్ని ఎక్కడ కబళించివేస్తుందోనని శ్రీ మహావిష్ణువు తాటంకాలనే చక్రాలను ఆచెంతనే కాపు ఉంచాడు.

## 4.1.34.5. కొప్పు – నీలమేఘం :

నీలమేఘంతో కొప్పును పోల్చడం అన్నమయ్య, చిన్నన్నల రచనలలో కనిపిస్తుంది. కృష్ణ, నీల వర్ణాలకైక్యం చెప్పడం కవిసమయం. నీలమేఘమంటే నల్లని మేఘమనే భావం. అన్నమయ్య -

నీలమేఘము చాయ నీమేనుగాని పెద్ద

నీలమేఘమెపో నెలఁత కొప్పు 12-71.

శ్రీ వేంకటేశ్వరుని శరీరచ్ఛాయ కేవలం నీలమేఘచ్ఛాయను బోలివుంది అంతమాత్రమే. ఆ నీలమేఘమే సరాసరి నాయిక కొప్పుగా అమరిందట ! ఇది అమ్మవారి పట్ల అన్నమయ్యకు గల పక్షపాతాన్ని సూచిస్తుంది.

చిన్నన్న అష్టమహిషీకల్యాణం -

నీలమేఘంబుపై నీలమేఘంబు

వ్రాలియొప్పెడి గతి వలనొప్పు కొప్పు 2ఆ-పుట 106.

ఇట శ్రీకృష్ణుని శరీరమే ఒక నీలమేఘంకాగా ఆ నీలమేఘంపై వ్రాలిన మరొక నీలమేఘమే కృష్ణుని కొప్పు.

## 4.1.34.6. కొప్పు – చీకటి :

నల్లని కొప్పును వర్ణసామ్యాన్ని బట్టి నలుపుల రాశి, చీకటి, చింతల చీకటి, కామాంధకారం, దుఃఖాంధకారాలతో పలురీతుల పోల్చడం తాళ్లపాక సాహిత్యంలో కనిపిస్తుంది. అన్నమయ్య -

అంధకార భూమి :

అలివేణి ధమ్మిల్ల మంధకారపు భూమి
కలికి రమణునకు నేకత మొసఁగను 12-112.

నలుపులరాశి :

అలులు, నీలపు మణులంధకారము మేఘము
నలుపుల రాశివో నలినాక్షి తురుము 13-288.

కామాంధకారము :

మీరిన నీతురుము తుమ్మిద మూకలా
కారుకమ్మె కామాంధకారముగాక 13-288.

చింతల చీకటి :

చేకొను నాతురుమిది చిత్తము లోపలనున్న
చీకాకుల చింతల చీకటి సుమ్మీ 27-433.

అని నాయిక కొప్పును పలురకాల చీకట్లతో పోల్చడమే గాక పూలతోడి కొప్పును

వేఁకపు నెరుల కొప్పు వెక్కసపు విరులతో
తేఁకువ మీరఁగ గడు దీపించఁగా
చీఁకటి లోపల మించు చిన్నిచిన్ని వెన్నెలల
తోఁక చుక్కలై చూడఁ దొంగలించీనే 12-334.

అని నల్లని కొప్పులోని తెల్లని పూలను చీకటిలోని తోకచుక్కలుగా అభివర్ణిస్తే పెదతిరుమలయ్య :

అందపుఁజెలియ తురుమటు నిలువున వీడి
పొందుమాలి వేరొక పోలికాయను

ముందర (జం(దుడు వచ్చి మోహరించితే(జీకటి

పందమై వెనకతీసి పారినయట్లున్నది 23-338.

ఈ వర్ణనలో నాయకుడే చం(దుడు. నాయిక కొప్పే చీకటి. చం(దుడు వస్తే చీకట్లు తొలగిపోతాయి. ఇది మరుసం(గామం ఈ సం(గామంలో నాయక చం(దుడు వచ్చి మోహరిస్తే నాయిక కొప్పువీడి ఆమె వెన్ను నా(శయించింది. రణరంగంలో ఓడిపోయిన పిరికివారు వెన్నుచూపించి పారిపోవడం సహజమేగదా! మరుకేళిలో కేశబంధం ఈవీబంధం సడలడం సహజమే.

చిన్నన్న అష్టమహిషీకల్యాణం -

కదిసి దుఃఖాంధకారమ్ము తమ్ము

బొదివిన రీతి కొప్పులు వీడి పారల -3ఆ-పుట 145.

ఇవి కంసుని కాంతల వీడిన కొప్పులు. తమ కాంతుని కోల్పోయిన దుఃఖంతో వీడి చిందరవందరలైన వారికొప్పులు వారిని పాదివిన దుఃఖాంధకారాన్ని పోలివున్నాయి.

ఈ విధంగా కేవలం కొప్పునేగాక పూలతోడి కొప్పును, సగంవీడిన కొప్పును, చిందరవందరైన కొప్పును సందర్భానుసారంగా మనోజ్ఞంగా వర్ణించడం సహజత్వానికి దగ్గరగా వర్ణించాలనే తాళ్లపాక కవుల అభిలాషను వ్యక్తపరుస్తుంది.

## 4.1.34.7. కొప్పు – మరుని ఆయుధశాల :

పూలే మరుని ఆయుధాలు. ఆ పూలతోడిదే మగువకొప్పు. అంచేత మగువకొప్పే మరుని ఆయుధ శాల. అన్నమయ్య -

మరుని ఆయుధశాల మగువకొప్పు

తొరలించి విరులెల్లా( దురిమె(గాన 29-196.

మరుని ఆయుధాలు తిరుగులేనివి వాటికి లోబడని వారు లేరు. మరి ఇక అట్టి సమ్మోహనా(స్త్రాలకు నెలవైనదే మగువకొప్పు. అది ఆ నాయకుని

సమ్మోహితుని చేయడంలో వింతలేదు గదా ! ఆవశీకరణ శక్తి దానికుంది. మగువ శరీరమంతా మదనుని భాండాగారమే అందులో అతిముఖ్యమైన ఆయుధశాలే మగువ కొప్పు.

## 4.1.34.8. కొప్పు – శిఖరం :

కొండ, రథం మొదలైనవాటి అగ్రభాగమే శిఖరం. ఎత్తైనది శిఖరం. శరీరానికంతటికి ఎత్తైనది కొప్పే. అంచేత ఈ రెంటికి పోలిక. అన్నమయ్య -

అలమేల్మంగ కాఁగిటి హస్తములే పగ్గాలు
చెలఁగిన పెనుఁగొప్పే శిఖరము 29-375.

మదనుని జయించడానికి దండెత్తే నాయకునికి నాయిక శరీరమే రథంకాగా ఎత్తైన ఆమె కొప్పే ఆ రథశిఖరం. కొండపై రథోత్సవాలను తిలకించే అన్నమయ్యకు ఎంతో ప్రీతి పాత్రమైది రథోపమానం.

## 4.1.34.9. కొప్పు – చక్కిలాల గంప :

ఉపనయనాది శుభ కార్యాలలో ప్రత్యేకతను సంతరించుకొన్న పిండివంట చక్కిలం. చక్రాకృతి లో తయారుచేయబడే పిండివంట తయారు చేసేవారి చేతి నైపుణ్యాన్ని సూచించే వంటయిది. పెక్కు చక్కిలాలతో కూడిన గంప చక్కిలాల గంప. కొప్పులను చిన్నవిగా పెద్దవిగా పలు ఆకారాలో పలుపద్ధతులలో వేయడం మనమెరిగినదే. జుట్టును మెలిదిప్పి చుట్టలుగా చుట్టి ముడివేసే పద్ధతి ఒకటి. ఇది అచ్చు చక్కిలాలరాశిని పోలివుంటుంది. పరిమాణంలో పెద్దదైన వస్తువును గంప, చాట (చాటభారతం) లతో పోల్చి వర్ణించడం మనమెరిగిందే. పెదతిరుమలయ్య గోపికల పెద్ద కొప్పులను చక్కిలాలగంపతో పోల్చాడు.

సతుల పెద్ద కొప్పులు చక్కిలాల గంపంటా
బతిమాలి వేఁడీ నప్పటి గృష్ణుడు 23-206.

తిండి బోతైన కృష్ణయ్యకు గొల్లెతల కొప్పులు చక్కిలాల గంపలా గోచరించడం సహజమే కదా! మధురమైన ఉపమానమిది.

## 4.1.35. జడ :

పాయలు చేసిన కురులతో అల్లబడిందే జడ. నల్లగా పొడవుగా ఉండే జడను సర్పం, తుమ్మెదబారు, దండం, ఖడ్గం మొ॥ వాటితో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య జడను సర్పం, తుమ్మెదలు, ద్రోణాలతోను పెదతిరుమలయ్య తుమ్మెదలు, ద్రోణాలతోను పెదతిరుమలయ్య తుమ్మెదతోను చిన్నన్న సర్పం, రాహువు,కలువలదండ, తరటుల తోను పోల్చారు.

## 4.1.35.1. జడ – కృష్ణసర్పం :

నల్లని సర్పం కృష్ణసర్పం. నల్లని పొడవైన సర్పాకృతిని బోలింది జడ. సర్పం వాయుభుక్. గాలిని భోంచేసేది. అన్నమయ్య –

అతివ నీయంగములె అతను తాపపుమాటు
తతినొకటి కొకటి కని దైవమే సేసె ॥పల్లవి॥
నిట్టూర్పు గాలికి నీలాలహి వేణికిని (ణియిదె?)
నెట్టనను విరహంపు నెగులేటికే 13-1.

విరహిణి అయిన నాయికకు చెలుల ఓదార్పులీ పలుకులు. మదనతాపాన్ని తట్టుకోగలుగునట్లుగా తరుణి శరీరాంగాలను భగవంతుడు పొందుపరిచాడు. విరహాతిశయంతో నాసికనుండి నిట్టూర్పు గాలులు రావడం సహజం. ఆ ఊర్పుగాలులను దిగమ్రింగ డానికే ఆ సమీపంలోనే ఆమె నీలాహి వేణిని భగవంతుడు పొందుపరిచాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం –

కృష్ణసపాయిని కిష్టదాయినికి
కృష్ణాహి వేణికి ( గీరవాణికిని –1ఆ–పుట 8.

అలమేలు మంగ కంకితం అష్టమహిషీకల్యాణం. ఆమె కృష్ణాన పాయిని. అంటే కృష్ణుని విడివడనిది. అర్ధాంగి. అంచేతే ఆ కృష్ణుని తలపింపచేసే కృష్ణాహిని బోలిన వేణి కలది.

## 4.1.35.2. జడ – రాహువు :

జుట్టును రాహువుతో పోల్చడం తాళ్లపాక సాహిత్యంలో విస్తృతం.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం –

ఉడుగ వేతహతహ నోరాహువేణి

యుడురాజా నీవన్న వెలయంగ వెఱచు 4ఆ–పుట 177.

లోకంలో చంద్రుడు విరహులందరినీ పీడించడం సహజం. కాని ఇక్కడ విరహిణి అయిన రుక్మిణిని చూచి చంద్రుడే పారిపోగలడు భయపడవలసిన పనిలేదని రుక్మిణికి చెలుల సలహా. దీనికి కారణం రుక్మిణి జడ రాహువును పోలివుండడమే. తనను కబళించే రాహువును చంద్రుడు సమీపింపలేడని నమ్మకం.

## 4.1.35.3. జడ – కలువల దండ :

కురులను నల్లని వస్తుసముదాయంతో పోల్చడం ప్రసిద్ధమే. చిన్నన్న జడను కలువదండలతో పోల్చడం విశేషం.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం –

వడి దేనే గురియు కల్వలదండయనగ

వడియుతోయములతో వలనొప్పు జడలు 2ఆ–పుట72.

గోపికా వస్త్రాపహరణ సందర్భమిది. అప్పుడే జలక్రీడలాడి గట్టుచేరిన గోపికల జలసిక్తమైన జడలు తేనెలను స్రవించే కలువల దండను పోలియున్నాయి.

### 4.1.35.4. జడ – ద్రోణం:

ద్రోణం మల్లయోధుల ఉపకరణం. యోధులు దీనిని గిరగిర త్రిప్పడం చేత భుజబలాన్ని చేకూర్చుకుంటారు. మదనయుద్ధంలో నాయక జడను చేజిక్కించుకోగా నాయిక వేసే ప్రశ్న యిది –

కమ్మటి బుసకొట్టేవు గరిడానా జవ్వనము
దొమ్మిఁబట్టి తీసేవు ద్రోణమా జడ
ఇమ్ముల శ్రీవేంకటాద్రి నిట్టేనన్ను గూడితివి
కమ్మి సామమరెనోయి కాంతుల తోడనే 29-217.

నాయికతో పెనగడమె నాయకుని సాము. ఆ సాము లో నాయకునికి మరింతబలాన్ని చేకూర్చే పరికరాలు నాయిక శరీరాంగాలే కాగా ఆ పరికరాలలోని ద్రోణమే నాయిక జడ.

### 4.1.35.5. జడ – తరటు :

తరటు అంటె కొరడా. చురుకైన దీని దెబ్బలకు ఎంతటి పొగరుబోతు పోట్ల గిత్తయినా లొంగకతప్పదు. తన అందంతో ఎదుటివారిని మురిపించి మైమరపించగల జడ అవసరమైతే కాలనాగులా కాట్లువేయగలదు. కొరడాలా చంప ఛళ్ళుమనిపించనూగలదు. కేవలం ఆకృతినిబట్టేగాక అవసరాన్ని బట్టి గూడ జడకు కొరడాకు పోలిక.

చిన్నన్న పరమయోగి విలాసం –

ఒఱపైన జడవిరహులన్ను వెనుతరటు 4ఆ-పుట 271

ఇది జగదేకమోహిని అయిన దేవదేవి జడ. ఆమె పొందు నాశించి విఫలులైన విరహులపాలిటి కొరడా. దేవదేవి నాట్యకత్తె. కూచిపూడి సంప్రదాయంలో జడకు ప్రత్యేకస్థానం ఉంది.

## 4.1.36. జడలు :

అందంగా అల్లబడిన కురులే జడ. చిక్కులతో చికాకుగా ఒకదానితో ఒకటి అతుక్కొనిపోయిన జుట్టు జడలు. అంటగట్టుకొనిపోయిన జడలకు సంప్రదాయసిద్ధ ఉపమానాలేవి లేవు. కాదేది కవితకనర్హం అన్నట్లు దేనినైన మనోజ్ఞంగ వర్ణించగలడం తాళ్ళపాకకవుల ప్రత్యేకత. జడలను అన్నమయ్య చింతకాయలతోను చిన్నన్న చింతకాయలు, కొడవళ్ళు - చీకటి గుమురుల మూలదుంపలతోను పోల్చారు.

## 4.1.36.1. జడలు – చింతకాయలు :

చిన్న చిన్న గణుపులు దేరినవి చింతకాయలు. జడలకు వీటికి ఆకారసాదృశ్యం.

అన్నమయ్య-

> చిన్నిశిశువూ చిన్నిశిశువూ
> ఎన్నడూ చూడమమ్మ ఇటువంటి శిశువు ॥ పల్లవి ॥
> తోయంపు గురులతోడ దూగేటి శిరుసుచింత
> కాయలవంటి జడల గములతోడ
> మోయుచున్న కనకంపు మువ్వల పాదాలతోడ
> పాయక యశోదవెంట బాఱాడు శిశువూ -4-1

అత్యంత సహజసుందరమైన బాలకృష్ణుని వర్ణన యిది. సామాన్యంగా చిన్నపిల్లలకు జుట్టు జడలు గట్టుకొని వుండడం సహజం. అందులో ఇది నీళ్ళలో తడిసి చిక్కువడిన చిన్నారి జుట్టు. తలనిండా చిందరవందరగా వున్న జడలు విరగగాసిన చింతకాయల గుంపును పోలివుంది. తాళ్లపాక సాహిత్యంలో చింతచెట్టుకు ప్రత్యేక స్థానముంది.

### 4.1.36.2. జడలు – కొడవళ్ళు :

చెట్లను తీగెలను ఛేదించడానికి ఉపయుక్తమయ్యేవి కొడవళ్ళు. కొడవళి వంకర తిరిగిన ఆకృతితో నల్లగా వుంటుంది. ఒకదాని కొకటి పెనవేసుకొని మెలికలు తిరిగిన జడలకు వీటికి పోలిక. తిన్నన్న అష్ట మహిషీ కళ్యాణం

కలుష వల్లులఁద్రెంచు ఘనల విత్రముల
యలపున జింతకాయలు తూలియాడ
గుంపులై చీఁకటి గుములుల మూల
దుంపలో యన జడల్ తుంపెసలాడ ఆ–పుట 22

ఇవి బాలకృష్ణుని జడలు. అంచేత ఇవి మామూలు కొడవళ్ళు కావు. కలుష వల్లులను త్రెంచె కొడవళ్ళు. తననాశ్రయించిన వారి పాపాలను మూలంట ఛేదించే కొడవళ్ళు. అంతేకాదు చవులూరించే చింతకాయలు. చీకతి ద్రాకులకు మూలమైన దుంపలు.

### 4.1.37. నరసిన వెంట్రుకలు :

వయసు పైబడే కొద్ది నల్లనికురులు తెల్లబడడం వయోధర్మం. నెరిసిన వెంట్రుకలు వార్ధక్యాన్ని సూచిస్తాయి. అందవిహీనమైనవి. కేశాలకు నైల్యాన్నే వర్ణించాలని కవులకట్టడి. అయినా వాటిని వెండితీగలు, బియ్యం మొ॥ తెల్లని వస్తువులతో పోల్చడం వుంది. తాళ్లపాక సాహిత్యంలో చిన్నన్న పరమయోగివిలాసంలో మాత్రమే పలితకేశవర్ణన ఉంది. చిన్నన్న వీటిని నమిలివేసిన చెరుకుపిప్పిలో పోల్చాడు.

### 4.1.37.1. నరసిన వెంట్రుకలు – చెరుకుపిప్పి :

చెరుకు తియ్యనిది. కాని దాని రసాన్ని మింగేస్తే ఇక మిగిలేది నిస్సారమైన తెల్లనిపిప్పే. మానవ జీవితంలో మధురమైన యౌవనం దాటాక ఇక

మిగిలేది శుష్క-వార్ధక్యమే. యౌవనంలో నల్లగ నిగనిగలాడే కురులు క్రమేపి వెలవెలబోవడం సహజం. అంచేత నెరిసిన వెంట్రుకలకు చెరుకుపిప్పికి పోలిక.

చిన్నన్న పరమయోగి విలాసంలో -

కౌమరు బ్రాయంబను కొమరైన చెఱకు
నమలిన పిప్పినా నరసె వెంట్రుకలు - 2.105

## 4.1.38. శిరస్సు :

శరీరంలో ఊర్ధ్వభాగమిది. సకల శరీరవ్యాపారాలకు అత్యంత ప్రధానమైన నాడీమండల కూడలిగా శాస్త్రకారులు, బుద్ధికి నిలయంగాబట్టి శరీరానికంతటికి ఉత్తమాంగంగా కవులూ, పండితులూ, పరబ్రహ్మతత్వమైన సహస్రారకమలస్థానంగా తాంత్రికులూ కీర్తించే అంగమిది. సర్వులకూ శిరోధార్యమైనది. దీనికి కవిసమయసిద్ధ ఉపమానాలేవి లేవు. అయితే అన్నమయ్య శిరసును శిఖరం, దండెకాయ, బొండ్రాయిలతో పోల్చాడు:

## 4.1.38.1. శిరస్సు – శిఖరం :

రథానికి, పర్వతానికి అగ్రభాగం శిఖరం. మానవ శరీరాన్ని పంచేంద్రియరథంతో పోల్చగా ఆ రథ అగ్రభాగమైన శిఖరమే శరస్సు. శిరీరానికి రథోపమానం ప్రాచీనం.

మించైన శిరసే మీదనున్న శిఖరము
పంచేంద్రియరథము పఱపీఁబో జీవుడు -2-152.

అని శిరసును రథశిఖరంతో అన్నమయ్య పోల్చాడు.

## 4.1.38.2. శిరస్సు – బొండ్రాయి :

సాధారణంగా ఊరికి నాలుగు పలగాడులుంటాయి. ఒక పలగాడికి మాత్రం బొండ్రాయి వుంటుంది. తూర్పు పొలిమేరల్లో వుండేరాయి బొండ్రాయి. సాధారణంగా ఊరిలోకి వచ్చే బండ్లుగాని ఊరినుండి బయలుదేరే బండ్లు గాని

బొ(డాయి మధ్యగా పోనిస్తారు. ఈ సాంప్రదాయం నేటికి కర్నూలుజిల్లాలో వుంది. ఆ దారిన పోయే బండ్లన్నీ బొ(డాయిని ఒరసుకుంటూ పోయినట్లే పలువురు స్త్రీల ఆశ్లేష చుంబనాదుల పొందేది ఈ నాయకుని శిరుసు అంచేతే ఈ రెంటికి పోలిక. అన్నమయ్య -

పంతమెల్లా నాదెకాక భావించి చూచితేను
యింతులకు (మొక్కేనీకు యెమ్మెవున్నదా
ఇంతటి శ్రీవేంకటేశ ఇట్టే నన్నుఁ గూడితివి
పొంతలనే (నీ) శిరసిది బొ(డాయిగదా 31-451.

కుపిత అయిన నాయిక నీతి నిజాయితీ లేని నాయకుని నిందించే నిందలివి. పలువురు కాంతల పొందుననుభవించే నాయకుని మోవి గాడిపట్టుగా, కాగిలే విడిదిల్లుగా శరీరమే దాయిమానుగా శిరసే బొ(డాయిగా నాయిక నిందిస్తుంది.

## 4.1.38.3. శిరసు - దండెకాయ :

వీణాదండానికి కట్టబడ్డ తుంబ లేక బుఱ్ఱయే దండెకాయ. వీణలో నాదోత్పత్తిని కలిగించడానికి ఉపయుక్తయమ్యే ప్రధాన భాగమిది. వీణను నిలువుగా పట్టుకుని వాయించే పద్ధతి అన్నమయ్య కాలంలో ఉంది. వీణను నిలువుగా పట్టుకొని నిల్చున్నప్పుడు ఈ దండెకాయ వీణా దండానికి శిరసులా గోచరిస్తుంది. అన్నమయ్య చేతిలోని వీణను పరిశీలిస్తే మనకిది విదితమవుతుంది. శిరస్సుకు వీణలో శిరస్థానీయమైన దండెకాయకు పోలిక.

అన్నమయ్య।

పాడేమునేము పరమాత్మనిన్నును
వేడుకముప్పది రెండువేళల రాగాలను ‖ పల్లవి ‖
తనువే వొళవు తలయేదండెకాయ - 9-178.

శరీరాన్ని వీణతో పోల్చే సంప్రదాయముది. నాదాన్ని పలికించడానికి అనువైంది వీణ. ఓం కారనాద నిలయం మానవ శరీరం. ఆ నాదబ్రహ్మ నుపాసించేవాడే వైణికుడు. యోగ శాస్త్రంలో సహస్రారకమల స్థానీయమైంది శిరస్సు అదే పరబ్రహ్మ నిలయం. అంచేతే అన్నమయ్య శరీరాన్ని వీణగా మలచి ఆ పరమాత్ముని ఎల్లవేళలా కీర్తించాలని చాటుతున్నాడు. "నాభీహృత్కంఠ రసనాదులయందు శోభిల్లు సప్తస్వర' అన్న త్యాగరాజ కీర్తన కూడ ఈ భావాన్నే చాటుతుంది.

## 4.1.39. శరీరం :

పాంచభౌతికమైనది. జీవికి ఆధారం. 'శరీరమాద్యంఖలు ధర్మసాధనం' - సకలార్థ సాధకమైనదీ శరీరం. ఈ శరీరాలు నలుపు తెలుపు వర్ణాలలో వున్నప్పటికి స్త్రీ శరీరానికి నైల్యాన్ని వర్ణించరాదని కవిసమయం. అంచేత స్త్రీ శరీరానికి చంద్రకళా, విద్యుత్, తారా, కనకలత, కాంచనయష్ఠి మొదలైన మేలిమి వర్ణ ఉపమాద్రవ్యాలతోను సరోజమాలా, శిరీష మొ॥లైన సున్నితవస్తు సముదాయంతోను పోల్చడం కవిసమయం. అందానికి ఆనందానికి ప్రతీకగా పరిగణింపబడేది స్త్రీ కాబట్టి కవులవర్ణనలలలో అధికభాగం తావు చేసుకొన్నది స్త్రీల సుందరశరీరమే. అయినా తాళ్ళపాకకవుల రచనలో యోగభోగాలు రెండు సమపాళ్ళలో కనిపిస్తాయి కాబట్టి స్త్రీ పురుష వ్యత్యాసం లేక మానవ శరీరానికి సంబంధించిన ఉపమానాలెన్నో వున్నాయి. అన్నమయ్య మానవ శరీరాన్ని కల్పతరువు, యాగశాల, గుడి, రథము, కోట, ఓడ, వూరు, నారు, వట్టిమోపు, వుండు, ముట్టుపాత, పొల్లు, కట్టు, గాడులతోను పురుషశరీరాన్ని చలివందిలి నీడ సంతకూటమి, మొగిలిరేకుముంటికొన, దాయిమానులతోను స్త్రీ శరీరాన్ని పూచినతంగేడు, చక్కెర బొమ్మ, వెన్నెలబొమ్మ, మెఱుపుతీగె, తీగె, వత్తి, గోతం, పరుపులతో పోల్చాడు. తిమ్మక్క స్త్రీ శరీరాన్ని పసిడిశలాక, తలిరాకులతోను, పెదతిరుమలయ్య మానవ శరీరాన్ని ఊరు, పుట్ట, ఓడ, మోహినీ గజం, రాజ్యాలతోను, స్త్రీ శరీరాన్ని మెఱుఁగులతీగె, పైడి బొమ్మ, చిగురు, మలగులతోను,

చినతిరుమలయ్య మెఱుఁగుఁదీగె, మేడ, చిగురు, మానులతోను, చిన్నన్న దర్పకాస్త్రం, బంగారుప్రతిమలతోను పోల్చారు.

## 4.1.39.1. శరీరం – మోహినీగజం :

మదవతియైన స్త్రీ శరీరాన్ని మదపుటేనుగుతో పోల్చే సంప్రదాయముంది. ఇది కేవలం స్త్రీ శరీరానికే గాదు మదమెక్కిన ఏ శరీరాన్నయినా మదగజంతో పోల్చవచ్చునని పెదతిరుమలయ్య నిరూపించాడు.

కాయమనేటి మోహినీ గజమెక్కినారము
పాయపు మోహమదము పట్టెను సుమ్మీ
తీయరాని బంధపు తీగె తెంచివేయలేము
యేయెడ విజ్ఞానమిక యెఱిగేమామేము 21-122

## 4.1.39.2. శరీరం – కల్పతరువు :

కామితఫలప్రదాయని అయిన తరువే కల్పతరువు. మానవుడు తన శరీరమనే సాధనంతో ఎంత ఉత్తమ ఫలాలనయినా పొందగలడు. మోక్షఫలప్రదాయిని అయినదీ ఈ శరీరమే. కాబట్టి అన్నమయ్య

తనువనియెడు కల్పతరువు యెక్కితిగాని
కొన విజ్ఞానఫలము గోయలేనైతి 2-27.

నని కల్పతరువును బోలిన ఈ శరీరాన్ని పొందాను గాని విజ్ఞానఫలాన్ని మాత్రం అందుకో లేకపోయాననే ఆవేదనను వ్యక్తం చేస్తున్నాడు. ఇట శరీరాన్ని కల్పతరువుతో పోల్చడం విదితం. పుట్టుక మరణమనేవి మానవులకేగాని దేవతలకు లేవు. అందువల్ల దేవతలు కూడ ఎదుగు బొదుగు లేని తమ జీవితాన్ని అసహ్యించుకొంటారని ఐతిహ్యం. కల్పతరువు స్వర్గంలో అందుబాటులో వుండవచ్చు గాని దేహమే కల్పతరువుగా చేసుకోవడం మానవులకు మాత్రం లభ్యలయిన వరం.

### 4.1.39.3. శరీరం – గుడి :

శరీరం జీవాత్మ, పరమాత్మలకు నిలయమైంది గా ఆధ్యాత్మవిదుల భావన. పరమాత్మ అంటే భగవదంశమే కాబట్టి భగవంతునకు నిలయమైనట్టి ఈ శరీరాన్ని గుడితో పోల్చడం అన్నమయ్య ప్రత్యేకత.

నిత్యపూజలివివో నేరిచిన నోహో
ప్రత్యక్షమైనట్టి పరమాత్మునికి
తనువే గుడియట తలయే శిఖరమట
పెను హృదయమే హరిపీఠమంటా -2-82.

అని భగవంతుడొసగిన ఈ శరీరం భగవదర్పితం కావడమే ధ్యేయంగా భావించినవాడు అన్నమయ్య. హృదయంలో పరమాత్ముని ప్రతిష్ఠించి కనుగొన చూపులనే దీపాలుగా, మాటలనే మంత్రాలుగా, నాలికే గంటగా, రుచులే నైవేద్యంగా నడకలే ప్రదక్షిణలుగా వూర్పులే ఆలవట్టాలుగా భగవంతుని వుపచరించినపుడు ఈ శరీరమే గుడి అవుతుందనడం అతిశయోక్తి కాదు కదా!

### 4.1.39.4. శరీరం – రథం :

'ఆత్మానం రథినం విద్ధి శరీరం రథమేవచ' -కఠోపనిషత్తు.

దేహానికి రథోపమానం ప్రాచీనం. దేవుడు ఊరేగేది రథం. పరమాత్ముడూరేగేది దేహరథం. ఈ దేహరథాన్ని తోలేవాడు జీవుడు.

సరి పేటుఁదే రెండు జంట బండి కండ్లు
సరవితో (బాదాలు చాఁపు నొగలు
గరిమ (జూపులు రెండు గట్టిన పగ్గములు
దొరయై దేహరథము దోలీఁబో జీవుడు 2-152.

అని అన్నమయ్య శరీరాన్ని పంచేంద్రియరథంగా అభివర్ణించాడు.

### 4.1.39.5. శరీరం – యాగశాల :

భగవత్ప్రీతికై నిర్వహించేది యజ్ఞం. పశుబలి, పూర్ణాహుతి, సామగానం, సోమపానాదులందలి భాగాలు. ఆ యజ్ఞం నిర్వహించడానికి అనుకూలమైంది ఈ యజ్ఞశాల. యజ్ఞాన్ని చేయించేవాడే గురువు. కామ్యంతో నిర్వహించే యజ్ఞం కంటె జ్ఞానయజ్ఞం శ్రేష్ఠం. మోక్షసాధనం. దీక్ష తీసుకున్న వ్యక్తిశరీరానికి యజ్ఞశాలకు పోలిక.

అలరి దేహమనేటి యజ్ఞశాలలోన
బలువైన యజ్ఞాన పశువు బంధించి
కలసి వైరాగ్యపు కత్తులఁగోసి కోసి
వెలయ జ్ఞానాగ్నిలో వేలిచె మాగురుడు 2-148.

ఇది అన్నమయ్య స్వానుభవం. తనకు పంచసంస్కారాలతో వైష్ణవ దీక్ష నిప్పించిన గురుడు నిర్వహించిన యజ్ఞమిది. ఈ యజ్ఞంలో వైరాగ్యమే కత్తి అజ్ఞానమే పశువు. జ్ఞానమే అగ్నిగా పేర్కొనడం చేత దృఢమైన వైరాగ్యంతో అజ్ఞానాన్ని పరిహరించాలని భావం. ఈ శరీరాన్ని జ్ఞానార్జనకుపయోగించి దానివల్ల మోక్షాన్ని పొందాలనే సూచన ఉంది.

### 4.1.39.6. శరీరం – వీణెవాళవు :

వీణాదండం వీణెవాళవు.

తనువేవాళవు తలయే దండెకాయ
ఘనమైన పూర్వులు రెండు కట్టిన తాళ్లు
మనసే నీ బద్దితాడు మరి గుణాలే జీవాళి
మొనసిన పుట్టుగే మూలమైన కరడి. -9-178.

ఆకృతిని బట్టి దండెకాయ తలయైనప్పుడు వీణెవాళవు మిగత శరీరస్థానాన్ని ఆక్రమిస్తుంది. వీపును కూడ వీణవాళవుతో పోల్చడం అన్నమయ్య

కీర్తనలలో కనిపిస్తుంది. అన్నమయ్య కాలం నాటి వీణ ద్వితంత్రీవీణ. దీనికి మెట్లు లేవు. వెదురుబొంగుకు తీగలు బిగించి కట్టేవారు. తుంబకూడ ఒక్కటే వుంటుంది. అన్నమయ్య చేతిలోని వీణ ఇట్టిదే.

## 4.1.39.7. శరీరం – ఊరు :

'నవద్వారపురే దేహే ' నవరంధ్రాలతో కూడిన దేహమే తొమ్మిది ద్వారాలు గల పట్టణం. దేహి కొలువున్నవూరు దేహం. అతని పరివారమే యింద్రియ విషయాలు. ఇది భూతపతి యేలే నిర్మలరాజ్యం. అతనికి నివాసమైన తొమ్మిది గవనుల దొడ్డతోలుకోట. కోటేగాదు అందమైన మేడ కూడ. తాళ్ళపాక సాహిత్యంలో శరీరాన్ని వూరు , రాజ్యం, కోట, మేడలతో పోల్చడముంది.

ఊరు :

అన్నమయ్య : ఉప్పడమయి దేహమనే వూరఁబెద్దచావడి
ఉప్పతిల్లి దేహి కొలువున్నపుడు
చప్పుడుతో నింద్రియ విషయ పరివారము
అప్పుడు పొరాడుదురు ఆహామేలు -2-124.

పెదతిరుమలయ్య: ఇరువది నలుగురి కిటునే గమికాఁడ
అరిది దేహపుటూరి అమర గాఁడా
నరయక నరసేటి నల్ల తెల్ల జల్లివాడ
యిరవై జీతముసేసి యేలుకోవే శ్రీహరీ -21-39.

## 4.1.39.8. శరీరం – ఓడ :

వర్తక వ్యాపారాలలో సరకుల రవాణాకు ఉపయుక్తమయ్యేది ఓడ. ఆటు పోటులనెదుర్కొంటూ సాగరంలో సరకులతో పయనించేది. కష్టసుఖాల నెదుర్కొంటూ పాపపుణ్యాలను సరకుల మోస్తూ సంసారసాగారాన్ని ఈదేది ఈ

శరీరం. అందువల్ల ఓడకు శరీరానికి పోలిక. అన్నమయ్య, పెదతిరుమలయ్యలిద్దరూ ఈ ఉపమానాన్ని ప్రయోగించినవారే.

అన్నమయ్య : తగిన సంసార సముద్రములోనఁదిరిగాడి
బిగువు దేహపుటోడ బేహారివాడ
జగతి బుణ్యపాపపు సరుకులు దెచ్చినాడ
దిగితి బూతు రేవునఁ దీరుచరో సుంకము -9-35.

ఇది పంచేంద్రియాలనే పట్టస్వాములకు చేసిన విన్నపము. బేరమాడి తలాకొంచెం పాపపుణ్యాల సరకు తీసుకొని దేహమనే ఓడబరువును తగ్గించమని ప్రార్థన.

## 4.1.39.9. శరీరం – పుట్ట :

చీమలకు పాములకు నెలవైనది పుట్ట. అల్పజీవులకు నెలవైన పుట్ట అంత ప్రమాదకరం కాదు. కాని క్రూరసర్పాలకు నిలయమైన పుట్ట హానికరం. మన కర్మములే సర్పాలు. వాటికి నిలయం ఈ దేహం. అంచేతే ఇది పాముపుట్ట. పెదతిరుమలయ్య –

పోలని దేహమను పుట్టఁబడి -21-61.

మన కర్మములనే పాపవిషం ఈ దేహమనే పుట్టకు ఎక్కకుండా వుండాలంటే దేహి హరిశరణాగతి పొందడమొక్కటే తరుణోపాయం.

## 4.1.39.10. శరీరం – పుత్తడిబొమ్మ :

తమ అందంతోను అలంకారాలతోను అలరించే యువతుల శరీరాన్ని పుత్తడిబొమ్మ, పూచినలతిక, పూచినతంగేడు, చిత్తరుప్రతిమ, చక్కెర బొమ్మ, వెన్నెలబొమ్మ, పసిడిశలాక, దర్పకాస్త్రాలతో పోల్చడం తాళ్ళపాక సాహిత్యంలో కనిపిస్తుంది. చిన్నన్న మాత్రం పరమయోగివిలాసంలో పసిబిడ్డడై తల్లిని మురిపించే నమ్మాళ్వార్‌ను కూడ బంగారు ప్రతిమతో పోల్చాడు.

పుత్తడి బొమ్మ :

అన్నమయ్య : పుత్తడిబొమ్మవలె పూచినలతికవలె

చిత్తరుప్రతిమవలె చెలియున్నది -13-186

చిన్నన్న : బంగారు ప్రతిమకు బ్రతివచ్చునట్టి

సింగారములతోడ చెలువొందువాని 3అ-159.

పూచిన తంగేడు :

అన్నమయ్య : రాచిలుక పలుకు రవళితోడి కొమ్మ

పూచిన తంగేడువంటి పుత్తడిబొమ్మ 19-239

## 4.1.39.11. శరీరం – పరుపు :

సుఖశయనానికి అనువైనవి పరుపు, దిండ్లు ఇవి మెత్తనివి. మృదువైన నాయిక శరీరాన్ని అన్నమయ్య మెత్తని పరుపుతోను పెదతిరుమలయ్య దిండుతోను పోల్చారు. నాయిక చెంతలేనప్పుడు నాయకుడు చిన్ని మలగునే నాయిక శరీరంగా భావించి కౌగిట బిగించాడు.

పరుపు - తనివోని రతికాగకతప్పు సేయని యీగక

వనితకీపతిమాట వలపు మూట

వినయంపురతికింపు వేంకటేశ్వరు సొంపు

తనువు మెత్తని పరుపు తనువెల్ల మరపు 12-347.

దిండు - అట్టె చిన్ని మలగు అదియే నీమేనంటా

బెట్టి కాగిలించుకొని బిగియించు సారెకు 23-456.

## 4.1.39.12. శరీరం – గోతం :

ఇచట మల్లుల సాధనకై రాళ్లు నింపి వుండే సంచే గోతం. నాయిక శరీరమంతా నాయకుని జెట్టిసాధన పరికరాలే. ఆ పరికరాలలో ఒకటైన నాయిక శరీరమే గోతం.

కామించి పెనగేవిట్టె కంబమా నాకంబు కంఠము
గోమున గాగలించేవు గోతమా మేను 29-217.

మల్లుడైన నాయకుడు రెండు చేతులతో గోతాన్ని పట్టుకున్నట్లే నాయికను ఆశ్లేషించగా ఆ పట్టుకు ఓర్వలేని నాయిక కుపితయై నాయకుని మోటుతనాన్ని ఖండిస్తున్నది.

## 4.1.39.13. శరీరం – దాయిమాను :

కొయ్యను చెక్కేటప్పుడు దానిక్రింది ఊతగా వుంచబడే దుక్క దాయిమాను. చెక్కే కొయ్యల దెబ్బలకు ఆధారంగా ఉండేమానిది. దెబ్బలన్నీ దానికే తగులుతాయి. పలుకాంతాలోలుడైన నాయకుని శరీరాన్ని అన్నమయ్య దాయిమానుతో పోల్చాడు.

సిగ్గెల్లా నాదెకాక చేరి యెరుకపరచితే
వొగ్గిన యాసలనీకు వోజవున్నదా
అగ్గలమై నీవు గడునంత నన్ను రేచితేను
తగ్గని నీమేనన్నిటా దాయిమానుగాదా 31-451.

ఇంతులకు మ్రొక్కి ఎంతకైనా దిగజారివారి కాలితాపులను సైతం తిన్న నాయకుని శృంగార క్రీడలను చెలులు చెప్పగా విన్న నాయిక వారి మాటలు వింటేనే నాకు సిగ్గు కలుగుతుంది మరి వారి చేత దెబ్బలు తినడానికి నీకు సిగ్గులేదా? అని ప్రశ్నిస్తోంది.

## 4.1.39.14. శరీరం – చలివందిలినీడ :

వేసవిలో ఆశ్రయించిన వారందరికి నీడనిచ్చేది, వచ్చే పోయే వాళ్ళందరి దాహాన్ని తీర్చేది చలివందిలి. ఇది ఎవ్వరి సొంతమూ కాదు. అందరి తనుతాపం తీర్చేది. పెక్కు కాంతాలోలుడైన రసికుని శరీరమే చలివందిలి.

కొలుపు కాంతలెల్లా కొంకక శ్రీ వేంకటేశ

కలగొన నీవురానఁ గాగిలించేవు
వలపుల నీమేను చలివందిలి నీడాయ
చెలరేఁగి నిన్నుఁ గూడి సేసచల్లవలెనా 13-185.

కుపిత, స్వీయ అయిన నాయిక నిందలవి. జంకుగొంకులేక కొలువులో ఉండే కాంతలందరినీ కాగిలించే నాయకుని శరీరాన్ని చలివందిలి నీడగా నిందించింది.

## 4.1.39.15. శరీరం – సంతకూటమి :

కొనేవారి అమ్మే వారి కూటమి లేదా పలువురు వ్యక్తుల కూటమి సంతకూటమి. ఇరువురు కాంతల మధ్య నుండే నాయకుని శరీరాన్ని సంతకూటమితో అన్నమయ్య పోల్చాడు.

చెంతలనాపెనీపైఁ జెయి చాచగాను
వంతుకుఁజెయిచాచితి నివ్వలనేనుండి
యింతులమిద్దరమునుయిరువంకలానుండగా
సంతకూటమాయెను చక్కని నీమేను 13-404

ఇద్దరు కాంతల నడిమి నాయకుని బ్రతుకు 'ఇస్తినమ్మ వాయనం పుచ్చుకొంటినమ్మా వాయనం' లావుంది. ఒకవైపునుండి ఒక కాంత నాయకునిపై చేయి వేయగా వంతునకు మరొక వైపునుండి మరోకాంత కూడ అతనిపై చేయివేసింది. ఇద్దరి చేతుల మధ్య నిలిగే నాయకుడి దుస్థితి సంతలోసరకు చందంలాగుంది. అంతేకాదు సంతలలో కలుసుకొనేవారి కూటమి శాశ్వతమైంది కాదుకూడా !

## 4.2. శారీరక ప్రవృత్తి సంబంధి :

శరీరంపై పొడచూపే వికారాలే శారీరకప్రవృత్తులు. నడకలు, మొక్కులు, సిగ్గులు, మాటలు, చూపులు, నవ్వులు, ఊర్పులు, చెమటలు, పులకలు, కాఁగిలి, జవ్వనం అన్నీ ఈ కోవలో చేరతాయి.

### 4.2.1. నడకలు :

స్త్రీ నడకలను హంసగమనం గజగమనాలతోను పురుషులనడకలను మదవృషభ గమనంతోను పోల్చడం సంప్రదాయం. తాళ్ళపాకకవులు స్త్రీల నడకలను హంస, గజగమనాలతోనే గాక నెమలి నడకతోను పురుషుని నడకను నెమలి, సింహాల నడకలతోను పోల్చడం విశేషం.

### 4.2.1.1. నడకలు – ఏనుగు :

ఉన్నతాకారంతో శీవిదర్పాలు తొణికిసలాడుతూ మెల్లగా సాగిపోయేది మదగజం. మదగజం విపరీత అహంకారానికి ప్రతినిధి. అహం దెబ్బతిన్నట్లయితే విజృంభించే ప్రవృత్తి కలిగినది. మన్ననగా చూచినపుడే మచ్చిక అవుతుంది. సరిగ్గా ఇదే ప్రవృత్తిని ప్రస్ఫుటించేది మదవతి. అంచేత ఆమె నడకలకు మదగజగమనానికి పోలిక. ఈ పోలిక తాళ్ళపాక సాహిత్యంలో విస్తృతంగా కనిపిస్తుంది.

అన్నమయ్య :

ముత్తేల పెండెమిది ముదితది ఆ
గుత్తపుఁబాదమునకు గొలఁదైనది
బిత్తరపు ముంజేతనే పెట్టితివి యీ
మత్తగజగమనపై మన్నన నీకెట్టిదో 12-283.

వేంకటపతి రాయడంతటి వాడు నాయికపట్ల ఎంతో భయభక్తులతో చేయరాని చేతలెల్ల చేశాడట. కారణం ఆమె మదవతి. మత్తగజగమనకావడమే.

తిమ్మక్క–

భద్రేభగమన సుభద్ర రమ్మనుచు
తోయజాక్షుడు తన తొడపైన నునిచె 22 పుట

భద్రేభం అంటే - శుభలక్షణాలు గల ఏనుగు. ఆమె 'సుభద్ర' అంచేతే ఆమె నడక భద్రేభగమనాన్ని పోలింది.

పెదతిరుమలయ్య:

ఎంతమోహమోయింతి నీపైన తనికి
కామిని నీనడపులు గజగమనములని
కామించి నీ పతి కరిఁగాచెను 23-1.

అలమేలు మంగ నడకలు గజగమనాన్ని పోలివున్నాయి. ఆమెపై విపరీత వ్యామోహం కలవాడు కాబట్టే శ్రీ వేంకటేశుడు ఆమె నడకల్ని తలపించే గజేంద్రుని మకరినుండి రక్షించాడు. ఇది గజేంద్రమోక్షణానికి సరికొత్త వ్యాఖ్యానం. అలమేలు మంగమ్మపట్ల పెదతిరుమలయ్యకు గల అభిమానం.

చిన్నన్న

కమలాయతాక్షి జగన్మోహనాంగి.
భ్రమరకుంతల దేవభద్రేభయాన 1-60.

ఇది భార్గవమౌని చిత్తాన్ని అపహసించడానికై యింద్రుడు పంపిన 'కనకాంగి' అనే దేవవేశ్య నడక ఆమె నడకను భద్రేభయానంతో పోల్చడం ఆమెలోని యౌవనమదాన్ని అభివ్యక్తం చేయడమే.

## 4.2.1.2. నడకలు – సింహం :

సింహం మృగరాజు. ఇది అవసరమైతే తన లక్ష్యాన్ని పొందడానికై అతివేగంగా పరుగులు తీయగల జంతువు. ఆవేశంతో అతివేగంగా పరుగులుతీసే రాజునడకలను సింహం నడకలతో పోల్చాడు చిన్నన్న.

పరమయోగివిలాసం:

పావలుదొడుగక పదనూపురంబు
రావంబులడర వారణరాజయాన

మొదవెడు కై దండ యొల్లక జాతి

కొదమసింగంబు బాగున వడి మీఱి

పరమవైష్ణవుల శ్రీపాద పద్మముల, వ్రాలి 3-194

ద్వారపాలకులు స్వాములను తన సభలోనికి ప్రవేశింపనీయలేదను విషయమెరిగిన 'కులశేఖరుడను' రాజసింహుడు తన తప్పిదాన్ని క్షమించమని స్వాముల ప్రార్థించడానికై ఉరుకులు పరుగులతో సింహాన్ని బోలిన నడకలతో వాకిటికి చేరుకున్నాడు.

### 4.2.1.3. నడకలు – హంస :

అన్నమయ్య నాయిక అలమేలుమంగమ్మ. ఆమె శ్రీ వేంకటేశ్వరునికి తగిన ఇల్లాలు. ఆమెకు లేని ఠీవి లోకంలో ఎవరికుంటుంది ? ఆమె నడిచేబాట శ్రీ వేంకటేశ్వరుని చేర్చేబాట. అంచేత

తగు శ్రీ వేంకటేశ్వరు దండనిల్చి ( జూడవే

మగువ నడపులనే మంచి హంసలు 2-286.

అని అలమేలుమంగమ్మ నడకలను మానససరసిలో సంచరించే హంసనడకలతో పోల్చాడు.

తిమ్మక్క- సుభద్రాకల్యాణంలో

హంసనడకలో నతివ సుభద్ర

అల్లనల్లనె వచ్చె అన్నముందరికి 21

అని తెల్లని తారహారాలతో సర్వాలంకారభూషితయై అన్న చెంతకు నడచివచ్చే కన్య సుభద్ర నడకలను స్వచ్ఛతకు ప్రతీకయైన హంస నడకలతో పోల్చడం ఆమె కన్యాత్వ నిరూపణమే.

పెదతిరుమలయ్య -

మంచితనముననే మచ్చికలు నీకుఁజెప్పి

అంచగమనబాగాలు అందియిచ్చెను 23-217.

చిన్నన్న

హైమ సంవ్యానకు హంసయానకు

నింద్ర భావితకు(గజేంద్ర సేవితకు ( 1ఆ-58పుట

అని అష్టమహిషీ కల్యాణంలో ప్రతి ఆశ్వాసాంతంలో తన కృతినంకితముగ కొన్న శ్రీ వేంకటేశురాణి నడకలను హంసయానంతో పోల్చడం ఆమె శ్రేష్ఠతనే సూచిస్తుంది.

### 4.2.1.4. నడకలు – నెమలి :

నెమలి నాట్యానికి ప్రసిద్ధి. అందునా వర్షాకాలంలో మేఘోదయమైతే మయూరం మరింత ఆనందంతో పురివిప్పి నాట్యమాడుతుందని వర్ణించడం కవిసమయం. నడకలను నెమలితో పోల్చడం తమిళ సంప్రదాయం. తాళ్ళపాక కవులలో ఈ సంప్రదాయం కనబడుతుంది. అన్నమయ్య -

అన్నమయ్య తోరపు మేఘపు తురుము విభునితో

అరయ మయూరయానయు బలికె -13-308.

నని నాయకుని చెంత ఆనందపారవశ్యంతోడి నాయిక నడకను నెమలి నాట్యంతో పోల్చాడు. ఇక్కడ నాయకుని కొప్పు మేఘాన్ని పోలివుండడం చేత నాయిక మయూరయాన అయిందనడం కవి సమయం.

పెదతిరుమలయ్య - కామించినీవు నెమలిగతి రతినాటలాడ

పాముపంటి యారుగల పడ(తిగూడె

దోమటి శ్రీ వేంకటేశ తొలుతటి మీలోని

బూమెలవైరాలు దీర(బొందొకటి సేసెను 23-281.

మయూరానికి ఆహారం సర్పం. రతియందు మయూరయానంతో నాయకుడు సమీపించగా పామువంటి నూగారు గల నాయిక అతనికి వశమైంది.

చిన్నన్న

బాణపుత్రిక యుషాబాలికయనఁగ

.................................

మెరుగువన్నెలది క్రొమ్మించు నవ్వులది

యొరపు బాగులది మయూరంపునడకలది ఉ.క. 210 పంక్తి

ఉషాసుందరి శరీరఛాయ మెరపుతీగెను బోలింది. నవ్వుతాలుకారుమెరుపును బోలింది. అంచేతే ఆమె నడక పురివిప్పి నాట్యమాడే నెమలి నడకను బోలివుంది. మెరపు వర్షాన్ని సూచించేది. వర్షాగమనం మయూరహృదయాకర్షకం.

## 4.2.2. సిగ్గులు :

స్త్రీలకు పురుషముఖావలోకనం, శృంగార భావాలవల్ల పురుషులకు ప్రతిజ్ఞా భంగం, పరాభవాలవల్ల కలిగేది సిగ్గు. అంధోముఖ త్వాదులచే సూచింపబడేది సిగ్గు. సిగ్గులను తెరలు, మొగ్గలు జల్లులతో పోల్చడముంది. సిగ్గులను తెల్లగా స్వచ్ఛను, మధురము అయిన నవరత్నాలు, మంచు, వెన్నెల, ముగ్గులు, తొకరివానలు,, చెలమ, మధుర పదార్థాలతో పోల్చడం అన్నమయ్య పదాల్లో మాత్రమే కనిపిస్తుంది.

### 4.2.2.1. సిగ్గులు – మధురపదార్థాలు :

ఇంతికి సిగ్గే శింగారం. అందులోనే మాధుర్యముంది. అందువల్ల అన్నమయ్య సిగ్గును మధురమైన పాలపొంగలి, పెరుగు,మీగడల విందులతో పోల్చాడు. ఈ రెండిటిలో మొదటిది నైర్మల్యానికి రెండవది రుచికి ప్రాధాన్యతలు వహిస్తాయి.

పాలపొంగలి : పాలప సిగ్గు పాలపొంగలిగాఁబెట్టి 28-320.

పెరుగుమీగడలవిందు :

గట్టి సిగ్గుపెరుగు మీఁగడవిందు

గుట్టుతో మన్నించితివి కొమ్మను శ్రీవేంకటేశ 27 - 599.

## 4.2.2.2. సిగ్గులు – నవరత్నాలు :

సిగ్గులను స్వచ్ఛమైన ముత్యాలు, వైడూర్యాలతో అన్నమయ్య పోల్చాడు. శ్రీవేంకటేశునకు నిచ్చలు సోబనమే. ఆకూటమిలో వారిసిగ్గులే వారికి ముత్యాలసేస. అన్నమయ్య నాయిక నవరత్నాలరాశి. ఆరాశిలో ఆమె సిగ్గులే ముత్యాలు,వైఢూర్యాలు.

ముత్యాల సేస :

పెంచెపు మీ తొడలే పెండ్లిపీటలుమీకు

ముంచిన సిగ్గులే కడుముత్తేలసేస 27-417.

వైఢూర్యాలు:

చెలితేనెమాటలు జిగిఁబుష్యరాగాలు

వలపుతెర సిగ్గుల వైఢూర్యాలు 24-108.

## 4.2.2.3. సిగ్గులు - తొకరి వానలు :

వర్షాకాలం ప్రారంభంలో కురిసే జల్లులే తొలకరి వానలు. యౌవనారంభంలో ముంచుకొచ్చేవి సిగ్గుల జల్లులు. ఈ వానలవల్ల నేల పదునెక్కి విత్తులు చల్లడానికి యోగ్యమవుతుంది. సిగ్గులతో జవ్వనం పదునెక్కి మరింత అందంగా పురుషుని ఆకర్షిస్తుంది. వలపుల మొలకలకు తావిస్తుంది.

కలికి సిగ్గులఁదొలకరి వానలు గురిసె

పలుమారు జవ్వనము పదనెక్కెనయ్యా 29-66.

నాయిక సిగ్గులవర్షం కురిపిస్తుంది. జవ్వనం పదునెక్కింది. ఇక వలపుల విత్తు చల్లడమే తరువాయి. అది నీ అదృష్టం. ఇక తొందరపడమని చెలికాండ్ర సలహా.

### 4.2.2.4. సిగ్గులు – మంచులు :

చలి, మంచులో శరీరం ముడుచుకు పోవడం ఆచ్ఛాదనాన్ని కోరడం సహజం. అలాగే సిగ్గుతో శరీరం కుంచించుక పోవడం నాయకుని ఆశ్లేషాన్ని కోరడం కూడ సహజమే. అంచేత ఒకే స్వభావం కలఈ రెంటికి పోలిక.

మంచు : సారిది సిగ్గులనే మంచు గప్పని 30-384.

చలి : సంకేదేరినందాకా చలివందిలిది సిగ్గు 25-575.

### 4.2.2.5. సిగ్గులు – ముగ్గులు :

ముగ్గులు ముంగిటికి అందం. ఆ ముగ్గులు అనేకరకాలు. పర్వాలబట్టి వారాలబట్టి పుణ్యకార్యాలబట్టి రకరకాలు. అలాగే నాయిక సిగ్గులు. ముగ్గులు ఇంట్లో జరిగే విశేషకార్యాన్ని సూచిస్తే నాయిక సిగ్గులు ఆమె నిగూఢమైన మనోభావాలను ప్రస్ఫుటం చేస్తాయి. 'అబ్బబ్బ సిగ్గు వరిపిండి ముగ్గు' అని జానపద సాహిత్యంలో కూడా సిగ్గులను ముగ్గులతో పోల్చడముంది.

చూతువు రావయ్యా సుదతికాపురము

యీతలనిదె నీ యింటిలోనను

మొనపి సిగ్గులను ముగ్గులు వెట్టీ 14-10.

అని నాయకుని రాకకై ఎదురుచూచే నాయిక తన సిగ్గులనే ముగ్గులుగా ముంగిట అలంకరించిందని అన్నమయ్య అభివర్ణన.

### 4.2.3. మాటలు :

నోరుమంచిదైతే ఊరు మంచిదౌతుందని సామెత. మాటల్లోనే వుంది మర్మమంతా. మాటలెంత మృదువుగా మధురంగా శృతిహితవుగా వుంటె అంతకుమించిన ఆకర్షణ ఆ మాట్లాడే వ్యక్తికి సిద్ధించడం లోకవిదితం. మాటలను చిలుకపలుకులు, కోకిలస్వరం, హంసపలుకులు, తుమ్మెద ఝుంకారం, అమృతం, తేనె. వీణా,వేణు నాదాలు మొ॥వాటితో పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య

మాటలను మంత్రాలు, పురాణాలు, పంచమవేదం, వీణానాదం, మధురపదార్థాలు, వేటపరికరాలు, నవరత్నాలు, మందులు, రావిమానిపువ్వులు, పువ్వులు, సూదులు, చిలకపలుకులు, కోవెలకూతలు, తుమ్మెద ఝుంకారం, పావురాలమోత, కప్పురాలతో పోల్చగా తిమ్మక్క కోవెల స్వరములు, చిలుక పలుకులతోను పెదతిరుమలయ్య బెల్లాలు, మంచినీటి తేటలు, పిల్లగ్రోవి రాగాలు, కోకిల కూతలు, రాయంచపలుకులు, మదన మంత్రాలు, నెమలికూత, పంచమవేదం,భేరీభాంకారం, ఘంటానాదాలతోను చినతిరుమలయ్య చింతకాయలు, వలలు, గోవిల పలుకులతోను చిన్నన్న కోవిలకూత, చిలుకపలుకులు, వీణ, బెల్లం, చక్కెర, అమృతం, పాకలతోను పోల్చడం కనిపిస్తుంది.

## 4.2.3.1. మాటలు – పక్షుల కలరవాలు :

శృతి హితవైన మాటలను చిలుకపలుకులు, కోకిల - స్వరం, హంసపలుకులు, తుమ్మెద ఝుంకారంతో పోల్చడం సంప్రదాయం. వీటన్నిటితోనేగాక పావురాలమోత, నెమలి కూతతో కూడ మాటలను పోల్చడం తాళ్ళపాక సాహిత్యంలో విశేషం.

అన్నమయ్య మాటలను చిలుకపలుకులు,కోయిల కూతలు, తుమ్మెద ఝుంకారాలతో పోల్చాడు. పంజరంలో బంధించి మనమే మాటలు నేర్పితే ముద్దుముద్దుగా ఆ మాటలనే పలికేది చిలుక. నాయకుని కౌగిట బందీ అయిన నాయిక పలుకులు చిలుకపలుకులే అయ్యాయి. బందీ అయిన వ్యక్తికి స్వాతంత్ర్యం లేదుగదా ! తుమ్మెదల ఝుంకారంలో మార్పువుండదు. ఆమోతలో కొలనిలో తుమ్మెదలు ఎప్పుడు రొదచేస్తుంటాయి. అలాగే రసమయుడైన నాయకుడు కొలనైతే అక్కడే వాలుతూ ఆనందించే కొలని తుమ్మెదే నాయిక అవుతుంది.

కూతకు మారుకూతగా మరింత మధురంగా ప్రతిస్పందించేది కోయిల. నాయకుని పిలుపుకు పరవశించి సుమధురకంఠంతో సమాధానమిచ్చే నాయిక పలుకులే కోయిల కూతలు.

కొసరుఁగోయిలవలె కొలని తుమ్మెదవలె

పసని చిలుకవలెఁబలికీనాపె 19-186.

కంఠంలోనుండి సుస్పష్టమైన ధ్వని బయటికి రాకుండ అవ్యక్తధ్వనితో గుసగుసలాడుతున్నట్టుగా కువకువాలడేవి పావురాలు.

చెంతఁబావురాలమోఁతచెలిమంతనములంటా

సంతసానఁబొదరింటి చాయకేఁగెను 13-299.

విరహంతోడి నాయకుడు చెంత పూపొదరింటిలోని పావురాల కువకువధ్వనుల విని తన నెలయించే చెలిపలుకులుగా భ్రాంతి చెంది సమీపించాడని అన్నమయ్య వర్ణన.

తిమ్మక్క

కోవెల స్వరముతో కొమరాలుపోయి

చిలుకపలుకుతోడ చెలివిన్నవించె 37.పుట.

నని ముద్దుముద్దుగా మృదుమధురంగా పలికే సుభద్ర పలుకులను కోవెల, చిలుకల పలుకులతో పోల్చడం విదితం.

పెదతిరుమలయ్య కోకిల రాయంచ, నెమలి కూతలతోపోల్చాడు.

కోకిలవాణి గనక కోరి మేఘవర్ణమైతే

నాకెనీతో మాటలాడదాయఁగాక 23-271.

వసంత ఋతువులోనే కోకిల కూస్తున్నట్లు వర్ణించడం కవిసమయం. వర్షర్తువు కోకిలకు గిట్టదు. నాయకుడు మేఘవర్ణుడు అంచేతే కోకిలవాణి అయిన నాయిక పలుక నిరాకరించింది.

మాటాడు రాయంచరీతిన్.

జగన్మోహనాకారయై మించ శృం.దం. 89పుట.

ఆమె పలుకులే రాయంచ పలుకులు.

చీమ చిటుకననీక చెలిపిలుతువో యంటా
ఆముకొని దిక్కులెల్లా నాలపించితి
ప్రేమపు నెమలి కూత పిలిచేవు నీవంటా
దీమసాననూఁ కొని తెలిసిలోగితిని 23-356.

ఇది నాయకుని కంఠధ్వని. విరహంతో వేగే నాయిక నెమలి కూతను విని నాయకుని కంఠస్వరమని భ్రాంతి చెందింది. పిక, శుక స్వరాలలోని శ్రావ్యత నెమలికంఠంలో లేదు. కొంచెం రాపుగా కటువుగా వుండేది నెమలి క్రీంకారం. అలాగైతే పురుషుని కటువైన కంఠానికి నెమలి కంఠంతో పోలిక సముచితం.

చిన తిరుమలయ్య- మగువ యాడిన యట్టి మాట విని నాయకుఁడు
పగటునఁగోవిలపలుకని భ్రమసె 16-8

చిన్నన్న పికములఁబిలవవే పికవాణినీవు -అష్టమహిషీ కాల్యాణం-4-177
కులుకుల నెఱి వేణిగల కీరవాణి - పరమయోగివిలాసం -3-235

అని శుక పికస్వరాలతో పోల్చారు.

## 4.2.3.2.మాటలు-రావిమానిపువ్వులు :

రావిచెట్టు పూలు పైకి కనిపించేవి కావు. యుఫోర్బియేసియే కుటుంబానికి చెందిన రావి పైకి కాయలులా కనిపించే వాటిలోపలవుండేవన్నీ పూలే. అవి అనభివ్యక్తాలు. రతులలోని అవ్యక్తభాషణానికి దీనికి పోలిక.

ప్రాపంచిక భోగాలన్నీ క్షణికాలు. అయదార్థాలు, మాయ ఒక్క ఇందిరారమణుని సేవే స్థిరమూ యదార్థమూ అయినది అనే భావంలో అన్నమయ్య రతులలలోని మాటలను రావిమాని పువ్వులతో పోల్చాడు. అంటేరతులలో మాటలున్నా అవి పైకి వినిపించవు కాబట్టి లేనట్టే. అనభివ్యక్తాలైన రావిమాని పువ్వులవంటివే.

ఇందువల్లనేమిగద్దు యినుపగుగ్గిళ్ళింతే

యిందిరా రమణసేవే యిరవైనపదవి

-----------------------

సతులతో నవ్వులు చందమామ గుటకలు

మతి తలపోఁత లెండమావుల నీళ్ళు

రతులలో మాటలు రావిమాని పువ్వులు 2-268.

### 4.2.3.3. మాటలు –పోఁక :

శుష్కమైనవి పనికిరానివి అనే అర్థంలో మాటలను పోకలతో చిన్నన్న పోల్చాడు

పోకమాటలు పల్కి పోక నాతోడ

కైకొని కయ్యంబు గావింపుమనుచు ఆ.క. 2ఆ-పుట76.

రణరంగంలో కృష్ణుని తూలనాడి తనసుతాను పొగడుకొన్న బాణుని పలుకులే పోకమాటలు. రణరంగంలో ప్రదర్శించవలసింది భుజబలపరాక్రమాన్ని అంతేకాని వాక్శూరత్వాన్ని కాదు. శుష్కమైనట్టి పలుకులే పోకలు.

### 4.2.3.4. మాటలు –మధురపదార్థాలు :

మధురమనే మాటకు యింపయినదని అర్థం. ఆ యింపు నాలుకకు కావచ్చు, గొంతుకు కావచ్చు, శరీరం యావత్తుకు కావచ్చు. మనసుకూ కావచ్చు. లోకోభిన్నరుచి. ఆ యింపు పలురకాలు. తీయనిది, పులిసినది కావచ్చు. చక్కెర, బెల్లం మానవకృతం. తేనె సృష్టిసహజం. అమృతం దేవతలకాహారం. చింతపులుపు చవులూరించేది. దప్పికగొన్నవారి దప్పికను తీర్చే మంచినీటితేట మరింత యింపైనది. అలాగే కొందరి మాటల్లో కృత్రిమత్వం, సహజత్వం, అనిర్వచనీయత్వం, సరసత్వాలుంటాయి. అంచేతే తాళ్ళపాక కవులు తమ పలుకుల్లోనే పలురకాల యింపులను మనకు చవిచూపించారు.

బెల్లం :

అన్నమయ్య : అయ్యెడ మాటల బెల్లాలప్పటి గొన్ని వున్నవి 14-34.

పెదతిరుమలయ్య : ఒగ్గిమాటల బెల్లాల కొడిగట్టీనితడు 23-33.

చిన్నన్న : పాలుపైన పలుకు నొప్పుల కుప్పలనగ

బలితంబులై బెల్లంపుటచ్చులును -అష్టమహిషీ కల్యాణం. 4-పుట 177

చక్కెర :

అన్నమయ్య : పాటల పంచదారలు పచ్చిమోవి తేనెలునీ

మాటలాయనేడిట్టే ఆరగించవయ్య 14-166.

చిన్నన్న : కెలసి చక్కెర నుడికించు పల్కులను ప.యో.వి.

తేనె :

అన్నమయ్య : తేనెలవంటి మాటలు తెరవనీతోనాడె 22-443

అమృతం :

అన్నమయ్య : పలుకులయమృతము పనిగొనుటెపుడే -18-533.

చిన్నన్న : సుధావాణికి నబ్జపాణికిని అష్టమహిషీకాల్యణం 1-58.

చింతకాయలు :

అన్నమయ్య :

బడిబడి చెప్పగానే పండ్లు పులిసీనే

కడునీ సుద్దలు చింతకాయలవంటివి 20-113.

చినతిరుమలయ్య : నమలక చవులయ్యీ నాతిసుద్దులు

అమర చింతకాయలవంటివి

భ్రమసి కొరుకబోతే పండ్లు పులుసును

తెమలక శ్రీహరిదెలియగవలదా 16-19.

మంచినీటి తేటలు : పెదతిరుమలయ్య :

మగనాలి మాటలు మంచినీటి తేటలు
తెగనాడరట్టె మోవి తేనెవూటలు 23-111.

### 4.2.3.5. మాటలు –కర్పూరం :

చల్లనైన హృదయావర్జకమైన పలుకులే కర్పూర కళికలు. తాను కరిగిపోతూ దశదిశలా సుగంధాన్ని గుభాళించేది కర్పూరం.

అన్నమయ్య : కాంతల పలుకులెల్లా కప్పురాలవంటివి
అంతలో నీవు సరసాలాడేటివేళ 2-292.

గాలికే కరిగిపోయేది కర్పూరం. నాయకుని సరసానికి పరవశించి గాలిలో కలసిపోయేవి నాయిక అవ్యక్తాలాపాలు.

చిన్నన్న

పొలతుల మాటలబ్బురమైన చిలుక
పలుకులోకప్రంపుఁబలుకులో యనుచు అ.మ.క. 5ఆ-286పు

తన అష్టమహిషుల పలుకుల గూర్చి కృష్ణుడు సాక్షాత్తు పలికిన పలుకులివి.

### 4.2.3.6. మాటలు – మంగళాష్టకాలు :

వివాహపు తంతులో వధూవరుల మధ్య తెర వేసినపుడు బ్రాహ్మణుడు చదివే ఎనిమిది శ్లోకాలు మంగళాష్టకాలు. ఈ అష్టకాల అనంతరమే వధూవరుల ప్రథమ పరస్పర వీక్షణం ఉంటుంది.

ఇక్కడ నాయికా నాయకులకు వివాహాత్పూర్వమే ప్రణయం ఉంది. ఆ ప్రణయం వివాహానికి దారితీసేదనే భావంతో అన్నమయ్య మాటలను మంగళాష్టకాలతో పోల్చాడు. అవి కేవలం మంగళాష్టకాలే కాక ఒకరినొకరు వశపరచుకోగల మదన మంత్రాలు. శిరోధార్యాలైన వేదమంత్రాలు కూడ.

పెదతిరుమలయ్య కూడ మాటలను పంచమవేదము, మదన మంత్రాలతో పోల్చాడు.

మంగళాష్టకాలు :

అన్నమయ్య : పలుకుల సరసాలు బలు మంగళాష్టకాలు -22-439.

మదనమంత్రాలు :

అన్నమయ్య : మలసియవె మదన మంత్రాలు -22-439.

పెదతిరుమలయ్య : మాటలు మీకిద్దరికి మదన మంత్రములు -23-165.

పంచమవేదం :

అన్నమయ్య : పంచమ వేదము నీకు పడతి మాటలెల్ల
సంచుల నెవరిమాట చవులయ్యీ -22-142.

పెదతిరుమలయ్య : ..........................వేడ్కల నీదు బాసలే
పంచమవేదమంచును బ్రపంచము సేసెను వేంకటేశ్వరా
శృం.వృ.శ. 36 పు

### 4.2.3.7. మాటలు – పురాణాలు :

సర్గ ప్రతిసర్గాది పంచలక్షణాలతో కూడిన బ్రహ్మాండాది అష్టాదశ పురాణాలు భగవంతుని మాటలుగా ప్రసిద్ధం. కాని అనంతర కుకవుల కల్పనలతో వీటి సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. పురాణమంటే బొంకులమయం పుక్కిటిపురాణాలు అన్నప్రసిద్ధి వచ్చింది. నాయకుని మాటలంటే నమ్మకం లేని నాయిక అతని మాటలను పుక్కిటిపురాణాలతో పోల్చింది.

నగు నీమాటలే పురాణంబులట బొంకు
దగిలీని చదువులింతయు బొంకులా
తెగి యిరువంకలా దీదీపులై నీ

పొగరుల మాటలెప్పుడును నిక్కములాల 12-329.త

### 4.2.3.8. మాటలు – వినరాని వేదాలు :

వేదాలు అపౌరుషేయాలు. అవి సాక్షాత్తు భగవంతుని పలుకులే. మానవులకు శిరోధార్యాలూ పరమ ప్రామాణికాలు. కాని ఆవేదాలను వల్లించే వ్యక్తి చేతలు వాటికి విరుద్ధంగా వుంటే ఆ వ్యక్తి మాటలును నమ్మడమెలా? అంచేత అన్నమయ్య ఆచరణలో లేని మంచిమాటను వినరాని వేదాలతో పోల్చాడు.

వేడుక నీ పలుకులు వినరాని వేదాలు

కూడేది గొల్లెతల గుంపుగాఁగిలి

ఆడేటి దొకటి నీయసిమలోని దొకటి

యీడనాతోనాడు మాటలివియైన నిజమా 30-90.

గోపకాంతాలోలుడైన నాయకుని పలుకును నాయిక వినరాని వేదాలుగా అభివర్ణిస్తోంది.

### 4.2.3.9. మాటలు – ఘంటానాదాలు :

ఘంట, భేరులు వాద్యవిశేషాలు. ఘంటానాదాన్ని పలురకాలుగా పలుసందర్భాలలో లౌకికంగా వినియోగించుకోవడముంది. అయినా దేవుడి గుడిలో గంటకి ప్రత్యేకత వుంది. భగవంతునికాహారనివేదన సందర్భాలలో గంటను మ్రోగించి భగవంతుని ఆహ్వానించడం ఆనవాయితీ. ఘంటారావం భగవంతుని ఆహ్వానానికి ప్రతీక పెదతిరుమలయ్య –

నే నిన్ను నుతించిన నుతుల యక్షర రవంబులు భేరీ భాంకార

ఘంటికా నినాదంబులు......................................

–వైరాగ్య వరచనమాలికాగీతాలు

దుష్టశక్తులను దూరంగా తరిమి భగవంతుణ్ణి ఆహ్వానించే శబ్దం భేరీ భాంకార ఘంటానాదాలు. భగవంతుని కీర్తించేవారి చెంత దుష్టశక్తులు చేరవు. భగవత్కీ

ర్తనతో తమ తనువునే భగవంతునికర్పించే భక్తుల పలుకులే ఘంటానాద భేరీ భాంకారాలు. ఇవి సుస్పష్టమైన ధ్వనులు.

## 4.2.3.10. మాటలు– వీణియపాటలు :

పలుకులను వీణియ పాటతో పోల్చడం విదితం. మధుర ధ్వనుల నీనేది వీణ.

అన్నమయ్య: వొలిసి నీవాడిన వొడ్డబాటు మాటలు

చెలికి వీణలో వాయించే పాటలు 13–392.

నాయకుని కై ఎదురుచూస్తూ నిరంతరం అతని జ్ఞాపకాలతో వేగిపోయే నాయికకు అడుగడుగున అతని పలుకులు తలపుకు రావడం సహజం. ఆమె తలపులో మెదిలే అతని అనునయోక్తులే మనసుకు హాయిగొలిపే వీణియపాటలు

చిన్నన్న

కిసలయపద వల్లకీవాణి దంత

హసిత కోమల యగు మిత్రవింద అ.మ.క. 5ఆ - పుట 249.

ఇవి మిత్రవింద పలుకులు కృష్ణుని పరవశింప జేయగలవి.

## 4.23.11. మాటలు – వేటపరికరాలు :

పశుపక్ష్యాదులను పట్టడానికై వేటకాడుపయోగించే వేటపరికరాలు పలురకాలు. ఎదుటివారిని ఆకర్షించి వశపరచుకొనే నాయికా, నాయకుల మాటలను వేటపరికరాలైన గాలాలు, జిగురుచుట్టిన కండెలు, దీమపుమెకములు, ఘంటలతో అన్నమయ్య పోల్చగా చినతిరుమలయ్య వలలతో పోల్చాడు.

గాలాలు :

మంచి గాలపుమాటల మతిఁదగిలించీ జాణ్మీ 25–307.

జిగురు చుట్టిన కండె :

చిరునవ్వు నీ పలుకు చిగురు చుట్టినకండె 12-75.

దీమపు మెకము :

మచ్చిక నీ మాటలు దీమపు మెకము వంటివి
కుచ్చితాన మెల్లనే తగులదీసేవు 29-424.

మోహన ఘంటలు :

ముంచిన మాటలే మోహనఘంటలు 9-6.

వలలు :

అన్నమయ్య : పిలుపుల మాటలే పెట్టినట్టి వాలలు 27-86.

చినతిరుమలయ్య : ప్రతినైన యతినైన వలల మాటలబెట్టి
బతిమి చెరుతురుగా బంధువులాల 16-28.

బాణాలు : మలయు నీ పలుకులు మరునంప చిలుకులు 24-90.

## 4.2.3.12. మాటలు –మందులు :

మందులు చాలరకాలు. ఇక్కడ మందులు మాయదారి మందులు, చొక్కుమందులు. ఎదుటివాళ్ళమీద చల్లినట్లైతే వాళ్ళను లోబరచుకొనే మందులు వశీకరణ సాధనాలు. నాయకుని పరవశింపచేసి లోబరుచుకొనే నాయిక మాటలకు మందులకు పోలిక.

అన్నమయ్య మదిరాక్షి మాటలు మాయపు చొక్కుమందులు
యెదుటి నిన్ను మదనమెత్తించెను -22-77.

### 4.2.3.13. మాటలు – నవరత్నాలు :

కాంతి వంతమైన, అందమైన, విలువైన రాళ్లే నవరత్నాలు. అపరూపమైన మాటలను మాణిక్యాలు, ముత్యాలు, పుష్యరాగాలతో అన్నమయ్య పోల్చాడు.

మాణిక్యాలు :

మగువ మాటాడితేను మాణికాలు నిండుకొనీ 29-30.

ముత్యాలు :

అడుగిడఁజాలక ఆడినమాటలె

ఒడిబడిఁబలికే పలుకులివి

జడిగొను ముత్యపుసరులై విరులై 30-104.

పుష్యరాగాలు :

చెలితేనెమాటలు జిగిఁబుష్యరాగాలు 24-108.

### 4.2.3.14. మాటలు – మందమిరియాలు :

మందపై (గుంపుమీద) మిరియాలు చల్లితే వాటిని పట్టుకోవడమెంత అసాధ్యమో ఆధారరహితమైన కేవలం నోటిమాటలను పట్టుకోవడమూ (రుజావుచూపడం) అంతే కష్టం ఇట్టి మాటలను నీటిమూటలుగా అభివర్ణిస్తారు. కాని అన్నమయ్య మందమిరియాలతో పోల్చాడు. మిరియాలు ఘాటైనవికూడ.

మందమిరియాలు వో నీమాటలు -15-116.

### 42.3.15. మాటలు – సూదులు :

మనసుకు గుచ్చుకుని బాధించే మాటలను అన్నమయ్య సూదులతో పోల్చాడు.

సూదుల మూటలువో నీ సుద్దలు -15-116.

### 4.2.4. చూపులు :

దృశ్యమానమైన ఈ చరాచరజగత్తును దర్శించడానికి అనువుగా భగవంతుడిచ్చిన 'కళ్ళు' అనే ఇంద్రియాలనుండి వెలువడేవే చూపులు. చూపులు పలువర్ణాలుగా వర్ణించడం కవిసమయం. వీటిని పలువర్ణాలతోను యమునా తరంగాలు, పువ్వులు, తుమ్మెదలబారు, విషం, అమృతం, బాణాలు మొ॥ వస్తు సముదాయంతో పోల్చడం కవిసమయం. అన్నమయ్య చూపులను ప్రాకృతిక పదార్థాలైన పూజాపరికరాలు పెళ్ళివస్తువులు, వేటవస్తువులు, నవరత్నాలతోను చరాచరాలైన జింకలు, చాతకాలు, చకోరాలు, మిణుగురులు, పలురకాల పూలు, తట్టుపునుటగు, మరుని టెక్కెలు, కస్తురివీణెలు, తుమ్మెదలతోను పెదతిరుమలయ్య చూపులను సూసకము, బాసికము, మెఱుగు, ముత్యాలు, మల్లెలు,, అమ్ములు, చీకటి, సూర్యుడు, వెన్నెల, వివాళి తట్టుపునుగు, చకోరాలతోను చినతిరుమలయ్య బాణాలతోను చిన్నన్న బాణాలు, మెఱపు, తుమ్మెదలతో పోల్చారు.

### 4.2.4.1. చూపులు – జింకచూపులు :

అందం, ఆకర్షణీయం అయిన బెదురు చూపుల జంతువు జింక. అందమైన నాయిక బెదురుచూపులే జింకచూపులు.

అన్నమయ్య : చింకచూపుల చెలియచేఁత మదనుని చేత
యింకానతని నె మోహించఁజేయఁగను -12-112.

### 4.2.4.2. చూపులు – పక్షులు :

నాయిక చూపులకు చకోర, చాతకాలకు పోలిక. చంద్రునిరాకకై ఎదురుచూచి ఆ చంద్రుని చల్లని కిరణ ప్రసారానికి పరవశించి ఆ వెన్నెల తనివితీరా గ్రోలే వెన్నెలపులుగే చకోరం. నాయకునికై ఎదురుచూచి అతని రాకతో పరవశించిచూచే నాయిక చూపులకు చకోరాలకు పోలిక.

కేవలం వర్షధారలనే స్వీకరించే నీటిపక్షి చాతకమని కవిసమయం. విరహిణి అయిన నాయిక కన్నీటిని గ్రోల్చడానికై ఆమె చూపులే జాతకాలైనవట.

చకోరం:

అన్నమయ్య : కాంత కోపించి చూచితే కాముని యమ్ములై తాకు
సంతసించి చూచితేనే చకోరాలౌను 20-403.

పెదతిరుమలయ్య : సన్నుత దృక్చకోరముల చక్కఁగ మిక్కిలి వాలఁజేసెనో
శృంగారవృత్తశతకం -89 పద్యం

చాతకం :

అన్నమయ్య : నెట్టన విరహంపు నెగులేటికే
మట్టుఁగన్నీటికిని చూపుఁజాతకములవె 13-1.

### 4.2.4.3. చూపులు - తుమ్మెదలు :

చూపులను తుమ్మెదలతో పోల్చే సంప్రదాయముంది.

అన్నమయ్య: తొంగిచూపుల మొక్కలు తుమ్మిద పిండురెక్కలు 18-266.
సాభిలాషంగా చూచే చూపులే నల్లని తుమ్మెద పిండురెక్కలు.

చిన్నన్న చూపుతుమ్మెదలు ప్రసూనాంతరముల
దీపింపనందు చెందిన తేఁటిగముల
పరషట్పద భ్రాంతి పగగొను కరణి
గరిమెతో మ్రోయ........................ ఉ.క. 1భా-పుట 14.

మన్మథ పూజకై పుష్పాపచయం చేస్తున్న కన్యకల వర్ణన యిది. ఆ కన్యల చూపులు పూలపై బడగా అంతకుమునుపే పూలపై వ్రాలివున్న తుమ్మెదలు ఈస్త్రీల చూపుతుమ్మెదలను చూచి పరషట్పదని భ్రాంతిచెంది ఝుమ్మని మ్రోయుచున్నవట.

### 4.2.4.4. చూపులు – కస్తూరి వీణెలు :

చూపులను తుమ్మెదలు, జింక, చాతకాలు, చకోరాలతో పోల్చడం విదితమే. తాళ్ళపాక సాహిత్యంలో వీటన్నిటితో పోల్చడమే గాకుండ తెల్లనినవ్వుతో అందమై నల్లని కనుచూపులను కస్తూరి వీణెలతో పోల్చడం విశేషం. కస్తూరి మృగము బొడ్డే 'కస్తూరివేణె' నల్లని సుగంధద్రవ్యమైన కస్తూరికి నిలయమిది. వర్ణసామ్యం వల్ల కాటుకతోడి కనుచూపులను కస్తూరి వీణెలతో అన్నమయ్య పోల్చాడు.

కాంత కాటుకల కనుచూపులకును

శాంతపు నవ్వులు సరిసరియే

మింతగఁగస్తూరి వీణెల లోపల

కాంతులఁగప్పురము గలసినయట్లు 30–147.

### 4.2.4.5. చూపులు –మిణుగురులు :

కోపాన్ని ఎర్రగా వర్ణించడం కవిసమయం. కోపంతో కూడిన ఎర్రని కనుచూపులను కొఱవులు, చింతనిప్పులతో పోల్చే సంప్రదాయముంది. కాని ఎర్రగా కాంతివంతంగా నిప్పుకణికల్లా ఎగిరే మిణుగురు పురుగులతో పోల్చడం అన్నమయ్య ప్రత్యేకత.

ఉడుగని కోపపుటుగ్రపుఁజూపుల

మిడుగురు లెగయగ మిన్నంది 11–1–200.

### 4.2.4.6. చూపులు – పూలు :

చూపులను పలువర్ణాల పూలతో పోల్చే సంప్రదాయముంది. కాని తాళ్ళపాక కవులు ఆ పూలన్నిటిని మాలలుగా శ్రీ వేకటేశుని కర్పించడం విశేషం.

తామరలు :

వడినలమేలు మంగ నిడువాలిక చూపునివాళి నీపయిన్

బడిసిన తమ్మిరేకులు ప్రసూన శరంబులు గల్వరేకులున్
బడిబడి మీఁదమీఁద రసభావన గాదిగఁబోసినట్లపో
పొడవగు పువ్వు జొంపముల పూజలు నీకు వేంకటేశ్వరా
-వేంకటేశ్వరశతకం -61.

కలువలు:

తగులుకొనెనో మెడఁదరుణి చూపులెల్లా
అగపడి కల్వదండలై వున్నవి -13-218

మల్లెలు:

కందులేని చందురోఁగలువరేకులువుట్టె
అందులోనే మల్లెదండలవి మించెను
కందువఁగమ్మరనవే కాయజు నమ్ములాయ
యిందుముఖి చెలువింక నేమిచెప్పేదే -23-514.

మొల్లలు:

ముడిచిన మేలు కట్టు మొల్లల దండలు నీ
కడగంటి చూపులంటా ఘూతఁబై పైఁజూచును -13-278

## 4.2.4.7. చూపులు – దీపాలు :

దీపాలు, ఆరతులు భగవంతుని కర్పించే షోడశోపచారములలోనివి. మనలోనున్న అంతర్యామికి మన శరీరమే పూజామందిరం. ఆగుడిలో దీపాలే కనుగొనచూపులు.

అన్నమయ్య -

కనుగొన చూపులే ఘనదీపములట 2-82.

వేంకటగిరీశునకు అంగనలు తమ చూపులతోనే ఆరతులిస్తున్నారు. అంచేత అన్నమయ్య పెదతిరుమలయ్య లిద్దరు చూపులను దీపాలతోనే కాక ఆరతులతో కూడ పోల్చారు.

అంగనల చూపులు ఆరతులవంటివి 2-292.

చొక్కముగ మగిడించి చూచెనొకచూపు

లెక్కించిమై నివాళించె నొక చూపు 23-536

## 4.2.4.8. చూపులు–తలఁబాలు :

తలంబ్రాలు పోసుకోవడం పెళ్లితంతులో ఒక భాగం. పైనుండి క్రిందిదాకా నిలువెల్ల జాలువారే బియ్యం తలంబ్రాలు. భవనాశినదికి యిరువైపుల ఎదురెదురు కొండలపై నున్న ఇందిరా ఔభళేశులకు నడుమనున్న భవనాశినదే పెండ్లితెర కాగా ఒకరి చూపులు మరొకరిపై నిలువెల్ల ప్రసరించగా అదే తలబాలు గాన్నమయ్య అభివర్ణన.

ఈ రీతి శ్రీ వేంకటాద్రినెందునందు నిద్దరూను

సారెకుఁగూడుచు సరసము లాడేరు

తారుకాణ చూపులు తలబాలు వోయగాను

తేరుకొని భవనాశి తెరయాయ నడుమా 22-430.

ఆనందంతో శరీరం యావత్తు స్పృశించే ఇందిరా ఔభళేశుల చూపులే తబాలుగ అభివర్ణించాడు.

## 4.2.4.9. చూపులు – సూసకాలు, బాసికాలు :

పెళ్ళిలో నాయికా నాయకులపై నిలువెల్ల జాలువారే జూపులను అన్నమయ్య తలంబ్రాలతో పోలిస్తే లక్ష్మీ కల్యాణంలో లక్ష్మీనారాయణుల చూపులు ఒకరిచూపులు మరొకరికి సూసకాలు బాసికాలుగా అమరాయని పెదతిరుమలయ్య అభివర్ణన. సూసకమంటే స్త్రీలు తలలో ధరించే తిరుగుడు బిళ్ల

(పాపిటబొట్టు లాంటిది) బాసికమంటె పెళ్లిలో వధూవరులు నుదుటను ధరించే అలంకారపు బిళ్ల.

లక్ష్మీ కల్యాణము లీలతోఁబాడే మిదే నేము
లక్ష్మీ నారాయణులే లలనయు నీవును
చూపులు చూపులు మీకు సూసకము బాసికము
పూపచన్ను గుబ్బలివి బూజగుండలు 23-165.

లక్ష్మీదేవి చూపులు నారాయణుని నుదుటిపైన నారాయణుని చూపులు లక్ష్మమ్మ నుదుటిపైన తదేకంగా నిలిచివున్నాయి. గాబట్టి అవి బాసికాలు సూసకాలుగా అమరినాయని భావం.

## 4.2.4.10. చూపులు – కంకణదారాలు :

లోకంలో ప్రేమకు అంకురార్పణ పలువిధాలుగా వుంటుంది. అన్నిటిలోకి బహుధా ప్రశంసలందుకొన్నది తొలిచూపులలోని ప్రేమే. 'లవ్ ఎట్ ఫస్ట్ సైట్'. ఆ చూపుల కుండే ఆకర్షణశక్తిని బట్టే కాబోలు పెళ్ళిచూపులకు మనపెద్దలు శుభగడియలనుంచుతారు.

అందుకే అన్నమయ్య
మనసుకు మనసే మరి తారు కాణగాక
వెనకకు ముందరికి విచారములేల
కన్నులనీ చూపులే కంకణదారములాయ
పన్నినన్ను వేరే వొడఁబరచనేల 26-435.

స్వామి చూపులు అమ్మవారిపై ప్రసరించిన ప్రథమవీక్షణమే అవి ఆమెకు వివాహదీక్షాకంకణాలై నిలిచాయి. అంచేత ప్రత్యేకించి తనను పెళ్ళికి ఒడబరచవలసిన పనిలేదని ఇక వివాహానికి త్వరపడమని అమ్మవారి పలుకులు. వివాహమొక పవిత్రకార్యం. ఆ కార్యదీక్షాకంకణమే కంకణదారాలు.

## 4.2.4.11. చూపులు – వేటపరికరాలు :

వాడి, వేడి చూపులను బాణాలతో అవీ తిరుగులేని మన్మధ బాణాలతో పోల్చడం సంప్రదాయం. బాణాలతోనే గాక ఎదుటివారిని పట్టిబంధించే చూపులను వలలు, పగ్గాలు, పాశాలు, వల్లెత్రాడు, ఉరుదాళ్ళతో కూడ పోల్చడం తాళ్లపాక కవుల ప్రత్యేకత.

బాణాలు :

అన్నమయ్య : తరుణి నీ కన్నుల బిత్తరి చూపులూ
మరునికి నవియే కమ్మని తూపులూ 18-142.

చిన్నన్న : అకట చూచినయంత నుడుగనేమిటికి
మకరాంకు చిలుకులెమా కటాక్షములు
– అష్టమహిషీ కల్యాణం-2ఆ-పుట 92.

గాలాలు:

కన్నులచూపులు గాలపుచిలుకులు 9-6.

తీగెలవల :

................చూపులనే తీగెలనే
వలలొడ్డించినది యీ వలపే కాదా -13-199

పగ్గాలు :

గరిమఁజూపులు రెండు గట్టినపగ్గములు 2-152.

పాశాలు :

పలుచని నీ తెలిచూపుంబాశాలు 4-119.

వల్లెతాడు :

వల్లెతాడువంటి వనిత చూపులెనీకు

ఉరి :

వుల్లము కోరికలను నురులై నిల్చె 14-224.

ఉరుదాళ్లు:

ఉదుట గాంక్షలోని వురుఁదాళ్లేగావా
సుదతి నిన్ను జూచే చూపులు 27-391

### 4.2.4.12. చూపులు – మరుటెక్కెలు :

నిటారుగా నిలిచిన టెక్కెం విజయసూచకం. నాయిక మనసును జయించి ఆమెను లోబరచుకొని ఆమెపై నిలిపిన నాయకుని చూపే మదనవిజయ సూచకమైన మరుటెక్కెం

నెలతపై నీవు చూపునిల్పితే జవ్వనసీమ
వాలసి మరుని టెక్కెలుంచినట్లాయ 30-438.

### 4.2.4.13. చూపులు – నవరత్నాలు :

అందం, అపురూపం అయిన చూపులను మెఱపుతీగెల తోను ముత్యాలు, బంగారంతోను పోల్చడం ప్రసిద్ధం.

'కళ్లెత్తితే చాలు కనకాభిషేకాలు' అని నండూరి వారి ఎంకి చూపుల మహాత్మ్యమెంతటిదో అందెరిగినదే కదా! తాళ్లపాకకవులు మెఱపులు, ముత్యాలు, బంగారాలతోనేగాక పలురకాల భావాలను ప్రదర్శించే అపురూపమైన చూపులను నవరత్నాలతో పోల్చారు.

అన్నమయ్య

ముత్యాలు : కందువ చూపు ముత్యాల గనులున్నవి 14-34.

రత్నాలు : అలరుఁజూపులే రత్నాభిషేకము 18-76.

నీలాలు : మగిడి చూచితేను నీలాలుప్పతిలీ 29-30.

పగడాలు : బలిమి నీవు జంకించి పగడాలవంటి చూపు 20-120

బంగారు : చూపులనే కురిసేవు సారిది బంగారపు పొడి 22-188

## 4.2.4.14. చూపులు – మధుర పదార్థాలు :

ఆస్వాదించినకొద్దీ మరింత చవులూరించేవి మధురపదార్థాలు. జిహ్వాకోరుచి అన్నట్లుగా మనిషి మనసునుబట్టి ఆ మాధుర్యం పలురకాలు. మనసును ఎలయించే ప్రియురాలి లేదా ప్రియుని చూపులను పాలు, తేనె, పండు, విందు, అంబలి, కప్పుర పువిడేలతో పోల్చడం అన్నమయ్య కీర్తనలలో ప్రత్యేకత.

పాలు : పాలువంటి చూపులును పానుపుపై సరసాలు 18-539.

పండు : పాసిక్కూడిన చూపు పండువంటిది 22-479.

తేనె : చిల్లర నాఁటు జూపులు చిమ్ము ఁదేనెలువంటివి 22-479.

అంబలి :

పొంకపుఁజూపులంబళ్లు పారినవ్వులపచ్చళ్ళు

అంకెలాయనేఁడిట్టె ఆరగించవయ్యా 14-166.

కప్పురపు విడేలు :

పెట్టితివి చూపులనే కప్పురవిడేలు 13-527.

## 4.2.4.15. చూపులు –వెన్నెల :

చల్లని తెల్లని ఆహ్లాదకరమైన చూపును వెన్నెలతో పోల్చే సంప్రదాయముంది. కాని అన్నమయ్య పెదతిరుమలయ్యలు చల్లని చూపులను వెన్నెలతోను కోపపుచూపులను సూర్యుని తోను పోల్చారు.

అన్నమయ్య : చెలియ జూచిన చూపు చీకటలో వెన్నెల 25.24.4

పెదతిరుమలయ్య : వెన్నెలా చూపు వేమారుఁజల్లుచు

కన్నులా నిన్ను గమ్మర నవ్వీని 23-439.

పెదతిరుమలయ్య : సాలసేటి కోపపుజూపులనంతలో

తళుకున సూర్యోదయమాయ 23-407

## 4.2.5. నవ్వులు :

'నవ్వునానావిధాల చేటు' అని సామెత. నవ్వులకు గల కారణాలు బట్టి నవ్వే తీరును బట్టి నవ్వులు పలురకాలు. అయినా సామాన్యంగా మనసులోని ఆనందాన్ని వ్యక్తంచేసేది నవ్వు. నిర్మలమైన మనసుకు ప్రతీక అయిన నవ్వును తెల్లగా వర్ణించడం తెల్లని చంద్రుడు వెన్నెల, అమృతం, పుష్పం, ఫేనం, కైరవం ఇత్యాదులతో పోల్చడం కవిసమయం. అన్నమయ్య నవ్వులను తెల్లని స్వామి అలంకారాలు, వెండిగనులు, ముత్యాలు, వజ్రాలు, పువ్వులు, ముగ్గులు, సేసలు, కర్పూరం, పంటలు, చందమామ గుటకలు, అమృతం; పాలు, పెరుగులతోనే గాక పరులనాకర్షించే నవ్వులను పలురకాల వేటపరికరాలతోను వికటాట్టహాసాన్ని తురగపు సకిలింపుతోను పోల్చగా తిమ్మక్క ముత్యాలతోను పెదతిరుమలయ్య తలంబ్రాలు, వెన్నెల, చంద్రోదయాలతోను, చిన్నన్న క్రొమ్మించు, డిండీరం, వెన్నెలతోను పోల్చారు.

## 4.2.5.1. నవ్వులు – సకిలింపు (తురగపు):

అందమైన నవ్వును చిలుకతో పోల్చడముండగా అన్నమయ్య వికృతమైన నవ్వును గుఱ్ఱపు సకిలింపుతో పోల్చాడు. పళ్లన్నీ బయటపెట్టి వికృతమైన గుఱ్ఱపుకూతే సకిలింపు.

గుట్టున శ్రీ వేంకటేశ కొంత నవ్వె జాలదా

తొట్టి సకిలించునా తురగము వలె 31-214.

అని నోరార నవ్వలేదని నాయికలో నేరాలెంచే నాయకునితో చెలులు పలికిన సమాధానమిది. అంటే చిరునవ్వులోవున్న సోయగం పళ్ళికిలించడంలో లేదని భావం.

### 4.2.5.2. నవ్వులు – చేనిపంటలు :

చక్కగా పండిన చేనిపంటలే భాగ్యాలు. మగడు నవ్వినవ్వే మగువల భాగ్యం అందువల్ల నాయకుని నవ్వులను నాయిక పాలిట చేనిపంటగా అన్నమయ్య అభివర్ణించాడు.

ఏమి చెప్పేమయ్య యివిగో మా భాగ్యాలు

..................................................

పిలిచి మాటాడిన ప్రియము తంగేటిజున్ను

సెలవుల నవ్వులు చేనిపంటలు 24-54.

### 4.2.5.3. నవ్వులు – పువ్వులు :

నిర్మల హృదయాన్ని ప్రతిబింబించే స్వచ్ఛమైన నవ్వును తెల్లగా వర్ణించడం కవిసమయం. నిర్మలము పవిత్రము అయిన నాయిక తన ప్రతి కదలికనూ పూజాకుసుమాలుగా నాయకునర్చిస్తోంది. ఈ అర్చనలో భాగమే నవ్వుల మొల్లల పూజ. అన్నమయ్య

కలికి నీకనుచూపు కలువరేకుల పూజ

లలన నీ నగవు మొల్లలపూజ 12-95.

అందము, ఆకర్షణీయమైన జవరాలినవ్వే జాజిపువ్వు.

కన్నులఁజూచిన చూపు గండుతుమ్మిద పూవు

సన్నల నవ్విన నవ్వు జాజిపువ్వు 24-90.

### 4.2.5.4. నవ్వులు – ముత్తెపు నామం :

తెల్లని నవ్వును తిరుమలేశుని ముత్తెపునామం, కర్పూరపు కాపు, గంధం, ఛత్రచామరాదులతో అన్నమయ్య పోల్చాడు.

ముత్తెపునామం:

చిక్కకొనెనో నొసలిఁజెలియ నగవులెల్లా
అక్కరముత్తెపునామమైనీకున్నది 13-218.

కప్పురపు కాపు :

ఇతవుగా లోలోన యెనసి వుండేటి వేళ
గతిగూడ నవ్వేనవ్వు కప్పురపుకాపు 13-129.

గంధం :

సిరులనవ్వు గంధాలు చెమటల పన్నీరు 14-58.

ఛత్రచామరాలు:

చలువైన నవ్వులే ఛత్రచామరాలు 18-76.

## 4.2.5.5. నవ్వులు – నవరత్నాలు :

అత్యంత విలువైన రత్నాలు నవరత్నాలు. అన్నమయ్య దృష్టిలో అలమేలు మంగమ్మ నవరత్నాలరాసి. అంచేతే అవకాశం దొరికినప్పుడల్లా ఆమె ప్రతిచేష్టను నవరత్నాలతో పోలుస్తుంటాడు.

ముత్యాలు :

ముచ్చట సెలవినవ్వు ముత్యాల దండలు గట్ట
నిచ్చలానఁజిన్ననాఁడే నేరిచితివే 24-344.

వజ్రాలు :

తొడిబడ నవ్వితేను తొరిగీని వజ్రాలు
వొడికమైనది యీపై వొరవు చూడవయ్య 29-30.

వెండి గనులు :

వెడలే సెలవినవ్వే వెండిగనులు 24-108.

తిమ్మక్క సుభద్రాకల్యాణంలో కూడ

పాలించు ముత్యముల పణతి చిర్నగవు    పుట 15

అని సుభద్ర చిరునవ్వును ముత్యాలతో పోల్చింది

## 4.2.5.6. నవ్వులు – పాయసదివ్యహోమము :

మధురమైన నవ్వును వెన్నెల, పాలు పెరుగు, అమృతాలతో పోల్చడం తాళ్లపాకసాహిత్యంలో విస్తృతంగా కనిపిస్తుంది. వీటితోనే గాక నవ్వును హోమంలోవేల్చే దివ్యపాయసంతో పోల్చడంచేత అన్నమయ్య నవ్వుకు మాధుర్యంతో బాటు దివ్యత్వాన్ని కూడ కల్పించాడు.

ఆమెపైఁజల్లే వలపదే తర్పణజలము
దీపించు నవ్వు పాయస దివ్యహోమము
దాపగు నీ యధరామృతమే మంచి భోజనము
నీపాలఁబ్రత్యక్షమాయ నెలఁతయిదె నీకు    22-518.

ఇక్కడ నాయకుడు చేసే పూజా క్రమంలో నాయికను వశపరచుకోవడానికతను చిందే చిరునవ్వులే అగ్నిలో వేసే దివ్యమైన పాయసహోమం.

## 4.2.5.7. నవ్వులు – సేసలు :

నాయికా నాయకులకు ఒకరిచేష్టలు మరొకరికి వింతవింత వేడుకలు కలిగిస్తున్నాయి. ఆ వేడుకలలో నాయకుని నవ్వులే నాయికకు తలఁబ్రాలు అయినాయి.

అన్నమయ్య : పెలుఁచుఁబయ్యెదనె పెండ్లి తెరమాఁటుసేసె
బలిమి నవ్వుల తలఁబ్రాలు వోయవయ్యా    22-443.

పెదతిరుమలయ్య : మేటి తలఁబాలు మీలో మించునవ్వులు    23-165.

సేసలు తెల్లనివి. నవ్వులు కల్లాకపటం లేనివి. అంచేతే రెంటికి పోలిక.

## 4.2.5.8. నవ్వులు –ముగ్గులు :

ముగ్గే ముంగిటికి శోభ. నాయకుని రాకే నాయికకు ఆనందం. మనసులోని ఆనందాన్ని ప్రతిబింబించేది నవ్వు. ఆ నవ్వే నాయికముఖానికి శోభ. అందువల్ల తెల్లని ముగ్గుకు స్వచ్ఛమైన నవ్వుకు పోలిక. అన్నమయ్య

ఈ పొద్దునీపతి వచ్చె నేలసిగ్గులు వడేవే

..............................................

నలుగడ సెలవుల నవ్వులు ముగ్గుపెట్టవే 24-39.

పతిరాకతో సిగ్గులు పడక నవ్వుల ముగ్గులతో అతనికి స్వాగతం పలుకమని చెలిసలహా. నవ్వు కోటి దివ్వెల వెలుగు.

## 4.2.5.9.: నవ్వులు – వేట పరికరాలు :

గ్రామీణ వాతావరణంలో పెరిగిన అన్నమయ్యకు వేట పరికరాలతో బాగా పరిచయమున్నట్లు అతని కీర్తనలలోని వర్ణనల వల్ల సువిదితం. పశుపక్ష్యాదులను పట్టి బంధించడానికి వేటకాడుపయోగించే వేట పరికరాలు-వలెతాళ్ళు, మచ్చు మేపులు, వెలి తెరలు, ఎదుటివారినిట్టే ప్రలోభపరచి పట్టి బంధించే నవ్వులను వీటితో అన్నమయ్య పోల్చాడు.

వలెతాళ్లు :

తెంచగరాని వలెతాళ్ళు తెలివి పడని లేతనవ్వులు 1-1

మచ్చుమేపులు :

మాయల నీనవ్వులివి మచ్చుమేపులవంటివి 29-424

వెలితెరలు :

వెన్నెల నవ్వులే వెలితెరలు

మిన్నక పురుషా మృగముల వేటలు

పన్నక యాడేరు పణఁతులు భువిని -9-6.

## 4.2.6. ఏడుపు :

మనసులోని విషాదాన్ని బహిర్గతం చేసేది ఏడుపు. ఇది కన్నీటిరూపంలోను, బాధతో కూడిన శబ్దం రూపంలోనూ వుంటుంది. ఏడుపును వర్ణించడం ప్రబంధసాహిత్యంలో విస్తృతంగా కనిపిస్తుంది. కన్నీటి బిందువులను ముత్యాలలోను, ఏడుపును కోకిల స్వరం, వీణా నాదాలతోను పోల్చడం ప్రసిద్ధం. అన్నమయ్య కన్నీటి బిందువులను ముత్యాలతో పోల్చగా చిన్నన్న కన్నీటి బిందువులను నక్షత్రాలలోను, వెన్నెలలతోను ఏడుపును కోయిలకంఠస్వరంతోను, వీణానాదంతోను పోల్చాడు.

### 4.2.6.1. ఏడుపు – కోయిల :

బాల పల్లవ గ్రాసకషాయ కంఠ కలకంఠ వధూ కల కాకలీధ్వనిన్

పారిజాతాపహరణం -10-133 ప.

ఇది కోకిల కాకలీకంఠంతో కూడిన సత్యావిలాపం. ప్రబంధయుగంలో అవతరించిన చిన్నన్నపై ప్రబంధప్రభావం తప్పలేదు. అంచేతే ఈ ఉపమాన ప్రయోగం. చిన్నన్న పరమయోగివిలాసం -

కోయిల జవరాలు క్రోల్చినరీతి

వాయెత్తి యా కీరవాణి యేడ్చుటయు 3ఆ-పుట 161.

శ్రీరంగేశుని వరప్రసాదంచేత తనకు పుట్టిన బిడ్డడు ఎంతకాలానికి పాలుద్రావక, ఏడువక, కనువిప్పి చూడకున్న అతని తల్లియైన నాథనాయిక తన బిడ్డను చూచి గొంతెత్తి విలపించింది. ఈ బిడ్డడే నమ్మాళ్వార్. తమిళంలో ప్రసిద్ధినందిన తిరువాయ్మొలి పాశురాల రచయిత, గాయకుడు.

### 4.2.6.2. ఏడుపు –వీణ :

'రాజీవానన యేడ్చె(గిన్నర వధూరాజత్కరాంభోజకాం
భోజీ మేళవిపంచి కారవ సుధాపూరంబు తోరంబుగాన్

వసుచరిత్ర -4ఆ-52 పద్యం.

ఇది గిరిక దుఃఖారావం. గిరిక సంగీతజ్ఞురాలు. అంచేతే దుఃఖంలో కూడ తాను మ్రోయించే వీణారావాన్ని తలపించింది. చిన్నన్న దేవదేవి సంగీత నాట్యకాభిజ్ఞురాలైన వేశ్య. దుఃఖంతో నిండి ఆమె కంఠధ్వని వీణా వాద్యంలా మ్రోగింది. చిన్నన్న పరమయోగి విలాసం -

దిట్టయైన యాదేవదేవిదావీణె
ముట్టి నాదించిన మరువు దీపింప(

.........................................

యప్పుడిట్లనియె దైన్యము పాదుకొనగ 4ఆ-335 పు.

### 4.2.7. కన్నీరు :

కంటినుండి వెడలేది కన్నీరు. ఇది సామాన్యంగా మనసులోని దుఃఖాన్ని సూచించేది. అయితే మిక్కుటమైన ఆనందంలో కూడ కన్నీరు రావడముంది.

### 4.2.7.1. కన్నీరు – వెన్నెల :

దుఃఖం కన్నీటిరూపంలో వెలువడుతుంది. కళ్ళను చకోరాలతో పోల్చడం సంప్రదాయం. చకోరాలు వెన్నెలలను పానం చేస్తున్నట్లు వర్ణించడం కవిసమయం. ఎంత ఇష్టమైన పదార్థాన్నైనా అతిగా భుజించినపుడు వికటించడం సహజం. కళ్లనుండి వెలువడే కన్నీరే నేత్ర చకోరాలు క్రక్కుతున్న వెన్నెలలు. ఇది చిన్నన్న అభివర్ణన.

కెరలి వెన్నెలలు గ్రక్కెడు చకోరముల

కరణి లోచనములఁ గ్రమ్మునశ్రువులు

చెక్కుటద్దములపైఁ జింది కిక్కిరిసి

కక్కసంబగు చనుగవమీఁద నురల ప.యో.వి. 4ఆ-పుట 330.

ఇది దేవదేవి వృద్ధమాత కన్నీరు. విప్రనారాయణుని శిష్యుడు బంగారుగిన్నె తెచ్చియివ్వగా విప్రనారాయణుని ఎంతో ప్రేమతో ఆదరించిన ఆమె అది దొంగసొత్తని తెలియగానే దుఃఖాన్నాపుకోలేక కన్నీరు కారుస్తూ విప్రనారాయణుని నిందిస్తోంది. చకోరాక్షి అయిన వృద్ధమాతకు లోపల ఇముడక వెలికి ఉబికే కన్నీరే ఆ చకోరాలు అతిగా భుజించినప్పుడు తనలో ఇముడ్చుకోలేక వెలికి కక్కిన వెన్నెలలు. ఇష్టమయిన వస్తువే వెగటు కావడం లోకసహజం గదా!

## 4.2.7.2. కన్నీరు – ముత్యాలు :

అన్నమయ్య :

ముంచిన వూర్పులవెంట ముత్యపుఁగన్నీరుజారె

నించుకంత తెమలవు యిదేమయ్యా 27-501

విరహంతో వేగే నాయిక కన్నీరే ముత్యాలు.

## 4.2.7.3. కన్నీరు – నక్షత్రాలు :

వినీలాకాశంలో తళతళ మెరిసేవి చుక్కలు. కళ్లనుండి వెలువడ్డ నీటిబిందువులే చుక్కలు. దేవదేవి కన్నీరే చుక్కలు చిన్నన్న పరమయోగి విలాసం –

జుక్కలతో నొప్పు సోముచందమునఁ

బిక్కటిల్లెడు బాష్పబిందు పూరముల

నొప్పెడి యాననం బొక యింత యెత్తి

యప్పుడిట్లనియె దైన్యము పొదుకొనఁగ 4ఆ-పుట 335

దేవదేవి ముఖం చంద్రబింబం. చంద్రుని చుట్టూ ఉండేవి తారకలు. అవే దేవదేవి ముఖబింబంపై దొరలిన కన్నీటిబిందువులు.

## 4.2.8. ఊర్పులు :

ఊర్పులు రెండు. అవి ఉచ్ఛ్వాస నిశ్వాసాలు. ఆ ఊర్పులే నిడివి అయితే నిట్టూర్పులవుతాయి. ఊర్పు మనిషి మనుగడకు అత్యవసరం. కాని నిట్టూర్పు ఆ మనిషిలోని నిర్వేదానికి ప్రతీక. వీటికి అత్యంత మందత, పరిమళ శైత్యాలను చెప్పడం కవిసమయం. అన్నమయ్య ఊర్పులను ఎండమావులు, ఆలవట్టాలు, వీణతీగెలతో పెదతిరుమలయ్య ఆలవట్టాలతోను పోల్చారు.

## 4.2.8.1. ఊర్పులు – ఆలవట్టాలు :

గుడ్డతో గుండ్రంగా చేయబడ్డ విసనకర్రే ఆలవట్టం. చల్లని గాలులతో సేదదీర్చే సాధనం ఆలవట్టం. వూర్పులను చల్లని గాలులుగా వర్ణించడం కవిసమయం గాబట్టి ఆ వూర్పులకు ఆకృతిని కల్పించి ఆ చల్లని గాలులొసగే ఆలవట్టాలతో వూర్పులను పోల్చడం తాళ్లపాక సాహిత్యంలోని విశిష్టత.

అమరిన వూర్పులే యాలవట్టములట
క్రమముతో శ్రీ వేంకటరాయనికి 2-82.

అని అన్నమయ్య

నాముకుఁజెఱమరి యూపున్‌లు నీ యిరుదెసలం బట్టెడి
యాలవట్టంబులు -

అని తన వైరాగ్య వచన మాలికా గీతాలలో పెదతిరుమలయ్య తమ వూర్పులతో పరమాత్ముని సేవించడం గోచరిస్తుంది. జీవుని వూర్పులే పరమాత్మునికి ఆలవట్టాలు.

### 4.2.8.2 ఊర్పులు – వీణతీగెలు :

ఇళ, పింగళ నాడుల వల్ల సంభవించేవి ఉఛ్ఛ్వాస నిశ్వాసాలు. ఇవే ఊర్పులు. ఈ రెండు వీణకు కట్టిన రెండు తాళ్లని అన్నమయ్య అభివర్ణన. శరీరమే వీణ. ఆ వీణలో నాదోత్పాదనకు అతిప్రధానమైనవి తంత్రులు. ఈ శరీర మనుగడకు అత్యంత ప్రధానమైనవి ఉచ్ఛాస నిశ్వాసాలే. అంచేత ఈ రెండిటికి పోలిక. అన్నమయ్యవర్ణించిన ఈ వీణ ద్వితంత్రీవీణ. ఇప్పుడు మనకుండేది సప్తతంత్రీ వీణ.

తనువే వోళపు తలయే దండెకాయ

ఘనమైన వూర్పులు రెండు కట్టిన తాళ్ళు 9–178.

### 4.2.8.3. ఊర్పులు – ఎండమావులు :

ఎండమావుల్లో నీరులేదు. అలాగే నిట్టూర్పులో ఆశలేని స్థితి. అంచేతే ఈ రెంటికి పోలిక. అన్నమయ్య –

ఊతల నిట్టూర్పుల యెండమావులనేఁడి

లేఁత మోవిచిగురు యీాలేమకునేఁడు 12–108.

నిట్టూర్పులకు శైత్యాన్ని వర్ణించడం కవిసమయం. అయితే నిట్టూర్పులో శైత్యం లేదు పైపెచ్చు వుండేది వేడిమి. ఆ వేడిమికి మావిచిగుళ్ళు వాడడం సహజం.

### 4.2.9. చెమటలు :

రతి ఘర్మ శ్రమాదుల వల్ల శరీరంనుండి వెలవడే నీరే చెమట. ఈ నీటి బిందువులను ముత్యాలు, మల్లెమొగ్గలతో పోల్చడం ప్రసిద్ధం. అన్నమయ్య చెమటలను అర్ఘ్య పాద్య ఆచమనాలు, పన్నీరు, వసంతం, హోమకృత్యం, నేయి,జడివానలు, మంచు, ముత్యాలముగ్గులు, గోమేధికాలు, మల్లెమొగ్గలు, పూదేనెలు, అవబృథములతోను పెదతిరుమలయ్య సేసలు, జడివానలతోను పోల్చారు.

### 4.2.9.1. చెమటలు – మల్లెమొగ్గలు :

మల్లెమొగ్గలు తెల్లనివి. శరీరంపై ఏర్పడే స్వేదబిందువులూ తెల్లనివే. అంచేతే ఈ రెంటికి పోలిక. అన్నమయ్య -

మొనయుఁ జెమట మల్లెమొగ్గలపూజ 12-95.

ఇది మధుర భక్తి. నాయిక తన శరీరాన్నే పూజా కుసుమంగా నాయకున కర్పిస్తోంది.

### 4.2.9.2. చెమటలు – పూదేనె :

వనలక్ష్మి అయిన నాయిక శరీరంనుండి స్రవించే స్వేదమే పూదేనె. అన్నమయ్య -

బొత్తుగాఁ బెంజెమటల పూఁదేనెలు గురియ

కొత్త సింగార వనము కోమలి వెంచెనయ్యా 24-118.

అని చెలుల చేత పలికించాడు.

### 4.2.9.3. చెమటలు – హోమకృత్యం :

అగ్ని కార్యంలో అర్పించబడే ఆజ్యాదులే హోమకృత్యాలు. నాయకుని ప్రీత్యర్థం నాయిక అర్పించే హోమకృత్యం ఆమె వొడలి చెమటే యజ్ఞయాగాదులలో యాజ్ఞికుడు చేసే పవిత్ర జలస్నానం అవభృధ స్నానం. ఇది నాయిక చేసే కామయాగం. ఆ యాగంలో పడతి విరహతాపమే అగ్ని. చెమటలదడయుటే అవభృధస్నానం. స్వేదజలాన్ని నేయి, హోమకృత్యం అవభృధాలతో అన్నమయ్య పోల్చాడు.

హోమకృత్యం :

పడతికి నీశయ్య బలుపుణ్యక్షేత్రము

వొడలి చెమట నీపై హోమకృత్యము 13-27

నేయి :

బొడ్డు హోమపు గుంటలు పొంగుఁజెమటలు నేయి 13-265.

అవబృథం :

కామయాగము చేసెఁగలికి తన

ప్రేమయే దేవతా ప్రీతిగాను ॥పల్లవి॥

....................................

బడఁబడిక సమరతుల నుదయించిన చెమటఁ

దడయులే యది యవబృథంబుగాను -12-223.

## 4.2.9.4. చెమటలు –ఆహ్నికకార్యాలు :

ఆర్ఘ్యపాద్య ఆచమనాలందివ్వడం, పన్నీరు వసంతం చల్లడం అతిథికి అందించే ఉపచారాలు. నాయకునకు నాయికతన స్వేదజలాన్నే అర్ఘ్యపాద్య ఆచమన వసంతాలుగా అందిస్తుంది. తనలోని అణువణువు నాయకుని కర్పించడమే నాయిక లక్ష్యం.

అర్ఘ్యపాద్య ఆచమనాలు :

అంగపుఁజిఱుచెమటలర్ఘ్యపాద్యాచమనాలు 18-273.

వసంతం :

వలపుల చెమటల వసంతము చల్లీ -18-299.

పన్నీరు :

నిలువుఁ జెమటల పన్నీళ్ళియ్యవే 24-39.

## 4.2.9.5. చెమటలు –మంచు :

మంచు చల్లనిది. శరీరంలో చల్లదనం ఎక్కువ కావడం విషమ పరిస్థితికి చిహ్నం. విరహాతిశయం వల్ల చమటలు పట్టడం చేత నాయిక శరీరం విషమ

పరిస్థితికి లోనైంది. అంచేత తొందరపడి ఆమెను ఏలుకొమ్మని సూచన.

అన్నమయ్య

ఒకటి గూడినను వేరొకటికి బొసగదు

వికటాలై నీవలన వేదనలే చెలికి ||పల్లవి||

..........................................

అక్కటా చిగురుబోడి కగుజెమటల మంచు

గక్కన నిట్టూర్పు పెనుగాలి గాదుగాని 30-120.

### 4.2.9.6. చెమటలు – జడివాన :

నాయిక కొప్పు మేఘంకాగా ఆమె చెమటలను జడి వానలతో అన్నమయ్య పోల్చాడు.

సతికొప్పు మేఘము జడివానలేకావా

మితిలేని చెమటలై మేనను న్నవి 29-570.

పెద తిరుమలయ్య

జల్లన జెమటల వానల జడిగొని కురియుచునుండగ

వెల్లాయపు విరహంబుల వేసవి యింకనేలే 23-425.

అని విరహంతో వేగే నాయికను చెలులు ఓదార్చుతున్నట్లు వర్ణించాడు.

### 4.2.9.7. ఛెమటలు – నవరత్నాలు :

చెమటలను ముత్యపు ముగ్గులతోను కుంకుమపూతతో కూడిన చెమటలను ఎఱ్ఱని గోమేధికాలతోను అన్నమయ్య పోల్చాడు.

ముత్యపు ముగ్గులు :

మొలక చెమటలనె ముత్యపు ముగ్గులు

అలరిచె మదనుండదె చెలిమేన 4-71.

గోమేధికాలు :

కుంకుమ చెమటల గోమేధికాలురాలీ 13-314.

### 4.2.9.8. చెమటలు – సేసలు :

రతియందలి నాయకుని స్వేదబిందువులు నాయిక చల్లిన సేసలుగా పెదతిరుమలయ్య అభివర్ణించాడు.

ఇమ్ముల శ్రీవేంకటేశ యీపె నీవు గూడితే
నెమ్మిఁజెమట బొట్టులు నీమైనిండెను
చిమ్మి యందు నించిన సేసలు పైకొనెనంటా 23-220.

### 4.2.10. పులకలు :

సంతోష ఆశ్చర్య భయాదులు మనసులో కలిగినపుడు శరీరం మీద పొడచూపే రోమవికారమే పులకలు. పులకలను జాజులు, మొల్లలు మొ॥వాటితో పోల్చడం సంప్రదాయం. నిక్కిబొడుచుకున్నట్లుండే పులకలను అన్నమయ్య పైరు, బియ్యం, కనకపు మొలకలు, నీరుబుగ్గలు, జాజిననలు, ముగ్గులు, ముత్యాలు, చుక్కలతోను పెదతిరుమలయ్య కర్పూరవసంతాలు, ముత్యాలు, పైరు, పూలు, పూదండలతోను చినతిరుమలయ్య మోహపునోముమొలకలతోను చిన్నన్న మొల్లలతోను పోల్చారు.

### 4.2.10.1. పులకలు –పూలు :

సన్నగా నిటారుగా వుండే ఆకృతిని బట్టి పులకలను జాజులు మొల్లలతో పోల్చడం సంప్రదాయం. ఆ పూలు మాలలుగా గుది(గుచ్చి వాటిని వేంకటగిరీశునకర్పించడం తాళ్లపాకకవుల సంప్రదాయం. అన్నమయ్య

తను పులకలు జాజిననల పూజ 12-95.

నాయిక తను పులకలే జాజిననలుగా. వాటిని నాయకున కర్పించడమే ఆమె చేసే పూజ. పెద తిరుమలయ్య తన వైరాగ్యవచనమాలికా గీతాలలో

నామేనం బొడమిన పులకలు నీకు గుదులు గ్రుచ్చి యప్పిఁచిన పూదండలు -

భక్తితో తన శరీరాన్ని సర్వస్వం భగవంతుని కర్పించడమే పెద తిరుమలయ్య ఆంతర్యం. ఆ అర్పణలో పులకల పూలదండలను భగవంతుని కర్పిస్తున్నాడు.

చిన్నన్న అష్టమహిషీ కల్యాణం

కరములు చెమరింప గౌనులల్లాడ

పొలయు మక్కువ మొల్ల పూచిన రీతిఁ

బులకలు సర్వాంగముల జాజుకొనఁగ 2ఆ-పుట 99.

కృష్ణ విరహంతో పరితపించే గోపిక మేని పులకే నిలువెల్ల పూచిన మొల్లలు.

### 4.2.10.2. పులకలు – పైరు :

పాలుపట్టిన గింజలతో, పంటకు వచ్చిన పైరుతో తన కోరిక ఫలించిన నాయిక పులకలను అన్నమయ్య పోల్చాడు. తాను కోరిన తన ప్రియుని కలయికతో ప్రియురాలి మనసుపండి ఫలవంతం కాగా ఆ ఆనంద పారవశ్యంతో ఆమె నిలువెల్ల పులకించింది. ఆ పులకలే పాలుపట్టి ఫలవంతమైన పైరు.

ఇంటిలోనే శ్రీ వేంకటేశుడఁ గూడితేను
పంటలై పులక పైరు పాల లెక్కీని 13-44.

పాలగింజల తోడి పైరుతో పోలిక ఆమెలోని మాతృత్వకాంక్షను తెలియజేస్తుంది.

పెద తిరుమలయ్య

శ్రీ వేంకటేశ్వరుఁడు చెలిఁగూడగా మేన
వావిరిఁ బులకల వాములాయను
సావిగాక చెమటలు జడివట్టి కురియఁగా
మోవరాని పయిరులెల్ల మొలచినట్లుండెను 23-338

శ్రీ వేంకటేశ్వరుడు తన సతిని కూడగా ఆ రతియందు చెమటల వానలు కురిశాయి. ఆ జడివానలకు పైరులు మొలిచాయి. అవే వారి శరీరం నిలువెల్ల పులకలు గా అంకురించాయి.

### 4.2.10.3. పులకలు – బియ్యం :

సన్నగా పొడవుగా నిటారుగా వుండే పులకలను సన్నని బియ్యంతో అన్నమయ్య పోల్చాడు.

చూతువు రావయ్యా సుదతి కాపురము
యీతలనిదె నీ యింటిలోనను
పులకల బియ్యాల పొంగలివెట్టీ 14-10.

నాయకుని రాకకై ఎదురుచూచే సుదతి కాపుర వర్ణన యిది. ఆమె నాయకునికై తన పులకల బియ్యంతోనే పొంగలి సిద్ధం చేసింది. ఇది ఆమెలోని ఆనందాతి రేకాన్ని తెలియజేస్తుంది.

### 4.2.10.4. పులకలు – మొలకలు :

అన్నమయ్య అలమేలుమంగ పులకలను కనకపు మొలకలుగా అభివర్ణిస్తే చినతిరుమలయ్య నాయిక నోచిన మోహపు నోములో భగవంతుని కర్పించే మొలకలుగా అభివర్ణించాడు.

పలికిన వెల్లఁబసని వజ్రములు
నిలువునఁ దురుమే నీలములు
కలిగిన పులకలె కనకపు మొలకలు
జలజ లోచనకు సరియానీవు 30-47.

నవరత్నాల రాశి అయిన అన్నమయ్యనాయిక పలుకులే వజ్రాలు. కురులే నీలాలు కాగా పులకలే బంగారు మొలకలు. ఇది తనకు పాయసాన్నాన్ని తినిపించి కవితల్లడం నేర్పిన ఆ అలమేల్ మంగమ్మపట్ల అన్నమయ్యకు గల అపూర్వ భక్తి భావం. పక్షపాతం. అంచేత ఎంత కోటికి పడగలెత్తిన వాడయినా గిరీశుఁడు శ్రీ వేంకట గిరీశుడు అమ్మవారికి సరిరాడట.

చినతిరుమలయ్య

హెచ్చినీ మైఁబులకలివేఁటికే యింతి అవి।
ముచ్చట మోహపునోము మొలకలురా
పెచ్చుగా దేవరమీదఁ బెట్టవచ్చు ఁబో ।నీవె।
వచ్చి వరములిచ్చే దేవరవెపో నాకును 16-42(శృం)

తన పాలిటి దేవరగా శ్రీ వేంకట నాథుని అర్చించే యింతి భక్తి శ్రద్ధలను మాటలోని ఆమె జాణతనాన్ని వర్ణించాడు. తన శరీరంపై కలిగిన పులకలు తాను

నోచిన మోహపు నోములో భాగమైన మొలకలేనట. స్త్రీలు నోచే శ్రావణమాసపునోము మొ॥కొన్ని నోములలో ధాన్యాన్ని నానవేసి మొలకలెత్తిన తర్వాత భగవంతునికి నివేదించే సంప్రదాయముంది. ఇక్కడ చిన తిరుమలయ్య నాయిక నోము సరికొత్త మోహపునోము. ఆనోములో మొలకలే పులకలు.

## 4.2.10.5. పులకలు – నీరుబుగ్గలు :

నీటి ప్రవాహంచెంత నీటిని వెలికిచిమ్మే చిన్న మడుగులే నీటిబుగ్గలు. భూమి లోపల నీరు ప్రవహించగా ఏమాత్రం తాకిడితోనైనా పైకి ఉబికి వచ్చే మంచినీరే నీటిబుగ్గ. అన్నమయ్య -

చెంతఁగోరికల సెలయేరులు

పొంతనున్న నీరు బుగ్గలు పులకలు 25-260.

అంగనకు జవ్వనమనే ఆమనికాలం సమీపించగా వలపులు జడిగొన్నాయి. కోరికలే సెలయేరులుగా ఆమెలో ప్రవహిస్తున్నాయి. ఆ ప్రవాహం లోపలదాగక బయటికి పులకలనే నీటి బుగ్గలుగా వెలికి జిమ్ముతున్నాయి.

## 4.2.10.6. పులకలు – ముగ్గులు :

సిగ్గులు, నవ్వులు, చెమటలు, పులకలు అన్నిటినీ ముగ్గులతో అన్నమయ్య పోల్చాడు.

చెల్లవిఁకనేల సిగ్గులూ ! నేడు

మొల్ల పులకలే ముగ్గులూ 30-16.

## 4.2.10.7. పులకలు – చుక్కలు :

నీలాకాశంలో మిలమిల మెరిసేవి చుక్కలు. విరహాతుర అయిన నాయికకు కేశబంధం వీడి పగలే చీకట్లు కమ్మాయి. ఆపై ఆమెలో కలిగిన భావసంచలనం చేత పులకలనే చుక్కలు శరీరంపై పొడమాయి. అన్నమయ్య :

ఎంతేసి కాగలదో ఇన్నియునిట్లాయ

యెంత వింతలు వాడమె నెదురెదురనె
పడతి వేనలి జారి పగలు చీకట్లాయ
వొడలఁబులకల చుక్కలురక పొడమె 29-580.

పగలే చీకట్లు క్రమ్మడం చుక్కలు పొడమడం చేత ఏమి వుత్పాతం రానున్నదో అని చెలుల కలవరం. నాయిక శరీరంపై ఉదయించిన పులకలే చుక్కలు

## 4.2.11. కాఁగిలి :

ఆలింగనమే కాఁగిలి. అన్నమయ్య కాగిలిని విడిదిల్లు, పెండ్లిపీట, పెండ్లి చవికె. గృహప్రవేశం, జాజులశయ్య, దోమతెర, మంచం, పూపొదరిల్లు, వలపులవల, జిగురుగండె, గని, కేలాకూళీలతో పెదతిరుమలయ్య పెండ్లిచవికె, గాలము, కంతుని సాము గరిడి, రసముగని, గుహలతోను పోల్చారు.

## 4.2.11.1. కాఁగిలి – పూపొదవిల్లు :

వింటి ఆకారంలోని ఆధారానికి పెనవేసుకున్న లతలే పూపొదవిల్లు. పురుషుని పెనవేసుకున్న స్త్రీ బాహులతల కాగిలికి పూపొదవింటకి ఆకార సామ్యం. పురుషుడు ఆధారంగా అల్లుకొనే లతగా, స్త్రీని ఉపమించడం కవిసమయం. అన్నమయ్య

పండెడి పూఁబొదవిల్లు బాహులతలకాఁగిలి
అండనీ పతి భాగ్య మేమని చెప్పేమే 24-58.

## 4.2.11.2. కాఁగిలి – పెండ్లితంతు :

స్త్రీ పురుషుల ప్రేమకు పరిణామం, సార్థకం పెళ్ళి. కౌగిలి. పెళ్ళిలో మగపెళ్ళివారి సుఖనివాసానికై విడిదిల్లు ఏర్పాటు చేయడం, అందమైన పెండ్లి చవికె తయారుచేసి పెండ్లి పీటలు సిద్ధంచేయడం, గృహప్రవేశం, పూలపాన్పులు సిద్ధం చేయడం మొదలైన తతంగాలుంటాయి. అన్నమయ్య వీటన్నిటితో కౌగిలిని పోల్చాడు.

విడిదిల్లు :

వెలఁదుల కాఁగిళ్ళు విడిదిండ్లవంటివి
చలముల నీరతులు సలిపేవేళ 2-292

పెండ్లి చవికె :

తరుణికాఁగిలి నీకుఁ దగిన పెండ్లి చవికె 22-77.

కాగిలి కాగిలి మీకు కందువ పెండ్లి చవికె 23-165.

పెండ్లిపీట :

నెమ్మికనలమేల్ మంగ నీ కాఁగిలి పెండ్లి పీట 15-299.

గృహప్రవేశం :

తరు ణివదనమఁ(మం?)దపు(?)దోరణములు
కెరలిన కాఁగిలి గృహప్రవేశము 28-60.

జాజాలశయ్య :

జడియని కాఁగిలి జాజాలశయ్య 24-244.

దోమతెరమంచము :

వనిత కౌఁగిలి నీకు వాటపు పెండ్లి చవికె
దిననమునదె దోమతెరమంచము 24-439.

## 4.2.11.3.కాఁగిలి – వేటపరికరాలు :

పట్ట దలచిన జంతువును ప్రలోభపరచి బంధించేది వల. వలలో చిక్కాక తప్పించుకోవడం కష్టం ఇది బలాత్కార బంధనం. కుపిత అయిన నాయిక కాగిలి నాయకునికి వలపుల వల. అదే కాగిలి కోపం తగ్గాక ప్రీతి పూర్వకమైన తమ్మిపూజ కూడ అవుతుంది. పుల్లలకు లేదా దారపుండకు జిగురుపూసి పక్షులను పట్టడం వేటలో ఒక పద్ధతి. జిగురు పూయబడ్డ కండె జిగురుకండె. చేపలను పట్టే పరికరం గాలం. గాలానికి ఎరవుంచి చేపలు పట్టడం సహజం. ఒకసారి గాలానికి

తగులుకున్న చేప తప్పించుకోలేదిక. నాయిక వలపుల కాగిలే నాయకునాకర్షించి బంధించే గాలం.

వల -

అన్నమయ్య -

వనిత కాగిలి నీకు వలపుల వలేను
తనిసి చేపట్టి తేనెతమ్మి పూజలా
యెనసి శ్రీ వేంకటేశ యాపెతో నెట్టు మీరేవు
మొనసి కూడితివిట్టె మొక్కు మొక్కవయ్యా 20-403.

జిగురుకండె -

అన్నమయ్య।

చెనకే నీకాఁగిలి జిగురు గండె వంటిది
అనువుగాఁ జొక్కించి అంటుకునేది
ఘనుఁడ శ్రీ వేంకటేశ కలిసితివిటునన్ను
తనిసి వేడుకలోలో దైవారుట గాక 29-424.

గాలం -

పెదతిరుమలయ్య।

గాలమువంటిది నా కాఁగిటి కూటమి నీకు
తూలిమఱి యెందుకును తొలఁగరాదు 23-388.

## 4.2.11.4. కాఁగిలి – గని :

ఎన్నో విలువైన వస్తువులకు జన్మస్థానం గని. అట్లే అవధుల్లేని ఆనందానికి ప్రేమకు పుట్టినిల్లు కాఁగిలి. అంచేత అన్నమయ్య పెదతిరుమలయ్యలు కాఁగిలిని గనితో పోల్చారు. ఈ గనిలోనుండి ఉద్భవించే రత్నాలే బిడ్డలు.

అన్నమయ్య -

గని వంటిదీ కాఁగిలి కలవంటిదీవయసు 18-515.

కలలు పండించుకోమని అన్నమయ్య సలహా.

పెదతిరుమలయ్య:

రతినీ కాఁగిలి పెద్ద రసముగని

యితవైన శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ గలసె

అతని రాజసమెల్ల నమరెఁగదమ్మా 23-510.

ఎన్ని సంపదలున్నా సుఖం సౌభాగ్యం అందరాసించే సంపద. ఆ సంపదల రసధుని నాయిక కాగిలి. దప్పికదీర ఆ రసపిపాస తీర్చుకొనేవాడు నాయకుడు.

## 4.2.11.5. కాఁగిలి –గుహ :

నృసింహునకు ప్రీతిపాత్రమైన నివాసస్థానం అహోబిలం. ఇందిర కాగిలీ అంతే ప్రీతి పాత్రమైనది. అంచేతే ఈ రెంటికి పోలిక.

పెదతిరుమలయ్య:

జవళి నీపె కాపెసరినుండే పెద్దగుహ

యవధరించఁగదయ్య అవుభళేశ్వరా 21-228.

అహో'బిలం' లేకుంటే నర 'సింహుడు' అవతరించడు. అంచేతే ఇదిగో ఆ బిలాన్ని బోలిన నీ ఇందిర కాగిలి ఇక అవతరించమని చెలికాండ్ర వేడుక.

## 4.3. మన స్సంబంధి :

మనసు మానసిక ప్రవృత్తులకు సంబంధించిన కవిసమయాలన్నీ ఈ కోవలో చేరుతాయి.

## 4.3.1. మనసు :

'ఇంద్రియేభ్య : పరంమనః - భగవద్గీత - కర్మయోగం 42

'ఇంద్రియాణాం మనశ్చాస్మి - భగవద్గీత-విభూతియోగం 22

అన్ని ఇంద్రియాలలో శ్రేష్టమైనది భగవత్స్వ రూపమైనదిగా కీర్తింపబడింది మనస్సు. మనిషి మనుగడ సుఖ దుఃఖమయం కావడానికి కారణం మనసే. తృప్తి అసంతృప్తుల నిలయమిది. ఇష్టానుసారం విహరించే దీనిని గాలి, జింక, గుఱ్ఱం, విహంగాలతోను, స్వచ్ఛమైన మనసును పాలు, దర్పణాలతోను, సున్నితమైన మనసును పూవు, వెన్న మొ॥ వాటితోను, కఠినమైన మనుసును శిల, పర్వతాలతోను, అగాధమైన మనుస్సును సాగరంతోను స్వభావానుగుణంగా పోల్చడం సంప్రదాయం. అన్నమయ్య మనస్సును గాలి, జింక గుఱ్ఱం, కరి, చిలుక పసురం, పూవు, చేను, చిగురు, పండు, సింహాసనం, చింతామణి, చంద్రకాంతశిల, ఉప్పరిగ, వెన్న, లక్క, జలధి, నుయ్యి, మడుగు, కొండ, కనుమ, ఇసుకపాతర, గాదె, నింగి, నేల, కుందెన, విల్లు, పాదరసం,, గొనెబట్టిన బంక, తేనె లోపలి ఈగ, నడివీధి పెసర, అడుసులోపలి కంబం, గడకు కట్టిన పాత, నీరువంక తుంగ, పాలపొంగు, కంచులతోను పెదతిరుమలయ్య పైరు, గుఱ్ఱం, మదపుటేనుగు, గద్దెరాయి, చిగురులతోను చినతిరుమలయ్య వింటితోను పోల్చారు.

### 4.3.1.1. మనసు – జంతువులు :

పట్టవశంగాక పరుగులు తీసే మనసును పరుగులో మేటి అయిన జింక, గుఱ్ఱాలతోను పొగరుగా అదుపులోనికి రాక విచ్చల విడిగా చరించే మనసును మదపుటేనుగుతోను పోల్చడం సంప్రదాయం. తాళ్ళపాక కవులీ సంప్రదాయాన్ని పాటించారు.

జింక :

అన్నమయ్య వడినడవుల చింకవంటిది నామనసు
సిడిబడి ఁబట్టఁబట్టఁ బారీ గాను 2-395.

గుఱ్ఱం :

అన్నమయ్య

గర్దించి పారెడు తురగము వంటి మనసు 1-167.

పెద తిరుమలయ్య

దిట్టయిన మనసనేటి తేజి గుఱ్ఱమునకు

వొట్టిన రేవంతుఁడవు వుపమింపనీవు 21-137

కరి :

అన్నమయ్య:

వసముగాని కరివంటిది నామనసు

యెసము సారెకు మదియించీఁగాన 2-395.

పెద తిరుమలయ్య

మలసి నాచిత్తమనే మదపుటేనుగయిదె 21-193.

### 4.3.1.2. మనసు – చిలుక :

పశువునుగాని, చిలుకనుగాని బంధించితే మనమెలా చెప్పితే అలా వింటాయి. వదిలితే మనకందకుండ యథేచ్ఛగా పారిపోతాయి. అలాగే మనసును అదుపులో పెడితే మనం చెప్పినట్టువింటుంది. వదిలితే పట్టుతప్పి యథేచ్ఛగా పారిపోతుంది. అంచేత అన్నమయ్య మనసును పసురం, చిలుకలతో పోల్చాడు. మనసును అదుపులో వుంచి మంచిగా మలచుకోమని అన్నమయ్య సలహా.

చిలుక :

చేవదిలితే పెంచిన చిలుకైనా మేడలెక్కు

రావించి గూట బట్టితే రామాయనును 2-341.

పసురం :

బట్టబయలట (దోలితేను బందె మేయు(బసురము
వట్టి మేపితేని తన పనులు సేయు 2-341

## 4.3.1.3. మనసు – కమలం :

కమలం పుష్పరాజం. అర్చనలన్నింటిలోకి మానసికార్చన శ్రేష్ఠం. నిరంతరం నాయకునే తలపోసే నాయిక తన మనస్సనే కమలంతో అతని నర్చిస్తుంది.

అన్నమయ్య:

తలపో(త చింత చిత్తపు(గమలపు పూజ 12-95

## 4.3.1.4.మనసు – చేను :

చేనులో ఏ బీజాలను మనం నాటితే ఆ మొక్కలే మొలుస్తాయి జ్ఞానపు పైరును మొలిపించాంటే చిత్తమనే చేనును ఎలా సాగుచేయాలో చూడండి.

పాపల పాపమునేటి పోడు నఱికివేసి
చిత్తమని యెడు చేను చేనుగా దున్ని
మత్తిలి శాంతమనే మంచివాన పదునున
విత్తుదురు హరిభక్తి వివేకులు 9-70.

చిత్తమే చేను. అది చేసే పాపకృత్యాలే అందులో మొలచిన విషవృక్షాలు ముందుగా వాటిని సమూలంగా పెకలించాలి. ఆ తర్వాతే చేనును దున్ని అంటే మనసును సుక్షేత్రంగా మార్చి సాత్త్వికంగా తీర్చిదిద్ది శాంతమనే వాన పడ్డాక హరి బీజాలను నాటాలి. ఇదే నిజమైన వ్యవసాయం.

## 4.3.1.5 మనసు – నీరువంకతుంగ :

తుంగ.................ఇది ఒక రకమైన గడ్డి, నీరెక్కడ వుంటే అక్కడ మొలుస్తుంది. ఆనీటిపై (వాలుతుంది.స్త్రీలూ, వారి (పేమ.....ఎక్కడవుంటే

అటువైపు మొగ్గేదే నాయకునిమనసు ఆ మనసును ఒక పిచ్చి గడ్డి మొక్కతో నాయిక పోలుస్తుంది.

అన్నమయ్య

నీరువంక తుంగవంటి నీమనసెందుండినాను
ఆరయగ నేనింక నడ్డపెట్టేనా 25-427.

గడ్డితో కూర చేసి అందులో కసవుందని ఏరుకొవడం తగునా ? కసవు అంటే గడ్డిగాదరే. గొంగళిలో అన్నం తింటూ వెంట్రుక లేరినట్లు గోపాలుడవైన నిన్ను వివాహమాడి నీలో తప్పులెంచడం అట్టిదే. అడ్డుపెట్టినా ఆగేదికాదు నీ మనసు. అది నీరు వంక తుంగలాంటిది. ఇవి నాయిక నిష్ఠురోక్తులు.

## 4.3.1.6. మనసు – చిగురు :

చిగురు చాల సున్నితమైనది. కాకకు ఓర్వలేనిది. సున్నితమైన చిగురును జాగ్రత్తగా చేపట్టకపోతే నలిగిపోతుంది. మనసూ అటువంటిదే. అది కాకకు ఓర్వలేనిది. మొరటుగా ప్రవర్తిస్తే నలిగిపోతుంది. అంచేతే ఈ రెంటికి పోలిక.

చిగురువంటి చిత్తము చేరియెందు దిప్పినాను
తగిలి యలయుటే దక్కినట్టి లాభము 9-136.

## 4.3.1.7. మనసు – పండు :

పక్వానికి వచ్చిన ఫలం ఎంతో రుచికరమైనది. హాయిగా నమిలి ఆస్వాదించవలసిన దీన్ని పిసికితే నాశనమవుతుంది. మనసూ అట్టిదే.

అన్నమయ్య

మెత్తని పండువంటిది మించిన పతిచిత్తము
వొత్తిపిసుకగబోతే వోరువ గద్దా 13-554.

## 4.3.1.8. మనసు – సింహాసనం :

సింహలాంఛనాలతోడి ఆసనం సింహాసనం. ప్రభువులు అధిష్టించే ఆసనమిది. సింహాసనాన్నధివసించిన వ్యక్తికి ఆరాజ్యంపై ఆధిపత్యం సిద్ధిస్తుంది. ఆధిపత్యం ఎన్నోసుఖ సౌఖ్యాలనిస్తుంది. అయితే కొందరికి ఆధిపత్యంతో పాటు అహంకారము కూడ కలగడం కద్దు. అహంకరించినపుడు ఎన్నో పరాభవాలను కూడ ఎదుర్కొనక తప్పదు. మనలోని జీవుడు మనస్సనే సింహాసనాన్ని అధిష్ఠించి తానే ప్రభువని గర్విస్తున్నాడు. చివరకు అంతరాత్మయైన శ్రీవేంకటేశుని చూచి భ్రమసిపోతున్నాడు అని అన్నమయ్య వర్ణన.

చిత్తమనియెడి మహాసింహాసనంబెక్కి
హత్తిబహుపరాకాయ నదె జీవుఁడు 2-58.

పెదతిరుమలయ్య।

వున్నతి యిందిరపొందు యోగా నందము నీకు
కన్నులకాపెచిత్తము గద్దెరాయి 21-228.

## 4.3.1.9. మనసు – చింతామణి :

చింతామణి, కల్పవృక్షం, కామధేనువులు కోరిన కోరికలీడేర్చేవి. హరిమీద మనసు నిలిపినట్లైతే ఆ మనసే మోక్ష సామ్రాజ్యాన్నిచ్చే చింతామణి. అప్పుడది మనవెంటే వుండి మనమెలా చెప్పితే అలా మసలుతుంది.

అన్నమయ్య

చిత్తమనియెడి మహాచింతామణి దనకు
తొత్తువలె మలసి తనుఁదోడు తేఁగలది 1-159.

### 4.3.1.10. మనసు – చంద్రకాంతశిల :

శిల కఠినమైనదే కాని చంద్రకాంతశిల వెన్నెలకు కరుగుతుందని కవిసమయం. నవ్వును తెల్లని వెన్నెలలతో పోల్చడం కవిసమయం. వేంకటేశ్వరుని నవ్వులనే వెన్నెలలకు కరిగే నాయిక మనస్సే చంద్రకాంతశిల.

అన్నమయ్య

ననుపై శ్రీవేంకటేశ నవ్వి నీవు గూడితేను
యెనసి కామిని చిత్తమెల్ల గరఁగె
వొనరి ఆ వెన్నెలకీ మనసనే చంద్రకాంత
మనువుగా గరఁగిన యట్టి చందమాయను 13-419.

### 4.3.1.11. మనసు – వెన్న :

తెల్లనిది మెత్తనిదీ ఏ మాత్రం వేడితగిలినా కరిగిపోయేది వెన్న. వలపులకాకకు కరిగే సున్నితమైన మనసే వెన్న.

అన్నమయ్య

వెన్నవంటిదీ మనసు వేఁడి వంటిదీ వలపు 18-336.

తేలికగా కరిగిపోయే మనసును వెన్నతోనేగాక లక్కతో గూడ అన్నమయ్య పోల్చాడు .

లక్కవంటిదీ మనసు చొక్కు వంటిదీ వలపు 18-347.

కాకకు కరిగిన లక్క అది తగులుకున్న చోట గట్టిగా అతుక్కుపోతుంది. మనసూ అట్టిదే. వలచినవారిపై నిలిచాక మరి తిరిగిరాదు.

### 4.3.1.12. మనసు – జలధి :

సముద్రం విశాలము అగాధమైనది. ఇందిర మనసే పాల జలధి. అందులో పవళించేవాడు మరి ఆ పరంధాముడే.

పాలజలధి వంటిది పవ్వళించు నా మనసు
గాలి వూర్పులే కడళ్ళు కలదులోతు 2-149.

## 4.3.1.13. మనసు – నుయ్యి :

నుయ్యి ఇరుకైనది లోతైనది. చింతలతో కూడిన మనసు కుంచించుకుపోవడంసహజం.

అన్నమయ్య

చెక్కిటి చెయ్యేటికే చిత్తపు నుయ్యేటికే 24-163.

చెక్కిటి చేయి మనసులోని చింతకు చిహ్నం.

## 4.3.1.14. మనసు – కొండ :

లోతైనది సముద్రమైతే ఎత్తైనది కొండ. దానినెక్కడం కష్టసాధ్యం. ఉన్నతమైన మనస్సును కొండతో పోల్చడం సంప్రదాయం. కాగా కొండతోనేగాక కొండ కనుమతో కూడ పోల్చడం అన్నమయ్యలో విశిష్టత. కొండలరాయని చూడాలంటే కొండంత ఉన్నతమైన మనసు కావాలి. అంచేత వేంకటరాయని కూడిన నాయిక మనసుకు కొండకు పోలిక. వేంకటపతిని దోచిన మనసు కొండేకాదు అది దొంగలకు నిలయమైన దొంగల సానికనుమ కూడ. అన్నమయ్య కీర్తించిన ఆరుకనుమలలో ఇదొకటి. ఇదినేటికి సిద్ధవటం తాలుకా ఓబుళం దగ్గర వుంది. నాయిక మనసుదోచిన నల్లనిదొంగ కిరవైనదే దొంగలసాని కనుమ ఇది తోడు దొంగల కిరువైనది.

కొండ :

కొండలరాయనిఁ గూడిన మనసూ
కొండయిలోలోనె కూడీనే 4-86.

కొండకనుమ :

కాంత నీ చిత్తమే దొంగల సానికనుమ

యింతటి వేంకటపతి కిరవైనది 12-115.

కొండ ఔన్నత్యానికే గాక కాఠిన్యానికి ప్రతీక. కాని తాళ్లపాకకవులు కొండలోని ఔన్నత్యాన్ని స్వీకరించారే గాని దాని పారుష్యాన్ని స్వీకరించలేదు. అంచేతే చినతిరుమలయ్య

పాయరాని వలపులు పక్కన దల చుకొంటే

రామా మనసు గరగనేమో 16-74(శృం)

## 4.3.1.15. మనసు – ధరణి :

ఓర్పుకు ప్రతీక భూమి. ఎంతో విశాలమైనది. ఎంతో భారాన్ని మోసేదిది. ఎంత భారాన్నైనా సరే గుప్తంగా తనలో ఇముడ్చుకొనేది మనసు. ఎంతో సోదించి చూచిన అంతు చిక్కని అనంతమైన నింగి నేలలతో కూడ అన్నమయ్య మనస్సును పోల్చాడు.

ధరణి:

టి (ఠీ) వులను ధరణివంటిది సుమీనామనసు 10-200.

మిన్ను, నేల :

సొగసి యెంత సోధించి చూచినా గానవచ్చునా

మిగులా నీమనసిట్టే మిన్ను నేలవంటిది -30-536.

## 4.3.1.16. మనసు – పాతర :

పాతర, గాదెలు కలకాలం ధనధాన్యాలు చెడకుండ నిలువ వుంచుకొనే సాధనాలు. అయితే వీటిని ధాన్యంతోనైనా నింపవచ్చు లేదా పాల్లుతో నైనా నింపవచ్చు. మనం దేనితో నింపితే అదే కలకాలం నిలుస్తుంది. కోరికలనే పాల్లుతో గాక హరిభక్తి అనే కొలుచుతో నింపిన మనస్సు కలకాలం మోక్షసంపద నిచ్చే గాదె.

గాదె :

యెలుకకు ( దినరాదు యెన్నాళ్లున్నా ( జివుకదు

తల(చి హరిభక్తి చిత్తపుగాదెఁ బెట్టితే 8-230.

ఇసుక పాతర :

ఎలిమి యిసుక పాతరెంత దవ్వినా మనసు

అలవి లేక పై కొనేదది తానెఱఁ గదా 28-488.

## 4.3.1.17. మనసు – కుందెన :

దంచడానికాధారమైనది కుందెన. కోనేటప్పని బాడుతూ వనితలు వలపులు దంచుతున్నారు. వలపులకాధారం మనసు. అంచేత మనసులను కుందెనగా చేసి దానిలో వలపులు నించి కనుసన్నలనే రోకండ్లతో వనితలు దంచుతున్నట్లు అన్నమయ్య అభివర్ణన.

సువ్వి సువ్వి సువ్వని

సుదతులు దంచెదరోలాల

వనితల మనసులు కుందెన చేసిటు

వలపుల తగనించోలాల

కనుసన్నలనెడు రోకండ్లను

కన్నెలు దంచెదరోలాల 12-353.

## 4.3.1.18. మనసు – విల్లు :

బాణాప్రయోగానికి సాధనం విల్లు. మనస్సనే వింటినుండి జ్ఞానమనే బాణాన్ని 'మాయ' అనే లక్ష్యంపై ప్రయోగించి ఆ మాయను తొలగించుకొనమని చినతరుమలయ్య సలహా.

చిన తిరుమలయ్య

మనసనియెడు పెనువింటను మాయాలక్ష్యము పైని

పనివడి జ్ఞానంబనియెడి బాణంబేసినను
వెనుకటి దుష్కర్మంబులు వేళ్ళతోడ ( బెకలిన
తనయంతనె సకలంబును తప్పక కాననగున్ 16-38(ఆధ్యా)

## 4.1.3.19. మనసు – పాదరసం :

ఇది ఒక లోహం. ఇది మిక్కిలి విలువైనది. మిక్కిలి వేగంగా పరుగిడేది. దేనికి అంటనిది. చేతికి చిక్కనిది. ద్రవరూపంలో వుండే లోహం పాదరసం. ఈ లక్షణాలన్నీ కలది మనసు. దానినెలా వశపరచుకొని అదుపులో వుంచుకోవాలో అంతుచిక్కని జీవుని వేదన ఇది -

అన్నమయ్య :

హరినీవే బుద్ధిచెప్పి యాదరించు నా మనసు
హరినీవే నా యంతర్యామిగాన ||పల్లవి||
పాస(గ( బాదరసము( బోలిన నామనసు
అసముదించక సదా అల్లాడీ( గాన 2-395.

## 4.3.1.20. మనసు – పాలపొంగు :

పాలు స్వచ్ఛమైనవే. కాని వేడికి పొంగేవి. ఆ పొంగును ఆపడం కష్టమే. మనసు మంచిదే కాని ఏ మాత్రం కాస్త వలపుల వేడి తగిలినా పొంగి పొరలుతుంది. ఆ పొంగునిక ఆపడం కష్టం. పరువంలో పరుగులు తేసే మనసే గాలి. పరగులు తీసే మనసును వశపరచుకొని అదుపులో పెట్టగలిగితే అది యేనుగ గుజ్జే.

అన్నమయ్య -

గాలివలె( బారుచుండు కానరాదు మనసు
పాలవలె( బొంగుచుండు పక్కనణ(గదు
యేలీలా గెలువరాదు యెక్కితే యేనుగ గుజ్జు 13-222.

## 4.3.1.21. మనసు – గోనెబట్టినబంక :

మంచికి చెడుకు రెంటికి తోడ్పడేది మనసే. దానిని మనం వినియోగించుకొనే తీరులోనే వుంది దాని సార్థకత. మనసును మన అదుపులో వుంచుకున్నట్లైతే అది సత్ఫలాలనిస్తుంది లేదా మనం దాని ఆధీనమైతే చేజిక్కని కొరగానికసిగాయలే. ఆ విషయాన్నే అన్నమయ్య సంసారబంధంలో చిక్కిన మనసును వానచేతకము, గోనెబట్టినబంక, మానఁజిక్కిన కోల, తేనెలోపలిఈఁగ, గడిరాజుబదుకు, నడివీధిపెసర, గడకుఁగట్టిన పాత, అడుసులోపలి కంబాలతో పోల్చి నిరూపించాడు.

ఎండలోని నీడ యీమనసు
పండు గాయసేయఁబనిలేదు మనసు ||పల్లవి||
వాన చేతక (చాతక) ములవలెనాయమనసు
గోనెఁ బట్టిన బంక గుణమాయ మనసు
మానఁజిక్కిన కోలమతమాయ మనసు
తేనెలోపలి యీఁగ తెఱఁ గ గాయ మనసు ||ఎండ||
గడిరాజు బదుకాయ కడలేని మనసు
నడివీధి పెసరాయ నయమైనమనసు
గడకుఁ గట్టిన పాఁ త గతిదోఁచెన మనసు |||ఎండ||
తెరువు చూపిన జాఁడ దిరుగు నీ మనసు
మరుగఁ జేసిన చోట మఱుగు నీ మనసు
తిరు వేంకటేశుపైఁ దిరమైన మనసు
సిరిగలిగినచోటఁ జేరు నీ మనసు ||ఎండ - 1- 337.

మనసుని అదుపులో వుంచుకోకపోతే ఈ దురవస్థలన్నీ దానికి తప్పవు. ఆ మనసులో తిరువేంకటేశుని నిలిపితే అదే స్థిరమైన మనసు.

## 4.3.1.22. మనసు – పరుసవేది :

ఇదే స్పర్శవేది. ఇనుమును బంగారంగా చేయు రసశిలావిశేషము. పరుసవేది ఉంటే చాలు అన్ని నిధులూ వున్నట్లే. శ్రీ వేంకటేశుని సన్నిదే ఇంతుల పాలిటి పెన్నిధి. కోరికలు నెరవేరిన మనసే పరుసవేది.

అన్నమయ్య:

చనవిచ్చి శ్రీ వేంకటేశ నీవు గూడితేను
మనసే పరుసవేది మగువలకు -24-54.

## 4.3.1.23. మనసు – రామరాజ్యం :

రఘురాముడు ఏలిన రాజ్యం రామరాజ్యం. సుఖశాంతులకు నిలయమిది. ఆత్మారాముడు మనసులో నెలకొని వుండగా మచ్చరాన్ని విడిచిన మనసే రామరాజ్యం.

అన్నమయ్య:

అతని మూలమే జగమంతానిది
ఆతుమలో హరికీలు అయివుండు గాని ॥పల్లవి॥
మచ్చరము లేకున్నను మనసే రామరాజ్యము -2-362.

## 4.4 మానసిక ప్రవృత్తి సంబంధి :

మనో వికారాలే మానసిక ప్రవృత్తులు. మానసిక ప్రవృత్తులైన వలపు, వైరాగ్యాలీ కోవలో చేరుతాయి.

### 4.4.1. వలపు :

ప్రేమే వలపు. అన్నమయ్య వలపును కామధేనువు, ముంజేతి చిలుక, పూచిన తంగేడు, వసంతం, తీగె, పైరు, పుప్పొడి, బయలు, కొండ, నుయ్యి, ఏరు, వారధి, యమునానది, తర్పణజలము, పాలు, పెరుగు, జున్ను, ఉప్పు, చింతకాయ కజ్జాయం, కప్పువట్టినచింతకాయ, కల, వలెతాళ్లు, తాసు, సింహాసనం, పట్టుజిగురు, నీడలతోను పెదతిరుమలయ్య తంగేటి జున్ను, వెన్న, నానని సనిగెలు, చలువమేడ, కొండ, తాసులతోను చినతిరుమలయ్య మేడిపండుతోను పోల్చారు.

#### 4.4.1.1. మనసు – కామధేనువు :

కోరిన కోరికలిచ్చే ధేనువు కామధేనువు. నాయకుని మన్ననే నాయికకు భాగ్యం. మనసిచ్చిన పతి చెంతనుంటే వనితలకు వలపే కామధేనువు.

పలుకుఁ బంతముతోను పతిచిత్తము వచ్చితే
వలపు కామధేనువు వనితలకు 24-54.

#### 4.4.1.2 వలపు – ముంజేతి చిలుక :

యథేచ్ఛగా ఆకాశంలో విహరించే విహంగం చిలుక. అందమైన ఆ చిలుకే మన చేజిక్కితే అది ఎంత మధురానందాన్ని కలిగిస్తుందో అలాగే అందరికీ అందని వలపు మనకు అనుభవానికి వస్తే ఎంతో ఆనందం కలిగించడం సహజమే కదా!

చెలరేగే ముంజేతి చిలుకవో వలపు 13-212.

#### 4.4.1.3. వలపు – పూచిన తంగేడు :

మనసులో మొలకెత్తిన ప్రేమాంకురం క్రమపరిణతి చెంది నిలువెల్ల వికసించగా ఆ వలపు, వికాసానికి పూచిన తంగేడుకు పోలిక.

పూచిన తంగేడు వలె పొదలీ మీ వలపు 22-511.

### 4.4.1.4 వలపు – వసంతం :

ఋతువులలో మొదటిది అందమైనది వసంతం. వసంతంలో వనమంతా కొత్త అందాలు నింపుకుంటుంది. యౌవనారంభంలో పొడచూపే వలపుతో వనిత సరికొత్త సొగసులు కైసేసుకుంటుంది. అందువల్ల ఈ రెంటికి పోలిక.

అన్నమయ్య

వనములో వసంతము వంటిది వో వలపు
మనసులో నెలకొన్న మర్మమువో వలపు -13-212.

### 4.4.1.5. వలపు – తీగె :

ఆధారాన్ని అందుకొని దానిచుట్టు గబ గబ అల్లుకొనేది పచ్చనితీగె. అలాగె ప్రేమించిన వ్యక్తి నాధారంగా చేసుకొని అతని చుట్టు అల్లుకొనేది వలపు.

తీగె : పచ్చని తీగెవల(లె) బారేది వలపు
యిచ్చకపు చల్లగాలి యీడువచ్చు వలపు 13-212.

చిగురు : కొత్త చిగురువంటిది కోరినట్టి నీ వలపు 25-316.

### 4.4.1.6. వలపు – మేడిపండు :

'మేడిపండు చూడ మేలిమైయుండు'
పొట్టవిచ్చి చూడ పురుగులుండు' వేమన.

అలాగే పైకి ఎంతో మధురంగా గోచరించే వలపుల నాస్వాదించబోతే ఎన్నో బాధలకు గురికావలసివస్తుంది. ఆ వలపులు ఫలించకపోతే ఇక ఆ బాధ వర్ణనాతీతం. కాబట్టి ఈ పై పై మెరుగుల కాశపడక మనసును శ్రీహరి మీద నిలుపమని చిన తిరుమలయ్య సలహా.

విచ్చక మెరుగులు విడివడ్డ వలపులు
పచ్చి మేడిపంటి భావము

మెచ్చిలోనుచూడ మొదలు పరువులె

గచ్చుల యివి మాని కనవద్దా హరిని 16-19( ఆధ్యా)

### 4.4.1.7. వలపు – పైరు :

విత్తనాలను నాటి పెంచి పోషిస్తే మొలకెత్తి ఫలవంతమయ్యేది పైరు. వలపూ అంతే. ప్రేమాంకురం నాటితే తగు ప్రోత్సాహాన్ని బట్టి మొలకలెత్తి శుభఫలాలనిస్తుంది. అంచేత వలపుకు పైరుతో పోలిక.

అన్నమయ్య

పలుమారు వలపుల పైరులు విత్తఁ గవలె

సొలసి తప్పక యిట్టే చూడవయ్య నీవు 13-434.

### 4.4.1.8. వలపు – పుప్పొడి :

పూవు ఫలవంతం కావడానికి పుప్పొడి అత్యవసరం. స్త్రీ శరీరాన్ని పూవుతో పోల్చడం సంప్రదాయం కాగా, ఆ పూవు యొక్క సార్థకతకు అత్యవసరమైనది పుప్పొడి. అలాగే జీవిత మాధుర్యాన్ని అనుభవించడానికి అత్యవసరమైనది వలపు. అంచేత వలపును పుప్పొడితో అన్నమయ్య పోల్చాడు.

పూవువంటి దాన నేను పుప్పొడివంటి వలపు 18-515.

### 4.4.1.9. వలపు –బయలు :

అనంతమైనది పట్టరానిది బయలు. అట్టిదే చేతికి చిక్కనిదే మొయిలు. అంతుచిక్కని వలపుకు వీటితో పోలిక.

బయలువలెనుండును పట్టరాదు వలపు

మొయిలు వలెనుండును ముద్దశాయరాదు 13-222.

### 4.4.1.10. వలపు – నుయ్యి :

అగాధమైనది నుయ్యి. ఉన్నతమైనది కొండ. స్త్రీల వలపులు అనేకరకాలు. కొందరిది నుయ్యిలాగా అగాధం. అంతుచిక్కనిది. మరికొందరిది కొండలాగా ఉన్నతమై అందుకొనడానికి వీలులేనిది. కొందరి వలపులు దూరపుకొండలలా నున్ననివిగా భ్రమింపచేసి తీరా దరిజేరాక ఎన్నో ఒడిదుడుకులకు ఎత్తు పల్లాలకు లోను చేసేవి కూడ.

నుయ్యి –

అన్నమయ్య :

నాకు జెప్పరే వలపు నలుపో తెలుపో

నూకి పోవగారాదు నుయ్యో కొండో 12-193.

కొండ –

అన్నమయ్య :

కొంకక కూడిన దాకా కొండవంటిది వలపు 25-575.

### 4.4.1.11. వలపు – ఏరు :

నిరంతరం ప్రవహించే నీటి ప్రవాహం ఏరు. నదిలో నీరు ప్రవహిస్తుంటే దాని సమీప ప్రాంతమంతా సస్యశ్యామలంగా వుంటుంది. ఆ నీరు ఎండితే మిగిలేది కేవలం శుష్కమైన ఇసుకపర్రే. వలపూ అట్టిదే. ప్రేయసీ ప్రియుల మధ్య ఆ వలపులు ఎడతెగక ప్రవహిస్తేనే ఆ మధురానుబంధం నిలుస్తుంది. వలపులు ఎండితే ఇక మిగిలేది శుష్కమైన నిరాశా నిర్మోహాలే. అప్పుడు జీవితమే ఎడారి సదృశం. అన్నమయ్య వలపును నీరు, ఏరు, వారధులతోను, కృష్ణుని వలపును అతనికి ప్రియమైన యమునానదితోను పోల్చాడు.

నీరు :

వలపు నీరు వంటిది వాడరాదు

తాళ్ళపాక సాహిత్యంలో కవిసమయాలు

తలపు మాకిద్దరికి తారుకాణై వుండును 14-269.

ఏరుయి

ఎదురుబడి కాఁగిళ్ల మేరులాయమీవలపు
అదనుఁబదనుఁగూడి అడుసాయవలపు 13-421.

వారధిః

వారధి వంటిది యీ వలపే కదా
వారకము నీకు నాకు వలపే కదా 13-199.

యమునానది :

అతివలుండు చోట అదేనీకు రేపల్లె
అతిశయపు వలపు యమునానది 27-100.

## 4.4.1.12. వలపు – తర్పణజాలము :

తృప్తిని కలిగించే జలము తర్పణ జలము.

ఆపెపైఁజల్లే వలపదే తర్పణజలము
దీపించు నవ్వు పాయస దివ్య హోమము
దాపగునీ యధరామృతమే మంచి భోజనము
నీపాలఁ బ్రత్యక్షమాయ నెలఁత యిదె నీకు 22-518.

ఇక్కడ నాయకుని వలపును తర్పణజలంతో అన్నమయ్య పోల్చాడు.

## 4.4.1.13. వలపు – మధురపదార్థాలు :

వలపనేదే ఎరుగని జీవితం శుష్కమైనది. జీవితంలో అత్యంత మధరమైనది వలపే. ఆ వలపును రుచికరమైన పెక్కు పదార్థాలతో తాళ్లపాకకవులు పోల్చారు.

వలపును మధరము, స్వచ్ఛము అయిన పాలు, పెరుగు, జున్ను, వెన్నెలతో పోల్చారు.

అన్నమయ్య

పాలు:

బడి బడి నీ వలపు పాలవంటిదె
విడువరు నిన్నిందుకే వీధి వీధిసతులెల్ల 17-22.

పెరుగు:

పేరబెట్టితే వలపు పెరుగు వంటిదెపో
కేరికాచఁ బోతే విరిగి పోవుగాని 14-59.

జున్ను:

వలపు జున్ను వంటిది వడిరేఁచఁబోతేను
తిలకించ మోవినే తేనె గారును 27-350.

పెద తిరుమలయ్య

కినియని వలపు తంగేటి జున్ను 23-187.

వెన్న:

వెన్న వంటిది వలపు వెచ్చనై తేఁగరఁగు
యిన్నివిధముల నీకు నేటికే చెలియ 23-355.

వలపు ఫలిస్తే ఎంత మధురమో అది వికటిస్తే అంత విషాదభరితం. అని పై పాదాలలో తాళ్లపాకవులు సూచించడం విదితం.

### 4.4.1.14. వలపు – ఉప్పు :

ఉప్పు వంటకు ఎంత అవసరమో వలపు జీవితానికి అంత అవసరం. ప్రేయసీ ప్రియుల మనుగడకు వలపు ప్రధానం. ఆ వలపులో పూరేకొలది వారి జీవితం మరింత మధురం. ఉప్పు లేని కూడులా వలపులేని జీవితం రసహీనం.

అన్నమయ్య

ఉప్పు వంటిది నీ వలపూరఁబెట్టితేఁ జవౌ

చిప్పంగౌఁగిట జేర్చి చెప్పవయ్యా ప్రియతమా 18-539.

## 4.4.1.15. వలపు – చింతకాయకజ్జాయం :

ఉప్పు,కారం కలిపి చింతపండు గుజ్జును పుల్లలకంటించి ఎండబెట్టి చీకడానికనువుగా తయారుచేయబడిన వంటకం చింతకాయకజ్జాయం. ఇది రాయలసీమ ప్రాంతంలోనే ప్రసిద్ధి చవులూరించే వలపును చింతకాయ కజ్జాయంతో పోలిక.

అన్నమయ్య -

చింతకాయ కజ్జాలు చెప్పరానివలపులు

అంతట నోరూరించేదిది తానెఱఁగదా 28-488.

## 4.4.1.16. వలపు – వేట పరికరాలు :

జంతువులను, పక్షులను పట్టడానికి వేటకాడుపయోగించే సన్నని తాళ్లతో కూడినది వల. పశువులను బంధించే తాళ్లు వలెతాళ్లు. తేలికగా తెంచుకోవడానికి వీలులేని బంధనమిది. వలపు బంధం కూడ అటువంటిదే. అందువల్ల వలపులకు వలెతాళ్లకు, వలలకు పోలిక.

వల।

వలపు వలవంటిది వయసామని వంటిది 28-36.

వలెతాళ్లు।

పచ్చిగాఁదిట్టవే చాలు పైకొనియదే నీకు
తచ్చివలపుల వల్లె తాళ్లయ్యీని పుడు 27-400.

### 4.4.1.17. వలపు – తాసు :

కొందరి వలపు చిరకాలం నిలిచేది, దృఢమైనది. అయితే మరికొందరిది క్షణికమైనది ఒడిదుడుకులకు తట్టుకోలేనిది. ఒడిదుడుకులకు నిలువలేక తారుమారయ్యే వలపును అన్నమయ్య, పెద తిరుమలయ్యలు తాసుతో పోల్చారు. త్రాసు చాల సున్నితమైనిది. ఎటు వెయ్యి జరిగినా ఆ చిరుతాకిడికే ఒరుగుతుంది. అసూయకు లోనైన మనసూ ఏ మాత్రం తాకిడికి ఓర్వలేక అవతలివారిని అవలీలగా అనుమానిస్తుంది, అవమానిస్తుంది కూడ. తాను కృంగిపోతుంది.

తాసువంటి వలపులు తారుమారుగావా 27-169.

తాసువంటిది వలపు తగిలితే ఁగుంగించు
యీసుకు మొదలుయిది యేటికే చెలియా 23-355.

### 4.4.1.18. వలపు – చలువమేడ :

చల్లదనాన్ని ఒసగే మేడ చలువమేడ. కలిమిలేముల వ్యత్యాసంలేక అందరినీ అలరించేది వలపు. మనసులో వలపు నెలకొన్నట్లయితే ప్రేయసీ ప్రియులకు చెట్టు పుట్టలయినా సరే చలువమేడల్లా భాసిస్తాయి. సరసాలన్నిటికీ నిలయమిది. అంచేతే వలపును చలువమేడతో పెదతిరుమలయ్య పోల్చాడు.

కలిమి చూడదు వలపు కడునమ్మితే రేఁచు
చలువ మేడౌ వలపు సరసములను 23-355.

### 4.4.1.19. వలపు – వచ్చీరాని పదము :

చిన్నపిల్లల వచ్చీరాని ముద్దుల పలుకులు ఎంత మధురమైనవో వ్యక్తావ్యక్తమైనవో వలపు అలా మురిపించేదే. అంచేతే అన్నమయ్య వలపును వచ్చీరాని పదము, తచ్చన మాటలతో పోల్చాడు.

వచ్చీరాని పదము వంటిదివో వలపు
తచ్చన మాటలవంటి తమి వలపు -13-212.

### 4.4.1.20. వలపు – వలరాయని గరిడి :

సాము కూటమి గరిడి. బలవంతుడైనా, బలహీనుడైనా బలాన్ని పుంజుకోవడానికి ఉపకరించేది సాము. అలాగే నాయికా-నాయకుల అనుబంధం పటిష్ఠం కావడానికి కుషకరించేది వలపే. అంచేతే అన్నమయ్య వలపును వలరాయని గరిడీతో పోల్చాడు. కాముడు మరింత బలపడడానికి ఉపకరించే గరిడీ ఈ వలపు.

వలరాయని గరిడివంటిదివో వలపు
పిలిచి బిడ్డనిచ్చిన ప్రియమిది వలపు -13-212.

### 4.4.1.21 వలపు – జిగురు :

జిగురు అంటుకుంటే వదిలించుకోవడం కష్టం. వలపూ అటువంటిదే. వలపులో చిక్కుకున్నాక ఆ వలపుల బంధం తప్పించుకోవడం కష్టం. ఇది అందరూ ఎరిగిందే అయినా ఎవ్వరూ తప్పించుకోలేనిది.

అన్నమయ్య

పట్టు జిగురు వంటిది పాయని మీ వలపు 25-148.

### 4.4.1.22. వలపు – నీడ :

మనిషి వెన్నంటివచ్చేది నీడ. నాయకుని వెన్నంటి వెంబడించే నాయిక వలపును నీడతో అన్నమయ్య పోల్చాడు.

ఒడక నావలపు నీ వొళ్ళి నీడవంటిది
వీడక నీ వెంట వెనఁబాయకున్నది 24-86.

## 4.4.2. వైరాగ్యం :

విరాగ భావం వైరాగ్యం. ఎప్పుడో ఒకప్పుడు మానవునికి జీవితంపై విరక్తి కలుగకమానదు. ఇది కంటికి కానరానిది. మోక్షానికి రాచబాట అయినది. దీనికి లాక్షణిక సిద్ధోపమానాలేవి లేవు. అయినా అన్నమయ్య దీనిని గాలి, వెలుగులతో పోల్చి మానవుని మనుగడకు గాలివెలుగులెంత ప్రధానమైనవో వైరాగ్యం అట్టిదేనని నిరూపించాడు.

### 4.4.2.1 వైరాగ్యం – గాలి :

కంటికి కానరాకున్నా గాలి ఆకసంలో అణగి సర్వత్రా వ్యాపించివుంటుంది. అంచేత దానిని మనం అనుభవించాల్సిందే గాని ఇలా వుంటుందని నిరూపించి చూపించలేము. వైరాగ్యం అట్టిదే.

కడఁగి యాకసమున గాలి యణఁగినట్లు

వడిఁగానరాదు నా వైరాగ్యం 11-1-53.

ఇది అన్నమయ్య స్వీయానుభవం. అతని శృంగార కీర్తనల్లో బాహ్యానికి వెల్లివిరిసేది శృంగారమే అయినా కంటికి కానరాక అంతర్లీనంగా వుండేది వైరాగ్యం . మానవుని మనుగడకు గాలి ఎంత అవసరమో వైరాగ్యం అంతే.

### 4.4.2.2. వైరాగ్యం – వెలుగు :

సంసారాంధకారంలో మునిగిన వ్యక్తికి దారి చూపించే వెలుగు వైరాగ్యమే. జీవుడు ఆ వెలుగు లోనే సంసారబంధనాలను ఛేదించి మోక్షఫలాన్నందగలడు. అందువల్ల కంటికి వెలుగే వైరాగ్యం . విత్తులు మొలవాలంటే సూర్యుని వెలుగు అవసరం. మనసులో నాటిన హరిభక్తి అనే విత్తులు మొలచి జ్ఞానపు పైరు పెరగాలంటే వైరాగ్యమనే వెలుగు అవసరం.

కామక్రోధాదులనే కలుపు దవ్వివేసి

వేమరు వైరాగ్యమనే వెలుఁగు వెట్టి

తాళ్ళపాక సాహిత్యంలో కవిసమయాలు

దోమటి నాచారవిధుల మెరుపులు వేసి

వోముచున్నారుజ్ఞానపు(బై రుద్యోగజనులు 9-70.

సంఖ్యా సూచిక

1. కావ్య మీమాంస - పుట 238
2. కావ్యాలంకార సంగ్రహం - పుటలు - 85-88
3. ఆధునికాంధ్ర కవిత్వం - సంప్రదాయం, ప్రయోగం - పుట 35
4. కవి సమయములు - పుట 140
5. తాళ్ళపాక సహిత్యం -శృంగాక సంకీర్తనములు - సంపుటం 26 - పీఠిక - పుట 26
6. తాళ్ళపాక సాహిత్యం - శృంగాక సంకీర్తనలు - సంపుటి12 - పీఠిక - పుట 30
7. తాళ్ళపాక సాహిత్యం - శృంగాక సంకీర్తనలు - సంపుటం 12 - పీఠిక - పుట 45

# ప్రకరణం –5

# ఉపసంహారం

# ఉపసంహారం

వాస్తవికతకు దగ్గరగా ఉండడం పదసాహిత్య లక్షణం. వాస్తవికతకు దూరంగా వుండడం కవి సమయం లక్షణం. పూర్తిగా విరుద్ధ స్వభావం గల ఈ రెంటి సమ్మేళనం పద కవితాపితామహుడుగా ప్రసిద్ధికెక్కిన అన్నమయ్య తదితర తాళ్ళపాక కవుల పద సాహిత్యంలో కనిపించడం ఒక విశిష్ట లక్షణం.

అశాస్త్రీయాలు అలౌకికాలు అయినా పరంపరాగతంగా కవుల వర్ణనలలో తావు చేసుకున్నవి, కావ్యానికి శోభను చేకూర్చేవి కవి సమయాలు. ఈ వర్ణనలు వర్ణనాత్మకమైన ప్రబంధ సాహిత్యంలో విస్తృతంగా తావు చేసుకున్నాయి. తాళ్ళపాక కవుల రచనలలో ఒక్క చిన్నన్న ద్విపదలలో తప్ప ఇతరుల రచనలలో కేవలం మూర్తి చిత్రణకు తప్ప ఇతర వర్ణనలకు తావు లేకపోయినా వీరు కవి సమయాలలోని ఔపమ్యతను గ్రహించి చాల వరకు వీటిని ఉపమానాలుగా దృష్టాంతాలుగా తమ సాహిత్యంలో పొందు పరచడం విశేషం.

కొండల రాయిని కొలువులోని వారైన తాళ్ళపాక కవులకు కళ్ళు మూసిన కళ్ళు తెరిచిన కనిపించే దైవం శ్రీ వేంకటేశ్వరుడే. అంచేతే అతని నివాసమైన తిరుమలకు ఆ తిరుమలేశునికి సంబంధించిన అలంకార, కైంకర్య, ఉత్సవ, యజ్ఞ యాగాలు సమస్త వస్తు సంపద వీరి కుపమాద్రవ్యాలే..

ఊరూరా సంచారం చేసి పద కవితలు వ్యాప్తి చేసిన అన్నమయ్యకు, ఆ వంశం వారికి ఆ గ్రామీణ వాతావరణంలోని ప్రతి అంశం కవితా వస్తువే. ఉపమా ద్రవ్యమే. అంచేతే ఇతర పదకవుల కవితలలో కనిపించని కవి సమయాలెన్నో వీరి సాహిత్యంలో తావు చేసుకొన్నాయి. అటు శిష్ట సాహిత్యం ఇటు జానపద సాహిత్యం రెంటిలోని కవిసమయ సంపదతో వీరి సాహిత్యం తుల తూగుతుండడం విశేషం.

కవిసమయాల సంఖ్య నియతంగా ఉండక పెరుగుతుండడం ఆ దేశ సాహిత్య జీవన లక్షణం. ప్రతిభావంతుడైన కవి నూత్న వినూత్న కల్పనలు చేయడం.

సహజం. ఇప్పుడు సుందరములైన కల్పనలు కొన్నాళ్ళకు కవి సమయ రూపం దాల్చడం సంప్రదాయం. తాళ్ళపాక కవుల రచనలలో ఈ కల్పనలు అన్నమయ్య తరువాత చిన్నన్నరచనలో ఎక్కువగా గోచరించడం ప్రస్ఫుటం. ప్రబంధయుగం వాడైన చిన్నన్న రచనలపై ఆ యుగపు ప్రభావం సువిదితం.

వీరి ఉపమానాలలో రూపసామ్యతకంటే గుణ సామ్యత అధికం. రూపం కంటే గుణం మిన్న అన్న నుడినివి నిరూపిస్తాయి.

# ఉపకరించిన రచనలు


అనంత కృష్ణశర్మ, రాళ్ళపల్లి మరియు శ్రీనివాసాచార్యులు ఉదయగిరి (పరిష్కర్తలు) : "ఆధ్మాత్మ సంకీర్తనములు" అన్నమచార్య విరచితములు, సంపుటము -8 1952 సంపుటము -11 1955. తిరుమల తిరుపతి దేవస్థానము ప్రచురణలు, తిరుపతి

అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి (పరిష్కర్త) : "ఆధ్యాత్మ సంకీర్తనములు" అన్నమాచార్య విరచితములు - సంపుటము 9-10 తి.తి.దే. ప్రచురణ, 1952

అనంతకృష్ణ శర్మ, రాళ్ళపల్లి : "శృంగాక సంకీర్తనములు" -అన్నమాచార్య విరచితములు, సంపుటము -13 తి.తి.దే. ప్రచురణ 1960

అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి మరియు శ్రీనివాసాచార్యులు, ఉదయగిరి (పరిష్కర్తలు) : 'శృంగార సంకీర్తనములు" అన్నమాచార్య విరచితములు - సంపుటము -14 తి.తి.దే. ప్రచురణ 1961

అనంత కృష్ణ శర్మ, రాళ్ళపల్లి మరియు రామసుబ్బశర్మ, గౌరిపెద్ది (పరిష్కర్తలు) : "శృంగార సంకీర్తనములు" -అన్నమాచార్య విరచితము - సంపుటము 1965 సంపుటము -20, 1965 సంపుటము 22, 1975 తి.తి.దే. తిరుపతి

అనంత కృష్ణశర్మ, రాళ్ళపల్లి : "సారస్వతాలోకము" త్రివేణి పబ్లిషర్స్ - మచిలీ పట్నం 1977

అప్పకవి కాకునూరి : "అప్పకవీయం" వావిళ్ళ రామశాస్త్రులు అండ్ సన్స్. ఎస్ప్లనేడ్ -చెన్నపురి-1 1962

| | | |
|---|---|---|
| అభినయ ఆర్ట్సు అకాడమి | : | అన్నమయ్య 580వ జయంత్యుత్సవ సంచిక. అభినయ ఆర్ట్సు అకాడమి విశాఖపట్టణం. |
| ఆంధ్రసారస్వత పరిషత్తు | : | 'తెలుగులో పదకవిత" -ఆంధ్ర సారస్వత పరిషత్తు ప్రచురణ, హైదరాబాద్ -1973 |
| ఆనందమూర్తి | : | 'తాళ్ళపాక కవుల కృతులు - వివిధ సాహిత్య ప్రక్రియలు"- ప్రభాకర ప్రచురణలు హైదరాబాద్ 1974 |
| ఆనందమూర్తి | : | "తొలి సంకీర్తన కవులు " ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ ప్రచురణ. కళాభవన్, హైదరాబాద్, 1975 |
| ఆనందమూర్తి, వేటూరి | : | "తాళ్ళపాక కవుల పదకవితలు- భాషా ప్రయోగ విశేషాలు' ప్రభాకర ప్రచురణలు హైదరాబాద్ 1976 |
| కృష్ణమూర్తి, ఇరివెంటి | : | 'కవి సమయములు' యువ భారతి కింగ్స్‌వే. సికింద్రాబాద్ 1987 |
| గంగప్ప, ఎస్. | : | 'క్షేత్రయ్య, పద సాహిత్యం - శశీ ప్రచురణ, గుంటూరు 1974 |
| గంగప్ప. ఎస్ | : | "తెలుగులో పద కవిత " - శశీ ప్రచురణలు గుంటూరు 1983. |
| గంగప్ప. ఎస్. | : | "తెలుగులో వాగ్గేయకారులు' యువభారతి. కింగ్స్‌వే, సికింద్రాబాద్ 1983. |
| గణపతి శాస్త్రి, చర్ల | : | 'సాహిత్య సౌందర్య దర్శనము -లతా ప్రెస్, ఖైరతాబాద్, హైదరాబాద్ -2.1972. |

గోవిందరాజా, చి|టాజా : 'తిరుమలలో తిరునాళ్ళు' శ్రీనివాస ప్రచురణలు, రామ సముద్రం 1985

గోవిందరాజా, చి|టాజా : 'తాళ్ళపాక అన్నమయ్య సంకీర్తనలలో ఉత్సవ విశేషాలు' శ్రీనివాస ప్రచురణలు రామసముద్రం, 1987.

చినతిరుమలాచార్యులు, తాళ్ళపాక : ఆధ్యాత్మ శృంగార కీర్తనలు - సంపుటి 16

జగన్నాధ రావు పి.టి. (పరిష్కర్త) : ఆధ్యాత్మిక సంకీర్తనలు - పెద తిరుమళాచార్య 21
"శృంగార సంకీర్తనలు - పెద తిరుమలాచార్య విరచితములు, సంపుటి -23. తి.తి.దే. ప్రచురణ, తిరుపతి. 1976.

జోగారావు, యస్.వి. : 'యక్షగాన వాఙ్మయ చరిత్ర - ఆంధ్ర విశ్వ విద్యాలయ ప్రచురణ - వాల్తేరు 1931

తిమ్మన, నంది : పారిజాతాపహరణం - వావిళ్ళ ప్రచురణ 1959

తిరువేంగళాచార్య, వేదాల : 'ఆంధ్ర రస గంగాధరము' ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, సైఫాబాద్ హైదరాబాద్, 1972.

నారాయణాచార్యులు, పుట్టపర్తి : 'తెలుగులో పద కవిత' - ఆంధ్రసారస్వత పరిషత్ ప్రచురణ, హైదరాబాద్ 1973.

నారాయణాచార్యులు, పుట్టపర్తి : 'వాగ్గేయకారులు- పదకృతి సాహిత్యం' ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమి ప్రచురణ- కళాభవన్, హైదరాబాద్, 1973.

నారాయణ రెడ్డి. సి. : 'ఆధునికాంధ్ర కవిత్వము -సంప్రదాయ ప్రయోగములు, ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ ప్రచురణ, సికింద్రాబాద్, రెండవ ముద్రణ 1977.

ప్రభాకర శాస్త్రి, వేటూరి : 'శృంగార సంకీర్తనలు' అన్నమాచార్య విరచితములు- సంపుటము 4. తి.తి.దే. ప్రచురణ, తిరుపతి -1947.

ప్రభాకర శాస్త్రి, వేటూరి : 'అన్నమాచార్య చరిత్రము' తి.తి.దే. ప్రచురణ తిరుపతి -1949.

బాల సుబ్రహ్మణ్యం, జూలకంటి : 'అన్నమయ్య పద కవితల్లో రామకథ తిరుపతి 1981

బాల సుబ్రహ్మణ్యం, జూలకంటి : 'శ్రీ వేంకటేశ్వరుఁడు అన్నమయ్య' చంద్రమౌళి ప్రింటర్స్, తిరుపతి 1983.

రంగనాథాచార్యులు కె.కె. : 'తెలుగులో తొలి సమాజ కవులు' ఆంధ్ర సారస్వత పరిషత్ ప్రచురణ తిలక్ రోడ్, హైదరాబాద్-1983.

రంగాచార్యులు, చెలమచర్ల : 'ఆంధ్రప్రతాపరుద్రీయ యశోభూషణము' 1-9-62518, శ్రీనివాస నిలయము హైదరాబాద్ -1962 ద్వితీయ ముద్రణ

రజనీకాంతారావు, బాలంత్రపు : 'ఆంధ్ర వాగ్గేయకార చరిత్రము' విశాలాంధ్ర ప్రచురణాలయం, విజయవాడ. 1958.

రమణయ్య సి. : 'తాళ్ళపాక చిన్నన్న కృతులు' పద్మబాల పబ్లికేషన్స్, మదనపల్లి 1984.

రామరాజు, బిరుదురాజు : 'జానపద గేయ సాహిత్యము' జానపద విజ్ఞాన ప్రచురణలు

తాళ్ళపాక సాహిత్యంలో కవిసమయాలు
హైదరాబాద్ 1978.

రామసుబ్బశర్మ, గౌరిపెద్ది
(పరిష్కర్త) : ఆధ్యాత్మ సంకీర్తనములు' అన్నమాచార్య విరచితములు - సంపుటము 1.1980 సంపుటము - 2 1981. సంపుటము-3 198, తి.తి.దే. ప్రచురణ, తిరుపతి

రామసుబ్బశర్మ, గౌరిపెద్ది
(పరిష్కర్త) : 'శృంగార సంకీర్తనములు' అన్నమాచార్య విరచితములు- సంపుటము - 12, 1976 సంపుటము-24, 25, 1977, సంపుటము 26, 27, 1979 సంపుటము-28, 29, 1980. సంపుటము. -30. 1983. సంపుటము-31. 1984. తి.తి.దే. ప్రచురణ. తిరుపతి 1978.

రామలక్ష్మి, ఆరుద్ర : 'తాళ్ళపాక వారి పలుకుబళ్ళు'-ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ ప్రచురణ హైదరాబాద్ -1971.

లక్ష్మణయ్య, సముద్రాల : 'అన్నమాచార్య సంకీర్తనామృతము' -1,2 సంపుటాలు 18-1-84.. కపిల తీర్థం రోడ్, తిరుపతి 1983.

లక్ష్మణ స్వామి, దాసరి : వర్తనారత్నాకరము- శ్రీ వద్వ్యజ్జన మనోరంజని ముద్రాక్షరశాల, పిఠాపురం 1వ కూర్పు1 1928.

లీలావతమ్మ : 'అన్నమయ్య సంకీర్తనల్లో జానపద గేయ ఫణితులు- పాన్సా పబ్లికేషన్స్

పాసకం -1986.

వాణి, కేసర్ల : 'తాళ్ళపాక అన్నమాచార్యుల పద కవిత
ల్లోని అలంకారాల పరిశీలన
శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం
అముద్రితం - 1982.

విజయ రాఘవాచార్య వి. మరియు ఆదినారాయణ నాయుడు. జి. (పరిష్కర్తలు) : The minor works of Tallapaka poets Vol -1.
తి.తి.దే. ప్రచురణ, మద్రాసు 1935

విజయ రాఘవాచార్య వి. (పరిష్కర్త) : 'అష్ట మహిషీ కళ్యాణము' -తాళ్ళపాక
తిరువేంగళనాధ విరచితము.
తి.తి.దే. ప్రచురణ, మద్రాసు -1937

విజయ రాఘవాచార్య.వి. (పరిష్కర్త) : 'ఉషా కల్యాణము' తాళ్ళపాక తిరు
వేంగళనాధ విరచితము. తి.తి.దే.
ప్రచురణ, మద్రాసు -1938.

విద్యావతి, అద్దేపల్లి : 'తాళ్ళపాక కవుల సాహిత్య సేవ'
ఏ. లక్ష్మణస్వామి, ఈడేపల్లి, మచిలీపట్టణం
1979.

విశ్వం విద్వాన్ : విజయ సమీపము
చేమకూరు వెంకటకవి కృతం.
(పరిష్కర్త) : ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి
కళాభవన్ - హైదరాబాద్ -4.

వేంకట నారాయణాచార్యులు : 'గాంధర్వ వేదామృతము' దేవనాగరి ప్రెస్
గుంటూరు 1957

వెంకట రామ శాస్త్రి (పరిష్కర్త) : 'పరమయోగి విలాసము' తాళ్ళపాక తిరువేంగళనాథ విరచితము కాకినాడ ముద్రాక్షరశాల , కాకినాడ-1928

వేంకట రామానుజ స్వామి, : 'ప్రథమ శ్రీ అన్నమాచార్యోత్సవ క్రమసంచిక ' తి.తి.దే. ప్రచురణ -1949.

వేంకట రాయశాస్త్రి, వేదం కృతము : 'ఆముక్త మాల్యద' - కృష్ణదేవరాయ చంద్రికాముద్రణాలయము-1 మద్రాసు 1963. రెండవ కూర్పు

శంకర రెడ్డి జి. : 'తెలుగు సాహిత్యంలో కవి సమయాలు' శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం (ముద్రిత సిద్ధాంత వ్యాసం) 1982.

శివప్ప, దాశెట్టి : 'తాళ్ళపాక సాహిత్యంలో తెలుగునాడు' శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయం సిద్ధాంత గ్రంథం- అముద్రితం -1987

శేషాద్రి రమణకవులు (వ్యాఖ్యాతలు) : 'వసుచరిత్ర' రామరాజ భూషణ కృతము, వావిళ్ళ ప్రచురణ -1962.

శ్రీనివాసరావు, వేమూరి : 'వృక్ష శాస్త్రము' విజ్ఞాన చంద్రికా మండలి ప్రచురణ, చెన్నపురి

శ్రీనివాసులు శెట్టి, కామిశెట్టి (సంపాదకుడు) : 'తాళ్ళపాక అన్నమయ్య పాటలు తి.తి.దే. ప్రచురణ, తిరుపతి 1976.

శ్రీనివాసులు శెట్టి, కామిశెట్టి (సంచాలకుడు) : 'తాళ్ళపాక అన్నమాచార్యుల జయంతి ఉత్సవ సంచిక' తి.తి.దే. ప్రచురణ తిరుపతి 1978.

సంగమేశం, ముట్నూరి : 'అన్నమాచార్య సాహిత్య కౌముది' తి.తి.దే. ప్రచురణ, తిరుపతి 1981

సంగమేశం, ముట్నూరి : 'అన్నమయ్య' యువభారత ప్రచురణ
కింగ్స్‌వే., సికిందరాబాద్

సత్యనారాయణ, విశ్వనాథ (పీఠికాకర్త) : 'వసు చరిత్ర' - రామరాజభూషణ కృతము
'విజయ విలాసము' చేమకూర వెంకట కవి
కృతము, ఎమెస్కో సంప్రదాయ సాహితీ
ప్రచురణ. యం. శేషాచలం అండ్ కో.
మచిలీ పట్నం 1970.

సర్వోత్తమరావు. కె. : 'అన్నమయ్య - శ్రీపాదరాయులు ' -1982
'అన్నమయ్య-పురందరదాసు' -1982
'అన్నమయ్య- హనుమత్సంకీర్తనములు'1983
'అన్నమయ్య - త్యాగయ్య -1983
'రామదాసు- త్యాగయ్య' -1984.
పారిజాత ప్రచురణలు - 6-7-554
శ్రీపురం కాలనీ, తిరుపతి

సూర్యనారాయణశాస్త్రి సన్నిధానం (వ్యాఖ్యాత) : 'కావ్యాలంకార సంగ్రహము- రామరాజ
భూషణ కృతము. యం. శేషాచలం
అండ్ కో, మద్రాసు.
తృతీయ ముద్రణ 1965

## వ్యాసాలు

ఆనందమూర్తి, వేటూరి : 'తెలుగు సంకీర్తన లక్షణము- లక్ష్య, లక్షణ
సమన్వయము- భారతి ఆగస్టు1971

ఉమాదేవి, జి. : 'అన్నమయ్య పదాల్లో కవి సమయాలు'
- సప్తగిరి మే 1987

కరిబసవశాస్త్రి, కపగల్లు మఠం : 'కవి సమయములు- ఆంధ్రసారస్వత
పరిషత్పత్రిక, ఫాల్గుణ -1928

| | | |
|---|---|---|
| కోటేశ్వరరావు, తుమ్మపూడ | : | అన్నమాచార్య సంకీర్తించిన శృంగార నాయిక' విభవ ఆగష్టు 1988 ఆచార్య జి. యన్.రెడ్డి షష్టిపూర్తి ఉత్సవ సంచిక |
| గంగప్ప, యస్. | : | 'అన్నమాచార్య సంకీర్తన కవిత' భారతి ఫిబ్రవరి -1981 |
| గంగప్ప, యస్. | : | అన్నమాచార్యుల అపురూప భావాలు ప్రయోగాలు- విభవ ఆగష్టు -1988. ఆచార్య జి.యన్.రెడ్డి షష్టి పూర్తి ఉత్సవ సంచిక. |
| రాఘవాచార్య, కె.వి. | : | 'కవి సమయములు- క్రొత్త ప్రయోగములు భారతి ఏప్రిల్ 1978 |
| వేంకట రమణయ్య, బులుసు | : | 'కొన్ని కవి సమయాలు' - భారతి. ఏప్రిల్ -1978. |
| వేంకట రమణయ్య, బులుసు | : | 'కొన్ని కవి సమయాలు' - భారతి జూలై 1932 |
| వేంకట సుబ్రహ్మణ్యం, మైనంపాటి | : | 'అన్నమాచార్య చరిత్ర- సంకీర్తన అవతారిక ఒక పరిశీలన - భారతి మార్చి 1985 |
| శంకర రెడ్డి జి. | : | 'జానపద సాహిత్యంలో కవి సమయాలు' నవ భారతి మార్చి 1982 |
| సత్యనారాయణ, విశ్వనాథ | : | 'హేతువాద యుగము' భారతి జూన్ 1962 |
| సుందరాచారి | : | 'ఉపమ' భారతి మార్చి 1945 |
| సుప్రసన్న | : | 'నేటి కవిత సంప్రదాయములు' జయంతి. జూన్ 1960 |

## సంస్కృతము


కేశవ మిశ్రుడు : 'అలంకార శేఖరము' పాండురంగ, జావజీ నిర్యాణ సాగర్ ప్రెస్ 26-28 కోల్బా స్ట్రీట్,బాంబే 1926.

జగన్నాథ పండితుడు : 'రసగంగాధరము' చేకాంబ విద్యాభవనము వారణాసి 1.1970

దండి : 'కావ్యాదర్శము- ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి, కళాభవన్, హైదరాబాద్ -1981

దేవేశ్వరుడు : 'కవి కల్పలత' శ్రీ సుజన రంజనీ ముద్రాక్షరశాల, రాజమహేంద్రవరము మొదటి కూర్పు 1930.

ధనంజయుడు : 'దశరూపకము' సత్యభామ భాయ్ పాండురంగ నిర్యాణ సాగర్ ప్రెస్ 26-28కోల్బా స్ట్రీట్. బాంబే 1941

భరతముని : 'నాట్యశాస్త్రము' ఓరియంటల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, బరోడా, రెండవ ముద్రణ 1956

మమ్మటుడు : 'కావ్యప్రకాశిక' నూతన్ ప్రకాశన్, 79, తిలక్ నాడ, బెల్గాం, ప్రథమ ముద్రణ 1959.

మార్కండేయ శర్మ, కనుపర్తి (వ్యాఖ్యాత) : 'కఠోపనిషత్తు, వావిళ్ళ ప్రచురణ చెన్నపురి 1952.

రాజశేఖరుడు : 'కావ్య మీమాంస' శ్రీమతి పుల్లెల సుబ్బలక్ష్మి ఆర్.33 ఉస్మానియా యూనివర్సిటి కాంపస్

తాళ్ళపాక సాహిత్యంలో కవిసమయాలు
హైదరాబాద్ - 1979

వామనుడు : 'కావ్యాలంకార సూత్రణి' పాంగురంగ జావజీ
నిర్యాణ సాగర్ ప్రెస్, బాంబే -1926

విశ్వనాథుడు : 'సాహిత్యదర్పణము' కుముద రాజన్ రే.
176, వివేకానంద రోడ్, కలకత్తా -9.1957

హేమచంద్రుడు : 'కావ్యానుశాసనము' మహావీర్
జైన్ విద్యాలయం, గౌలియ టాంక్ రోడ్
బొంబాయి-7, ప్రథమ ముద్రణ -1938.

## హిందీ

విష్ణు స్వరూప్ : 'కవి సమయ మీమాంస' కాశీ హిందూ విశ్వ
విద్యాలయ ప్రచురణ. వారణాశి 1963.

## ఆంగ్లం

Salim Ali — Common Indian Birds
National Book Trust of India.
N. Delhi. 1968

Salim Ali &
Dillon Riley S. — ' A Hand book of the Birds of India
&Pakistan Vol-3. Oxfod University
Press. London. 1969